www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం | 1-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 201
శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 3.44 తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష మ. 3.06 తదుపరి మఖ; వర్జ్యం: రా. 2.03-3.31; దుర్ముహూర్తం: ఉ. 10.37-11.22, మ. 3.07-3.52; అమృతఘడియలు: మ. 1.40-3.07; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.07
నిజామాబాద్ సిటీ*
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

జంపన్న వాగులో జలమంత జనం

గద్దెనెక్కిన సారలమ్మ



గద్దెల వద్ద పోటెత్తిన భక్తజనం జయజయ ధ్వానాలు చేస్తుండగా జంపన్నవాగు వద్ద శివసత్తుల హోరుతో నిండైన ఆధ్యాత్మిక వాతావరణం మధ్య.. పగిడిద్దరాజు, గోవిందరాజులు వేచి చూస్తుండగా అక్కడికి ఊరేగింపుగా అమ్మలగన్న అమ్మ సారలమ్మ వచ్చింది! డప్పులు, డోలు వాయిద్యాల నడుమ వెదురు బుట్టలో ఉన్న ఆ వనదేవతను పూజారులు గద్దెల వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు! ఈ కమనీయ దృశ్యాన్ని తిలకించి భక్తులు పరవశం చెందారు. ఇలా మేడారం మహా జాతరలో తొలిరోజైన బుధవారం ప్రధాన ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. జాతరలో కీలక ఘట్టం మాత్రం నేడే! గురువారం సమ్మక్క రాకతో జాతర మరో దశకు చేరుకుంటుంది. 2



5

హోంగార్డుల వేతనం పెంపు

రోజువారీ జీతం రూ.400 నుంచి రూ.675కు

6 నెలల ప్రసూతి సెలవు

ట్రాఫిక్‌లో చేస్తే 30% భత్యం

ఫిబ్రవరిలోనే కొత్త జీతం



5

టీఆర్టీ షెడ్యూల్ జారీ

ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు పరీక్షలు

గురుకుల మెయిన్ పరీక్షల షెడ్యూల్ కూడా జారీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



6

'పరిహారాని'కి వన్‌టైం సెటిల్‌మెంట్!

భూ సేకరణ పెండింగ్ కేసుల సత్వర క్లియరెన్స్

ప్రత్యేక లోక్ అదాలత్‌లతో పరిష్కరించే యోచన

నేడు మంత్రి హరీశ్ సమీక్ష



16

అవినీతి జడ్జిపై వేటు!

రాష్ట్రపతి, మోదీకి సీజే సిఫారసు

రాజ్యసభలో అభిశంసన?

» సరికొత్త సారథి



ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన జోషికి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ సీఎస్ ఎస్పీ సింగ్

'కాళేశ్వరం'తో కల సాకారం

అధికారుల్లో జవాబ్దారీతనం పెంచుతా

అప్పుడే ప్రజలకు మేలు.. ఆ దిశగా శాఖల్లో మార్పులు

సమన్వయంతోనే ఫలితాలు.. పనితీరు మెరుగవ్వాలి

ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు వినడమూ ముఖ్యమే

సమస్యలేవైనా చర్చలతోనే పరిష్కారం సాధ్యం

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జోషి

కొత్త సీఎస్‌గా పదవీ బాధ్యతల స్వీకారం

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి చెప్పారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళతానని తెలిపారు. అధికార

మిగతా 6వ పేజీలో...

• నేడే కేంద్ర బడ్జెట్

సవాళ్ల సవారీ

పెరుగుతున్న చమురు ధరతో అంచనాలు తారుమారు

ఎన్నికల తాయిలాలుంటాయా?

సంస్కరణలే సాగుతాయా?

ఐటీ పరిమితి పెరుగుతుందా?

ఉదయం 11కు సమర్పణ

ఆర్థికమంత్రి జైట్లీకి ఆఖరి పద్దు

అసలు బడ్జెట్‌లోనే రైల్వేల లెక్క

» ఖేలో ఇండియా..



ఢిల్లీలో ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 31: ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2018-19 సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను గురువారంనాడు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఆర్థికమంత్రిగా ఆయనకిది ఐదోదీ, చివరిదీనూ. సంక్లిష్ట పరిస్థితుల మధ్య ఆయన ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌పై అటు దేశప్రజానీకంలోనూ, ఇటు కార్పొరేట్ ప్రపంచంలోనే కాక అంతర్జాతీయంగా కూడా అమితాసక్తి నెలకొంది. జీఎస్టీ అనంతర బడ్జెట్ కావడంతో దీనికి ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాన కారణం ఇది ఎన్నికల సంవత్సరం కావడం. ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలకే కాకుండా వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఈ బడ్జెట్ రాజకీయంగా కీలకం కానుంది. నిరుడు జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి గ్రామీణ ఓట్లు దూరం కావడంతో కాషాయసేన ఈ దిశగా దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే జనాకర్షణకు పోయి తాయిలాలను విరజిమ్మితే వృద్ధిపై గట్టి ప్రభావం

మిగతా 16వ పేజీలో...

» ఎర్రని జాబిలి





గ్రహణం పట్టిన చంద్రుడు

నిండు పున్నమ మండు వెన్నెల

గ్రహణ చంద్రుడి అరుణ కాంతులు

సూపర్, బ్లూ, బ్లడ్‌మూన్ కనువిందు

152 ఏళ్లలో తొలిసారి అద్భుతం

మళ్లీ 2037లోనే ఇలాంటి దృశ్యం

ఆలయాలు మూత.. శుద్ధి, సంప్రోక్షణ

ఆకాశంలో గడ్డకట్టిన వెన్నముద్దలా తెల్లని చల్లని చందురుడు! అంతలోనే.. భూమి చాటు నుంచి వచ్చిన భానుడి కిరణాల అరుణాన్ని పూసుకుని రుధిర

మిగతా 2వ పేజీలో...



హైదరాబాద్‌కు వచ్చిన కుంతియాతో జానారెడ్డి, ఉత్తమ్

కాంగ్రెస్‌లో ఓబీసీ కుంపటి!

ఓబీసీ సాధికారత కమిటీని నియమించిన టీపీసీసీ

బీసీ సెల్ ఉండగా మరో కొత్త దుకాణమెందుకు?

భగ్గుమన్న నేతలు.. రాజీనామాకు చిత్తరంజన్ సిద్ధం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఓబీసీ చిచ్చు రాజుకుంది. పీసీసీ ఆధ్వర్యంలో ఓబీసీ సాధికారత కమిటీని నియమించడమే దీనికి కారణం. బీసీల కోసం టీఆర్ఎస్‌కు దీటుగా ఏం చేయాలనే అంశంపై సమాలోచనలు జరిపేందుకు ఓబీసీ సాధికారత కమిటీని ఏర్పాటు

మిగతా 6వ పేజీలో...

ముందస్తు ఎన్నికలకు మేమూ సిద్ధమే: జానారెడ్డి

కాంగ్రెస్ పార్టీకి 70 సీట్లు వస్తే...

రాజకీయ సన్యాసం తీసుకుంటా

ఎన్నికలపై ఉత్తమ్‌కు కేటీఆర్ సవాల్

ఆ పార్టీకి వచ్చేది ఒకటీ రెండు సీట్లే

గడ్డం పెంచితే ముఖ్యమంత్రి కారు

కాంగ్రెస్ వల్లే తెలంగాణ వెనుకబాటు

జవహర్‌లాల్ నెహ్రూ నుంచి రాహుల్ దాకా చేసింది ద్రోహమే

గద్వాల బహిరంగ సభలో ధ్వజమెత్తిన మంత్రి కేటీఆర్



గద్వాల సభలో కత్తి పట్టిన కేటీఆర్

గద్వాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాబోయే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 70 సీట్లు సాధిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన టీఆర్ఎస్ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 70 సీట్లు వస్తాయని ఉత్తమ్ చెప్పుకుంటున్నారని, నిజానికి ఒకటి, రెండు సీట్లు మించి రావని వ్యాఖ్యానించారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన

మిగతా 6వ పేజీలో...

ఢిల్లీకి రండి!




బీజేపీ నేతలకు అధిష్ఠానం పిలుపు.. వెళ్లనున్న లక్ష్మణ్, కిషన్‌రెడ్డి

నేడు అమిత్‌షాతో చర్చలు.. సీట్ల పెంపుపై చర్చించే అవకాశం

టీఆర్ఎస్‌పై పోరు తీరుపై దృష్టి.. ఏపీ నేతలకూ ఆహ్వానం

5



పరుగులు తీసే జీవితం



ఆధునిక జీవితాన్ని పరుగులు తీసే జీవితమని అంటుంటాం. జీవితం ఎప్పుడూ అలాగే ఉంటుంది. చాల కాలం క్రితమే ఒక కవి దీన్ని గూర్చి ఒక శ్లోకం వ్రాశాడు. ఒక కప్ప తన ఎదురుగా ఉన్న కీటకాన్ని తినడానికి పరిగెడుతోంది. ఆ కప్పను తినడానికి ఒక పాము పరిగెడుతోంది. ఆ పామును వేటాడ్డానికై ఒక నెమలి దానివెంట పడింది. నెమలిని తినడానికై ఒక పులి ప్రయత్నిస్తోంది. నెమలి వెంటే ఒక వేటగాడు కూడా వెళుతున్నాడు. చివరకు పులి, వేటగాడు ఈ ఇద్దరి మధ్య ఎవరో ఒకరు మిగులుతారు. జీవితమంతా ఇలా తిండి, సుఖాలు సమకూర్చుకోవడానికి ప్రపంచమంతా పరిగెడుతుంటుంది. దీన్నే 'లోకః సదా ధావతి' అని కవి చెప్పాడు. జీవనఅవసరాల విషయంలో జంతువులకు, మనిషికి తేడా లేదు. మనిషి కూడా అలాగే పరిగెడుతుంటాడు అని చెప్పడం కూడా ఆ శ్లోకం ఉద్దేశం. సాంకేతిక విప్లవం వల్ల ఈ పరుగులో వేగం పెరిగింది. కానీ ఆ పరుగు ఏ దిశలో ఉన్నదీ గమనించడం లేదు. అంటే దిశానిర్దేశం చేసే వ్యవస్థ లేదు. పరుగంతా మన అవసరాల్ని, సుఖసాధనాలనుకునే వాటిని సంపాదించడానికే. ఈ

పరంజ్యోతి

పరుగుకు కావల్సిన విజ్ఞానం సాంకేతిక విజ్ఞానం. కానీ జీవితంలోని సమస్యల్ని, మానవ సంబంధాల్ని అర్థం చేసుకోవడానికి సాంకేతిక విజ్ఞానం పనిచేయదు. దీనికి మంచి సాహిత్యం, సామాజిక శాస్త్రాలు అవసరం. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మన జీవనశైలి సామాజిక మాధ్యమాల చేతిలో ఉండిపోయింది. ప్రపంచంలోని మంచి, చెడు అంతా మనకు ఇంటర్‌నెట్‌లోనే అందుబాటులో ఉండడం వల్ల ఏది తీసుకోవాలి, ఏది వదిలేయాలి అనే నిర్ణయాన్ని తీసుకునే బాధ్యత చిన్న పిల్లలపై పడింది. జీవితలక్ష్యాలపై తమ పిల్లలకు అవగాహన కలిగించడం తల్లిదండ్రుల బాధ్యత. పరుగుతో పాటు దిశానిర్దేశం ఇవ్వాలంటే మనిషి తన పరుగును ఆపి కొంత ఆలోచించడం నేర్చుకోవాలి. పరుగును ఆపి ఆలోచించినవారే చరిత్రలో మనం చూసే గొప్ప తత్త్వవేత్తలు. వీరి గ్రంథాలు మనిషి సుఖానికి తోడ్పడే సాధనాలు.

-కె.అరవిందరావు



కిక్కిరిసిన మేడారం దారులు



ములుగు -జంగాలపల్లి మధ్య ట్రాఫిక్‌జామ్

సారలమ్మకు దండాలో!

గద్దెకు చేరుకున్న వనదేవత .. పగిడిద్దరాజు, గోవిందరాజు కూడా

- **నేడు సమక్క రాకతో జాతరలో మహాఘట్టం**
- **భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు**

మేడారం, హైదరాబాద్, వరంగల్ అర్బన్, జనవరి (ఆంధ్రజ్యోతి): "కన్నెపెల్లి సారలమ్మ.. కరుణించే మాయమ్మా! ఆది కుంకుమలో పుట్టిందా.. ఆది కుంకుమ పువ్వు సారలమ్మ.. పసుపులో పుట్టిందా.. పచ్చ సారలమ్మ" అంటూ వనదేవత సారలమ్మకు భక్తజన కోటి స్వాగతం పలికారు! గిరిజన సంప్రదాయ రీతిలో.. డప్పు, డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ సారలమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు చేర్చారు. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించి భక్తులు పరవశించిపోయారు. చేతులు జోడించి భక్తితో నినాదాలు చేశారు! ఈ విధంగా తెలంగాణ కుంభమేళగా ప్రసిద్ధి పొందిన మేడారం జాతరలో ప్రథమ ఘట్టం బుధవారం కన్నుల పండుగగా జరిగింది. కన్నెపెల్లి నుంచి సారలమ్మ రాక మునుపే గోవిందరాజు, పగిడిద్దరాజులు మేడారానికి విచ్చేశారు. సారలమ్మ జంపన్నవాగుకు చేరుకోగానే.. ముగ్గురు దేవతలను ఊరేగింపుగా అర్ధరాత్రి 12:20 గంటలకు గద్దెలపైకి చేర్చారు. జాతరలో మహాద్భుతమైన ఘట్టం గురువారం ఆవిష్కృతం కానుంది. అడవితల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెపైన ప్రతిష్ఠిస్తారు. దీంతో జాతరలోని మహాఘట్టానికి తెరలేస్తుంది. సమ్మక్క రాక జాతరలోనే ప్రత్యేక ఆకర్షణ అని చెబుతారు. చిలుకల గుట్టలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుంకుమ భరిణ రూపంలో ఉన్న సమ్మక్కను ప్రధాన పూజారి తోడ్కొని గుట్టకు తీసుకువస్తున్నట్టు సంకేతమిస్తారు. తల్లిని ఊరేగింపుగా తీసుకువచ్చే సందర్భంగా ఆమెకు గౌరవసూచకంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ తుపాకీతో ఐదు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరుపుతారు. ఇన్‌చార్జి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధు లు అమ్మవారికి స్వాగతం పలుకుతారు. సమ్మక్క గద్దెకు చేరడంతో జాతర పతాకస్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత నుంచి వనదేవతలను దర్శించుకోవడం మొదలవుతుంది. మరోవైపు జాతర తొలిరోజే మేడారం జనారణ్యాన్ని తలపించింది. బుధవారం రాత్రికే సుమారు 65 లక్షల మంది దాకా భక్తులు జాతరకు చేరుకున్నట్టు అంచనా. భక్తజన ప్రవాహం గురువారం కూడా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుండడంతో మేడారం భక్తులతో కిటకిటలాడుతోంది. సమ్మక్క రానుండడంతో శుక్రవారం భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశాలున్నాయి. కాగా ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం మేడారానికి చేరుకుని గద్దెలను దర్శించుకున్నారు.

వాహనాల జాం.. భక్తులకు తిప్పలు

మేడారానికి వస్తున్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. భక్తుల తాకిడి పెరిగిపోతుండడంతో ప్రధాన మార్గాల్లో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి జాకారం-పస్రాల మధ్య పలు చోట్ల ట్రాఫిక్ జామైంది. వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో భక్తులు నాలుగైదు గంటల పాటు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి పరిస్థితి కాస్త మెరుగైంది. ములుగులోని గట్టమ్మ దగ్గర ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలుపుతుండడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. కాగా మేడారం చేరుకున్న డీజీపీ మహేందర్ రెడ్డి భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 2వ తేదీన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సీఎం కేసీఆర్ రానున్న దృష్ట్యా హెలిప్యాడ్ సహా జాతరలో ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. కాగా మేడారం జాతరకు గురువారం నుంచి హెలికాప్టర్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. ఈ మేరకు ఎలుబాక ప్రాంతంలో రెండు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు.

వనదేవతలకు చెంచుల సారె

నాగర్‌కర్నూల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతం నుంచి చెంచు మహిళలు సారెతో బుధవారం బయల్దేరి వెళ్లారు. అప్పాపూర్, బౌరాపూర్, రాంపూర్‌పెంట, మేడిమల్కల, చెంచు పెంటల నుంచి దాదాపు 60 మంది మహిళలు వనదేవతలకు సారె తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌కు చేరుకున్న చెంచు మహిళలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ తన కార్యాలయంలో స్వాగతం పలికారు. సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెంచు మహిళలు మేడారం వెళ్లేందుకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయించారు.

దళారుల చేతికి బెల్లం

హైదరాబాద్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో అమ్మవార్లకు బంగారం రూపంలో సమర్పించే బెల్లం వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది! మేడారం జాతర పేరుతో బెల్లం అక్రమ వ్యాపారంతో లక్షలు దండుకుంటున్నారు. తెలంగాణను గుడుంబా రహిత రాష్ట్రంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ మేరకు ప్రత్యేక నిబంధన తెచ్చింది. రాష్ట్రంలో తయారైన బెల్లాన్ని వేరే రాష్ట్రాల్లో అమ్మాలన్న నిబంధనతో టెండర్లు ఆహ్వానించి మార్క్‌ఫెడ్ ద్వారా అమ్మకాలు చేస్తోంది. మేడారం జాతర సందర్భంగా బెల్లం అమ్మకాలకు సర్కారు ఐదురోజుల సడలింపునిచ్చింది. ఇదే అదనుగా చేసుకొని రైతులు ఉత్పత్తి చేసిన బెల్లం దళారుల చేతుల్లోకి వెళుతోంది. తాజాగా మేడారం జాతర నేపథ్యంలో భారీ మొత్తంలో అక్రమంగా దాచిన బెల్లం బహిరంగ మార్కెట్‌లోకి చేరుతోంది. అలాగే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్దమొత్తంలో బెల్లం దిగుమతి జరుగుతోంది.

వివిధ ఘటనల్లో నలుగురు మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మేడారం మహాజాతరకు వెళ్లిన కొన్ని కుటుంబాల్లో విధి పెను విషాదాన్ని నింపింది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం గాంధీనగర్‌కు చెందిన శేగర్ కళాబాయి (27) నిండు గర్భిణి. వారం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి మేడారానికి వెళ్లిన కళాబాయి తిరిగొచ్చే క్రమంలో ట్రాఫిక్‌లో చిక్కుకుంది. పురుటి నొప్పులు రావడంతో అక్కడే మగబిడ్డకు జన్మనిచ్చి ప్రాణాలు విడిచింది. యాదాద్రి భువనగిరి జిల్లా కొండపాకకు చెందిన నాగయ్య (60) మంగళవారం రాత్రి మేడారంలో తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు విడిచాడు. మేడారం దర్శనానికి వెళుతున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడింది. భూపాలపల్లి జిల్లా తాడ్వాయి వద్ద బుధవారం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మృతులను భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఆవాస ప్రాంతమైన చవిటిగూడానికి చెందిన పొలిశెట్టి నవీన్ (22), పాల్వంచకు చెందిన అతడి మేనమామ అంజయ్య (45)గా గుర్తించారు. కాగా జాతరలో జఫర్‌గఢ్‌కు చెందిన వెంకటయ్య అనే వ్యక్తికి శివసత్తి పూనకంతో ఊగుతూ తగలడంతో కాలువిరిగింది.

కన్న పేగే యమపాశం

- **ఆస్తి కోసం తల్లి మరణం కోరుకుంటున్న కుమారులు**
- **తనయుల నుంచి రక్షణకు పోలీసులను ఆశ్రయించిన కన్నతల్లి**



పోలీసులను ఆశ్రయించిన బైరోజు నర్సమ్మ

మోటకొండూర్, జనవరి 31: నవ మాసాలు మోసి.. పిల్లల్ని కని.. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల జీవిత చరమాంకంలో వారి బాగోగులు ఏమాత్రం పట్టించుకోని కన్న కొడుకులు.. ఆస్తి కోసం తల్లి మరణం కోరుకుంటున్నారు. కన్న పేగే యమపాశమై ప్రాణాలు తీస్తుంటే.. రక్షించమని ఆ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం వర్టూరులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బైరోజు వీరస్వామి మొదటి భార్య నీలమ్మకు సత్యనారాయణ, లక్ష్మయ్య అనే ఇద్దరు కుమారులు. ఆమె అనారోగ్యంతో చనిపోవడంతో నర్సమ్మను రెండో వివాహం చేసుకున్నాడు వీరస్వామి. వీరికి ఆచారి, వెంకటాచారి అనే ఇద్దరు కుమారులు. ప్రస్తుతం నలుగురు కుమారులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఈ నలుగురిలో వృద్ధుల బాగోగులను వెంకటాచారి ఒక్కడే 25ఏళ్లుగా చూస్తున్నాడు. అయితే 2నెలల క్రితం వీరస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలు పూర్తి కాకముందే మిగతా ముగ్గురు కుమారులు తమ తల్లితండ్రుల ఆస్తిలో వాటాల గురించి పంచాయతీ పెట్టారు. దీంతో బతికున్నపుడు తల్లిదండ్రుల బాగోగులు చూడని వారికి ఆస్తులెందుకని గ్రామస్థులు వారిపై తిరగబడడంతో దహన సంస్కారాలు కూడా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ప్రస్తుతం బతికినున్న తల్లి నర్సమ్మ కూడా మరణిస్తే ఆస్తి పంచుకోవచ్చునని ఈ ముగ్గురు కొడుకులు రెండు నెలలుగా వెంకటాచారిని వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో కలత చెందిన వృద్ధురాలు నర్సమ్మ బుధవారం వర్టూరుకి చేరుకుని ఈ విషయాన్ని గ్రామస్థులకు మొరపెట్టుకుంది. గ్రామస్థుల సహకారంతో మోటకొండూరులో ఆమె తన కొడుకుల నురక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాకీ డబ్బులు అడిగితే నిప్పంటించారు



దుర్గం స్రవంత(ఫైల్)

బెజ్జూరు/సిర్పూర్(టి), జనవరి 31: కూతురు పెళ్లికి డబ్బులు కావాలని అడిగితే అప్పుగా ఇచ్చింది. కానీ అవే డబ్బులు ఆ మహిళ ప్రాణాలు తీశాయి. ఈ విషాదకర ఘటన కుమ్రం భీం జిల్లా బెజ్జూరు మండలం మర్తిడిలో జరిగింది. గ్రామానికి చెందిన దుర్గం స్రవంత(45) అనే మహిళ ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య కూతురు పెళ్లి కోసం స్రవంత రూ.47 వేలు అప్పుగా ఇచ్చింది. బాకీ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగిన ప్రతిసారీ దుర్గయ్య గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో దుర్గయ్య భార్య సాలుబాయి, కుమారుడు సాయికుమార్‌తో పాటు మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్ మంగళవారం అర్ధరాత్రి స్రవంత ఇంటికి వెళ్లి ఆమె నిద్రిస్తుండగా కిరోసిన్ పోసి నిప్పంటించారు. స్రవంత కుమారులు గమనించి చికిత్స నిమిత్తం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మృతిచెందింది.





ఆస్ట్రేలియాలోని లాన్సిలిన్‌లో సూపర్‌మూన్‌ను కెమెరాలో బంధిస్తున్న సైక్లిస్టులు

న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద కనువిందు చేస్తున్న నిండు జాబిలి

నిండు జాబిలి మండు వెన్నెల

(మొదటిపేజీ తరువాయి...)

వర్ణం దాల్చాడు!! ఆకలిగా కబళించే భూమి ఛాయ రాహువులా కమ్మేస్తుండగా.. గ్రహణచంద్రుడయ్యాడు. అంతలోనే మబ్బులు తొలగిన ఆకాశంలా.. మళ్లీ క్రమక్రమంగా పూర్ణచంద్రబింబమై ఖగోళప్రియులకు కనువిందు చేశాడు!! బుధవారం సాయంత్రం ఆకాశంలో ఆవిష్కృతమైన ఖగోళ అద్భుతం ఇది. 152 ఏళ్ల క్రితం అంటే 1866 మార్చి 31న.. 'సూపర్ (భూమికి అత్యంత దగ్గరగా వచ్చి రోజూ కన్నా 14 శాతం ఎక్కువ వెలుగులు కురిపించే), బ్లూ (ఒకే నెలలో వచ్చిన రెండో పౌర్ణమి నాటి చంద్రుడు), బ్లడ్‌మూన్ (సూర్యకిరణాలు భూమి అంచుల నుంచి చంద్రుడి మీద పడటంతో ఎర్రగా)'గా చంద్రుడు అలరించాడు. ఆ తర్వాత మళ్లీ అలా కనిపించడం ఇప్పుడే. ఆస్ట్రేలియా, ఆసియా దేశాలతోపాటు.. రష్యాలోని కొన్ని భాగాల్లో ఈ గ్రహణం కనిపించింది. ఇలాంటి దృశ్యాన్ని మళ్లీ చూడాలంటే 2037 దాకా ఆగాల్సిందే. కాగా, ఈ ఏడాది మొత్తం ఐదు చంద్రగ్రహణాలున్నాయి. వాటిలో ఒకటి బుధవారం నాటి సంపూర్ణ చంద్రగ్రహణం. రెండోది జూలై 28న సంభవించనుంది. ఫిబ్రవరి 15, జూలై 13, ఆగస్టు 11న సంభవించేవి పాక్షిక చంద్ర గ్రహణాలు.

ఆలయాలు మూసివేత

గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో.. ఒక్క శ్రీకాళహస్తి మినహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆలయాలను మూసివేశారు. తిరుమలలో ఉదయం సర్వదర్శనం సమయంలో మాత్రమే భక్తులను అనుమతించారు. 9.30 గంటలకు రెండో వైకుంఠం క్యూకాంప్లెక్స్ గేటును మూసివేశారు. ప్రత్యేక పూజల అనంతరం 11 గంటలకు శాస్త్రోక్తంగా ఆలయ తలుపులు మూసేశారు. శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో నిత్య పూజల అనంతరం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో గుడి తలుపులు వేశారు. భద్రాచలంలో రాముల వారి ఆలయ ద్వారాలను.. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 10.27 గంటలకు మూసివేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి నిత్య పూజా కైంకర్యల అనంతరం పది గంటలకు బాలాలయాన్ని ద్వారబంధనం చేశారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానాన్ని ఉదయం 8.18 గంటలకే మూసివేశారు. బాసరలోని సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. గ్రహణానంతరం కొన్ని ఆలయాల్లో ఆగమశాస్త్ర ప్రకారం శుద్ధి, సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. మరికొన్ని ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున శుద్ధి, సంప్రోక్షణ పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


గ్రహణాలతో దోషం లేదు: భగవతి మహారాజ్

రాంగోపాల్‌పేట్/రాంనగర్, హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రహణాల వల్ల ఎలాంటి దోషాలు ఉండవని జాంబవంత శక్తి పీఠాధిపతి ఆదిదండి శక్తిశ్రీ జగద్గురు భగవతీ మహారాజ్ అన్నారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఇప్పుడు వచ్చిన చంద్రగ్రహణం 150 ఏళ్లకోసారి వస్తుంది. అందువల్ల మనం, మన పిల్లలు ఖగోళ వింతల్లో ఒకటైన ఇలాంటి చంద్రగ్రహణాన్ని నిస్సంకోచంగా చూడవచ్చు"అని అన్నారు. కొన్ని వర్గాలు తమ పబ్బం గడుపుకోవడానికి గ్రహదోషం అని గుళ్లను మూసివేయడం, దోష నివారణ అని ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని విమర్శించారు.

మూఢ నమ్మకాలను నమ్మొద్దు: వంగపల్లి శ్రీనివాస్

దళిత బహుజన ప్రజలు మూఢ నమ్మకాలు నమ్మవద్దని, సైన్స్‌ను మాత్రమే నమ్మాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ సూచించారు. బుధవారం చంద్రగ్రహణం సమయంలో శ్రీనివాస్ మాదిగ ఇతర టీఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	06.7	33.0
హైదరాబాద్	11.8	32.1
వరంగల్	12.5	31.5
నిజామాబాద్	14.5	31.9
ఖమ్మం	16.0	33.0

తెలంగాణ గజగజ!

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శీతాకాలం చివరిదశలో ఉన్నా రాష్ట్రం చలికి గజగజలాడుతోంది. అన్నిచోట్లా సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రత 6.7,భద్రాచలం, ఖమ్మం, మెదక్‌లలో ఏడు డిగ్రీలు, హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, రామగుండంలలో సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. మహబూబ్‌నగర్‌లో 3 డిగ్రీలు, నిజామాబాద్, నల్లగొండ, హకీంపేటల్లో 2 డిగ్రీల మేర సాధారణం కంటే తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



తమిళనాట జాతీయ పార్టీలకు చోటు లేదు

తమిళనాడులో జాతీయ పార్టీలకు స్థానం లేదు. 1967 నుంచీ రాష్ట్రంలో ద్రవిడ పార్టీలే అధికారంలో ఉన్నాయి. వంతులవారీగా తమిళనాడును ఏలుతున్నాయి. జాతీయ పార్టీలు నిలదొక్కుకోలేకపోయాయి. ఆ పార్టీలను ప్రజలు అంగీకరించరు.

- ఒ.పన్నీరు సెల్వం, తమిళనాడు ఉపముఖ్యమంత్రి



ఓపీఎస్ అన్నది మా గురించి కాదు

కాంగ్రెస్, వామపక్షాల గురించే ఓపీఎస్ అలా వ్యాఖ్యానించి ఉంటారు. మా పార్టీ గురించి కాదు. అయినా ఆయన అలా ఎందుకన్నారో అర్థం కావడం లేదు. మరికొంత స్పష్టంగా చెప్పి ఉంటే బాగుండేది. మా పార్టీ గురించి అలా మాట్లాడి ఉండరు.

-తమిళసై సౌందరరాజన్, తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలు (ఓపీఎస్ వ్యాఖ్యలపై స్పందన)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.22	పాత ధర 69.53
కొత్త ధర రూ.77.36	కొత్త ధర 69.65
పెరుగుదల : 00.14 పైసలు	పెరుగుదల : 00.12 పైసలు



ఆ ఆవు పాలతో కీళ్లవాతం

న్యూయార్క్, జనవరి 31: ఆవు పాలకు కీళ్లవాతానికి లింకు ఉందా? అవుననే అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా పరిశోధకులు. అమెరికాలోని కొన్ని ఆవులపై పరిశోధన చేయగా వాటిల్లో ఒక రకమైన సూక్ష్మక్రిములు కనిపించాయట. అలా సూక్ష్మక్రిములు ఉన్న ఆవు ఇచ్చిన పాలల్లోనూ అవి ఉన్నాయని, వాటిని సేవించిన మనుషులకు కీళ్ల వాతం వస్తోందని తెలిపారు. అలాంటి ఆవు మాంసం తిన్న వారికి కూడా ముప్పు ఉందట. వందమంది రోగులపై పరీక్షలు చేసి ఈ నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు.

సూర్యరశ్మితో హృద్రోగం దూరం

వాషింగ్టన్, జనవరి 31: గుండెపోటు ముప్పును అడ్డుకునే శక్తి విటమిన్ డి3కి ఉందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ విషయంలో ఒహియో వర్సిటీ ప్రతినిధులు తమ పరిశోధన వివరాలను ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ నియోమెడిసిన్‌లో ప్రచురించారు. సూర్యరశ్మి శరీరానికి తగిలినప్పుడు విటమిన్ డి3 అందుతుంది. ఈ సూర్యరశ్మి సరిపడా శరీరానికి అందితే హృద్రోగ సంబంధ రుగ్మతలను కూడా నయం చేసే శక్తి వస్తుందని వివరించారు. అంతేకాదు హైపర్‌టెన్షన్, మధుమేహం వంటి వ్యాధులు కూడా దరి చేరవని అంటున్నారు. కొంత మంది రోగులపై పరీక్షలు చేసినప్పుడు వారిలో విటమిన్ డి3 లోపం గుర్తించినట్లు తెలిపారు.

● గ్రామాల్లో మినీ మేడారం

▸ వరంగల్ అర్బన్ జిల్లాలో సందడి


కమలాపూర్‌లో సారలమ్మను తీసుకెళ్తున్న పూజారులు

కమలాపూర్/భీమదేవరపల్లి/వడ్డెపల్లి, జనవరి 31: వరంగల్ అర్బన్ జిల్లాలోని కమలాపూర్ మండలంలోని కన్నూరు, కమలాపూర్, మాధన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామ శివారులలో బుధవారం సమ్మక్క-సారలమ్మ జాతరలు ప్రారంభమయ్యాయి. గ్రామాలలో సారలమ్మ దేవతకు కోయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా పేల్చుతూ డప్పు, చప్పుళ్లతో ఊరేగింపుగా అమ్మవారిని గద్దెలకు తరలించారు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారలమ్మ కొలువు తీరడంతో భక్తులు తమ మొక్కలను ముట్ట జెప్పారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్, కొత్తకొండ గ్రామాలలో సారలమ్మను గద్దెకు తీసుకొచ్చారు. ముల్కనూరులో వేలాది మంది భక్తుల సమక్షంలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్ట వద్దకు సారమల్మను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కాజీపేట మండలం అమ్మవారిపేట దామెరగుట్టల వద్ద ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు సుమారు లక్ష పైచిలుకు భక్తులు హాజరై వనదేవరలను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య చిన వడ్డె నామని శివమూర్తి సారలమ్మ దేవరను దామెర గుట్టల నుంచి ఊరేగింపుగా తరలించి గద్దెపై ప్రతిష్ఠించారు. వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లు, ఆటోలు, ట్రాలీ, డీసీఎం, ట్రాక్టర్లు, జీపులు, కారులలో జాతరకు భక్తులు ముల్లెమూట, పిల్లా పాపలతో అశేషంగా తరలిరావడంతో సందడి నెలకొంది.

శ్రీశైలంలో నేలమాళిగ

▸ రుద్రాక్షమఠం జీర్ణోద్ధరణలో వెలుగు చూసిన గది

▸ రాగి, ఇత్తడి పూజా సామగ్రి లభ్యం

శ్రీశైలం, జనవరి 31: శ్రీశైలంలో పురాతన నేలమాళిగ బయటపడింది. ఉభయ దేవాలయ ప్రాంగణానికి వెనుకభాగంలో పురాతన రుద్రాక్షమఠం జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. బుధవారం నాటి తవ్వకాల్లో ఆరు అడుగుల పొడవున్న చిన్నపాటి సొరంగ మార్గంతో కూడిన నేలమాళిగ (3.5 అడుగుల ఎత్తు, 4.5 చ.అడుగుల వెడల్పు ఉన్న భూగర్భ గది) బయటపడింది. గది పైకప్పు రాతిబండతోఉండగా, చుట్టూ మూడువైపులా రాతి గోడలు ఉన్నాయి. ఒక వ్యక్తి దూరి వెళ్లేంత ప్రవేశ ద్వారం ఉంది. పూర్వం మఠాధిపతుల కాలంలో ఈ గదిని పూజా మందిరంగా వినియోగించి ఉండొచ్చని భావిస్తున్నారు. నేలమాళిగలో పెద్దఎత్తున లభించిన రాగి, ఇత్తడి పూజా సామగ్రిలో బేసిన్లు రెండు, బాండి ఒకటి, 26 చెంబులు, ఒక ధూపపాత్ర, ఒక గిన్నె, 2 పెద్ద గుడిగంటలు, 3 చిన్న పూజామందిర గంటలు, 6 చిన్నగజ్జెలు, 5 గుండ్రటి గిన్నెలు, విరిగిన ప్లేట్లు, 2 కడియాలు, ఆరు హారతి దీపాలు, 19ఇతరత్రా సామాన్లు ఉన్నాయి.



శ్రీశైలంలో తవ్వకాల్లో బయటపడ్డ నేలమాళిగ, లభించిన పూజా సామగ్రి

నల్లమలలో తప్పిపోయిన వృద్ధుడు

ఝరాసంగం: శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి బయలుదేరిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండ లం ఇస్లాంపూర్‌కు చెందిన బోయిని అంజయ్య (56) తప్పిపోయాడు. గ్రామం నుంచి 40 మంది సభ్యులు 24న పాదయాత్రగా బయలుదేరారు. వీరి పాదయాత్ర బుధవారం నాటికి మన్ననూర్ పరిధిలోని వటువర్ల పల్లికి చేరింది. గ్రామంలో ఆలయం వద్ద బృందం సభ్యులు సేదతీరుతున్న సమయంలో బొప్పానపల్లికి చెందిన బోయిని అంజయ్య కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదని సభ్యులు తెలిపారు . సాయంత్రం వరకు వెతికినా ఆయన దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజయ్య తప్పిపోయిన విషయాన్ని తెలుసుకున్నకుటుంబసభ్యులుఆందోళన చెందుతున్నారు.

మినీ బస్సు దగ్ధం



కీసర, జనవరి 31:: తుర్కపల్లిలోని ఎసెన్స్ బయోఫార్మాసీ కంపెనీలోకి ఉద్యోగులను తీసుకెళ్తున్న ఓ ప్రైవేట్ మినీ బస్సు బుధవారం మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో తిమ్మాయిపల్లి పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆగిపోయింది. డ్రైవర్ బస్సు దిగి ఇంజను బ్యాటరీని పరిశీలిస్తుండగా అందులో నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే బస్సులో నుంచి కిందికి దిగిపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది.

రైలుతో సెల్ఫీలు ప్రాణాంతకం: ఎస్పీ

గిర్మాజిపేట, జనవరి 31: రైళ్లు వెళ్తున్నప్పుడు పట్టాల పక్కన నిలబడి సెల్ఫీలు దిగడం ప్రాణాంతకమని, రైల్వే చట్టం ప్రకారం నేరమని రైల్వే ఎస్పీ జి.అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం వరంగల్ రైల్వేపోలీస్ స్టేషన్‌లో ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. రైల్వే నేరస్థుల సమగ్ర సమాచారం సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

ఠాణాలో ఒకరి ఆత్మహత్యాయత్నం

▸ కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒకరు పురుగు మందు తాగిన ఘటనలో సీపీ విక్రమ్ జిత్ దుగ్గల్ క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. సీఐ రాములు, ఎస్ఐ షేక్ జానీపాషాలకు చార్జ్ మెమోలు జారీ చేశారు. కానిస్టేబుల్ సంపత్ కుమార్, హోంగార్డు రాజయ్యను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఊషన్నపల్లికి చెందిన మేడిద రాజయ్యను ఓ కేసు విచారణ కోసం మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అయితే, ఆయన పోలీస్ స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి డబ్బాతో స్టేషన్ లోపలికి వెళ్లాడు.

ఆపరేషన్‌స్మైల్‌తో బాలలకు రక్షణ

▸ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణే ధ్యేయంగా జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో సుమారు 19,272 మంది పిల్లలను రక్షించినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ లక్ష్మీదేవి బుధవారం తెలిపారు. తాము రక్షించిన పిల్లల్లో ఎక్కువ మంది జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ప్రాంతాలవారు ఉన్నారన్నారు. ఆయారాష్ట్రాల శిశుసంక్షేమ అధికారులను సంప్రదించి బాలలను అక్కడికి పంపేయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణికి కల్పతరువు బెల్లంపల్లి

పది నెలల్లో రూ. 600 కోట్ల లాభాలు ● మార్చి 31 నాటికి రూ. 700 కోట్లకు చేరే అవకాశాలు


బెల్లంపల్లిలోని ఓపెన్‌కాస్టు గనిలో కొనసాగుతున్న ఉత్పత్తి

మంచిర్యాల, జనవరి 31, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని బెల్లంపల్లి ఏరియా సంస్థకు కల్పతరువులా మారింది. గతేడాది రూ. 560 కోట్ల లాభాలు సాధించిన ఈ ఏరియా, 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పది నెలలకు గాను రూ. 600 కోట్ల లాభాలతో సింగరేణిని ఆదుకోబోతోంది. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ లాభాలు రూ. 700కోట్లకు పైగా చేరే అవకాశముందని యాజమాన్యం భావిస్తోంది. సింగరేణిలో ఒకప్పుడు అన్ని ఏరియాలకన్నా వెనుకబడిన బెల్లంపల్లి మూడేళ్లుగా లాభాల్లో దూసుకుపోతోంది.ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యానికి మించి జరుగుతోంది. ఇప్పటికే ఈ పది నెలల్లో 104 శాతం ఉత్పత్తిని సాధించి ంది. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి లాభాలు రూ. 1100 కోట్లు ఉండే అవకాశం ఉంది. ఇందులో ఒక్క బెల్లంపల్లి ఏరియా నుంచి రూ.700 కోట్లు రానుండడం గమనార్హం.

65 లక్షల టన్నుల బొగ్గు రవాణా

2017-18 లో ఇప్పటి వరకు ఉత్పత్తి అయిన బొగ్గులో 65 లక్షల టన్నుల వరకు రవాణా చేశామనీ, ఇలాంటి రికార్డు సాధించడం ఇదే మొదటిసారని బెల్లంపల్లి జనరల్ మేనేజర్ కే రవిశంకర్ తెలిపారు. 2015-16లో రూ. 467.8 కోట్లు, 2016-17లో రూ. 560 కోట్లు లాభాలు సాధించిందని ఆయన తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో 2022 నాటికి కొత్తగా చింతగూడ, ఉల్లిపిట్ట, గోలేటి మెగా ఓపెన్‌కాస్టు లాంటి కొత్త గనులు రానున్నాయని, బెల్లంపల్లికి అద్భుతమైన భవిష్యత్ ఉందని బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ఇదంతా సీఎండీ ఎన్ శ్రీధర్ పర్యవేక్షణలో కార్మికుల, కార్మిక సంఘాల సహాయ సహకారాల వల్లే సాధ్యమైందన్నారు.

నీటి సరఫరాకు ప్రత్యేక నిధులక్కర్లేదు!

▸ అధికారులతో మిషన్ భగీరథ వైస్ చైర్మన్

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎండా కాలం నుంచి నీటి సరఫరాకు ప్రత్యేక నిధులు అక్కర్లేదని, వచ్చే నెల ఐదో తేదీ నుంచి ప్రతి గ్రామానికీ మిషన్ భగీరథ నీటిని దశలవారీగా సరఫరా చేస్తామని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భగీరథ పనులు ఆలస్యంగా జరుగుతున్న సందర్భంగా ఆయన బుధవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కొన్నిసెగ్మెంట్లలో చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే వందలాది గ్రామాలను నీటిసరఫరా అయ్యే అవకాశముందని, వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. పనులను సకాలంలో పూర్తిచేయని ఏజెన్సీల బిల్లులను ఆపేస్తామని ప్రశాంత్‌రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.

'ఫార్మసీ' పోస్టుల దరఖాస్తుకు అనుమతించండి: ఫార్మసీ విద్యార్థులు

హైదరాబాద్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన 230 గ్రేడ్-2 ఫార్మసీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు తమకు కూడా అవకాశం కల్పించాలని బీఫార్మసీ విద్యార్థులు బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతకుమారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే ఆప్షన్లు చూపడం లేదని, వాస్తవానికి ఆ పోస్టులకు తామూ అర్హులమేనని తెలిపారు.

కోల్‌ఇండియా సీఎండీ పదవికి పెరిగిన పోటీ

▸ బరిలో 5గురు ఐఏఎస్‌లు, 20 మంది మైనింగ్ నిపుణులు ▸ 9న ఢిల్లీలో ఇంటర్వ్యూలు

మంచిర్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కీలకమైన కోల్ ఇండియా సీఎండీ పదవి కోసం భారీగా పోటీపడుతున్నారు. బరిలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు సహా 20 మంది మైనింగ్ నిపుణులు వివిధ సంస్థల సీఎండీలు ఉన్నారు. సీఎండీ పదవికి ఫిబ్రవరి 9న ఢిల్లీలో పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఐఏఎస్ అధికారుల్లో గతంలో సింగరేణిలో డైరెక్టర్ పర్సనల్‌గా పనిచేసిన జీవీఎజీ అయ్యంగార్, సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్, ఐఏఎస్ కేడర్ అధికారులు సతీష్‌చంద్ర, అజయ్‌జైన్, ఎండీ పాఠక్, కేంద్ర ప్రభుత్వం నుంచి పీకే ముకోపాధ్యాయ, డీపీఎస్ నేగిలు ఉన్నారు. బొగ్గు గనుల నుంచి సీసీఎల్ సీఎండీ గోపాల్‌సింగ్, సీఎండీ సీపీడీఐఎల్ శేఖర్ సరన్, సీఎండీ ఎన్‌సీఎల్ ఏకే ఝా, సీఎండీ డబ్ల్యూసీఎల్ ఆర్ఆర్ మిశ్రా, సీఎండీ బీసీసీఎల్ ఏకే సింగ్, సీఎండీ ఎన్‌సీఎల్ పీకే సింగ్, ఎండీ ఓఎండీసీ పీకే సిన్హా, డైరెక్టర్ పర్సనల్ పీజీసీఐఎల్ ఆర్‌పీ సింగ్, సీఎండీ ఎన్ఎల్‌సీ ఎస్‌కే ఆచార, ఇతర ప్రైవేటు కంపెనీలలో పని చేస్తున్న వారిలో కపిల్ ధాగత్, జీపీ చౌదరి, అదాని గ్రూప్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ మిశ్రా, మున్ని మాలిక్ దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. గతంలో మాదిరి ఈసారి ఐఏఎస్ అధికారినే ఎంపిక చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచన ప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. ఆగస్టు 31, 2017న కోల్ ఇండియా సీఎండీగా పని చేసిన ఐఏఎస్ అధికారి సుతీర్థ భట్టాచార్యఉద్యోగ విరమణ చేశారు.

అంధుల పాఠశాలకు ఆర్థిక చేయూత

▸ అమెరికాలో స్థిరపడ్డ జనగామవాసి సాయం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ అంధుల పాఠశాలకు అమెరికాలో వైద్యురాలిగా స్థిరపడ్డ జనగామ జిల్లా రేగుల గ్రామానికి చెందిన అరుణాదేవి రూ. 20 లక్షల విలువైన సోలార్ సిస్టం, బెంచీలు, ఫ్రిజ్‌ను అందించారు. హైదరాబాద్‌లో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అమెరికాతో పోల్చుకుంటే భారత్‌లో విద్య అందరికీ అందుబాటులో ఉందన్నారు. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే.. మన విద్యావ్యవస్థే కారణమన్నారు. ఢిల్లీలోని గెయిల్ సంస్థ సహకారంతో వరంగల్, నిర్మల్‌లోని పలు పాఠశాలలను పునరుద్ధరించి ఒక్కొక్క విద్యార్థికి రూ. 3,500ల ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు.

పందెం రాయుళ్లకు జైలు

▸ 3 రోజుల జైలు.. రూ. 100 జరిమానా ▸ నిడదవోలులో 95 మందికి శిక్ష ఖరారు


కోడి పందేల నిర్వాహకులు

నిడదవోలు, జనవరి 31: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. అయినా ప్రజలెవరూ పట్టించుకోలేదు. పండగ సందర్భంగా యధావిధిగా కోడి పందేలు నిర్వహించారు. పండగ అయిపోయింది. పందేలూ అయిపోయాయి. ఇదంతా మామూలే కదా అనుకుంటున్న తరుణంలో నిడదవోలులోని జూనియర్ సివిల్ కోర్టు పందెం రాయుళ్లకు షాక్ ఇచ్చింది. పందెంలో పాల్గొన్న 95 మందికి ఒక్కొక్కరికీ మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి వై.శ్రీలక్ష్మి తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిడదవోలు, సమిశ్రగూడెం, చాగల్లు మండలాల పరిధిలో కోడి పందేలు నిర్వహించినందుకు 44 కేసులకు సంబంధించి మొత్తం 95 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా.. జీవహింసతోపాటు నిషేదాజ్ఞలు ఉల్లంఘించినందుకు జైలు శిక్ష, జరిమానా విధించారు. అనంతరం పోలీసులు వీరిలో 32 మందిని తణుకు సబ్ జైలుకు, 63 మందిని ఏలూరు జిల్లా జైలుకు తరలించారు. 95 మందికి జైలు శిక్ష విధించారని తెలియడంతో కోర్టు బయట ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తప్పు ఒప్పుకొని జరిమానా కట్టి వచ్చేద్దామని భావించిన పందెం రాయుళ్లకు జైలు శిక్ష విధించడం సంచలనమైంది. అయితేఏ ఇందులో అమాయకులకు శిక్ష పడిందని, తమ కుటుంబసభ్యులు అసలు కోడి పందేలకు వెళ్లలేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కొందరు నాయకులు తమ వారిని కేసుల్లో ఇరికించారని వారు ఆరోపించారు.

పింఛన్ ఇప్పిస్తామని.. జైలుకి పంపారు

నా పేరు మోరా జయ. మాది నిడదవోలు మండలం శింగవరం. సంక్రాంతి సందర్భంగా మా ఇంటికి సమీపంలో కోడి పందేలు నిర్వహించారు. నా భర్త మోరా దావీదు కోడి పందేలవైపే వెళ్లలేదు. మా ఎంపీటీసీ భర్త రత్నం ఈ రోజు నా భర్తను పిలిచి ఆధార్ కార్డు తీసుకురా పింఛన్ ఇప్పిస్తానని అన్నాడు. తీరా ఇక్కడి కొస్తే కోడి పందేలు ఆడాడని శిక్ష వేసి జైలుకు పంపారు.

మర్రి కృష్ణారెడ్డికి డాక్టరేట్

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సంస్కృతంలోని నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించినందుకు గానూ మర్రి కృష్ణారెడ్డికి రాష్ట్రీయ సంస్కృతి విద్యాపీఠం డాక్టర్ ఆఫ్ లిటరేచర్‌ను అందజేయనుంది. ఫిబ్రవరి 5న తిరుపతిలో సంస్కృతి విద్యాపీఠం స్నాతకోత్సవం సందర్భంగా కృష్ణారెడ్డికి విద్యాపీఠం చాన్స్‌లర్, మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఎన్.గోపాలస్వామి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకోనున్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్

ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎయిడెడ్ టీచర్లు బుధవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం(డీఎస్‌ఈ)ని ముట్టడించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలనివారు డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు జారీచేయాలని, మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ప్రభుత్వ, జిల్లా పరిషత్‌పాఠశాలలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

7 నుంచి ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల ధ్రువపత్రాల పరిశీలన

గురుకులాల్లో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. 612 పోస్టులకు గానూ 963 మందిని ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేసినట్లు తెలిపింది. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు.

మోడలింగ్ చాన్సుల పేరిట మోసం

▸ పలువురికి ముంబయి మాయలేడి టోకరా

▸ 200 మంది నుంచి 30 లక్షలు

▸ నటాలి కోసం ఆరా తీస్తున్న పోలీసులు

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మోడ్రన్ డ్రెస్సుతో.. చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. కనిపించిన వారితో క్షణాల్లో మాటలు కలిపేస్తుంది. అందంగా, చురుగ్గా ఉన్నావంటూ పొగిడేస్తుంది. మోడలింగ్‌లో, యాడ్ ఫిల్మ్స్‌లో అవకాశాలు ఇప్పిస్తానంటుంది. ఫొటో షూట్ చేసి నమ్మిస్తుంది. అవకాశాలు రావాలంటే యాడ్ ఏజెన్సీలకు సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత మొత్తం చెల్లించాలంటుంది. ఈ పేరుతో ఏక కాలంలో వందల మంది నుంచి డబ్బు వసూలు చేస్తుంది. చివరికి అడ్రస్ కూడా లేకుండా చెక్కేస్తుంది. నటనావకాశాల పేరిట ముంబయికి చెందిన నటాలీ కొంతకాలంగా చేస్తున్న మోసమిది. ఇప్పటికే పలు నగరాల్లో ఇలా మోసం చేసిన ఈ మాయలేడీ.. హైదరాబాద్‌లోనూ తన 'ప్రతిభ'ను ప్రదర్శించింది. నటాలీ ప్రధానంగా షాపింగ్ మాల్స్‌నే కేంద్రంగా చేసుకుంటుంది. అక్కడికి చిన్న పిల్లలను ఎత్తుకొని వచ్చే తల్లిదండ్రులను పలకరించి.. అతడు యాడ్, షార్ట్ ఫిల్మ్స్‌లో నటిస్తే సూపర్ సక్సెస్ అవుతాడని చెబుతుంది. యువతీ, యువకులను కూడా ఇలాంటి మాటలతోనే బుట్టలో వేసుకుంటుంది. ఇలా నగరంలోని సుజనా షాపింగ్ మాల్ వద్ద జనవరి 26న ముంబయికి చెందిన మరో ముగ్గురితో కలిసి నటాలీ.. కొంత మందిని కలిసింది. రెండు రోజులపాటు సుజనా మాల్ వద్దే ఉండి.. సుమారు 350 మంది ఫోన్ నంబర్లను సేకరించారు. వీరందరికీ ఫోన్ చేసి.. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 7లోని లినార్డ్ ఫొటో స్టూడియోకు ఫొటో షూట్‌కు రావాలని చెప్పారు. దీంతో జనవరి 28న సుమారు 250 మంది స్టూడియోకు వచ్చారు. వారితో ముందుగా ఫొటో షూట్ కోసం కొంత డబ్బు కట్టాలని చెప్పింది. సుమారు 200 మంది రూ.1000 నుంచి రూ.10 వేల వరకు చెల్లించారు. వీరికి ఫొటో షూట్ పూర్తి చేశాక.. ఆ ఫొటోలను యాడ్ సంస్థలకు పంపించామని, 43 సంస్థలు యాడ్ ఫిల్మ్స్‌లో అవకాశమిచ్చారని చెప్పింది. అయితే యాడ్ ఏజెన్సీలతో కాంట్రాక్ట్ కుదుర్చుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు సెక్యూరిటీ డిపాజిట్ కట్టాల్సి ఉంటుందని చెప్పింది. రూ.50 వేలు, రూ.20 వేలు.. ఇలా అందినకాడికి వసూలు చేసింది. కేవలం మూడు గంటల్లోనే సుమారు రూ.30 లక్షలు దండుకొని.. మరుసటి రోజు నుంచి షూటింగ్ ఉంటుందని చెప్పి పంపించేసింది. డబ్బులిచ్చిన వారంతా జనవరి 29న స్టూడియో వద్దకు వెళ్లగా.. అప్పటికే నటాలి అక్కడి నుంచి పారిపోయింది. బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


నటాలి



కందుల జల్లెడ కోసం రైతుల జగడం

సిద్దిపేట మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రం వద్ద కందులను జల్లెడ పట్టే యంత్రం కోసం రైతులు జగడానికి దిగారు. కందుల కొనుగోలు కేంద్రంలో అవసరమైనన్ని జల్లెడ యంత్రాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - సిద్దిపేట

నాగా సంక్షోభం!

ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో విచిత్రమైన పరిస్థితి ఉత్పన్నమైంది. ఫిబ్రవరి 27వతేదీనాటి ఎన్నికలకు బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ఆరంభం కాబోతున్న నేపథ్యంలో, రెండు రోజుల ముందు అక్కడ దృశ్యం మారిపోయింది. ఎన్నికల కన్నా నాగాల డిమాండ్ నెరవేరడమే ప్రధానమనీ, శాంతి ఒప్పందం కుదిరే వరకూ ఎన్నికల్లో పాల్గొనకూడదని 11 రాజకీయపక్షాలు తీర్మానించాయి. ఎన్నికలకు ముందే సానుకూల పరిష్కారం సాధించాలంటూ డిసెంబరులో చేసిన అసెంబ్లీ తీర్మానానికి అనుగుణంగా ఎన్నికలు వాయిదా వేయాలని గతంలోనే నిర్ణయించిన నాగా గిరిజన సంఘాలు, పౌర సంస్థల సమితి తీసుకున్న నిర్ణయం ఈ పరిణామానికి కారణం. ఎన్నికలు ఆపండంటూ ఈ సమితి చేసిన విజ్ఞప్తిని ఎన్నికల సంఘం తోసిపుచ్చుతూ, అదే తేదీన యథావిధిగా జరుగుతాయని ప్రకటించింది. అత్యంత శక్తిమంతమైన 'నాగా హోహో' నిర్ణయాన్ని దాటి పోగలిగే స్థితి ఏ రాజకీయపార్టీకీ లేదు కనుక, అఖిలపక్ష సమావేశంలో ఈ నిర్ణయానికి బీజేపీ, తరువాత అర్థం తిరిగిన బీజేపీ ఇప్పుడు మిగతాపార్టీలతోపాటు ఎన్నికల బహిష్కరణకు సిద్ధపడింది. అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు మిత్రపక్షంగా ఉన్న బీజేపీ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేందుకు వీలుగా ఆడుతున్న నాటకంగా ఈ పరిణామాలను తీసిపారేస్తున్నవారూ ఉన్నారు.

రాజకీయపక్షాల నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమైనప్పటికీ, అవి భయంతోనే ఇందుకు అంగీకరించాల్సి వచ్చిందన్న వాదనను ఉపేక్షించలేం. ఈ పరిణామం బీజేపీని అనూహ్యమైన సంకట స్థితిలోకి నెట్టిందన్నది నిజం. నాగాలాండ్‌లో పార్టీ వ్యవహారాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఎన్నికలను బహిష్కరించడమంటే రాజ్యాంగ ధిక్కారం కనుక పార్టీ అటువంటి పనికి అంగీకరించదని అంటున్నారు. అఖిలపక్ష సమావేశంలో మిగతా పార్టీలతో సహా ఎన్నికల బహిష్కరణకు సిద్ధపడి, తీర్మానంపై సంతకం చేసిన ఇద్దరు రాష్ట్ర పార్టీ ప్రతినిధులను ఆ పార్టీ ఇప్పుడు సస్పెండ్ చేసింది. ఆ సమావేశానికి పార్టీ ప్రతినిధులుగా మాత్రమే వారిని పంపించామే తప్ప, నిర్ణయంపై సంతకం చేసే అధికారం మాత్రం వారికి ఇవ్వలేదని నాగాలాండ్ బీజేపీ అధ్యక్షుడు అంటున్నారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు హాజరుకాకుండా ఉపాధ్యక్షులను పంపడమూ, సంతకాలు చేసినందుకు వేటువేయడమూ అంతుచిక్కని రహస్యం. ఈ సమావేశం జరుగుతున్నవేళ ఎన్నికల బహిష్కరణకు సంబంధించిన నిర్ణయం తీసుకోవచ్చనికాని అన్నిపార్టీలకూ తెలుసు. అధికారపక్ష కూటమి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం అసలు లక్ష్యం మిత్రపక్షంగా ఉన్న బీజేపీకి అసలు తెలియదని అనుకోలేము. ఎన్నికల బహిష్కరణ వంటి నిర్ణయం చేసినప్పుడు అభ్యంతరం వ్యక్తంచేసి ఉండవలసిన దానికి, తాను ఆ ఇద్దరికీ ముందే చెప్పానని రాష్ట్ర అధ్యక్షుడు ఓ మాటన్నారు. అందువల్ల, సమావేశానికి వెళ్లటోయే ముందే ఉపాధ్యక్షులు ఇద్దరికీ విషయాన్ని అవగాహన ఉన్నదని, అప్పటికే పార్టీ రాష్ట్రశాఖ ఓ నిర్ణయానికి వచ్చివున్నందునే వారు సంతకాలు చేశారని భావించాలి. ఒకవేళ సంతకాలు చేసే అధికారం వారికి ఇవ్వని పక్షంలో, లేదా వారు తన ఆదేశాలను ధిక్కరించారన్న అనుమానం ఉన్నప్పుడు అధ్యక్షుడే స్వయంగా వెళ్లివుండాల్సింది లేదా, వేరే సమస్యలున్నాయని చెప్పి ఉండాల్సింది. వీరిద్దరినీ సస్పెండ్ చేయడం ద్వారా బీజేపీ విచిత్రమైన విన్యాసం చేసింది. ఇప్పటికే సంతకాలు చేసినందువల్ల ఈ పార్టీ కూడా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టేనని అనుకోవాలో, లేక సంతకం చేసిన వారితో పాటే ఆ నిర్ణయమూ కొట్టుకుపోయిందనుకోవాలో తెలియదు.

ఈ పాము-శక్తి సూత్రాన్నే నాగా తిరుగుబాటు వర్గాల్లో ప్రధానమైనది, ఎక్కువ ప్రజాబలం ఉన్న ఐసాక్ మువయా వర్గంతో కుదిరిన 2015నాటి ఒప్పందంలోనూ బీజేపీ పాటించింది. ఏదారి ఆరంభంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కప్లాంగ్ వర్గం భారత సైన్యంపై దాడిచేయడం, తూర్పుదేశాలతో వాణిజ్యాన్ని పెంచుకొనే లక్ష్యంతో ఉన్న మోదీ ప్రభుత్వం మువయా వర్గాన్ని దారికి తెచ్చుకొని ఈ సమస్యకు ప్రాధాన్యం ఇచ్చింది. అయితే, ఈ శాంతి ఒప్పందంలో ఏమున్నదో ఎవరికీ తెలియని కారణంగా పొరుగు రాష్ట్రాల్లో అనుమానాలు, భయాలను కూడా పెంచింది. హోంమంత్రిత్వశాఖతో సంబంధం లేకుండా ప్రధాని కార్యాలయం అజిత్ దోవల్ ద్వారా నేరుగా మంత్రాంగాన్ని నడిపడమూ, ఇది స్థూల అవగాహనే తప్ప వివరాల్లోకి పోలేదని అనడమూ, స్వతంత్ర ప్రతిపత్తి వంటి ప్రధానమైన హామీలేమైనా ఇందులో ఉన్నాయో లేదో తెలియకపోవడం వంటివి గందరగోళానికి కారణమైనాయి. తాము ఏ ఒక్క డిమాండ్ విషయంలోనూ రాజీపడలేదని ఈ ఒప్పందంపై సంతకం చేసిన మువయా వర్గం ప్రధాన కార్యదర్శి అనంతర కాలంలో ఓ వ్యాఖ్య చేశారు. నాగాల ప్రధాన డిమాండ్ అయిన 'గ్రేటర్ నాగాలాండ్'ను ప్రభుత్వం సూత్రప్రాయంగానైనా ఈ ఒప్పందంలో అంగీకరించి ఉంటే మూడు పొరుగు రాష్ట్రాల భూభాగాలపై దాని ప్రభావం ఉంటుంది. ఒప్పందం వివరాలు పొక్కితే మంటలు రేగుతాయని ప్రభుత్వం భావిస్తుండవచ్చు కానీ, వాటిని రహస్యం ఉంచుతూ ఎక్కువ కాలం ఉపరితల విన్యాసాలు సాగించడం అసాధ్యం. అసలు సమస్యను కప్పెట్టి, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్ ప్రయోగించిన ఈశాన్యాన్ని ఏ మార్గదర్శనమైనా, తనవైపు తిప్పుకోవచ్చునన్నది సరికాదు. ఇటువంటి విన్యాసాలు భారత ప్రభుత్వంపై ఈశాన్య రాష్ట్రాల్లో అనుమానం పెంచి, విశ్వాసం తగ్గిస్తాయి. ఈ పరిణామం తరువాతైనా బీజేపీ నాగా ఒప్పందంలోని అంశాలను బహిర్గత పరచి, పార్లమెంటులో విస్తృతంగా చర్చించి సంపూర్ణంగా సమస్య పరిష్కారానికి కృషి చేయడం అవసరం.

పాలకుడిని గద్దె దించడమే ప్రత్యామ్నాయమా?

గత ఆదివారం (జనవరి 28) ఆంధ్రజ్యోతి దినపత్రిక 'కొత్త పలుకు' శీర్షికన 'పవనూ.. పాతికేళ్లు' వ్యాసంలో నేటి రాజకీయ పరిస్థితిని వివరిస్తూ వేమూరి రాధాకృష్ణ (ఆర్కె) ఇలా వ్యాఖ్యానించారు: "తాము కూడా ఒక పార్టీని ప్రారంభిస్తున్నట్టు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ రెండు రోజుల క్రితం ప్రకటించారు... తెలంగాణ ప్రజలు ఇన్ని రాజకీయ పార్టీలను భరించగలరా? అసలు రాజకీయ పార్టీ అంటే ఏమిటి? అందులోని సాధకబాధకాలు ఏమిటి? వంటి అంశాలపై కనీస అవగాహన లేకుండా రాజకీయ పార్టీలను ప్రకటించడం వల్ల అభాసుపాలు కావడం మినహా మరేమీ ఉండదు." కొన్ని పత్రికలు, న్యూస్ ఛానల్స్ మా వార్తలను ప్రస్తావించడానికి కూడా వెనుకంజ వేస్తున్న ఈ తరుణంలో మా గురించి ప్రస్తావించినందుకు ఆర్.కెకి ధన్యవాదాలు తెలుపుతూ, మా అభిప్రాయాలను వివరిస్తాను.

రాజకీయం అంటే ఏమిటి? ఎవరి కోసం రాజకీయం? ఎందుకోసం రాజకీయం? అన్నవి మొదట తెలియాలి. రాజకీయం అంటే 'మోసం, అవినీతి, కుట్రలు కుతంత్రాలు, ప్రజలను మభ్యపెట్టడం, ఉద్యమాలను రెచ్చగొట్టి, ఉద్యమాలలో ఆత్మబలిదానం చేసినవారి త్యాగాల వల్ల వచ్చే భావోద్వేగాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం, అబద్ధపు, మోసపు వాగ్దానాలు చేయడమే' అని అధికులు భావిస్తున్నట్లు అర్థమవుతున్నది. ప్రస్తుతమున్న ఇటువంటి రాజకీయ వాతావరణాన్ని చూస్తూ ఊరుకోవాలా? చేతులు ముడుచుకుని కూర్చోవాలా? వాస్తవాలు ఏమిటో, నిజమైన రాజకీయాలు అంటే ఏమిటో, ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించబడతాయో, ప్రత్యామ్నాయ విధానాలేమిటో చెప్పాల్సిన అవసరం లేదా? నిజమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సిన బాధ్యత దేశభక్తి, సామాజిక బాధ్యతగల వారిది కాదా? నిజాయితీపరులు, అవినీతిని వ్యతిరేకించేవారు, మేధావులు, సమాజంలో సమూల మార్పులు కావాలని కోరుకునేవారు, అత్యంత పేదవారి జీవితాలలో వెలుగు నిండాలని ఆశించేవారూ రాజకీయాలలోకి రావద్దా? స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి మనకు రెండు రకాల నాయకులు కనబడతారు. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసి, ప్రాణాలు సైతం ఇవ్వడానికి సిద్ధపడ్డ నాయకులు కొందరైతే.. అవకాశ వాదులు మరికొందరు. సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, బాలగంగాధర తిలక్, బాబా సాహెబ్ అంబేడ్కర్ వంటి రాజకీయ నాయకులు కొందరు దేశస్వాతంత్ర్యంతో పాటు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం ప్రజలకు లభించాలని ఆశించారు. మరోవైపు అవకాశవాదులు, స్వార్థపరులు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవాలని కుట్రలు, కుతంత్రాలు పన్నారు. అలాంటివారు ఈనాడూ ఉన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమం కావచ్చు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కావచ్చు, లేక మరేదైనా ఉద్యమం కావచ్చు.. ఉద్యమంలో త్యాగాలు చేసినవారి ఆశయాలు ఏమిటి? వారి ఆకాంక్షలేమిటి? అవి ఏమేరకు నెరవేరాయి? అన్నవి ఎప్పటికప్పుడు బేరీజు చేసుకోవాలి. భారత ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందిస్తామని; వెనుకబడిన జాతులను, కులాలను అభివృద్ధి పరుస్తామని; ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని, ఆదాయాల్లో అంతరాలను తగ్గిస్తామని; దళితుల, ఆదివాసీల జీవితాలలో మార్పులు తెస్తామని; అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని; ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే చర్యలు తీసుకుంటామని చెబుతూ మొట్టమొదటి 1952 ఎన్నికల నుంచి నేటి వరకూ అధికారాన్ని ప్రజల ఓట్ల ద్వారా చేజిక్కించుకున్నవారు తమ వాగ్దానాలను ఏమేరకు నెరవేర్చారు? 1969 ఉద్యమం కావచ్చు, 2004 నుంచి సాగిన తెలంగాణ ఉద్యమం కావచ్చు, ఉద్యమపరంగా నాయకులు చేసిన వాగ్దానాలేమిటి? అవి ఏమేరకు నెరవేరాయి? నేడు కేంద్రంలో అధికారంలో ఉన్నవారు చేసిన వాగ్దానాలేమయ్యాయి? ఆదాయాలలో అంతరాలు తగ్గకపోగా, కొంతమంది లక్షల కోట్లకు ఎలా అధిపతులు కాగలుగుతున్నారు? ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారమే 2016 సంవత్సరంలో ఒక శాతంగా ఉన్న ధనికుల ఆస్తులు 16లక్షల కోట్ల రూపాయలు కాగా, 2017 నాటికి అంటే ఒకే ఒక్క సంవత్సరంలో 20లక్షల కోట్లకు పెరిగిపోయాయి! ఇక, నల్లడబ్బు వెలికి తీయడం అటుంచి, కనీసం నల్లడబ్బు లెక్కతేలే అవకాశం కూడా కనుచూపు మేరలో కనిపించడం లేదు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. లక్షలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నిరుద్యోగుల సంఖ్య 10 కోట్లకు చేరుకొంది. రైతాంగ, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించే విధానాలు ప్రభుత్వాల దగ్గర లేవు. బ్యాంకుల ఋణ విధానం సంక్షోభంలో ఉంది. జాతీయ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని ఎగవేసిన డబ్బు పది లక్షల కోట్లకు పెరిగిపోయింది. ఎక్కడ చూసినా అవినీతి. ఎన్నో కుంభకోణాలు. ఏ ప్రభుత్వ పనులైనా కమీషన్‌ల మీదనే నడుస్తున్నాయన్నది జగమెరిగిన సత్యం. ఆహార పదార్థాల్లో, పాలలో, కొబ్బరి నీళ్ళలో, చివరకు మందుల్లో 'ఇందుగలడందు లేడను సందేహంబు వలదు' అన్నట్లు ప్రతి వస్తువూ కల్తీమయమైపోయింది. వీటన్నిటికీ కారణం ఏవరు? అత్యధిక సంవత్సరాలు దేశాన్నీ రాష్ట్రాన్నీ ఏలిన కాంగ్రెస్ పార్టీ కాదా? నేడు అవే విధానాలను అనుసరిస్తున్న బీజేపీ, టీఆర్‌ఎస్‌లు కావా? అవునన్నది నిజం. పాలకులుగా ఈ పార్టీలు అనుసరించిన, అనుసరిస్తున్న విధానాలు కేవలం కార్పొరేట్ కంపెనీలకు, బడా కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చడం లేదా? అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడి, లంచాలను ప్రోత్సహించిన ఇలాంటి పార్టీలు ఎలా ప్రత్యామ్నాయ పార్టీలు అవుతాయి? ప్రజాతంత్ర హక్కులను కాలరాసిన ఈ పార్టీల నాయకులు ఏ ముఖం పెట్టుకుని 'మేం ప్రత్యామ్నాయం' అని చెబుతారు? అణగారిన కులాలను అణగదొక్కి, అధికారంలో ఉన్న కుటుంబాలు, వారి బంధువులు, కులంవారు అన్నిరకాలుగా లాభపడటం ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? నిరుద్యోగాన్ని పెంచి పోషించిన రాజకీయ నాయకులే 'కొలువుల కొట్లాట' సభలో ప్రముఖ పాత్ర వహిస్తే.. వారు అధికారంలో వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తారని ఎలా నమ్మాలి? ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టి గెలిచినవారు ఖర్చుపెట్టిన దానికి నాల్గింతలు సంపాదించుకోవాలని చూస్తారా, లేక ప్రజలకు సేవ చేస్తారా? ఓట్లకోసం ప్రజలను చీల్చుతూ కుట్రలు కుతంత్రాలు చేసేవారు ప్రజలకు ప్రత్యామ్నాయం చూపగలరా? ఎలాగైనా టీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి, కాబట్టి టీఆర్ఎస్ వ్యతిరేకులంతా ఒక్కటి కావాలనడం నిజమైన ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది? ఒక అవినీతిపరుడిని, అవకాశవాదినీ గద్దెదించి మరొక అవినీతిపరుడినీ, అవకాశవాదినీ గద్దెనెక్కించడమేనా ప్రత్యామ్నాయం?



ఓట్ల కోసం ప్రజలను చీల్చుతూ కుట్రలూ కుతంత్రాలు చేసేవారు ప్రజలకు ప్రత్యామ్నాయం చూపగలరా? ఎలాగైనా టీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి కాబట్టి టీఆర్ఎస్ వ్యతిరేకులంతా ఒక్కటి కావాలనడం నిజమైన ప్రత్యామ్నాయం ఎలా అవుతుంది? ఒక అవినీతిపరుడినీ, అవకాశవాదినీ గద్దె దించి మరొక అవినీతిపరుడినీ, అవకాశవాదినీ గద్దెనెక్కించడమేనా ప్రత్యామ్నాయం?

ఈ దేశానికి ప్రత్యామ్నాయాన్ని చూపిస్తారనుకొన్న కమ్యూనిస్టులు తమ ఎత్తుగడ పంథాలో భాగమని కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ లాంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడం ప్రత్యామ్నాయం అవుతుందా? నేడు మళ్లీ కాంగ్రెస్‌ను బలపరుస్తున్న నాయకులను భుజాన ఎత్తుకునే ప్రయత్నం చేయడాన్ని ఏమనుకోవాలి? సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలలో మనువాద సిద్ధాంతాన్ని ఆచరించే విషయంలో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌లకు ఎటువంటి తేడా లేదు. అందుకే మాలాంటి వాళ్లం రాజకీయ వేదికను ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

ప్రత్యామ్నాయ విధానం అంటే అందరికీ ఉచిత శాస్త్రీయ విద్యను, పౌష్టికాహారాన్ని అందించగలగాలి. విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే విద్యా విధానం కావాలి. దేశభక్తినీ, సామాజిక బాధ్యతనూ, స్త్రీల పట్ల గౌరవాన్నీ పెంచి కుల రహిత సమాజం దిశగా అభ్యుదయ భావాలను కల్గించే విద్యావిధానం కావాలి.


ప్రత్యామ్నాయం అంటే.. రైతులకు సాగు సౌకర్యాలతోపాటు గిట్టుబాటు ధర కల్పించడం; నిరుద్యోగులకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడం; అవినీతిని అంతం చేయడం; స్త్రీలకు రక్షణతోపాటు సమానహక్కులను కల్పించడం; చేతి వృత్తులు, కుల వృత్తులవారు మరింత కుంగిపోని విధంగా అభివృద్ధి పథకాలు చేపట్టడం; దళారీ వ్యవస్థను రూపుమాపడం.... ఈ పనులు ఇప్పుడు ఉనికిలో ఉన్న పార్టీలు చేయగలవా? చేయలేవు కాబట్టే మాలాంటి వారి రాజకీయ ప్రవేశం అనివార్యమయ్యింది. రాజకీయమంటే కుళ్లు కుతంత్రాలు అనే భావన నుంచి రాజకీయం అంటే త్యాగం, సహృదయంతో స్పందించడం, మార్పు కొరకు నిస్వార్థంగా పనిచేయడం అనే భావనను కలిగించాలి. కోదండరామ్ కావచ్చు, మరొకరు కావచ్చు.. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనుకుంటే, అవినీతిని పెంచి పోషించిన నాయకులతో, పార్టీలతో జట్టుకట్టకూడదు. అవినీతి నిర్మూలనకు, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలి.

ప్రజలకు మేం వాస్తవాలు చెబుతాం. సరియైన విధానాలను, నిజమైన రాజకీయాలను ప్రజలకు వివరిస్తాం. అవినీతిని వ్యతిరేకిస్తాం సామాజిక న్యాయాన్ని కోరుతాం. నిజమైన రాజకీయమంటే ఏమిటో ప్రజలకు తెలియపరుస్తాం. మా అభిప్రాయాలను ప్రజలు ఇప్పుడే స్వీకరిస్తారా, ఇప్పుడే మా వెంట వస్తారా, 2019 ఎన్నికల్లోనే మాకు అధికారం ఇస్తారా? అన్నది ప్రజల చైతన్యంపై, రాబోయే అనేక పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికలు వచ్చేసరికి ఎవరెవరూ ఎలా స్పందిస్తారో ఇప్పుడే ఊహించడం సరికాదు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడమే మా కర్తవ్యం. ప్రజలు చైతన్యవంతులైతే డబ్బు, మద్యం... ఏవీ పనిచేయవు. ఈ విషయం 1977 పార్లమెంట్ ఎన్నికల్లో జనతా, 1983 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తెలుగుదేశం, ఇటీవలి ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీల గెలుపుతో ఋజువైంది. మేం తాత్కాలిక ప్రయోజనాలను కోరడం లేదు. ఏదో వ్యక్తిగత లాభాన్ని, పదవులను ఆశించి రాజకీయాల్లోకి రాలేదు. సమాజంలోని అనేక సమస్యలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తూ దళితులపై, ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాం. మాది ఒక ఉద్యమం. ప్రజలను చైతన్యవంతులను చేసే ఉద్యమం. అవినీతికి, అన్యాయాలకు వ్యతిరేకంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం సాగే ఉద్యమం. ఎన్నికల్లో పాల్గొనడం మా కార్యక్రమాల్లో ఒక భాగం మాత్రమే!

■ జస్టిస్ బి. చంద్రకుమార్
హైకోర్టు మాజీ న్యాయమూర్తి

రైల్వే బడ్జెట్‌లో ఈసారైనా న్యాయం జరిగేనా?

దక్షిణమధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చాలా అన్యాయం జరిగింది. ఏదైనా 100కోట్ల అంచనాతో ఒక కొత్త రైల్వే లైను నిర్మాణం చేపట్టినప్పుడు ప్రతి ఏటా బడ్జెట్‌లో 20కోట్ల కేటాయింపు జరిగితే ఆ పని 5 సంవత్సరాలలో పూర్తవుతుంది. కానీ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కొత్త రైల్వేలైన్లకు అలా కేటాయింపులు జరగకపోవడం వలన బడ్జెట్ అంచనాలు ఎన్నో రెట్లు పెరగడమే కాకుండా, నిర్మాణం తీవ్ర జాప్యమై ప్రజలకు ఇబ్బంది కలుగుతూ ఉంది. రైల్వేకు వచ్చే ఆదాయం కూడా రాకుండా పోతోంది. ఉదాహరణకు పెద్దపల్లి–నిజామాబాద్ రైలు మార్గం 1993–94లో 500కోట్ల అంచనాతో ప్రారంభించగా, నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో ఖర్చు 1000కోట్లకు చేరి నిర్మాణానికి 24ఏళ్ళు పట్టింది. ఈ ఏడాది మార్చిలో నిర్మాణం పూర్తిచేసి రైళ్లు నడపడం మొదలుపెట్టారు. అలాగే కాకినాడ పట్టణాన్ని మెయిన్ లైన్‌లోకి తీసుకురావడానికి పిఠాపురం నుంచి కాకినాడకు 22 కిమీ రైల్వే లైను నిర్మాణం ఆ ప్రాంత ప్రజల 60 ఏళ్ల కల. నిధులు ఎట్టకేలకు 1999లో మంజూరయి 85 కోట్ల అంచనాతో 2000లో పనులు ప్రారంభించడం జరిగింది. ఇప్పటికి 17 ఏళ్లయినా ఇంకా నిర్మాణం పూర్తి కాలేదు. దీని అంచనా ఇప్పుడు 200కోట్లకు పైగా పెరిగిపోయింది. గత ఏడాది 2017–2018 బడ్జెట్‌లోనే అధికంగా 150 కోట్లు కేటాయించారు. రెండు రాష్ట్రాలలో నిర్మాణంలో ఉన్న మిగిలిన అన్ని రైల్వే లైన్లకూ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో నిర్మాణాలు ఆలస్యమైపోతున్నాయి. అలాగే, ఎప్పుడో సర్వేలు పూర్తయిన అనేక మార్గాలలో ఇంకా రైల్వేలైన్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. కాగా, ప్రతి ఏడాది బడ్జెట్‌లో కొత్త రైల్వేలైన్ల నిర్మాణాలకు సర్వేలు జరుపుతామని ప్రకటించడం ఆ తరువాత ఆ పని చేయకపోవడం షరా మామూలైపోయింది. మన దక్షిణ మధ్య రైల్వేలో తప్ప మిగిలిన రైల్వేలలో మాత్రం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు తగిన శ్రద్ధ చూపకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నదని భావించాల్సి వస్తోంది. దేశంలో ఉన్న మొత్తం 16 రైల్వేలలో ఆదాయం రీత్యా దక్షిణమధ్య రైల్వే 2వ స్థానంలో ఉంది. 2015–16లో దీని ఆదాయం 15,131 కోట్లు. అయినా అభివృద్ధికి నిధులు కేటాయింపులో మాత్రం పాలకులు తగు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక్క లోకోమోటివ్ ఫ్యాక్టరీ గాని, రైల్ కోచ్ ఫ్యాక్టరీగానీ లేదు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని శ్రీపెరుంబుదూర్‌లో 1955లోనే ఐసీఎఫ్ ఏర్పాటు చేశారు. కర్నాటకలోని ఎల్హంకలో 1984లోనే వీల్ అండ్ ఎక్సల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. కర్నాటకలోనే కోలారులో ఒక కోచ్ ఫ్యాక్టరీ, కేరళలోని పలక్కాడులో మరొక కోచ్ ఫ్యాక్టరీ ఈమధ్యనే మంజూరు చేశారు. కాగా, తెలంగాణలోని కాజీపేటలో నిర్మింప తలపెట్టిన కోచ్ ఫ్యాక్టరీ పుర్తాలకు తరలిపోయింది. వ్యాగ్ ఫ్యాక్టరీ ఇంకా కాగితాలకే పరిమితమైఉంది. రేణిగుంటలో కోచ్ రిపేర్ షాప్, రాయినపాడులో వ్యాగన్ రిపేర్ షాప్‌లు మాత్రమే మనకు దక్కాయి. ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాలవారికి ఉత్పత్తి కర్మాగారాలు, ఆదాయం ఎక్కువగా అందిస్తున్న మనకు మాత్రం రిపేర్ షాపులు! దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న యువత వేలాది ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు. ఇప్పటి వరకూ ఎలక్ట్రిక్, డీజిల్ లోకో ఫ్యాక్టరీలన్నీ ఉత్తరాదికే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా రైల్వే స్థలం చాలినంత ఉన్న నెల్లూరు జిల్లా బిట్రగుంటలో లోకో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి. మన ఎంపీలు రైల్వే మంత్రిపై వత్తిడి తెచ్చి బిట్రగుంలో లోకో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఉంది. ఫ్యాక్టరీ ఏర్పాటైతే వేలాది ఉద్యోగాలు రావడమేగాక, చెన్నై–ఢిల్లీ–కోల్‌కత్తా ట్రంక్ రూట్‌లో ఉన్న ఆ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయం ఎక్కువగా ఉన్న డెల్టా ప్రాంతాలలో ఎప్పటినుంచో టాయిలెట్లు లేని రైళ్లను నడుపుతున్నారు. దీనివల్లల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులలో చలనం లేదు. ఇప్పటికైనా ఈ రైళ్లకు బదులు టాయిలెట్ సౌకర్యం ఉన్న రైళ్లను నడపాలి. మన ప్రజా ప్రతినిధులు, ఎంపీలు ఇప్పటికైనా దక్షిణ మధ్య రైల్వేపై దృష్టిపెట్టి దాని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. ఈ బడ్జెట్‌లో అయినా తెలుగు రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.



■ డి. శ్రీరామమూర్తి

బడ్జెట్‌పై గంపెడాశలు!

వచ్చే ఏడు పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జెట్లీ నేడు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ బీజేపీకి అత్యంత కీలకం. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్ ప్రజాకర్షకంగా ఉంటుందన్న ఆశ ఉంది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టిన తరువాత కేంద్రం ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ ఇది. పన్నుల రంగంలో గొప్ప సంస్కరణగా చెప్తూవస్తోన్న జీఎస్టీలోని వాస్తవాలను ఈ బడ్జెట్‌లోని అంకెలు నిగ్గు తేలుస్తాయి. ఈ బడ్జెట్ గతంలోలా సంక్లిష్టంగా కాకుండా తక్కువ నిడివితో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు కారణం ప్రభుత్వ ఆదాయంలో జీఎస్టీ ద్వారా వచ్చిన మార్పులే. వస్తుసేవలపై పన్నుల నిర్ణయాధికారం రాష్ట్రాల ఆర్థిక శాఖా మంత్రులతో కూడిన 'జీఎస్టీ మండలి'ది కావడంతో పలు పన్నుల ప్రస్తావన లేకుండా బడ్జెట్ ఉండే అవకాశముంది.

'ఒకే దేశం–ఒకే పన్ను' నినాదంతో ప్రవేశ పెట్టిన జీఎస్టీ లాభ నష్టాలు ఎలా ఉన్నాయనే విషయాన్ని కేంద్ర బడ్జెట్ స్పష్టం చేయనుంది. గతంలో కేంద్రం పేర్కొన్న ప్రకారం జీఎస్టీ ప్రవేశ పెట్టిన ఏడాదిలో అంటే 2018 జూలై నాటికి స్థిరాస్తి రంగం కూడా జీఎస్టీ పరిధిలోకి వస్తుంది. కాబట్టి ఈ ఏడు రాబడి అంచనాల్లో ఈ అంశం కూడా కలిసే అవకాశముంది. ఇప్పటికే అనేక మార్పులకు లోనైన జీఎస్టీ సహేతుక స్థిరీకరణ వైపు చేసే పయనంలో మరిన్ని మార్పులకు లోనయ్యే అవకాశముంది. పెద్ద నోట్ల రద్దు విషయంలోలాగే జీఎస్టీ విషయంలో కూడా తమకు ప్రయోజనం చేకూరుతుందని సామాన్యులు భావించారు. దేశమంతా ఏకరూప పన్ను విధానం వల్ల నిత్యావసరాల ధరలు తగ్గుతాయని ఆశించారు. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిని కేంద్రం పెంచుతుందనే ఆశతో వేతన జీవులున్నారు. ఈసారి బడ్జెట్‌లో కీలకమైనది– మౌలిక వసతుల కల్పన రంగం. రహదారులు, రేవుల అభివృద్ధికి, భారత్‌మాల ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఇటీవల వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల ఫలితాలు కూడా కేంద్ర బడ్జెట్‌ను ప్రభావితం చేసే అవకాశముంది. ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేందుకు ఈ ఎన్నికల ఫలితాలు ప్రేరేపిస్తాయనడంలో సందేహం లేదు. త్వరలో జరుగనున్న త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్నాటక శాసనసభ ఎన్నికలు కూడా ఈ బడ్జెట్‌పై ప్రభావం చూపనున్నాయి.

■ డాక్టర్ రాయారపు సూర్యప్రకాశరావు

కంకవనం చేజారనివ్వద్దు!

మేడారం. ఆధిపత్యాన్ని ధిక్కరించి ఈటెలతో, బల్లేలతో కలబడి ఎదురునిలబడిన పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, గోవిందరాజు, జంపన్నలు వీరత్వం పొందిన రణస్థలి. ఆదివాసీ ఆత్మాభిమాన బావుట. పోరాట స్ఫూర్తి. ఆదిమ సంస్కృతైన సర్వాత్మవాదానికి, టోటెమిజానికి, ప్రకృతి ఆరాధనకు సజీవ సాక్ష్యం. మూలవాసుల మాతృస్వామ్య వ్యవస్థ అవశేషం. చిలుకలగట్టుపై ఒక గొట్టువాళ్లు గుట్టుగా చేసుకునే త్యాగాల యాదితీర్థం. ఏళ్లనాటి తమ మూలాలను వెతుక్కుంటూ, కాలినడకన, ఎడ్లబండ్లలో వాగుల్ని, వంకల్ని, లొద్దులను దాటుకుంటూ, చిక్కని అడవిని చీల్చుకుంటూ యావత్ తెలంగాణేకాక, మధ్యభారతం, దండకారణ్యంలోని కోయ కుదురంతా(గుంపు) కదిలివచ్చి కలుసుకునే కూడలి. కొంగొత్త బంధాలను కలిపే వారధి. నిష్ఠతో గూడేలను అలికి, పూదిచ్చి, గోడలకు జాజు పూసి, ముగ్గులేసి, ఆదివాసీ వీరుల నిషానులను గద్దెలపై నిలుపుకునే అనాది వారసత్వ సంప్రదాయం. చిటికెడు బండారి(పసుపు), పిడికెడు బంగారం(బెల్లం), కుడకలు, ఒడివాల బియ్యం, రెండు రైకబట్టలు, పోకలు, ఖర్జూరాలును సారెబోసి, ఒపన్ సత్తి కోడిపిల్లనో, యాటపోతునో కోసి కుంకుమభరిణకు, కంకవనానికి మోకరిల్లితే కోరిన వరాలనిస్తుందనే దృఢ నమ్మకం. చెలిమె తొక్కుడు, కోడిబుక్కుడు, ఆరగింపు మొక్కులు, సోలుపూత వరాలు, ఎదురుకోళ్లు, యాటపోతుల బలిహారాలు, రేలపాటలు, కొమ్ము నృత్యాలు, తూతకొమ్ము రాగాలు, డోలివాయిద్యాల నడుమ ఆడిపాడే అచ్చమైన ఆదివాసీ సంబురం. నిండుపున్నమి వేళ అడవితల్లి ఆత్మీయ స్పర్శ, జీలుగు కల్లు వాసన, ఇప్పసార నిషాతో తన్మయత్వం పొందే సామూహిక సంరంభం.

మేడారం కంకవనం తామరతంపరై మైదానాలకు విస్తృతినొందుతున్నది. సబ్బండ వర్గాల ఇలవేల్పవుతోంది. ఆధునికతలో ఆదివాసీ సంస్కృతి విలుప్తమవుతూ, విచ్ఛిన్నమవుతూ విశ్వజాతరై వెలుగొందుతున్నది. ఆత్మాభిమానానికి, స్వేచ్ఛా కాంక్షలకు ప్రతీకలైన సమ్మక్క, సారక్కలు ఇప్పుడు వనదుర్గలు. ఆదిపరాశక్తి అవతారులు. సాలహారం సంకెళ్లతో బంధించబడిన ఇనుపకంచెలో కుచించుకుపోయిన గద్దెలపై కొలువుదీరి కోటొక్క కోర్కెలను ఈడేర్చే దేవేరులు. కుంకుమభరిణ కుంభమేళా సరసన చేరుతోంది. చెట్టు, పుట్ట, గుట్ట, రాతిబండ, కోయదుంగ ప్రకృతిశక్తులు రూపాంతీకరణ నొంది పులి, దుప్పి ప్రతిమలై ప్రభవిస్తున్నయ్. పురాణగాథగా మారుతున్నది. ఎములాడ రాజన్నతో బంధమల్లుకున్నది. పీతాంబరాలను అందుకుంటున్నది. బంగారమే కాదు లడ్డూ నైవేద్యాన్నీ స్వీకరిస్తున్నది. హుండీలు వెలసి దండిగా నిండుతున్నయ్. నిష్ఠ పోయి శిష్ట సంప్రదాయ ఊబిలో దిగబడుతున్నది. అది పాయలు పాయలుగా చీలుతున్నది. అది భౌతిక మార్పునూ చెందుతున్నది. కంకవనం కొత్త రూపును సంతరించుకుంటున్నది. కాంక్రీటు మయవుతున్నది. రసాయనిక రంగుల గత్తరవాసన లేపుతున్నది. అడుగడుగునా సాబాదు బండలు. కాగితం పూల తోరణాలు. గద్దెల ప్రాంగణం రోప్ పార్టీల రాపిడిలో నలుగుతున్నది. పోలీసుల నిఘా నీడన మగ్గుతున్నది.

అంతేనా, అదిప్పుడు పస్రా, తాడ్వాయికీకారణ్యంలో నాలుగురోజులు మెరిసి మాయమైపోయే మెట్రోపాలిటన్ నగరం. సకల సదుపాయాల నిలయం. మల్టీనేషనల్ ఉత్పత్తుల విపణి క్షేత్రం. ప్రపంచ వస్తు ప్రదర్శనశాల. మార్కెట్ వస్తువు. రమ్ము, బ్రాందీ విస్కీల దుర్గంధం. వేల చదరపు కిలోమీటర్ల వన విధ్వంసం. నీటికో రేటు. నిలబడే నీడకోరేటు. యాపపుల్లకో రేటు. అమ్మకానికి కాదేదీ అనర్హం అక్కడ. సందడంతా మార్కెట్ శక్తులదే! నాగరీకులు సకుటుంబ సపరివార సమేతంగా తాగి, ఊగి, జాలారి మడుగుల్లో ఈదులాడే వినోదకేళి. జాతర సంబురమంతా రాజకీయ నేతలది. ప్రచారాలు. నిలువెత్తు కటౌట్లు. పటాటోపమంతా అధికారులది. అజమాయిషీ అంతా ఆదివాసీయేతరులది.

జాతర ఇంతగా విస్తృతి చెందుతున్న తరుణంలోనే ఆదివాసీలు విస్మృతి చెందుతుండడం శోచనీయం. ఆక్షేపణీయం. మేడారం భౌతికస్థితిలో వచ్చిన గుణాత్మక, పరిమాణాత్మక మార్పులు గిరిజనగూడేల్లో, వారి బతుకుల్లో కానరాకపోవడమే నేటి వైచిత్యం. నేటికీ డయేరియా, మలేరియా వ్యాధులతో నడమంత్రపు చావులకు ముగింపు లేదు. పౌష్టికాహారలేమితో డొక్కలు ఎండిపోయి, ముఖాలు ఈడ్సుకపోయి, ఎముకలు తేలిన దేహాలకు కొదవలేదు. గొంతెండితే లొద్దులు, ఊటలు, వాగుల వైపు సారించే చూపుల దిశ మారలేదు. విద్యా, వైద్యం ఇంకా అందని ద్రాక్షే. పాత రాతియుగంనాటి జీవన సరళే. దినదిన గండమైన బతుకే. అలవికాని అంధకారమే. అన్నింటికీ మించి బ్రిటిష్ వలస పాలనకాలంలో మొదలైన ఆదివాసీ స్వయంపాలన కాంక్ష ఇప్పటికీ, 70 ప్రజాస్వామ్య ప్రభుత్వాల హయాంలోనూ కలగానే మిగిలిపోవడం విషాదం.



కార్పొరేట్ల కీలుబొమ్మ ప్రభుత్వాలు జమిలిగా సాగిస్తున్న అటవీ వనరుల దోపిడిని, సంస్కృతిపై విచ్ఛిన్నదాడిని ఆదివాసీ సమాజం ఇకనైనా ఐక్యంగా తిప్పికొట్టాలి. అటవీహక్కులు, చట్టాల అమలు కోసమే కాదు; సంస్కృతి పరిరక్షణకూ నడుంకట్టాలి. మూలవాసీ అస్తిత్వాన్ని చాటుకోవాలి. కంకవనం చేజారకుండా పొదివిపట్టుకోవాలి. ఆదివాసీల ఆరాటాలకు, పోరాటాలకు ప్రజాతంత్ర శక్తులన్నీ బాసటగా నిలవాలి.

ఇట్లా ఎందుకు జరుగుతున్నది? మేడారం ఏ దిశగా పరివ్యాప్తి నొందుతోంది? ఏ రాచరిక ఆధిపత్య శక్తులను ఎదిరించారో అదే భావజాలంలోకి, సనాతన సంప్రదాయవాదుల కబంధహస్తాల్లోకి సమ్మక్క, సారలమ్మ క్రమక్రమంగా జారిపోవడం దేనికి సంకేతం? ఈ వికృత, విరోధ పరిణామాలకు కారకులు ఎవరు? రాంజీ గోండు, బిర్సాముండా, కుమ్రంభీం ఇచ్చిన జల్ జంగిల్ జమీన్ నినాదాలు అడవంతా ఇంకా ఎందుకు ప్రతిధ్వనిస్తున్నాయ్? ఆదివాసీల ఆకాంక్షలు ఎందుకు విస్మరణకు గురవుతున్నవి?

చరిత్రనంతా వడబోసినా సనాతన వైదిక సంప్రదాయంలో ఆదివాసీలు కొనసాగిన దాఖలాలు ఎక్కడా కనబడవు. సర్వస్వతంత్రంగా ఒక జాతిగానే మనుగడ సాగించారు. సాగిస్తున్నారు. ఇప్పుడు వారిని కర్మసిద్ధాంతాలకు కట్టిపడేసి ఉత్పత్తిదారులకు ఊడిగం చేసే వారిగా నిలపాలన్నదే ఆధిపత్యవర్గాల కుట్ర. బలప్రయోగంతో కాకుండా భావజాలవ్యాప్తితో లోబరుచుకునే విలీనీకరణ సిద్ధాంతం. అందులో భాగమే ఆదివాసీల సంస్కృతిపై ఈ ఎడతెగని దాడి. ఆదివాసీ ఆరాధ్యశక్తులకు పురాణేతిహాస గాథల అభూత కల్పనలు. వైదిక దేవతలు, దేవుళ్లతో పోలికలు. కొత్త బంధుత్వాల అల్లికలు. ప్రతిమల ప్రతిష్టలు. పత్రికల్లో పతాకస్థాయి ప్రచారాలు. టూరిజం ప్రోత్సాహకాలు. కాంక్రీటు నిర్మాణాలకు, విడిది కేంద్రాలకు కోటాను కోట్ల నిధుల కేటాయింపులు. ఇది ఒక్క మేడారంలోనే కాదు ఆదివాసీలు ఆదివాసీయేతరులతో సంబంధాలను నెరిపిన, నెరపుతున్న ప్రతిచోటా ప్రతిఫలిస్తున్న దుష్ఫలితమే. పచ్చిక బయళ్లను అన్వేషిస్తూ భారతదేశంలోకి వలసవచ్చిన ఆర్యులు తమకు లొంగిపోని స్థానిక తెగలను నిర్మూలించి, లోబడిన తెగలను తమలో కలిపేసుకున్న ఏకీకరణ సూత్రీకరణ చరిత్రలకు మేడారం ఒక కొనసాగింపు మాత్రమే. హైందవీకరణతో ఆదివాసీల పోరాట స్ఫూర్తిని నిర్వీర్యం చేసే ఎత్తుగడ. ఆదివాసీలను బేదఖల్‌చేసి అడవిని, అరణ్య గర్భాన దాగిన అపార సంపదను కొల్లగొట్టేందుకు రాజ్యం చేస్తున్న విషపన్నాగం. ఇది సామ్రాజ్యవాదుల దన్నుతో బూర్జువా ఆధిపత్యశక్తులు అమలు చేస్తున్న మంద్రస్థాయి యుద్ధవ్యూహం. వీటి ఫలితం సుస్పష్టం. ఆదివాసీల చేజారిన శ్రీశైలం, భద్రాద్రి, తిరుపతి, అన్నవరం, అహోబిలం, యాదాద్రిలే అందుకు సాక్ష్యం.

కార్పొరేట్ల కీలుబొమ్మ ప్రభుత్వాలు జమిలిగా సాగిస్తున్న అటవీ వనరుల దోపిడిని, సంస్కృతిపై విచ్ఛిన్నదాడిని ఆదివాసీ సమాజం ఇకనైనా ఐక్యంగా తిప్పికొట్టాలి. అటవీహక్కులు, చట్టాల అమలు కోసమే కాదు సంస్కృతి పరిరక్షణకూ నడుంకట్టాలి. సమ్మక్క, సారక్కల పోరాట స్ఫూర్తితో ఆధిపత్య హైందవభావజాల వ్యాప్తికి వ్యతిరేకంగా పోరుబావుటాను ఎగరేయాలి. మూలవాసీ అస్తిత్వాన్ని చాటుకోవాలి. కంకవనం చేజారకుండా పొదివిపట్టుకోవాలి. ఆదివాసీల ఆరాటాలకు, పోరాటాలకు ప్రజాతంత్ర శక్తులన్నీ బాసటగా నిలవాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మేడారం మేడాద్రిగా మిగిలిపోవడం తథ్యం.

■ ఆర్కే ప్రావ్ద



దీపక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బూర నర్సయ్య గౌడ్

ఎన్‌హెచ్ 163పై అండర్‌పాస్‌లు నిర్మించండి

›› ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ను కోరిన ఎంపీ బూర నర్సయ్య

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి - వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 163)లో ఐదు చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించాలని నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా చైర్మన్ దీపక్‌కుమార్‌ను టీఆర్‌ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ బుధవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. వనపర్తి, మానుకొండ రోడ్డు, హైదరాబాద్ వైపు ఆలేరు బైపాస్, ఆలేరు జీడికల్ రోడ్డు, జనగాం బైపాస్ రెండు చోట్లా అండర్ పాస్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయనకు వివరించారు. అండర్‌పాస్‌లు లేని కారణంగా ఇప్పటి వరకు 50 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వినతిపత్రం ఇచ్చామని, సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

జర్మనీలో టీఆర్‌ఎస్ శాఖ

›› ప్రారంభించిన పార్టీ ఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జర్మనీలో టీఆర్‌ఎస్ శాఖ ఏర్పాటైంది. టీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల నేతృత్వంలో టీఆర్‌ఎస్ తాత్కాలిక శాఖను ప్రారంభించారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు అక్కడి ప్రవాస తెలంగాణ వాసులు తెలిపారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎన్‌ఆర్‌ఐలకు మహేశ్ బిగాల పిలుపునిచ్చారు. త్వరలోనే జర్మనీ టీఆర్‌ఎస్ శాఖకు ఎంపీ కవిత కార్యవర్గాన్ని ప్రకటిస్తారని చెప్పారు.

గల్ఫ్‌కు మంత్రులు జల్సాల కోసమేనా?: దాసోజు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "గల్ఫ్‌కు మంత్రులు వెళ్లింది జల్సాలు చేసేందుకు, బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకా? అక్కడి కార్మికుల సమస్యలను పట్టించుకోరా?"అని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణవాసులు స్వదేశానికి వచ్చేందుకు కువైత్‌లోని రాయబార కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కువైత్‌కు ప్రత్యేక బృందాన్ని పంపించాలన్నారు. వెయ్యి కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని, గల్ఫ్ వెళ్లే వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని, అక్కడి కార్మికులు తమ సమస్యలు తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఒక బృందం గల్ఫ్ వెళ్తుందని, అక్కడి కార్మికుల సమస్యలపై సాయం అందించాలని ఇప్పటికే సీఎంకు లేఖ రాశామన్నారు.

ముందస్తుకు మేం సిద్ధం

›› అధికారంలోకి రావడం ఖాయం

›› నన్ను టచ్ చేసే ధైర్యం ఎవరికీ లేదు: జానా



హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముందస్తు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఎన్నికల్లో తాము విజయం సాధించడం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి గాంధీభవన్‌లో జానారెడ్డి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటముల గురించి ఆలోచించడం సహజమని, అన్ని పార్టీలూ ఆలోచిస్తాయని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో రెండున్నర దశాబ్దాలుగా ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఇక టీఆర్‌ఎస్ నేతలు గొప్పల కోసమే ఊహలకు కూడా అందనన్ని స్థానాలు గెలుస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గొప్పలకు పోదని, 70 నుంచి 80 సీట్లు గెలుస్తామని చెబుతోందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ఉండబోదని, అందుకు ప్రధాని మోదీ సుముఖంగా లేరని తాను భావిస్తున్నట్లు జానారెడ్డి చెప్పారు. ఎకరానికి రూ.4 వేలు వ్యవసాయ పెట్టుబడిగా ఇవ్వడం కాదని, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. "గతంలో మా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వల్లే ఆ భూములు అమ్ముకోకుండా మిగిలాయి. నేడు కేసీఆర్ ప్రభుత్వం వాటికి వ్యవసాయ పెట్టుబడి ఇవ్వగలుగుతోంది. మేం అధికారంలోకి వస్తే గిట్టుబాటు ధర కల్పిస్తాం. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని రైతలను కోరుతాం."అని జానారెడ్డి వివరించారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ విధానాలు నచ్చినందునే పార్టీలో చేరారని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు రేవంత్ సిద్ధంగానే ఉన్నారని, కానీ.. ఇప్పటి దాకా పలువురు ఎమ్మెల్యేలు చేసిన రాజీనామాలను స్పీకర్ ఆమోదించనందున తనది కూడా పెండింగ్‌లో పెడతారేమోననే ఆగారని అన్నారు. ఇక తనతో ఇతర పార్టీ నేతలెవరూ టచ్‌లో లేరని జానా స్పష్టం చేశారు. తనను టచ్ చేసే ధైర్యం ఎవరికీ లేదన్నారు.

టీఆర్‌టీ పరీక్షల షెడ్యూల్ జారీ

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) పరీక్షల షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ బుధవారం జారీ చేసింది. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు పరీక్షలను నిర్వహించనుంది. 8,792 టీచర్ పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఎస్‌జీటీ పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనుంది. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ విభాగంలో బయోలజికల్ సైన్స్, గణితం, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు రాత విధానంలో పరీక్షలు నిర్వహించి.. మిగతా పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనుంది. అలాగే గురుకులాల్లో జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్, లైబ్రేరియన్‌తో పాటు మరికొన్ని పోస్టుల భర్తీకి గానూ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసింది. ఫిబ్రవరి 19 నుంచి 23వ వరకు ఈ పరీక్షలు నిర్వహించనుంది.

టీఆర్‌టీ పరీక్షల షెడ్యూల్...


సబ్జెక్టు	విభాగం	తేదీ
తెలుగు	లాంగ్వేజ్ పండిట్	24-02-2018
తెలుగు	స్కూల్ అసిస్టెంట్	24-02-2018
--	ఎస్‌జీటీ(తె/మి)రాత విధానం	25-02-2018
--	ఎస్‌జీటీ(ఇ/మి)రాత విధానం	25-02-2018
ఇంగ్లిషు	స్కూల్ అసిస్టెంట్	26-02-2018
మ్యాథ్స్, సోషల్	స్కూల్ అసిస్టెంట్(ఇ/మి)	26-02-2018
ఫిజికల్ సైన్స్	స్కూల్ అసిస్టెంట్(తె/మి)	27-02-2018
ఉర్దూ, మరాఠీ, హిందీ	లాంగ్వేజ్ పండిట్	27-02-2018
ఫిజికల్ ఎడ్యుకేషన్	---	28-02-2018
హిందీ,కన్నడ, ఉర్దూ,తమిళం	స్కూల్ అసిస్టెంట్	28-02-2018
---	ఎస్‌జీటీ	02-03-2018
ఫిజికల్ ఎడ్యుకేషన్	స్కూల్ అసిస్టెంట్(తె/మి)	02-03-2018
బయోలాజికల్ సైన్స్	స్కూల్ ఇసిస్టెంట్ (ఉర్దూ, మరాఠీ, కన్నడ)	03-03-2018
మ్యాథ్స్	స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ, కన్నడ, మరాఠీ, హిందీ, తమిళం)	03-03-2018
సోషల్ స్టడీస్	స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ, మరాఠీ, హిందీ, తమిళం)	03-03-2018
ఫిజికల్ సైన్స్	స్కూల్ అసిస్టెంట్(ఇ/మి)	03-03-2018
బయోలజికల్,	స్కూల్ అసిస్టెంట్(తె/మి)	
మ్యాథ్స్, సోషల్	రాత విధానం	04-03-2018
---	ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(ఇ/మి)	04-03-2018

హోంగార్డుల వేతనం పెంపు



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న హోంగార్డుల వేతన సమస్య పరిష్కారానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమల్లోకి వచ్చింది. హోంగార్డుల రోజువారి వేతనాన్ని రూ.400 నుంచి రూ.675కు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పెరిగిన వేతనం ప్రకారం హోంగార్డులకు నెలకు రూ.20,250 అందనుంది. పెరిగిన ఈ వేతనం ఫిబ్రవరి నెల నుంచి హోంగార్డులు అందుకోనున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుంచి జీతంలో రూ.వెయ్యి పెంపు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న 2500 మంది హోంగార్డులకు ట్రాఫిక్ కానిస్టేబుళ్ల తరహాలో వేతనంలో 30% పొల్యూషన్ అలవెన్సు లభిస్తుంది. పోలీస్ సిబ్బందికి ఇస్తున్న విధంగానే యూనిఫాం, బందోబస్తు అలవెన్సు చెల్లిస్తారు. మహిళా హోంగార్డులకు ఆరు నెలల ప్రసూతి సెలవు, పురుష హోంగార్డుకు 15 రోజుల పితృత్వ సెలవు అమల్లోకి వచ్చింది. అయితే ఇద్దరు పిల్లల వరకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. పోలీస్ సిబ్బంది తరహాలోనే యూనిట్ పోలీస్ ఆసుపత్రిలో హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించారు. విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు కుటుంబసభ్యులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం చెల్లించే మొత్తాన్ని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారు. కాగా హోంగార్డులతోపాటు కుటుంబసభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్, డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం త్వరలో జారీ చేయనున్న మరో ఉత్తర్వుల్లో స్పష్టత ఇవ్వనుందని హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ ఉత్తర్వుల పట్ల హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేనికైనా రెడీ!



పెంచినా, పెంచకున్నా ఓకే.. పెంచితే మాకే అడ్వాంటేజ్

›› సద్వినియోగం చేసుకుంటాం

›› విపక్షాలకు అభ్యర్థులు దొరకరు

›› అసెంబ్లీ సీట్ల పెంపుపై టీఆర్‌ఎస్ మనోగతం

›› పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడున్న అసెంబ్లీ స్థానాలు 119.. ఒక వేళ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగితే 153 స్థానాలు.. ఇందులో దేనికైనా తాము సిద్ధమేనని అధికార టీఆర్‌ఎస్ అధిష్ఠాన శిబిరం చెబుతోంది. ఎన్నికలను ఎదుర్కొనే క్రమంలో తమకు స్థానాల సంఖ్య అప్రాధాన్యమని అభిప్రాయపడుతోంది. ఎన్నికల నాటికి అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగినా.. పెరగకున్నా రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది ఉండబోదనే ధీమా వ్యక్తం చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యస్థీకరణపై కేంద్రంలో కదలిక వచ్చిందనే వార్తల నేపథ్యంలో తెలంగాణలో అధికార పార్టీగా టీఆర్‌ఎస్ మనోగతం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న హామీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ కూడా ఒకటి. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటే, రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153కు పెరుగుతాయి.

టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే రాజకీయ పునరేకీకరణలో భాగంగా పలువురు కాంగ్రెస్, టీడీపీ సహా ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను 'గులాబీ' గూటిలో చేర్చుకుంది. ఈ క్రమంలో టీఆర్‌ఎస్ చాలా కాలం క్రితమే మిగిలిన విభజన హామీలతోపాటు, నియోజకవర్గాల పెంపునకు పూనుకోవాలని కేంద్రానికి ఒక లేఖ ఇచ్చింది. ఆ తర్వాత టీఆర్‌ఎస్ ముఖ్యులు ఢిల్లీ పర్యటనల్లో కేంద్ర మంత్రుల వద్ద ఈ అంశాన్ని అడపాదడపా ప్రస్తావిస్తున్నప్పటికీ, సీరియస్‌గా ప్రయత్నాలు చేసింది లేదు. తాజాగా ముందస్తు జమిలి ఎన్నికల ఆలోచన నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపునకు ఆసక్తిగా ఉండటంతోనే ఆ పార్టీ రాష్ట్ర శాఖ ముఖ్య నేతలకు హస్తిన నుంచి పిలుపు వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలను టీఆర్‌ఎస్ అధిష్ఠానం ముఖ్యులు ఆసక్తిగా గమనిస్తున్నారు. నియోజకవర్గాల పెంపు ఉండే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే తాము అనుకున్నంత మాత్రాన నియోజకవర్గాల పెంపు ఉండబోదని, కేంద్రం సానుకూలంగా ఉంటేనే, దాని ఆచరణ సాధ్యపడుతుందనే వాస్తవం తమకు తెలుసునని పార్టీ ముఖ్యులు అంటున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కేంద్ర నాయకత్వం రాజకీయ లాభ, నష్టాలను బేరీజు వేసుకోదని ఊహించలేమని చెబుతున్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న తమతో పోల్చుకుంటే, ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీకి నియోజకవర్గాల పెంపు అవసరం ఎక్కువగా ఉందని టీఆర్‌ఎస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు భాగస్వామి టీడీపీ బలమైన ఆకాంక్ష మేరకు ఏపీలో నియోజకవర్గాల పెంపు జరిగినప్పుడు, తెలంగాణలోనూ పెంపు ఉంటుందని, ఈ విషయంలో తమకు ఎలాంటి కంగారు లేదని అంటున్నారు.

కేంద్రం కనుక నియోజకవర్గాల పెంపునకు పూనుకుంటే, ఈ ప్రక్రియ పూర్తి కావటానికి మూడు నెలల సమయం పడుతుందని, వచ్చే ఎన్నికలు పెరిగిన నియోజకవర్గాలకే జరుగుతాయని టీఆర్‌ఎస్ పెద్దలు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే తమకు అడ్వాంటేజ్ ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే తమ పార్టీలో 119కి తోడు, అదనంగా పెరుగుతాయని అనుకుంటున్న 34 అసెంబ్లీ స్థానాలకు మించి సమర్థులైన అభ్యర్థులు ఉన్నారని అంటున్నారు. మరోవైపు రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాల సంఖ్య 153కి పెరిగితే, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ సహా విపక్షాలకు అన్ని స్థానాలకు అభ్యర్థులు కూడా ఉండరని చెబుతున్నారు. పేరుకు అన్ని స్థానాల్లో విపక్షాలు అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ, టీఆర్‌ఎస్ అభ్యర్థుల ముందు తేలిపోవటం ఖాయమని చెబుతున్నారు. ఏదేని కారణాల వల్ల కేంద్రం రాష్ట్ర విభజన హామీ మేరకు నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జోలికి వెళ్లని పరిస్థితుల్లో ఇప్పుడున్న 119 స్థానాలకే ఎన్నికలు జరిగినప్పటికీ, తమకు ఇబ్బందిలేదనే విశ్వాసంతో 'గులాబీ' దళం ఉంది. తమ అవసరాల కంటే ఎక్కువగా ఉన్న అసెంబ్లీ అభ్యర్థుల స్థాయి నేతలను ఇతరత్రా సర్దుబాటు చేస్తామని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. మండలి, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పదవులు కట్టబెడతామని అంటున్నారు.

జమిలికి టీఆర్‌ఎస్ పూర్తి మద్దతు

›› లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత జితేందర్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనకు టీఆర్‌ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని లోకసభలో టీఆర్‌ఎస్ పక్ష నేత జితేందర్ రెడ్డి చెప్పారు. "ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే దేశాభివృద్ధి విషయంలో ఎంతో మేలు జరుగుతుంది. ఎంతో డబ్బు, సమయం ఆదా అవుతుంద"ని అన్నారు. మోదీ ప్రతిపాదన అమలైతే ఎన్నికైన తర్వాత అయిదేళ్ల పాటు పాలనపై మరింత శ్రద్ధ పెట్టే వీలు ప్రభుత్వాలకు కలుగుతుందని జితేందర్ రెడ్డి అన్నారు.

శ్రీనివాస్ హత్యపై హైకోర్టులో భార్య పిటిషన్

›› రాజకీయ కుట్ర ఉందన్న నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్

›› సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విన్నపం

›› అఫిడవిట్ కోసం ఎస్పీకి కోర్టు ఆదేశం



హైదరాబాద్/నల్లగొండ క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై ఆయన సతీమణి, నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. తన భర్త హత్య వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఈ కేసును సీబీఐతోగానీ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో గానీ దర్యాప్తు చేయించాలంటూ బుధవారం ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన ఉమ్మడి హైకోర్టు.. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సంబంధించిన అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీని ఆదేశించింది. అత్యవసరంగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి విచారించారు. శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, టీఆర్‌ఎస్‌లో చేరాలంటూ నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అనేకసార్లు ఒత్తిడి చేశారని, ఈ హత్య వెనుక వీరేశం హస్తం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది దామోదర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, భద్రత కల్పించాలని కోరినా స్పందన లేదని తెలిపారు. నిందితుల కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేయాలని, కాల్‌డేటాను సేకరించి తమకు ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. అనుకోకుండా జరిగిన ఘర్షణలోనే శ్రీనివాస్ హత్యకు గురయ్యాడంటూ జిల్లా ఎస్పీ మీడియా ముందు ప్రకటించారని, దర్యాప్తు పారదర్శకంగా జరగడం లేదని అన్నారు. దీంతో 'నిందితులను మీడియా ముందు మాట్లాడించారు. ఇందులో పోలీసులెవరో, నిందితులెవరో తెలియడం లేదు' అంటూ న్యాయమూర్తి ఈ సందర్భంగా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాగా నిందితుల కాల్‌డేటా సేకరించారని, ఈ దశలో వాటి వివరాలు వెల్లడిస్తే దర్యాప్తునకు విఘాతం కలుగుతుందని హోంశాఖ తరఫున స్పెషల్ జీపీ శరత్‌కుమార్ నివేదించారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు మూడు వారాలు గడువు ఇవ్వాలని కోరడంతో అనుమతించిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.



సత్తుపల్లి పర్యటనలో బుల్లెట్ నడుపుతున్న మంత్రి తుమ్మల

ఢిల్లీకి రండి!

›› ఏపీ, టీ నేతలకు బీజేపీ అధిష్ఠానం పిలుపు

›› నేడు అమిత్‌షాతో వేర్వేరుగా చర్చలు

›› సీట్ల పెంపుపై చర్చించే అవకాశం

›› పార్టీలో వర్గాలు, సమస్యలపై చర్చ

›› టీడీపీతో అనుసరించే వైఖరిపై స్పష్టత?

›› టీఆర్‌ఎస్‌పై పోరు తీరుపై దృష్టి

న్యూఢిల్లీ/అమరావతి/హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు అందింది. ఏపీలో తెలుగుదేశంతో పొత్తుపై కమలంలో కొందరి 'కత్తులు'! తెలంగాణలో అధికార టీఆర్‌ఎస్‌పై పోరాడాల్సిన తీరుపై అస్పష్టత! రెండు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పెంపుపై డిమాండ్లు! 'ముందస్తు - జమిలి'పై ఊహాగానాలు! వీటన్నింటి నేపథ్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని తన నివాసంలో ఇరు రాష్ట్రాల ముఖ్య నేతలతో వేర్వేరుగా సమావేశం కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, శాసన సభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు, సీనియర్ నేతలు పురందేశ్వరి, సోము వీర్రాజు, కన్నా లక్ష్మీనారాయణ... తెలంగాణ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, శాసనసభా పక్ష నేత కిషన్ రెడ్డి, సీనియర్ నేత దత్తాత్రేయ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మంత్రి శ్రీనివాస్‌లకు ఢిల్లీ నుంచి పిలుపు అందింది. అసెంబ్లీ సీట్ల పెంపుతోపాటు రెండు రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణ, అనేక ఇతర రాజకీయ అంశాలు చర్చకు రానున్నాయి.

ఏమిటి సీన్?

రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు నియోజకవర్గాల సంఖ్య పెరగాలని గట్టిగా కోరుకుంటున్నాయి. అయితే, సీట్ల పెంపుతో టీఆర్‌ఎస్‌కు మేలు జరుగుతుందంటూ తెలంగాణ బీజేపీ నేతలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. తాజా పరిణామాల దృష్ట్యా, గురువారం జరిగే సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరుగుతుందన్నది ఆసక్తికరంగానే ఉంటుందని టీ-బీజేపీ ముఖ్య నేత ఒకరు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన సమస్యలు, పార్టీ పరంగా ఉన్న ఇబ్బందులు, టీడీపీ స్నేహబంధంపై భిన్నాభిప్రాయాలు, పార్టీలో గ్రూపులు తదితర అంశాలపై అమిత్‌షా చర్చించే అవకాశం కనిపిస్తోంది. టీడీపీతో సంబంధాలు కొనసాగించే విషయంలో బీజేపీలోనే రెండు వర్గాలు తయారయ్యాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడంపై అమిత్‌షా దృష్టి సారిస్తారని తెలుస్తోంది. రెండు రాష్ట్రాల్లో ప్రధాన సమస్యలు, కేంద్రం పరిష్కరించాల్సిన అంశాలు, కేంద్రంపై ప్రజలు ఏమనుకుంటున్నారు అనే అంశాలపైనా దృష్టి సారించే అవకాశముంది. పార్టీ బలోపేతానికి ఎవరెవరు ఏం చేస్తున్నారో నిర్దిష్టంగా అడుగుతారని తెలుస్తోంది. తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, అధికార టీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ విధానాలు, బీజేపీలోకి వలసలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అమిత్‌షా చర్చించనున్నారు. ముఖ్యాయింపుగా... ఆయా నేతలకు సంబంధించిన వ్యాపార, వ్యవహారాలు, రాజకీయాలకు సంబంధించి తన వద్ద ఉన్న అంతర్గత నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ పార్టీకోసం చిత్తశుద్ధితో పని చేయని వారిని గట్టిగా మందలిస్తారనే సమాచారం ఉంది.

అధిష్ఠానమే స్పష్టత ఇవ్వాలి: లక్ష్మణ్

తెలంగాణలో అధికార టీఆర్‌ఎస్ పట్ల ఎలాంటి వైఖరి అనుసరించాలన్న విషయంపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వడంలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. "కేంద్ర మంత్రులు తరుచూ వచ్చి టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని పొగుడుతున్నారు. ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలని భావిస్తున్నాం. 23 వేలమందితో ఇప్పటికే బూత్ కమిటీలను వేశాం. 105 మంది పూర్తి స్థాయి నేతల్ని నియమించాం. త్వరలో గుజరాత్ నమూనాలో పేజి ప్రముఖ్‌లను కూడా నియమిస్తాం. అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఉధృతంగా రంగంలోకి దిగి కేసీఆర్ ప్రభుత్వంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రజల ముందు ఉంచుతాం" అని తెలిపారు.

పనిచేసే వాళ్లే ఉండండి

›› నీటిపారుదల అధికారులపై తుమ్మల గరం

దమ్మపేట/సత్తుపల్లి, జనవరి 31: "రెండో దశ పనులే పూర్తి చేయలేకపోతే 3, 4 దశలు ఎలా పూర్తి చేస్తారు..? చిత్తశుద్ధితో పని చేయగలిగితేనే ఈ ప్రాంతంలో ఉద్యోగం చేయండి. చేయలేని వాళ్లు వెళ్లిపోండి" అని నీటిపారుదల శాఖ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తుమ్మల నివాసంలో మంత్రిని ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఐబీ ఈఈ ఆనంద్‌కుమార్, డీఈ మరియన్న బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లోని మిషన్ కాకతీయ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. పనులు నాణ్యతగా జరగాలని, ఏ ఒక్క చెరువు పనిలో లోపం ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్టీఆర్ ప్రత్యామ్నాయ కాలువ హెడ్ రెగ్యులేటరీ పనులకు భూసేకరణ సమస్య ఉందన్న అధికారుల సమాధానంపై మండిపడిన మంత్రి 150 క్యూసెక్కుల రెగ్యులేటర్ స్థానంలో పెద్దది నిర్మించడానికి భూసేకరణ అవసరమేంటని ప్రశ్నించారు. దమ్మపేట గిరిజన గురుకుల పాఠశాల శివారున గల అసైన్డ్ భూములను గిరిజనులకు అప్పగించాలని తహసీల్దార్ భద్రకాళిని ఆదేశించారు. కల్లూరులో డబుల్ బెడ్ రూం ఇళ్లకు స్థల సమస్యను టీడబ్ల్యూ ఈఈ శంకర్ ప్రస్తావించగా స్థలం అందుబాటు ఉన్న గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జూలైకి 'కొండపోచమ్మ'కు నీరు

›› మల్లన్నసాగర్ పనులు ప్రారంభం: హరీశ్

గజ్వేల్/హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ సాగర్ పనులను జూలై నాటికి పూర్తి చేసి గోదావరి నీటిని తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం రేయింబవళ్లు కష్టపడుతోందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం, కొడకండ్ల గ్రామాల పరిధిలో కాళేశ్వరం కాలువ నిర్మాణ పనులను బుధవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించే 2 పంప్‌హౌస్‌లలో మొదటి పంప్‌హౌస్ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని, రెండో పంప్‌హౌస్ పనులను వచ్చే నెలలో పూర్తి చేస్తామన్నారు. 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను ఐదారు నెలల్లోనే పూర్తి చేస్తామన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల నుంచి గంధమల్ల-బస్వాపూర్ రిజర్వాయర్‌కు 2018 చివరిలోగా నీటిని తరలించి యాదాద్రి-భువనగిరి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. రైతు ఆత్మహత్యలను ఆపడానికి ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మిస్తుంటే ప్రతిపక్ష కాంగ్రెస్ అడుగడుగునా అడ్డు పడుతోందన్నారు. కాగా, పంటల దిగుబడి, మార్కెట్ యార్డుల పరిస్థితి, మద్దతు ధర, చెల్లింపులు తదితరాలపై మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా, కర్ణాటక రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన అధికారులు మంత్రి హరీశ్‌రావుకు హైదరాబాద్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నివేదికలను సీఎం కేసీఆర్‌కు సమర్పించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎకరానికి రూ.4 వేల పంట పెట్టుబడి పథకం అమలు, పెరగనున్న సాగునీటి వసతి, సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ రంగంలో సంస్కరణలతో రాష్ట్రంలోని రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

కందుల సేకరణ పరిమితి మరోసారి పెంపు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్దతు ధరకు కందుల సేకరణ పరిమితిని కేంద్రం మరోసారి పెంచింది. సేకరణ పరిమితిని 1,13,600 టన్నులకు పెంచినట్లుగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. తొలుత రాష్ట్రంలో మద్దతు ధరకు కందులను 33,500 టన్నుల మేరకు సేకరించాల్సిందిగా నాఫెడ్‌ను కేంద్రం ఆదేశించింది. సేకరణకు తుది గడువు జనవరి 31గా పేర్కొంది. అయితే కందుల సేకరణ పరిమితి పెంచాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. సేకరణకు తుది గడువునూ మార్చి 31 వరకు పొడిగించాలని కోరింది. ఈ నేపథ్యంలో కందుల సేకరణ పరిమితిని 53,600 టన్నులకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. సేకరణకు తుది గడువును ఫిబ్రవరి 28కి పెంచింది. కందుల సేకరణ పరిమితిని 1.50 లక్షల టన్నులకు పెంచాలని తాజాగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

అక్రమాలను సహించం: హరీశ్

మద్దతు ధరకు కందుల కొనుగోళ్లలో అక్రమాలు, అవకతవకలు జరిగితే సహించేది లేదని మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. కందుల రీ సైక్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల ముసుగులో కొందరు వ్యాపారులు, దళారులు ఎక్కువ ధరకు కందులు అమ్ముతున్నారని, ఆ కార్యకలాపాలను అరికట్టాలన్నారు.

తహసీల్దార్ల నీడలోకి సబ్‌రిజిస్ట్రార్లు

▸▸ ఎమ్మార్వో ఆఫీసుల్లోకి 120 కార్యాలయాలు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సబ్‌రిజిస్ట్రార్లు ఇక నుంచీ తహసీల్దార్ కార్యాలయాల నుంచే విధులు నిర్వర్తించనున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లేని మండలాల్లో తహసీల్దార్లకే రిజిస్ట్రేషన్ అధికారాలు కట్టబెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి పట్టణ ప్రాంతం మినహా అన్ని జిల్లాల్లో భూముల రిజిస్ట్రేషన్ తహసీల్దార్ చేతుల్లోకి వెళ్లనుంది. రాష్ట్రంలో 584 మండలాలు ఉండగా, 141 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో సొంత భవనాలున్న 21 కార్యాలయాలు మినహా.. 120 కార్యాలయాలను తహసీల్దార్ల పరిధిలోకి మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు మార్చి 12వ తేదీ నుంచి తహసీల్దార్లకు సబ్‌రిజిస్ట్రార్ అధికారాలు దఖలు పరచనున్నారు. కాగా, ప్రస్తుతం ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని రెవెన్యూ మండలానికే పరిమితం చేస్తూ ఉత్తర్వులు వెలువడనున్నాయి. భూముల విలువను సవరించే అధికారాన్ని తెలంగాణ భూసేకరణ చట్టంతో జిల్లా కలెక్టర్‌కు దఖలు పరచనున్నారు. మరోవైపు రైతులు చనిపోతే ఆ రైతు భార్య పేరిట రికార్డుల్లో మ్యుటేషన్ చేయాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశించారు.

సీసీఎల్‌ఏగా రాజేశ్వర్ తివారి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ)గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్ తివారికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఏర్పడ్డాక కేవలం ఏడాది పాటే పూర్తిస్థాయి సీసీఎల్‌ఏ ఉన్నారు. ఆ తర్వాత సీఎస్‌లుగా ఉన్న రాజీవ్‌శర్మ, ప్రదీప్‌చంద్ర, ఎస్పీ సింగ్ మాత్రమే సీసీఎల్‌ఏగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఎస్పీ సింగ్ పదవీ విరమణ చేయడంతో ఆయన చూసే బాధ్యతలను తివారి, స్మితాసభర్వాల్‌కు పంచారు. స్మితాసభర్వాల్‌ను సీఎంవోలో కొనసాగిస్తూనే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత సీస్ ఎస్కే జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్ల రాబడి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ఈ ఏడాది రూ.3,000 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, రికార్డు స్థాయిలో ఇప్పటికే రూ.3638.52 కోట్ల రాబడి నమోదైంది. డిసెంబర్ 31 నాటికే 97.97 శాతంమేర అంటే.. రూ.2939.06 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖాతాలో జమ కాగా, జనవరి 31 నాటికి అది 109%కు చేరింది.

రబీలో జోరుగా వరి సాగు.. నివేదిక వెల్లడి

హైదరబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీలో వరి జోరుగా సాగవుతోంది. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 5.43లక్షల హెక్టార్ల మేర వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ తాజా నివేదికలో వెల్లడైంది. ఇది సాధారణం కన్నా 2.18 లక్షల హెక్టార్లు ఎక్కువ. గత ఏడాది రబీలో వరి సాగు అంచనాలు మించింది. ప్రస్తుత రబీలో వరి సాగు దాన్ని మించిపోయింది.

కృష్ణా బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ పదవీ విరమణ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ బుధవారం పదవీ విరమణ చేశారు. గత 9 నెలలుగా ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఆయన పదవీవిరమణ నేపథ్యంలో బోర్డు కార్యాలయంలో బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కాగా శ్రీవాస్తవ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అయితే ప్రస్తుతం కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ)లో సభ్యుడిగా పనిచేస్తున్న వై.కె.శర్మను కృష్ణా బోర్డు ఛైర్మన్‌గా నియమించే అవకాశం ఉంది.

ఐదు జిల్లాల బడులకు 2న 'మేడారం' సెలవు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారక్క జాతర నేపథ్యంలో ఫిబ్రవరి 2న పాత వరంగల్ జిల్లా పరిధిలోకి వచ్చే 5 జిల్లాల్లోని పాఠశాలలకు విద్యాశాఖ సెలవు మంజూరు చేసింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు 2న సెలవు ప్రకటించారు.

'అంతర్రాష్ట్ర బదిలీ'కి జూన్ 30వరకు గడువు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు సంబంధించి దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. దరఖాస్తు గడువును జూన్ 30వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు గతంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరించిన విషయం తెలిసిందే.

ఏఎస్పీ సునీతా రెడ్డి నా రోల్‌మోడల్!

▸▸ వివాహేతర సంబంధం కలిచివేసింది

▸▸ 'ఆంధ్రజ్యోతి'కి ఈమెయిల్లో సూసైడ్ నోట్ పంపిన అజ్ఞాతవ్యక్తి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఏఎస్పీ సునీతా రెడ్డి తనకు రోల్ మోడల్ అని, ఆమె వివాహేతర సంబంధం పెట్టుకోవడం తీవ్రంగా కలిచి వేసిందని ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డితో ఏసీబీ ఏఎస్పీ సునీతారెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం బాధ కలిగిస్తోందని, తీవ్ర మనస్తాపానికి గురై చనిపోతున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఒక అజ్ఞాత వ్యక్తి ఈ-మెయిల్‌లో సూసైడ్ నోట్ పంపాడు. vinay.sunitha30@gmail.com ఈ-మెయిల్ ఐడీ నుంచి ఆంధ్రజ్యోతికి సందేశరూపంలో పంపించాడు ఈ సూసైడ్ నోట్ వ్యవహారాన్ని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

'కాళేశ్వరం'తో కల సాకారం

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగంలో జవాబుదారీతనం పెరగడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పరిపాలనలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు కూడా ముఖ్యమేనని, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీటిని అందించడం తనకు సంతోషాన్నిచ్చిందని, కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా తన కల నిజమవనుందని పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్.కె.జోషి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి: ప్రధాన కార్యదర్శిగా నియమితులవడం ఎలా అనిపిస్తోంది?

జోషి: చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ శాఖలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ వందశాతం కష్టపడతాం.

యంత్రాంగాన్ని ఎలా నడిపించాలనుకుంటున్నారు?

పరిపాలనలో ప్రభుత్వ యంత్రాంగానిదే కీలక పాత్ర. ఉద్యోగులు సరిగ్గా పనిచేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. అధికారుల్లో జవాబుదారీతనం ఉండడం చాలా ముఖ్యం. ఇది ఎంత ఎక్కువ ఉంటే ఫలితాలు అంత బాగా ఉంటాయి. ఆ దిశగా అధికారుల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తా.

శాఖల పనితీరును మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలేమిటి?

ప్రభుత్వ విభాగాలు బాగా పనిచేయాలంటే ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలి. అప్పుడే సమగ్ర అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అయితే ఈ విషయంలో కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆయా శాఖల మధ్య మరింత సమన్వయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

మీ ప్రాధాన్య అంశాలు ఏమిటి?

ప్రభుత్వ ప్రాధాన్యమే నా ప్రాధాన్యం. ప్రజలకు సాధ్యమైనంత మేలు చేయడమే నా లక్ష్యం. ముఖ్యంగా ప్రజల అవసరాలను గుర్తించి వాటి కోసం పనిచేసేలా ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తా. అలాగే చేసే పనిలో సామర్థ్యాన్ని మరింత పెంచాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటా.

ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య ఎలాంటి సమన్వయం ఉండాలి?

ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు ఎంతో విలువ ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించి అధికారులు వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు, సమాజానికి మేలు జరుగుతుంది.

మీకు సంతోషం కలిగించిన సందర్భం? నిజం కావాలనుకుంటున్న మీ కల ఏమిటి?

మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీటిని అందించడం అత్యంత సంతోషాన్నిచ్చింది. నేను ఇరిగేషన్ శాఖాధిపతిగా ఉండి.. సాగునీటిని ఇవ్వడాన్ని ఎన్నడూ మరిచిపోలేను. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా కల నిజమవుతుందని భావిస్తున్నా. ఈ ప్రాజెక్టు ద్వారా అనేక జిల్లాల రైతులకు మేలు జరగనుంది.

తెలంగాణతో, ఇక్కడి ప్రజలతో మీ అనుబంధం ఎలా ఉంది?

నా సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్. అక్కడి ఉన్నత పాఠశాలలో నా తృతీయభాష తెలుగు. అప్పటినుంచే నాకు తెలుగుతో అనుబంధం ఏర్పడింది. తెలుగు బాగా వచ్చు. ఐఏఎస్‌కు ఎంపికయ్యాక ఇష్టపూర్వకంగా తెలుగు రాష్ట్రాన్ని ఎంపిక చేసుకున్నా. 30 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నా. రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

నీటిపారుదల రంగం నుంచి సీఎస్‌గా నియమితులయ్యారు. ఆ అనుభవం ప్రాజెక్టుల నిర్మాణంలో మేలు చేస్తుందా?

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నందున అక్కడ పనిచేసి రావడం నాకు సానుకూల అంశంగా భావిస్తున్నా. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిచేయడంపై దృష్టి సారిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1, 2 పనులు వచ్చే జూన్, జూలైలోగా పూర్తి చేస్తాం.

ప్రాజెక్టుల వివాదాలను ఎలా పరిష్కరిస్తారు?

పక్క రాష్ట్రమైనా, కేంద్ర ప్రభుత్వమైనా.. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గం.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌కే జోషి

సీఎస్‌గా ఎస్‌కే జోషి

సచివాలయంలో బాధ్యతల స్వీకరణ

▸▸ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సీఎస్

▸▸ ఎస్పీ సింగ్‌కు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శైలేంద్రకుమార్ జోషి నియమితులయ్యారు. ఎస్పీ సింగ్ పదవీకాలం బుధవారంతో ముగియడంతో సీఎం కేసీఆర్ జోషిని నూతన సీఎస్‌గా నియమించారు. 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జోషి ప్రస్తుతం నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్పీ సింగ్ పదవీ కాలాన్ని మరో 3 నెలలు పొడిగించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు అనుమతి కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. స్పందన రాకపోవడంతో కొత్త సీఎస్‌గా జోషిని నియమిస్తూ కేసీఆర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆయన సచివాలయంలో ఎస్పీ సింగ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సింగ్‌తోపాటు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జోషికి అభినందనలు తెలిపారు. అనంతరం సింగ్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. సీఎస్‌గా రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను జూలైలోగా పూర్తి చేస్తామని చెప్పారు.

జోషి ప్రస్థానం..

పేరు: శైలేంద్రకుమార్ జోషి
తల్లిదండ్రులు: శ్యామాజోషి, శ్రీశంకర్ లాల్ జోషి
స్వస్థలం: అల్లాపూర్ గ్రామం, బుదౌన్ జిల్లా, ఉత్తరప్రదేశ్
పుట్టినరోజు: డిసెంబరు 20, 1959. బరేలీ, ఉత్తరప్రదేశ్
విద్యాభ్యాసం: శ్రీవిష్ణు బాల్‌సదన్(కేజీ-5), ప్రభుత్వ ఇంటర్ కాలేజ్ (6-12)బరేలీ. (6, 7, 8 తరగతుల్లో తృతీయభాష తెలుగు)
ఐఐటీ రూర్కీలో ఈసీఈలో ఇంజనీరింగ్, ఐఐటీ ఢిల్లీలో కమ్యూనికేషన్, రాడార్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, 2010లో పీహెచ్‌డీ.
కుటుంబం: భార్య అనురాధా జోషి (ఎంఏ, ఎల్ఎల్‌బీ) గృహిణి, కుమార్తె రిహా జోషి.. ఐఆర్ఎస్ అధికారి.
తొలి ఉద్యోగం: రైల్వేలో 8 నెలలపాటు సిగ్నల్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్‌గా విధులు. 1984లో ఐఏఎస్‌గా ఎంపిక.
ఐఏఎస్ అధికారిగా: నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్, తెనాలి, వికారాబాద్ సబ్ కలెక్టర్, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్, కలెక్టర్. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇరిగేషన్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్, మునిసిపల్, పట్టణాభివృద్ధి, విద్యుత్తు, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ శాఖల్లో కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.
కేంద్ర విద్యుత్తు మంత్రి కార్యదర్శిగా, విదేశాల్లోనూ వివిధ అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ సేవలందించారు.



సీఎస్ జోషికి అభినందనలు తెలుపుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

నూతన సీఎస్‌ను కలిసిన డీజీపీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కే జోషిని డీజీపీ మహేందర్ రెడ్డి సచివాలయంలో కలిశారు. డీజీపీతోపాటు ఏడీజీ అంజనీ కుమార్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు సీఎస్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

హైదరాబాద్‌లోనే ఉంటా



▸▸ ఎస్పీ సింగ్

రాష్ట్రంలో పాలనరంగంలో సుదీర్ఘ అనుభవం సంతృప్తినిచ్చిందని సీఎస్‌గా పదవీ విరమణ పొందిన ఎస్పీ సింగ్ చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్, హైదరాబాద్ మెట్రో, మిషన్ భగీరథ పథకాల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ముగింపు దశకు చేరుకున్న మిషన్ భగీరథతో తనకు భావోద్వేగ అనుబంధం ఉందని చెప్పారు. ఈ పథకంతో గ్రామీణ ప్రజల జీవితాలు మరింత మెరుగుపడతాయన్నారు. తాను హైదరాబాద్‌లోనే ఉంటానన్నారు. తనకు గ్రూపుల్లేవని, శత్రువులూ లేరని చెప్పారు. సీఎం కేసీఆర్ కల అయిన బంగారు తెలంగాణ సాధ్యం కావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి.. సింగ్‌ను కారు వరకు తోడ్కొని వెళ్లి సాగనంపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

'పరిహారా'నికి వన్‌టైం సెటిల్‌మెంట్!

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ సేకరణ, పరిహారం చెల్లింపు వంటి అంశాల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక లోక్ అదాలత్‌లను నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఈ అంశంపై చర్చించడానికి భారీ నీటిపారుదల శాఖమంత్రి హరీశ్‌రావు గురువారం అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా భూ సేకరణ, పరిహారం చెల్లింపు కేసులు ఏళ్ల తరబడి కోర్టుల్లో కొనసాగుతుండడంపై "ఆంధ్రజ్యోతి" బుధవారం "పరిహారం పరిహాసం" పేరిట కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనంతో రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఇప్పటివరకు వివిధ కోర్టుల్లో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి పరిస్థితేంటి? అనే అంశాలపై అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. ఆ వివరాల ప్రకారం.. ఇప్పటివరకు 1556 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, కోర్టులు ఇచ్చిన తీర్పుల మేరకు పరిహారం కింద రైతులకు రూ.262 కోట్లను చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. కొన్ని కేసులు గత 15 ఏళ్ల నుంచి వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో చాలావరకు లాయర్ల ప్రమేయంతో జాప్యం జరుగుతున్నట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. పరిహారాన్ని చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, స్వీకరించడానికి రైతులు సానుకూలంగా ఉన్నప్పటికీ లాయర్ల వల్ల సమస్య పరిష్కారం కావడం లేదనే అంచనాకు ప్రభుత్వం వచ్చింది. కేసులు ఎంత త్వరగా పరిష్కారమై.. అంత వేగంగా పరిహారాన్ని చెల్లిస్తే ప్రభుత్వంపై అంత భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వన్‌టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో కేసులను పరిష్కరించాలని భావిస్తున్నారు. హైకోర్టు అనుమతితో ప్రత్యేక లోక్ అదాలత్‌లను నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఏజీతో కోర్టుకు ప్రత్యేక లేఖను రాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ముందుకువచ్చే రైతులకు సంబంధించిన కేసుల ను లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సహకార సంఘాల పాలకవర్గం 6 నెలలు పొడగింపు

రామారెడ్డి, జనవరి 31: రాష్ట్రంలోని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), జిల్లా సహకార బ్యాంకులకు(డీసీసీబీలు) ప్రస్తుత పాలకవర్గాలనే మరో 6 నెలలపాటు పర్సన్ ఇన్‌చార్జ్(పీఐసీ)లుగా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్వర్వులు జారీ చేసిదని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో సహకార బ్యాంకును బుధవారం ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహకార సంఘాలు రైతాంగానికి కల్పవృక్షాల వంటివన్నారు. కాగా, వివాదాలు, అవినీతి సంఘాలకు మాత్రం పొడిగింపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని భావించడంతో ప్రస్తుత పాలకవర్గాలనే పీఐసీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చేపల అక్రమ చెరువులపై నివేదిక ఇస్తాం

గద్వాల, జనవరి 31, (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో చేపల అక్రమ చెరువులు ఉన్నది వాస్తవమేనని, వీటిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని మత్స్యశాఖ జేడీ సరళ చెప్పారు. బుధవారం మత్స్యశాఖ బృందం చేపల అక్రమ చెరువులపై విచారణ జరిపింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కృష్ణ కొల్లేరైంది' కథనంపై మంత్రి శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. మంత్రి అదేశాల మేరకు చేపల చెరువులపై విచారణ జరుపుతున్నామని అధికారులు తెలిపారు. ఇటిక్యాల మండలం షేక్‌పల్లి, తిమ్మాపూర్‌లో నిర్వహిస్తున్న చేపల చెరువులకు అనుమతులు లేవన్నారు. క్యాట్‌ఫిష్ చెరువులను తొలగిస్తామని, మిగిలిన వాటిని ఏం చేయాలనే నిర్ణయం ఉన్నతాధికారులు తీసుకుంటారని చెప్పారు. తమ నివేదికను ప్రభుత్వానికి, మంత్రికి నివేదిస్తామని వివరించారు.

కాంగ్రెస్‌లో ఓబీసీ కుంపటి!

(మొదటిపేజీ తరువాయి..)

చేశారు. అయితే పార్టీ అనుబంధంగా బీసీ సెల్ ఉండగా మరో కొత్త దుకాణం ఎందుకంటూ బీసీ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. బీసీ నేతల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు పార్టీలోని అగ్రకుల నేతలు కుట్ర చేస్తున్నారని శివాలెత్తుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ సాధించేది, దానివల్ల కలిగే ప్రయోజనం ఏంటని బీసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని అడిగినందుకే ఈ రకమైన చిచ్చు రేపేందుకు అగ్రవర్ణాల నాయకుడు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా కాంగ్రెస్‌లోని బీసీ నేతలందరినీ ఒకే వేదికపైకి తేవాలనే ఉద్దేశంతో ఓ ఫోరంను ఏర్పాటు చేసేందుకు సమావేశం జరిగింది. బీసీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు లేనందున.. ఎక్కువ సీట్లు, టికెట్లు సాధించడానికి ఈ కోర్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అగ్రకుల నేతలతో సమానంగా వ్యక్తిగతంగా ఇమేజ్ సంపాదించుకున్న పలువురు నేతలు తామెందుకు వెనుకబడిపోవాలనే ఉద్దేశంతోనే ఈ కోర్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కనీసం 50శాతం టికెట్లు దక్కించుకోవాలని భావించారు. ఈ ప్రయత్నానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కోర్ కమిటీలో ప్రాధాన్యం లభించడంలేదని నేతలు ఆరోపణలు చేసుకోవడంతో ఆ ఫోరం నిర్వీర్యమైంది. దాని తర్వాత టీపీసీసీ బీసీ సెల్ ఛైర్మన్ చిత్తరంజన్‌దాస్ నేతృత్వంలోనే తమకు న్యాయం జరుగుతుందని పార్టీ నేతలు భావించారు. తాజాగా బీసీ సెల్‌ను పక్కనబెట్టి ఓబీసీ సాధికారత కమిటీని ఏర్పాటు చేయడంతో చిచ్చు రాజుకుంది.

సాధికారత కమిటీ ఏర్పాటుకు కారణమిదే!

రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు, తాయిలాలు ప్రకటిస్తూ బీసీలను ఆకర్షిస్తున్న నేపథ్యంలో ఆ వర్గం వారిని కాంగ్రెస్ వైపునకు తిప్పుకోవాలంటే ఏం చేయాలనే దానిపై ఓబీసీ సాధికరత కమిటీ సమాలోచనలు, సంప్రదింపులు జరుపుతుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియాతో బుధవారం జరిగిన ముఖాముఖి సమావేశంలో మెజారిటీ బీసీ నేతలు ఈ మేరకు ఆయనతో చర్చించారు. సీఎం స్థాయిలో బీసీల కోసం కాంగ్రెస్ ఏదైనా చేయాలంటే అధ్యయనం అవసరమని కుంతియా దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

సాధికారత కమిటీ ఛైర్మన్‌గా నాగయ్య

టి.నాగయ్య ఛైర్మన్‌గా, బి.మహేశ్‌కుమార్ గౌడ్ కన్వీనర్‌గా ఓబీసీ సాధికారత కమిటీని ఏర్పాటు చేస్తూ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో మాజీ ఎంపీలు అంజన్‌కుమార్‌యాదవ్, మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, దాసోజు శ్రావణ్ పి.వినయ్ కుమార్, టి.నిరంజన్, ఆదం సంతోశ్‌కుమార్, క్యామ మల్లేశ్, ఇ.అనిల్‌కుమార్, ప్రేమ్‌లాల్, జి.సుజాత, కత్తి వెంకటస్వామి, రాజారాం యాదవ్, బండి నర్సాగౌడ్, అల్లం భాస్కర్, నగేశ్ ముదిరాజ్, ఇందిరా శోభన్‌లకు చోటు కల్పించారు. ఓబీసీ సాధికారత కమిటీ మొదటి సమావేశాన్ని ఈ నెల 6న గాంధీభవన్‌లో నిర్వహించనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

కాంగ్రెస్ పార్టీకి 70 సీట్లు వస్తే

రాజకీయ సన్యాసం తీసుకుంటా

(మొదటిపేజీ తరువాయి..)

ముఖ్యమంత్రి కాబోరని, సేవలందించే వారినే ప్రజలు గెలిపిస్తారని ఉత్తమ్‌ను ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీలో టీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని ఆనాడు బల్దియా ఎన్నికల్లో ఉత్తమ్ సవాల్ విసిరితే 99 సీట్లు సాధించి చూపానన్నారు. పాలేరులో ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ ఓడిపోతుందని ఉత్తమ్ జోస్యం చెప్పారని, గెలిచి బదులిచ్చానని ప్రకటించారు. 2019 ఎన్నికల్లోనూ హైదరాబాద్ జీహెచ్ఎంసీ తరహాలోనే ఫలితాలు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగుతారని, అప్పటివరకు ప్రజలు టీఆర్ఎస్‌నే విశ్వసిస్తారని అన్నారు. గతంలో తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు ఒక్క పైసా కూడా ఇవ్వబోనని సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శాసనసభలో అన్నారని, నేడు తెలంగాణ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల పట్ల తేడా చూపకుండా గద్వాలకు రూ.40 కోట్లు, తుమ్మిళ్లకు రూ.390 కోట్లు ఇచ్చామని ప్రకటించారు. రూ.10 వేల కోట్లతో రైతులకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు పెట్టుబడి అందించే గొప్ప ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని కాదని ప్రజలు మరెవరికీ ఓటు వేయరని చెప్పారు. రాష్ట్రంలో ఏడుపుగొట్టు ప్రతిపక్షం ఉన్నదని, ఏ పని చేపట్టినా కడుపు మంటతో కేసులు వేస్తున్నారన్నారని ఆరోపించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులకు, ఫార్మాసిటీకి అడుగడుగునా కాంగ్రెస్ నేతలు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. పంచాయితీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బండారి భాస్కర్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు రూ.14 కోట్లతో చేపట్టిన చేనేత పార్కుకు శంకుస్థాపన చేశారు. ప్రజా ఫిర్యాదుల కోసం నివేదన యాప్ ఆవిష్కరించారు. 40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అటవీ శాఖ ఏర్పాటు చేసిన స్మృతివనాన్ని ప్రారంభించారు.



గద్వాల బహిరంగ సభకు హాజరైన జనం

బతుకు లేదని మాతో కలిశారు

కేటీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి రాహుల్ వరకు తెలంగాణకు ద్రోహమే చేశారని ఆరోపించారు. 2004లో కాంగ్రెస్‌కు బతుకులేక తమతో పొత్తు పెట్టుకుందని, 2014 వరకు అందరినీ నష్టపరిచి తెలంగాణ రాకుండా చేసిందని అన్నారు. 'జైపాల్‌రెడ్డి తాను తెలంగాణవాదిని కాదు.. జాతీయ వాదినంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. చిన్నారెడ్డి టీఆర్‌సీసీ జెండా పట్టుకుని రాజశేఖర్‌రెడ్డికి అమ్ముడుపోయారు. డి.కె.అరుణ మంత్రిగా పాలమూరుకు నీరందించలేదు. అనుమతిలేని హంద్రీనీవాకు హారతులిచ్చారు. టీఆర్ఎస్‌ను ఖతం చేస్తానంటూ టీడీపీలో ప్రగల్బాలు పలికిన నేత రైఫిల్ రేవంత్‌రెడ్డిగా మారి కాంగ్రెస్‌లో ఎందుకు చేరారు?" అని వ్యాఖ్యానించారు.



కేటీపీఎస్ ఏడోదశ బాయిలర్ లైటప్‌ను ప్రారంభిస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

3 నెలల్లో అదనంగా 800 మెగావాట్లు!

▸▸ మిగులు విద్యుత్తు దిశగా తెలంగాణ.. పెరగనున్న ఉత్పాదక సామర్థ్యం

▸▸ కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల ట్రయల్‌రన్

▸▸ జెన్‌కో సీఎండీకి ముఖ్యమంత్రి అభినందనలు

▸▸ మార్చి 31కల్లా కేటీపీఎస్-7 పూర్తి: ప్రభాకర్‌రావు

హైదరాబాద్, పాల్వంచ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పాదక సామర్థ్యం పెరుగుతోంది. కరెంట్ కోతల నుంచి మిగులు కరెంట్ దిశగా రాష్ట్ర ప్రస్థానం కొనసాగుతోంది. రాష్ట్రం ఆవిర్భవించేనాటికి 6,574 మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు ఉత్పాదక సామర్థ్యం ప్రస్తుతం 12,455 మెగావాట్లకు చేరింది. మూడునెలల్లో తెలంగాణ జెన్‌కో పాల్వంచలో చేపట్టిన తొలి సూపర్‌క్రిటికల్ 800 మెగావాట్ల ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం కానుంది. దాంతో సామర్థ్యం 13,255 మెగావాట్లకు చేరనుంది. మొత్తం మీద రాష్ట్రం ఈ ఏడాది డిసెంబరు నాటికి 17 వేల మెగావాట్ల విద్యుదుత్పాదక సామర్థ్యం కలిగి ఉండనుందని అధికారులు వెల్లడించారు. కాగా పాల్వంచలోని కేటీపీఎస్ ఏడోదశలో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం లైటప్ ప్రక్రియను జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు బుధవారం ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా అనుసంధానించారు. లైటప్ విజయవంతమవడంతో కార్మికులు, ఇంజనీర్లు కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు అధికారులు, ఇంజనీర్లు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి కల్లా కేటీపీఎస్ ఏడో దశలోని 800 మెగావాట్ల ప్లాంటు పూర్తవుతుందన్నారు. కేటీపీఎస్ ఏడో దశ నిర్మాణంలో భాగంగా బాయిలర్‌ను వెలిగించి, ట్రయల్ రన్ ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. పారదర్శకత, పనుల్లో వేగం సాధించాలనే లక్ష్యాలతో విద్యుత్కేంద్రాల నిర్మాణాన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించామని, ఈ లక్ష్యం నెరవేరుతుండడం సంతోషకరమని చెప్పారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యుత్తు శాఖ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అభినందించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 1 ఫిబ్రవరి 2018

“చదువుకునే రోజుల్లో ఉద్యోగం చేయాలనే కోరిక. కానీ అది తీరలేదు. పెళ్లయ్యి, పిల్లలు పెద్దవాళ్లయ్యాక కావాల్సినంత తీరిక. అలాగని తీరిక సమయాన్ని వృథా కానివ్వకూడదు అనుకున్నా. సరిగ్గా ఆ సమయంలోనే చార్మినార్ వద్ద షాపింగ్‌కు వెళ్లా. అక్కడ ఒక బ్యాంగిల్ స్టోర్‌లో బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. అది కాస్తా ‘ట్రెడిషనల్ టెంప్టేషన్స్’ అయ్యింది” అంటున్నారు ఇమిటేషన్ జువెలరీ డిజైనర్ సరిత దండ. కొద్ది పెట్టుబడితో మొదలై... మరికొందరికి ఉపాధి కల్పించే దశకు చేరిన ఆమె ప్రయాణం గురించి...


శ్రీ శక్తి



ఫొటో: రామినేని రాజ్‌కుమార్

ఇమిటేషన్ ఇప్పుడిదే ట్రెండ్!





చార్మినార్ దగ్గర మీరు వెళ్లిన షాపులో ఐడియా వచ్చిందంటున్నారు? అదెలా! అని ఆవిడని అడిగితే... “అవును. ఖాళీగా ఉండకూడదనే నా ఆలోచనలకు ఊపిరి పోసుకుంది అక్కడే. ఒకరోజు చార్మినార్ దగ్గర ఉన్న ఒక గాజుల షాపుకి వెళ్లాను. గాజులు కొంటున్నప్పుడు అక్కడికి వచ్చిన ఆడవాళ్ల మీద, వాళ్లు చేస్తున్న షాపింగ్ మీద దృష్టిపడింది. ఇంతమంది ఆడవాళ్లు - ఇమిటేషన్ జువెలరీ అయిన గాజులు, చెవిపోగులు, నెక్లెస్ సెట్‌లు, కాలి పట్టీలు, జడ కుచ్చులు వంటి వాటి మీద ఇంత ఆసక్తి చూపుతున్నారు. నేను కూడా వీటికి సంబంధించిన పని చేస్తే బాగుంటుందేమో అనిపించింది. అంతే వెంటనే కొన్ని గాజులు కొని, వాటిని ఇంటికి తెచ్చి అమ్మాను. ఆ తరువాత సొంతంగా చెవిపోగులు తయారుచేయడం మొదలుపెట్టా. అలా అనుకోకుండా ఇమిటేషన్ జువెలరీ డిజైనింగ్‌లోకి అడుగు పెట్టా. అప్పుడు మా ఇంట్లో ఉండే ఒక అబ్బాయికి జువెలరీ తయారీ నేర్పించి, ఇద్దరం కలిసి పనిచేసే వాళ్లం. అలా నా సొంత ఆలోచనలతో చేసిన చెవిపోగుల తయారీ సక్సెస్ అయ్యింది. ఏదో ఒకటి చేయాలనే నా ఆలోచనకు బీజం అలా 2007లో పడింది.

ఆ చదువు ఇలా ఉపయోగపడుతోంది...

అయితే ఇదంతా కూడా యాదృచ్ఛికమే కానీ పలానాది చేయాలని, ప్రణాళికా బద్ధంగా చేసింది కాదు. మాది నల్గొండ జిల్లాలోని ముప్పారం గ్రామం. ఇంటర్మీడియెట్ వరకు అక్కడే చదువుకున్నాను. ఆ తరువాత హైదరాబాద్‌లోని హోంసైన్సు కాలేజిలో గ్రాడ్యుయేషన్ చదివాను. ఉద్యోగం చేయాలనుకున్నా కానీ కుదరలేదు. పెళ్లయ్యాక ఫ్యాబ్రిక్ పెయింటింగ్ నేర్చుకున్నా. కానీ కుటుంబ బాధ్యతల వల్ల పూర్తిస్థాయిలో కమర్షియల్‌గా చేయలేకపోయాను. మా అమ్మాయి ఎనిమిది, అబ్బాయి ఆరో తరగతిలోకి వచ్చాక జువెలరీ డిజైనింగ్ మొదలుపెట్టా. ఇవి డిజైన్ చేయడంలో హోంసైన్సు చదువు బాగా ఉపయోగపడింది. అదెలాగంటే రంగుల కాంబినేషన్ ఎలా ఉంటే బాగుంటుందనేది దానివల్లే సరిగ్గా నిర్ణయించుకోగలుగుతున్నా. చదివిన చదువు ఏదో ఒక దశలో ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కష్టపడితే మంచి ఆదాయం

మొదట్లో హైదరాబాద్‌లో ఉన్న ఓ పది మంది బంధువులు, స్నేహితుల ఇళ్లకి వెళ్లి నేనిలా చేస్తున్నానని చెప్పాను. ఆ తరువాత ఎగ్జిబిషన్లలో పాల్గొనడం మొదలుపెట్టాను. ఇక ప్రభావంతమైన మార్కెటింగ్ ఉండనే ఉంది కదా... అదే ‘నోటిమాట’. అలా నేను తయారుచేసే నగలకు మార్కెట్ బాగా లభించింది. ఇప్పటివరకు ఐదు వందలకు పైగా ఎగ్జిబిషన్లలో పాల్గొన్నాను. వినియోగదారుల్లో ఎన్‌ఆర్ఐలు కూడా ఉన్నారు. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేస్తాను. ప్రొడక్ట్ ఒకసారి మార్కెట్‌లోకి వెళ్లిందంటే చాలు మనల్ని మనం ప్రూవ్ చేసుకోవాలి అనే ఉత్సాహం అదే వస్తుంది. ఆదివారాలు, సెలవు రోజులని చూసుకోకుండా పనిచేయాలి. అలా చేస్తేనే ఒడిదొడుకులు ఎదురైనా స్థిరంగా ఉండొచ్చు.

నల్లపూసలు ప్రత్యేకం

నేను జువెలరీ డిజైనింగ్ చేయడం మొదలుపెట్టాక ఒకసారి కోవె(కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంట్రప్రెన్యూర్) వాళ్లు నెక్లెస్ రోడ్డులో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. అందులో నేను తయారుచేసిన చెవిపోగులతో ఒక స్టాల్ పెట్టాను. దానికి మంచి స్పందన వచ్చింది. బిజినెస్ బాగా పుంజుకుంది. బ్లాక్ బీడ్స్(నల్ల పూసలు)తో నగలు తయారుచేయడమంటే నాకు చాలా ఇష్టం. వాటినయితే చీరలు, సల్వార్‌కమీజ్‌ల మీద అయినా ధరించొచ్చు. ట్రెడిషనల్, మోడ్రన్‌గా... ఎలా తయారైనా బ్లాక్ బీడ్స్ వేసుకుంటే చక్కగా నప్పుతాయి. ఇమిటేషన్ జువెలరీ డిజైన్ చేయడం మొదలుపెట్టాక మా ఇంట్లో వాళ్లు ప్రోత్సహించారు. కానీ కొందరు మాత్రం నగలు నల్లగా అవుతాయేమో అని సందేహం వెలిబుచ్చారు. మరికొందరు వీటిని నమ్ముకుంటే ఎలా? చాలా శ్రమపడాలి. అంత లాభం ఏమీ ఉండదని నిరుత్సాహపరిచారు. కానీ... ఖాళీగా ఉండకూడదనే ఏకైక ఆలోచన నన్ను వెనుకడుగు వేయనీయలేదు. నేను చేసే పని బాగా క్లిక్ అవుతుందనే ఆత్మవిశ్వాసం ఉండేది. అదే నన్ను ముందుకు నడిపింది.

‘బంగారం’లాంటి నగల కోసం...

చెవిపోగులతో మొదలు పెట్టి నెక్లెస్‌లు, వడ్డాణాలు, పాపడి బిళ్లలు, గాజులు, పట్టీలు, జడలు... ఇలా తల నుంచి పాదం వరకు అన్ని నగలు తయారుచేస్తున్నా. వీటి ధర ఐదు రూపాయల నుంచి పాతిక వేల రూపాయల వరకు ఉంటుంది. ముంబయి, జైపూర్, అహ్మదాబాద్‌ల నుంచి మెటీరియల్ తెస్తున్నాం. నాకు సాయంగా మొదట్లో ఒక



తను ఉండేవాడని చెప్పాను కదా... ఇప్పుడా సంఖ్య ఎనిమిదికి చేరింది. వినియోగదారులతో ముడిపడిన పని చేస్తున్నప్పుడు వాళ్ల ఇష్టానికి అనుగుణంగా ఉత్పత్తులు తయారుచేయాలి. అప్పుడు సక్సెస్ మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. డిజైనింగ్‌లో కొత్తదనం కోసం ఎప్పటికప్పుడు మార్కెట్‌లో ఎలాంటి డిజైన్లు వస్తున్నాయనేది గమనిస్తుంటాను. అందుకోసం మేగజైన్స్ చదువుతాను. నగరంలో జరిగే పలు ఎగ్జిబిషన్లకు వెళ్తుంటాను. ముఖ్యంగా గోల్డ్ ఎగ్జిబిషన్లకు వెళ్తే బోలెడు విషయాలు తెలుస్తాయి. ఎందుకంటే మన వాళ్లు బంగారు నగల్లాగ ఉన్న ఇమిటేషన్ నగలని కొనేందుకే ఎక్కువగా ఇష్టపడతారు. నగల డిజైన్లకు సగం ఆలోచనలు ఎగ్జిబిషన్లు, పుస్తకాల ద్వారా తెచ్చుకుంటే... మరికొన్ని ఐడియాలు నా దగ్గరకు వచ్చే వినియోగదారులు ఇస్తుంటారు. మార్కెట్ స్టడీ చేయడంతో పాటు, కస్టమర్‌కి ఏం కావాలో గమనించి డిజైన్ చేస్తుంటా. పాత నగలను తీసుకొస్తే వాటిని రీ-మోడల్ చేసిస్తాం కూడా.”

• కిరణ్మయి



సెమీ ప్రెషియస్ రాళ్లు వాడతాం కాబట్టి రంగు పోవడం అనేది ఉండదు. బంగారు నగలకు కూడా చాలా వరకు సెమి ప్రిషియస్ రాళ్లే వాడుతున్నారు. డైమండ్స్‌కి బదులుగా ఇమిటేషన్ సిజెడ్స్, సీ పర్ల్స్‌కి బదులుగా ఇమిటేషన్ కల్చర్డ్ పర్ల్స్‌ను వాడతా. బీడెడ్, సిల్వర్ జువెలరీ కూడా చేస్తాను. ఎందుకంటే ఇమిటేషన్ జువెలరీ అందరికీ పడదు. అలాంటి వాళ్లకి సిల్వర్ మీద డిజైన్ చేసి గోల్డ్ కోటింగ్ ఇస్తాం. ఇక కుందన్ సెట్స్ అయితే 40 వేల వరకు కూడా ఉంటాయి. తమ దగ్గరున్న చీరలు తెచ్చుకుని వాటికి మ్యాచయ్యేలా డిజైన్ చేయించుకునే వాళ్లూ ఉన్నారు. బంగారు నగల్లా కనిపించే ఈ ఇమిటేషన్ జువెలరీ అయితే ‘దొంగలు ఎత్తుకెళ్తారన్న భయం ఉండదు. ధర కూడా అందుబాటులో ఉంటుంది. ఇదివరకటి కంటే ఇప్పుడు వీటికి డిమాండ్ బాగా పెరిగింది.



■ కిచెన్ టిప్స్

మసాలా ఘాటు తగ్గాలంటే...

- ❖ బిర్యానీ ఆకును పొడి చేసి వంటగదిలో బొద్దింకలు వచ్చే ప్రదేశంలో చల్లితే ఆ వాసనకు బొద్దింకలు చనిపోతాయి.
- ❖ చీమలు తిరిగే చోట దోసకాయ ముక్కల్ని ఉంచితే అవి పారిపోతాయి.
- ❖ కూరల్లో మసాలా ఎక్కువైతే రెండు లేదా మూడు టొమాటోలు ఉడికించి వేయాలి. మసాలా ఘాటు తగ్గి రుచిగా ఉంటుంది.
- ❖ చెక్కతో చేసిన స్పూన్లు, గరిటెలు వాసన వేస్తుంటే వాటిని వెనిగర్ కలిపిన నీళ్లలో ఉంచాలి. కొద్దిసేపయిన తరువాత వాడితే అవి వాసన రావు.



- ❖ వంట చేసేటప్పుడు చేతులకి అంటిన మరకలు పోవాలంటే ఆలుగడ్డ ముక్కలతో చేతులు రుద్దాలి.
- ❖ గులాబ్ జామ్ పిండి కలిపేటప్పుడు అందులో కాస్త పన్నీర్ కలిపితే... అవి మృదువుగా, రుచిగా తయారవుతాయి.
- ❖ చపాతీ పిండిలో పాలు, గోరువెచ్చని నీళ్లు లేదా కాస్త నూనె కలిపి ఒక గంట నానబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- ❖ చపాతీ పిండిలో, బంగాళా దుంపను కలిపి చపాతీలు చేస్తే ఎక్కువసేపు మృదువుగా ఉంటాయి. చపాతీలు వత్తేటప్పుడు మధ్యలో కాస్త నూనె వేసి సమోసా ఆకారంలో మడవాలి. వాటిని చపాతీల్లా వత్తి, కాల్చి, హాట్ ప్యాక్‌లో ఉంచితే ఆరు నుంచి ఏడు గంటల పాటు మెత్తగా ఉంటాయి.
- ❖ రాగి సామాన్ల మీద నిమ్మరసం చల్లి ఉప్పుతో రుద్దితే కొత్త వాటిలా మెరుస్తాయి.
- ❖ పచ్చి బఠానీల్లో చిటికెడు పంచదార వేసి ఉడికిస్తే అవి రంగు మారవు.
- ❖ బియ్యం, తృణధాన్యాలను నిల్వ చేసే డబ్బాల్లో నాలుగు పసుపు కొమ్ములు లేదా వెల్లుల్లి రేకలు వేస్తే పురుగు పట్టదు.
- ❖ కూరల్లో ఉప్పు ఎక్కువైతే కాస్త బియ్యప్పిండి కలపాలి.
- ❖ బాగా పులిసిన దోశెల పిండిలో కొంచెం గోధుమపిండి కలిపి దోశెలు వేస్తే రుచికరంగా వస్తాయి.

ఆమె సేవా సర్జన్

ఒకటి రెండు కాదు ఏకంగా 15 వేల ప్లాస్టిక్ సర్జరీలు చేసి ఎంతో మందికి కొత్త రూపాన్నిచ్చిన డాక్టర్ లక్ష్మీ సలీమ్... రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి మహిళా ప్లాస్టిక్ సర్జన్. దాదాపు 45 ఏళ్లపాటు వృత్తే ఊపిరిగా జీవిస్తున్నారామె. ఈ సుదీర్ఘ ప్రయాణంలో లక్ష్మీ సలీమ్‌కు ఎదురైన అవమానాలు, అనుభవాలు ఎన్నో... అవి ఆమె మాటల్లోనే...

నేను మెడిసిన్ చదివిందే సర్జరీ మీద ప్రేమతో! కానీ ఆ అభిరుచికి అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. పుట్టింది విజయవాడలో. నాన్న ఇంజనీరు. మేం ఆరుగురం పిల్లలం. అందరికంటే చిన్నదాన్ని. చిన్నప్పటి నుంచే డాక్టరవ్వాలని ఉండేది. అయితే మెడిసిన్ చదివే సమయంలో, ఆ తర్వాత చండీగఢ్‌లో సర్జరీ కోర్సులో చేరేటప్పుడు...‘ఆడపిల్లవు కాబట్టి పీడియాట్రిక్స్ లేదా గైనకాలజీ ఎంచుకో...సర్జరీ వద్దు’ అంటూ ప్రొఫెసర్లు నిరుత్సాహపరిచారు. అప్పట్లో సర్జరీ చేసే మహిళా వైద్యులు ఒక్కరూ లేరు. నాలో పట్టుదల పెరగటానికి అదీ ఒక కారణమేమో?... మొత్తానికి ఎవరు చెప్పినా నా మనసు మార్చుకోలేదు. పట్టుదలతో సర్జరీలో ఎమ్‌సిహెచ్ కూడా చేశాను.

పెళ్లయినా లక్ష్మినే!

గుంటూరు మెడికల్ కాలేజీలో నా క్లాస్‌మేట్ సలీమ్. ఇద్దరం కలిసి చదువుకున్నాం. కలిసి ఉద్యోగాల్లో చేరాం. ఒకర్నొకరం ఇష్టపడుతున్నట్లు మెడిసిన్ చదివే రోజుల్లోనే తెలుసుకున్నాం. కానీ మా ప్రేమ వ్యక్తం చేసుకోవటానికి కుటుంబ నేపథ్యాలు, మతాలు, కుటుంబ పరిస్థితులు అడ్డొచ్చాయి. ఇంటికి ఆయన పెద్ద కొడుకు కాబట్టి బాధ్యతలు ఎక్కువ. తెనాలి నుంచి గుంటూరు వలసవచ్చిన సంప్రదాయ ముస్లిం కుటుంబం వారిది. దాంతో ఆయనకి మా ప్రేమ గురించి కొన్ని భయాలుండేవి. కానీ నేనాయనతో ‘ప్రేమ నిజమైనదైతే దాన్ని ఏ శక్తీ ఆపలేదు’ అంటుండేదాన్ని. అలాగని మా ప్రేమనెప్పుడూ బహిరంగంగా ప్రకటించలేదు. ఆయనక్కూడా చండీగఢ్‌లో సీటొచ్చింది. కలిసి మూడేళ్లు ఎమ్మెస్ చేసి, పరీక్ష పాసయిన తర్వాత పెళ్లి చేసుకోవాలనేది మా ఆలోచన. అనుకున్నట్టే కోర్టులో పెళ్లి చేసుకున్నాం. ఇద్దరి ఇళ్లలో అభ్యంతరాలు ఉండటంతో తక్కువ మంది సన్నిహితుల మధ్య దండలు మార్చుకున్నాం. ‘పెళ్లయ్యాక మతం మార్చుకుంటావా?’ అని నాన్నగారు అడిగితే ‘నేను లక్ష్మిగానే ఉంటాను’ అని చెప్పాను. కానీ పుట్టబోయే పిల్లలేమైపోతారోనని నాన్నగారికి అనుమానం. దానికి నేను ‘పిల్లలేమవుతారు? క్రిస్టియన్లు అవుతార్లెండి!’ అనేశాను. దాంతో నాన్నగారేమీ మాట్లాడలేకపోయారు.



పుట్టిన ఊరు సాక్షిగా!

చండీగఢ్‌లో ఎమ్‌సిహెచ్ పూర్తి చేయగానే లండన్‌లో శిక్షణ పొందే అవకాశం వచ్చింది. అప్పుడు పాపకి మూడేళ్లు. తనని తీసుకుని లండన్ వెళ్లిపోయాను. బాబు అక్కడే పుట్టాడు. కొంతకాలం అక్కడ పని చేసి ఇండియా తిరుగు ప్రయాణమయ్యే సమయంలో చండీగఢ్‌లో నేను చదివిన కాలేజీ నుంచి ఉద్యోగ అవకాశమిస్తున్నట్టు ఫోనొచ్చింది. కానీ నా లక్ష్యం వేరు. ప్లాస్టిక్ సర్జన్ ఒక్కరూ లేని మా ఊరిలో పని చేయాలనేది నా కోరిక. ‘ఇంత శిక్షణ తీసుకున్నది నా ఊరికి కాకుండా ఇంకెక్కడో సేవ చేయటానికి కాదు’ అని సున్నితంగా తిరస్కరించాను. మరోవైపు పుట్టింటివాళ్లు నన్ను మరో రకంగా భయపెట్టారు. ‘సలీమ్‌ని పెళ్లి చేసుకున్నావు కాబట్టి సమాజంలో నిన్ను అందరూ చులకనగా చూస్తారు. ఇంగ్లండ్‌లో లేదంటే చండీగఢ్‌లో స్థిరపడిపో’ అన్నారు. అందుకు నేను నిరాకరించాను. నేను పుట్టిన ఇంటినే పది పడకల ప్లాస్టిక్ సర్జరీ యూనిట్‌గా మార్చి 1984లో కెరీర్ మొదలుపెట్టాను. అప్పట్లో ప్లాస్టిక్ సర్జరీ అంటే ఎవరికీ పెద్దగా అవగాహన లేదు. అందుకని వీలైనన్ని పబ్లిక్ టాక్స్, రేడియో షోలు ఇచ్చి, ప్రతి మీటింగ్‌లో ప్లాస్టిక్ సర్జరీతో కాలిన గాయాలకు ఎలా చికిత్స చేయొచ్చో, ఎలా సరిచేయవచ్చో వివరించాను.

■ స్ఫూర్తి

ఉన్నంతలో సహాయం...

నా దగ్గరకొచ్చే కేసుల్లో ఎక్కువ మెడికో లీగల్ కేసులుండేవి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సకు నిరాకరించిన కేసులే ఎక్కువగా వచ్చేవి. అయినా నేనెప్పుడూ పర్యవసానాల గురించి ఆలోచించలేదు. కష్టంలో ఉన్న పేషెంట్‌కు చేతనైనంత సేవ చేయటమే నా బాధ్యత. నేను చేసే సర్జరీలు కాస్మెటిక్ సర్జరీల కోవలోకి రావు. వ్యక్తులు ఎటువంటి ఇబ్బంది పడకుండా సాధారణ జీవితం గడపటానికి తోడ్పడే సర్జరీలు చేస్తాను. ఆత్మ స్థైర్యం, ఆత్మవిశ్వాసాలను పెంచటానికి ప్లాస్టిక్ సర్జరీని ఉపయోగిస్తాను. ఎవరొచ్చినా ఖర్చుకు వెనకాడకుండా సర్జరీ చేయటానికి పూనుకుంటాను. ఒకవేళ ఖర్చు నా పరిధి దాటిపోతే స్నేహితుల స్వచ్ఛంద సహాయం కోరతాను.



‘సలజ’ పేరు వెనుక...

మావారి పేరు సలీంలోని మొదటి అక్షరం, నా పేరు లక్ష్మిలోని మొదటి అక్షరాలకు జ (జన్మించటం) కలిపి ‘సలజ’ అని హాస్పిటల్‌కి, ట్రస్ట్‌కి పేరు పెట్టాను. హాస్పిటల్ మా పెళ్లి రోజైన ఫిబ్రవరి 26నే మొదలుపెట్టాం. ‘సలజ’ నా కోసం ఏర్పాటు చేసుకున్న ట్రస్ట్. సర్జరీలకు సహాయం చేయాలనుకునేవాళ్లు ఈ ట్రస్ట్‌కు విరాళాలిస్తే ఆ డబ్బుతో పేదలకు సర్జరీలు చేస్తాను.

విదేశీ వైద్యుల సహకారం


ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ అసోసియేషన్ తరపున లేడీ ప్లాస్టిక్ సర్జన్స్ ఇక్కడ నేను ఏర్పాటు చేసే క్యాంపుకి వచ్చి సర్జరీల్లో సహాయపడుతూ ఉంటారు. కెనడా, జర్మనీ, అమెరికాల నుంచి వచ్చి కొన్ని కేసులకు స్పాన్సర్ చేయటంతోపాటు ఉచితంగా సర్జరీలు చేసి వెళుతూ ఉంటారు. అలా గత 9 ఏళ్ల నుంచి 350 మంది పేషెంట్లకు సర్జరీలు చేశాం. ఈ నెలలోనే మరో క్యాంపు ఏర్పాటు చేయబోతున్నాం. ఏడాదికి ఇలాంటి క్యాంపులు రెండు సార్లు ఏర్పాటు చేస్తాం.

• గోగుమళ్ల కవిత

■ నగధగ

ముచ్చటైన ‘మాథా పట్టి’

‘పద్మావత్’లో దీపికా పదుకొనే కన్నా ఆమె ఆభరణాలే ఎక్కువ ఆకర్షించాయి. వాటిలో రాజస్థానీ ‘మాథా పట్టి’ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నుదుటిని అతుక్కోకుండా, బుట్ట ఆకారంలో ఉండే ఈ పాపటి బిళ్ల వేడుకల్లో ధరించటానికి అనువైనది. మరీ ముఖ్యంగా కంఠాభరణం, జూకాలు, ముక్కెరలతోపాటు పెళ్లి కూతురు ఇలాంటి ‘పాపిట బిళ్ల’ ధరిస్తే ప్రత్యేకంగా కనిపిస్తుంది.



బంగారు పాపటి బిళ్ల: పూర్తి బంగారంతో తయారైన పాపటి బిళ్ల ధరించాలనుకుంటే గుండ్రటి బంతి లేదా గంట ఆకారంలో ఉండి, సెల్ఫ్ డిజైన్ ఉన్న మాథా పట్టీ ఎంచుకోవాలి. అడుగున వేలాడే మువ్వలు ఉంటే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. ఇలాంటి పాపటి బిళ్లకు మ్యాచింగ్‌గా పూర్తి బంగారు నగలే ధరించాలి.

ఘూమర్ మాంగ్ టీకా: భారీగా కనిపించాలనుకునేవాళ్లు ఎంచుకోవలసిన పాపటి బిళ్ల ఇది. అర్ధ చంద్రాకారంలో ఉండి, రాళ్లు, ముత్యాలు పొదిగిన ఈ పాపటి బిళ్ల నుదుటికి నిండుదనాన్ని తీసుకొస్తుంది. పాపటి బిళ్ల అడుగున ముత్యాల మువ్వలు వేలాడేలా ఉంటే ఆకర్షణ రెట్టింపవుతుంది.

సింగిల్ చైన్ మాథా పట్టీ: సింపుల్‌గా కనిపించాలనుకుంటే ఒంటిపేట పాపటి బిళ్ల వేసుకోవాలి. ఒకే సైజులో ఉన్న జాతి రాళ్లు పొదిగి, పాపటి బిళ్లలో మరికాస్త పెద్ద సైజు ప్రెషియస్ స్టోన్ ఉండాలి. ఇలాంటి పాపటి బిళ్ల ఆధునికంగా కనిపించాలనుకునే పెళ్లి కూతుళ్లకు అనువైనది.

స్ట్రీట్ షాపింగ్



లాడ్ బజార్, హైదరాబాద్

ఎక్కడుంది?: పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో

ఏం కొనొచ్చు?: లక్కతో తయారు చేసిన, ఆర్టిఫిషియల్ డైమండ్స్ పొదిగిన రకరకాల గాజులు, పెళ్ళి అలంకారాలకు సంబంధించిన వస్తువులు, ఇమిటేషన్/చౌక రకం జ్యూయలరీ, వెల్వెట్, బంగారు, జరీ ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు. దీన్నే చుడీ బజార్ అని కూడా అంటారు. చార్మినార్ ప్రాంతం ముత్యాల ఆభరణాలకు కూడా ప్రసిద్ధి.

భలే చౌక బేరం!

పిల్లలకు పరీక్షల టైమ్ వచ్చేస్తోంది. ఫిబ్రవరి, మార్చి అంతా ప్రిపరేషనే! పరీక్షలవగానే హాలీడేస్... ఊళ్ళకు వెళ్ళడానికి సన్నాహాలు మొదలవుతాయి. కొత్త ప్రాంతాల్లో పర్యటనకి సిద్ధమవుతున్నప్పుడు 'ఎక్కడ ఉండాలి?, ఏం తినాలి?' అనే ప్రశ్నలతో పాటే 'ఏం కొనాలి? ఎక్కడ కొనాలి?' అనే అనుబంధ ప్రశ్నలు కూడా ఆలోచనల్లో తిరుగుతూ ఉంటాయి. మన ఊళ్ళో ఎన్ని మార్కెట్లున్నా, ఆన్‌లైన్‌లో ఆఫర్లు కుప్పలుగా వచ్చి పడుతున్నా కొత్త ఊరు వెళ్ళినప్పుడు వీధుల్లో విహరిస్తూ- మనసుకి నచ్చేవి దొరికేవరకూ వెతుకులాడి, కావలసినవి ఎంచుకొని, తెగేవరకూ బేరాలాడి- ఆఖరికి కొని... ఇంటికి తెచ్చుకుంటే ఆ సంతోషమే వేరు. ప్రధానమైన ఈ క్రింది నగరాలనే తీసుకోండి... అక్కడ మీ ఆసక్తికి తగినవి లభించే, స్థానికులనే కాకుండా పర్యాటకులను కూడా ఆకర్షించే స్ట్రీట్ మార్కెట్లు చాలా ఉన్నాయి. ఈ ఊర్లకి కొత్తగా వెళ్తున్నవారే కాదు... మరోసారి వెళ్ళేవారు కూడా ఆ మార్కెట్లని సందర్శించండి. నచ్చే వస్తువులు తక్కువ ధరలకే మీ సొంతం చేసుకోవచ్చు. స్థానికులనే కాదు, దేశంలోని ఇతర ప్రాంతాల వారినీ, విదేశీ పర్యాటకులనూ కూడా ఆకర్షించే షాపింగ్ గమ్యాల్లో కొన్ని...



పాండీబజార్, చెన్నై

ఎక్కడుంది?: చెన్నై టి.నగర్ ప్రాంతంలో

ఏం కొనొచ్చు?: చీరలు, కుర్తాలూ, చెప్పులు, గృహోపకరణాలు. ఎథ్నిక్ వేర్... ఇక్కడ విస్తృతమైన రకాల్లో, చాలా తక్కువ ధరలకు దొరుకుతాయి. అంతేకాదు, ఈ చుట్టుపక్కలే దక్షిణాదిలో ప్రఖ్యాతి చెందిన పట్టు వస్త్ర దుకాణాలు కూడా ఉంటాయి.

కమర్షియల్ స్ట్రీట్ , బెంగళూరు

ఎక్కడుంది?: బెంగళూరులోని టస్కర్ టౌన్ వద్ద శివాజీనగర్‌లో

ఏం కొనొచ్చు?: ఎంతో రద్దీగా ఉండే ఈ మార్కెట్ బెంగళూరులోని అతి పాత దుకాణ సముదాయాల్లో ఒకటి. సాధారణమైన సాంప్రదాయిక దుస్తులు మొదలుకొని పాశ్చాత్య దేశాలకు చెందిన ఆధునిక ట్రెండ్స్‌కు అనుగుణమైన వస్త్రాలు ఇక్కడ దొరుకుతాయి. షూలు, ఇతర అలంకరణ వస్తువులు, ఇమిటేషన్ జ్యూయలరీలకు కూడా ఈ ప్రాంతం ప్రసిద్ధి! అన్ని రకాల ఫుడ్స్ ఈ ప్రాంతంలో లభిస్తాయి.



జన్‌పథ్ మార్కెట్, ఢిల్లీ

ఎక్కడుంది?: ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్ సమీపంలో

ఏం కొనొచ్చు?: హస్తకళా వస్తువులకు ఈ మార్కెట్ పెట్టింది పేరు. వీలైనంత బేరం ఆడుకోవచ్చు కూడా! దుస్తులు, పంజాబీ, రాజస్థానీ ఫుట్‌వేర్, హ్యాండ్ బ్యాగ్‌లు, పర్సులు, ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు... ఇలా ఏవి కావాలన్నా మీకు దొరుకుతాయి. దగ్గర్లోని జనపథ్ వీధుల్లోకి వెళ్తే మీకు నచ్చిన ఆధునిక, సాంప్రదాయిక దుస్తులు కొనుక్కోవచ్చు.



గరియాహట్ మార్కెట్, కోల్‌కతా

ఎక్కడుంది?: కోల్‌కతాలోని గరియాహట్ ప్రాంతంలో


ఏం కొనొచ్చు?: చౌక ధరలు, గీసిగీసి బేరాలాడే సౌలభ్యం... ఈ మార్కెట్ ప్రత్యేకతలు ఇవి మాత్రమే కాదు, బెనారస్ సిల్క్ చీరల నుంచి ఏ రకం దుస్తులైనా ఇక్కడ దొరుకుతాయి. విశాలమైన ఈ మార్కెట్లో విండో షాపింగ్ చేస్తూ గంటలకు గంటలు గడిపెయ్యొచ్చు. రకరకాల ఫుడ్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉంటాయి. దగ్గర్లోనే ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాలు, అధునాతన మాల్స్ ఉన్నాయి.



లింకింగ్ రోడ్డు-కొలాబా కాజ్‌వే మార్కెట్లు, ముంబయ్

ఎక్కడున్నాయి?: ముంబయ్‌లోని బాంద్రా ప్రాంతంలో ఒకటి, కొలాబా ప్రాంతంలోని నేవీ నగర్ దగ్గర మరొకటి

ఏం కొనొచ్చు?: లేటెస్ట్ ఫ్యాషన్ ఏదైనా లింకింగ్‌రోడ్డు మార్కెట్లో మీకు కనిపిస్తుంది. దుస్తులు, ఎక్సెసరీస్, రకరకాల షూలు, అన్ని రకాల కాజువల్ వేర్, ఇమిటేషన్ ఆభరణాలు కళ్ళు తిప్పుకోనివ్వవు. షాపింగ్‌కు మారుపేరైన ఈ మార్కెట్లో బేరాలకు ఆకాశమే హద్దు! ఇక, విదేశీ పర్యాటకుల్ని ఎక్కువగా ఆకర్షించే కొలాబా మార్కెట్లో పుస్తకాలు, బ్యాగ్‌లు, హస్తకళా వస్తువులు... ఇంకా మరెన్నో ప్రత్యేక ఆకర్షణలు. ఏది కొనాలో తెలీక తబ్బిబ్బైపోవడం ఖాయం!



సర్వే


బెస్ట్ జాబితాలో బెజవాడ!



రైల్వే స్టేషన్ అంటేనే జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రదేశం. రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల సందడి... వెరసి ఎప్పుడూ రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లు పరిశుభ్రంగా ఉండాలంటే దానికి బోల్డన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పక్కా ప్రణాళికతో రైల్వే స్టేషన్లను శుభ్రంగా ఉంచుతున్న రైల్వే స్టేషన్ల గురించి 'ఇక్సిగో' అనే ట్రావెల్ యాప్ సర్వే నిర్వహించింది. అన్నట్లు ఇక్సిగో గురించి చెప్పనేలేదు కదూ! భారతీయ రైల్వే నిర్వహిస్తున్న ఐఆర్‌సీటీసీతో కలిసి పనిచేసే ఓ సంస్థ అది. ఈ అధ్యయనంలో తెలిదేంటంటే... దక్షిణ భారతదేశంలోని స్టేషన్లు ఉత్తరాది వాటితో పోల్చుకుంటే చాలా పరిశుభ్రంగా ఉన్నాయట! ఈ జాబితాలో బెస్ట్ స్టేషన్‌గా కేరళలోని కోజిక్కోడ్, చివరి స్థానంలో ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లు నిలిచాయి. వీటిలో విజయవాడ రైల్వే స్టేషన్‌కు కూడా స్థానం దక్కింది.

విభిన్నం

సెల్ఫీలకీ ఉంటుందో మ్యూజియం



మోనాలిసా సెల్ఫీ తీసుకునే పెయింటింగ్ చూడాలని ఉందా? అదేంటి అప్పటికి సెల్ఫీలు లేవు కదా? అంటారా! పోనీ ఆ పెయింటింగ్ ముందు సెల్ఫీ దిగాలని ఉందా? అయితే లండన్‌లోని సెల్ఫీ మ్యూజియంకి వెళితే ఇలాంటి వింతలు, విడ్డూరాలు బోల్డెన్ని. నిద్ర లేచాక సెల్ఫీ, ఎవరినైనా కలిస్తే సెల్ఫీ, తింటూంటే సెల్ఫీ... ఇలా సెల్ఫీకి కాదేది అనర్హం అంటూ ఈ సరదా కాస్తా వ్యసనంలా మారిపోయి, కొందరి అత్యుత్సాహం ప్రాణాలు కూడా తీస్తోంది. సెల్ఫీ అంటే ఓ అనుభూతి. ఆ సందర్భంలో నేను కూడా ఉన్నాను అనే సంతోషం ఇందులో ఉంటుంది. అందుకే ఫొటోల కన్నా సెల్ఫీలకే క్రేజ్ ఎక్కువైపోయింది. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 20 లక్షల సెల్ఫీలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ట్రెండ్‌నే క్యాష్ చేసుకోవడానికి సిద్ధమైంది. ఈ మ్యూజియంలోని ఫోటోలు, పెయింటింగ్స్‌తో మీరు సెల్ఫీ ఆట ఆడుకోవచ్చు. అంత క్రేజీగా డిజైన్ చేశారు నిర్వాహకులు. సెల్ఫీ మ్యూజియం లోపలికెళ్లాలంటే 25 డాలర్లు చెల్లించాల్సిందే. ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ 17 వరకూ ఈ మ్యూజియం అందుబాటులో ఉంటుంది. ఈ తేదీల్లో అక్కడ పర్యటిస్తే సెల్ఫీ మరిచిపోకండి.

ఈ-జీ ట్రావెల్

ఈ యాప్‌తో భలే ఆదా!



అర్జంటుగా ఢిల్లీ వెళ్లాలి...! రెండు గంటలే టైమ్. ఫ్లైట్ టిక్కెట్ ధరలు ఆకాశంలో ఉంటాయి. ఇక హోటల్ ధరల గురించి చెప్పనవసరం లేదు. మరేం చెయ్యాలి? అయితే 'లాస్ట్ మినిట్ ట్రావెల్ అనే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఫ్లైట్, హోటల్... ఇలా ఏదైనా మీకు అందుబాటులో ఉండే ధరలో బుక్ చేసుకోండి. ఇక మీరుంటున్న లొకేషన్‌లోనే దగ్గరల్లో ఉన్న హోటళ్లను మ్యాప్‌లో వెతుక్కోవచ్చు. చక్కగా డబ్బు ఆదా చేసుకోవచ్చు.

ట్రై చేయండి

ఉతికేయండి..! ఎక్కడైనా.. ఎప్పుడైనా..!

ట్రిప్‌కు వెళ్లేటప్పుడు దుస్తులను ఉతుక్కొని, ఇస్త్రీ చేసుకొని బ్యాగ్‌లో సర్దుకుంటారు. కానీ ఆ ఫ్రెష్‌నెస్ ఎంతో కాలం ఉండదు! ఆ ఇస్త్రీకి కూడా ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. నలిగిపోతాయి. ప్రయాణంలో దుస్తులు ఉతుక్కోవడానికి కొన్ని సార్లు వీలుండదు. వారం రోజుల ట్రిప్ అంటే ఫర్లేదు. కానీ నెలా, రెండు నెలలైతే ఏం చేయాలి? అన్ని దుస్తులను ఎలాగో తీసుకెళ్లలేం! కావాలనుకున్నప్పుడు ఎలా? అని ఆలోచనలో పడుతున్నారా? దీనికి ఓ పరిష్కారం ఉంది. అదే 'స్క్రబ్బా పోర్టబుల్ లాండ్రీ సిస్టమ్'. పంచింగ్ బ్యాగ్ మోడల్‌లో దీన్ని డిజైన్ చేశారు. ఎలా వాడాలంటే... ఉతకాల్సిన దుస్తులను ఆ బ్యాగ్‌లో వేసి, సర్ఫ్, నీళ్లు పోసి టైట్‌గా ప్యాక్ చేయండి. పై చిత్రంలో చూపించినట్లుగా బ్యాగ్‌ను చేత్తో రుద్దండి. తర్వాత పిండుకొని ఆరేయడమే!



ట్రావెల్ టిప్స్

తెలియని చోట... జాగ్రత్త మంచిదే!

ఓ ట్రావెల్ యాప్ ఓపెన్ చేసి హోటల్ రూమ్ చూశాడు రమేశ్. చూడటానికి చాలా బాగుంది. రేటింగ్ సూపర్. రివ్యూలూ సరేసరి. టక్కున బుక్ చేశాడు. అంతే క్షణం కూడా ఆలోచించలేదు అతను. భార్యతో కలిసి ఆ హోటల్‌కి వెళ్లిన రమేశ్, అతని భార్య షాక్ తిన్నారు. యాప్‌లో పెట్టిందొకటి, అక్కడ రియల్ సీన్ మరొకటి. అంతా అపరిశుభ్రం. అల్లకల్లోలం. బాబోయ్ అనుకున్నారిద్దరూ! రూమ్ మెయిన్‌టెనెన్స్ సరిగ్గా లేదు. అప్పటికప్పుడు క్లీన్ చేయించారు. అయినా పరిస్థితి మారలేదు. ఇంటికి వెళ్లాక మాత్రం కొత్త అనారోగ్య సమస్యలు బయటపడ్డాయి. అసలు తెలియని చోటికి వెళ్లినప్పుడు అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?





- స్టార్ హోటల్ అయినా సరే మీ జాగ్రత్తలు మీవే. ముందుగా హోటల్ రూమ్‌లోకి చెక్ ఇన్ అయ్యే ముందు గది అంతా చెక్ చేసుకోండి. ముఖ్యంగా మీ బెడ్ మీద నల్లులు ఏమైనా ఉన్నాయేమో చూడండి. ఒకవేళ ఉంటే హోటల్ సిబ్బందికి తెలియజేసి శుభ్రం చేయించండి.
- ఎంత ఖరీదైన హోటల్లో అయినా వాష్‌రూమ్స్ సరిగ్గా ఉండవు. దాని వల్ల అనేకమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే వేడినీళ్లను వాష్‌రూమ్ మొత్తం చల్లండి. అప్పుడు బ్యాక్టీరియా తగ్గుతుంది. ఇక టాయిలెట్ సీట్ శానిటైజర్ స్ప్రే కూడా ఉపయోగించండి.
- హోటల్ రూమ్ పైకి ఎంత క్లీన్‌గా కనిపించినా సరే, నేల మీద మాత్రం కూర్చోవడం మంచిది కాదు. రూమ్‌లో నడిచేటప్పుడు స్లిపర్స్ తప్పనిసరి. అలాగే మీ బెడ్ షీట్లనే వాడండి. ఎట్టి పరిస్థితుల్లో కూడా హోటల్ గదుల్లోని దుప్పట్లను వాడకండి.

ట్రావెల్ గైడ్

గోవా కార్నివాల్

అయిదు వంద ఏళ్ళకు పైగా చరిత్ర ఉన్న ఈ కార్నివాల్ గోవా సంస్కృతికి నిలువుటద్దం. 1510వ సంవత్సరంలో గోవాను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్న పోర్చుగీస్ పాలకులు ఈ ఉత్సవానికి బీజాలు వేశారు. మొదట్లో క్యాథలిక్ క్రైస్తవులకే పరిమితమైన ఈ వేడుకలో కాలక్రమేణా మత, కుల, ప్రాంతాలకు అతీతంగా అందరూ పాలుపంచుకోవడం మొదలుపెట్టారు. సుందర సముద్రతీరాలకు నిలయమైన గోవా ఈ కార్నివాల్‌తో కొత్త శోభనూ, ఉత్సాహ, ఉద్వేగాలనూ సంతరించుకుంటుంది.

ఎక్కడ?: కేంద్రపాలితప్రాంతమైన గోవాలో

ఎప్పుడు?: ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ

ఎలా వెళ్ళాలి?: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలనుంచి గోవాలోని వాస్కోడిగామాకు, అక్కడినుంచి మార్గోవాకు రైలు సౌకర్యం ఉంది. హైదరాబాద్‌నుంచి బస్సులున్నాయి. గోవాలో విమానాశ్రయం ఉంది.

ప్రత్యేకతలేమిటి?: విందులు, వినోదాలతో, సంగీతం, నృత్యాలతో సాగే ప్రదర్శనలు, కళ్ళు చెదిరేలా అలంకరించిన వాహనాల ఊరేగింపులు సందర్శకుల్ని కట్టిపడేస్తాయి. చిత్రవిచిత్రమైన రంగురంగుల మాస్కులు ధరించిన యువత వీధుల్లో సందడి చేస్తారు. వాహనాల్ని నోరూరించే ఫుడ్ స్టాల్స్, అభిరుచులకు తగిన పానీయాలూ ఉండనే ఉంటాయి. ఈ ఫిబ్రవరి 10వ తేదీన పనాజీ, 11న మార్గోవా, 12న వాస్కో, 13న మపూసా పట్టణాల్లో ప్రత్యేకంగా ఊరేగింపులు జరపడానికి కార్నివాల్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



అధ్యయనం

మహిళలే ఎక్కువ!



సెల్ఫ్ డ్రైవింగ్ టూర్లకు విదేశాల్లో ఆదరణ ఎక్కువ. తీరుబాటుగా వివిధ ప్రదేశాల్లో పర్యటించి, మనసుకు నచ్చినవి ఆస్వాదించగల అవకాశం ఉండటంతో మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా కారు తీసుకోని ఎంచక్కా లాంగ్ టూర్లు వెళ్తూ ఉంటారు. మన దేశంలో ఈ సెల్ఫ్ డ్రైవింగ్ టూర్ల సంస్కృతి తక్కువే. అయితే ఇప్పుడిప్పుడే ఇండియాలోనూ ఈ తరహా టూర్లకు ఆదరణ పెరుగుతోందని టూరిజం కంపెనీ 'ట్రావ్‌కార్ట్' చేసిన అధ్యయనంలో తేలింది. ఈ టూర్లను ఎంజాయ్ చేస్తున్నవారిలో పురుషులతో పోల్చితే మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం విశేషం. పురుషుల శాతం 40 కాగా 60 శాతం మంది మహిళలు సెల్ఫ్ డ్రైవింగ్ టూర్లకు వెళ్తున్నారుట. మొత్తంగా భారతీయులు తీర్థయాత్రలు, సాహసయాత్రలు, నౌకావిహారంలాంటి వాటి వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారనీ ఆ అధ్యయనం వెల్లడించింది.

స్టార్ డెస్టినేషన్

హిమాచల్ కా వీర్!

టెస్టులూ, వన్డేలూ అనే తేడా లేకుండా బ్యాట్‌ని ఝళిపించి అనేక రికార్డుల్ని పాదాక్రాంతం చేసుకున్న క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్. క్రికెట్ చరిత్రలో 'అత్యంత విధ్వంసక బ్యాట్స్‌మేన్' అనే గుర్తింపు అతని సొంతం. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పినా కామెంటరేటర్‌గా, పంజాబ్ కింగ్స్‌లెవెన్-ఐపిఎల్ జట్టు కోచ్‌గా బిజీగా ఉన్న సెహ్వాగ్ తను మెచ్చిన, తనకు నచ్చిన గమ్యాల గురించి ఏం చెబుతున్నాడంటే...



ఇష్టమైన ప్రదేశం

దాదాపుగా భారతదేశం మొత్తం తిరిగాను. అన్నిట్లో హిమాచల్‌ప్రదేశ్ నన్ను ఎప్పుడూ ఆకర్షిస్తూ ఉంటుంది. ధర్మశాల, ఉనా, ఛంబా ప్రాంతాలు, అద్భుతమైన లోయలు, పర్వతాలు నదులు... ఆ రాష్ట్రంలో ప్రతిదీ అందంగానే ఉంటుంది. విదేశాల్లో అయితే దుబాయ్ నచ్చుతుంది. అక్కడ ఎక్కువగా షాపింగ్ చేస్తా. రకరకాల ఫుడ్ ట్రై చేస్తూ ఉంటా.

చిన్ననాటి జ్ఞాపకాలు


నా బాల్యంలో ఢిల్లీ వదిలి ఎక్కడికీ వెళ్ళేలేదు. వేసవి సెలవులు ఇస్తే మాత్రం హర్యానాలోని జజ్జర్ జిల్లా ఛుదానీకి వెళ్ళేవాళ్ళం. అది మా స్వగ్రామం.

ఇవి ఉండాల్సిందే

టూర్లకి వెళ్ళినప్పుడు నాతో తప్పనిసరిగా ఉండేవి మొబైల్ ఫోన్, వ్యాయామానికి అవసరమైన పరికరాలు. ఎందుకంటే, ఎక్కడికెళ్ళినా ఫిట్‌నెస్ గురించి మరిచిపోను. దుస్తులంటారా, టి-షర్ట్‌లు, జీన్స్..

నచ్చిన మైదానాలు

ప్రపంచంలోని ప్రధాన స్టేడియంలు అన్నిట్లో ఆడాను. అన్నిటి కన్నా నా మనసును దోచుకున్నది మాత్రం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల స్టేడియం. అదో అద్భుతం... అంతే! దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ మైదానానికి రెండో స్థానం ఇస్తాను.



నవ్య సకల

పేరెంటింగ్

భిన్నత్వాన్ని ప్రోత్సహించండి

అందరి పిల్లల్లాగే తమ పిల్లలూ ఉన్నత స్థితికి చేరుకోవాలనుకుంటే ఓకే. కానీ, వాళ్లు వెళ్లే దారిలోనే తమ పిల్లలూ వెళ్లాలనుకుంటేనే తప్పు. ఎందుకంటే, ప్రతి పిల్లాడిలోనూ విలక్షణమైన శక్తి సామర్థ్యాలు ఉంటాయి. తలిదండ్రులు చేయాల్సిందల్లా వాటిని వెలికి తీయడానికి అవసరమైన తోడ్పాటును అందించడమే. పిల్లల అభిరుచి ఏమిటో గమనించి ఆ రంగంలో వారిని సానబెడితే గుంపులో గోవిందం కాకుండా ఉంటారు.అలా కాకుండా మీ ప్రోద్బలంతో అందరు పిల్లల్లా ఇంజినీరుగానో, డాక్టర్‌గానో మారిపోయి నాలుగు డబ్బులు వెనకేసుకోవచ్చు. కానీ, అనుకున్న దాన్నించి వైదొలగిన ఆత్మక్షోభ వారిని జీవితాంతం వేధిస్తుంది. విధిగా చేసే పనుల్లో మెదడు మాత్రమే పనిచేస్తుంది. ప్రేమతో చేసే పనుల్లో ఆ మెదడుకు హృదయం కూడా తోడవుతుంది. పైగా, ఒక బాధ్యతగా చేసుకుపోతున్నవాడు మర మనిషి అవుతాడు. మనస్ఫూర్తిగా చేసే పనుల్లో మాత్రమే మనిషి విశ్వరూపం ధరిస్తాడు. ఆ విశ్వరూపం సమాజంలోని అత్యధిక సంఖ్యాకుల్ని ప్రభావితం చేస్తుంది. సంచలనాలు సృష్టిస్తుంది.

కురుల కోసం మాస్క్

చలికాలంలో జుట్టు పొడిబారిపోవడం అందరికీ ఎదురయ్యే ప్రధానమైన సమస్య. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే జుట్టు ఊడిపోవడం ఖాయం. దీని కోసమే చాలా సింపుల్ చిట్కాలు ఉన్నాయి. వీలుంటే ఒక్కసారి ట్రై చేయండి...

కొబ్బరి నూనె మాస్క్

ఇంట్లో అందుబాటులో ఉండే కొబ్బరి నూనె చాలు. జుట్టుకు ఇంతకు మించిన నేస్తం ఎక్కడ ఉంటుంది? రెండు టేబుల్‌స్పూన్ల కొబ్బరినూనెలో పాలు కలిపి ఆ మిశ్రమాన్ని తలకు రాయండి. ఓ మూడు గంటల తర్వాత తలస్నానం చేయండి. ఇలా కొన్నాళ్లు చేస్తే జుట్టు రాలే సమస్య కూడా తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్ మాస్క్

మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్‌నూనెలో మూడు కోడిగుడ్డు సొనలను కలిపి ఆ మిశ్రమాన్ని తలకు పట్టించండి. ఓ గంట తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయండి. కోడిగుడ్డు సొన జుట్టు పొడిబారకుండా కాపాడుతుంది.

ఆలివ్-బనానా మాస్క్

అరటిపండుకు కూడా జుట్టు సమస్యలను పోగొట్టే గుణాలు ఉన్నాయి. రెండు టేబుల్ స్పూన్ల నూనె, అరటిపండు గుజ్జు, యోగర్ట్ కలిపి తలకు రాయండి. గంట తర్వాత షాంపు చేయండి. అరటిపండులో పొటాషియం, యోగర్ట్‌లో ఉండే లాక్టిక్ యాసిడ్ జుట్టు పాడవకుండా కాపాడతాయి.



ట్రెండింగ్

అదరగొట్టిన వీడియోలివే!

సినిమాలకు రికార్డు కలెక్షన్లు, మ్యూజిక్ ఆల్బమ్‌కు మ్యూజిక్ చార్ట్‌లు. మరి చిన్నదో పెద్దదో ఒక వీడియో గొప్పతనాన్ని నిగ్గుతేల్చే కొలబద్ద ఏది? కంటెంట్ ఉన్నోడికి కటౌట్ అక్కర్లేదు నిజమే! కానీ 'డౌట్ లేదు ఇది సీమ సరుకే బాస్.. దీపావళి ఔట్‌లా పేలుతుంది' అని సర్టిఫై చేసేదెవరు. ఇంకెవరు యుట్యూబ్ వ్యూయర్సే. వారికి నచ్చితే చాలు వ్యూస్, లైక్‌లతో సీమ టపాకాయల మోత మోగిస్తారు. వైరల్ వీడియోలను కాస్తా యూట్యూబ్ చరిత్రలో ఆల్‌టైమ్ ఫేవరేట్ బ్లాక్‌బస్టర్స్‌గా నిలుపుతారు. ఇప్పటివరకు అలాంటి ఘనత పొందిన వీడియోలు మీకోసం...

24 హవర్స్ యుట్యూబ్ రికార్డ్

'నువ్వు నాకు నచ్చలేదు'! 'బట్ నువ్వు మాకు నచ్చావ్!'

సాంగ్: లుక్ వాట్‌యూ మేడ్‌మీ డూ!
ఆల్బం: రెప్యూటేషన్
నిడివి: 4. 15 ని.
జానర్ : పాప్
అప్‌లోడ్ : ఆగస్టు 24, 2017
తొలిరోజు వ్యూస్: 4.32 కోట్లు

'ఐ డోంట్ లైక్ యువర్ లిటిల్ గేమ్స్, బికాజ్ మగాళ్లు పచ్చిమోసగాళ్లు.. అంటూ... అది ఎందుకో వివరించిన ఈ పాప్ సాంగ్‌కు అభిమానులు యూట్యూబ్ వ్యూస్‌తో హారతిపట్టారు. టేలర్ స్విఫ్ట్ సృష్టించిన క్యాచీ మ్యూజిక్ వీడియో యూట్యూబ్‌లో మ్యాజిక్ చేసింది. సంగీతం, కోరస్, బీట్ ఒకదానికి ఒకటి నెచ్చెనమెట్లలా మారి యూట్యూబ్ వీడియో చార్ట్‌లో 'లుక్ వాట్‌యూ మేడ్‌మీ డూ' సాంగ్‌ను అగ్రస్థానంలో నిలిపాయి. ఎంతలా అంటే సినిమాలకు ఫస్ట్‌డే కలెక్షన్స్ చెప్పినట్టు యూట్యూబ్ ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి మరీ.. తొలి రోజులోనే అత్యధిక వ్యూస్ పొందిన యూట్యూబ్ వీడియోగా ప్రకటించారు. అంతలా ఈ వీడియోలో ఏముందంటే.. ఒక్కటి కాదు.. చాలా.. ముఖ్యంగా టేలర్ అందం. వజ్రానికి వజ్రాలను పొదిగినట్టు ఉంటుంది. అందుకే 'లుక్ వాట్‌యూ మేడ్‌మీ డూ' అన్న టేలర్ వైపు యూట్యూబ్ వీక్షకులు ఒకటికి నాలుగు లుక్కులేసారు. వీడియోను వైరల్ చేశారు. టేలర్‌కి రెప్యూటేషన్ ఇచ్చారు. మరో కారణం... పన్నీ లిరిక్స్. ప్రేమికులు తనకు ఎందుకు నచ్చలేదో టేలర్ ఒక్కో చరణంలో పాడుతుంటే గడుసు పిల్ల అనిపిస్తుంది. అబ్బాయిలకైతే నాలుగు రోడ్ల కూడలిలో నగ్నంగా నిలబెట్టినట్టు ఉంటుంది.నా గురించేనేమో అని అప్రయత్నంగా భుజాలను తడుముకుంటారు. ఈ పాప్ మ్యూజిక్ వీడియో యూట్యూబ్‌లో మ్యాజిక్ చేసింది. విడుదలయిన 24 గంటల్లో 4.30 కోట్ల వ్యూస్ సాధించింది. 15 రోజుల్లో 35 కోట్లకు పైగా వ్యూస్‌ను ఛేదించింది.



వరల్డ్ వైడ్ హిట్‌సాంగ్

'సీదో.. స్పాబ స్పాబె సీదో..' • **సాంగ్:** 'డెస్పాసిటో'
ఇంగ్లీష్ టైటిల్: స్లోలీ • **అప్‌లోడ్ :** జనవరి 12, 2017
నిడివి : 3.47 • **జోనర్:** లాటిన్ పాప్, పాప్



సీదో.. స్పాబ స్పాబె సీదో... ఈ స్పానిష్ ట్యూన్ సంగీతానికి ఎల్లలు లేవనటానికి తిరుగులేని రుజువు. సముద్ర తీరంలో, స్లమ్ముల్లో, అడ్డదిడ్డంగా వెలసిన వీధుల్లో, పెచ్చులూడిన గోడల లోగిళ్లలో లాటిన్ అమెరికన్ల పార్టీ కల్చర్‌ను ప్రతిబింబిస్తుంది ఈ వీడియో. 'నిచ్చెలీ నీకోసం చాలా రోజులుగా వేచి చూస్తున్నా.. నీ రాకతో ఈ రోజు పండుగ చేసుకుంటా.. కళ్లతో నువ్వు పిలిచిన పిలుపులు నా మనసుకు చేరాయి. నీ దరి చేరే దారి చూపు, నువ్వు అయస్కాంతం అయితే నేను ఇనుప రజును. నిన్ను గాఢంగా హత్తుకోని' అంటూ లూయిస్ ఫోన్సీ ఒలకబోసిన బావుకత్వంలో యుట్యూబ్ వీక్షకులు తడిసి ముద్దయ్యారు. ఈ వీడియో ఇప్పటికి నాలుగు వందల కోట్లకు పైగా వ్యూస్ సాధించి 'యుట్యూబ్ వరల్డ్ వైడ్ హిట్ సాంగ్'గా నిలిచింది. పాత రికార్డులకు పాతరేసి 'మోస్ట్ వాచ్‌డ్ వీడియో ఆన్ యూట్యూబ్' రికార్డును సొంతం చేసుకుంది. ఈ వీడియో ఇస్లాం విశ్వాసాలకు భంగం కలిగిందనే కారణంతో మలేషియా ప్రభుత్వం జూలైలో ప్రభుత్వ ప్రసార సాధనాల్లో దీని ప్రసారంపై నిషేధం విధించింది.

యూట్యూబ్ మోస్ట్ లైక్‌డ్ వీడియో ఆఫ్ ఆల్‌టైమ్

'సీయూ ఎగైన్' అండ్ ఎగైన్

సాంగ్: సీయూ ఎగైన్
ఆల్బమ్: ఫ్యూరియస్ 7
అప్‌లోడ్ : మార్చి 10, 2015
జానర్: హిప్ హాప్, పాప్, రాప్
నిడివి: 3.49 ని.
వ్యూస్ : 300 కోట్లు




అమెరికన్ రాప్ సంగీత తరంగం విజ్ ఖలీఫాను ఈ ఒక్క గీతం పాప్ మ్యూజిక్ ఖలీఫాగా నిలబెట్టింది. 'సీయూ ఎగైన్' అనే పేరుకు తగ్గట్టు వీక్షకులు మళ్లీ మళ్లీ చూడటంతో యూట్యూబ్ చరిత్రలో మోస్ట్ లైక్ వీడియోగా చరిత్రపుటల్లో స్థానం సంపాదించింది. 2013లో రోడ్డు ప్రమాదంలో మరణించిన హాలీవుడ్ నటుడు పాల్‌వాకర్‌కు నివాళిగా యాక్షన్ ఫిల్మ్ 'ఫ్యూరియస్ 7' లో చేసిన సౌండ్ ట్రాక్ దీనికి స్ఫూర్తి. ఆ సినిమాలో ఆఖరి సన్నివేశంలో కనిపించే బ్రిడ్జి దగ్గరే సీయూ ఎగైన్ ప్రారంభ సన్నివేశం ఉంటుంది. కొద్ది కాలంలో గంగ్నమ్ స్టైల్ వీడియోను అధిగమించింది. దాని తరువాత యూట్యూబ్ మోస్ట్ లైక్‌డ్ వీడియో ఆఫ్ ఆల్‌టైమ్ గౌరవాన్ని అందుకుంది. నాలుగేళ్ల పాటు ఆ రికార్డును అట్టిపెట్టుకుంది. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 300 కోట్ల వ్యూస్ దాటిన వీడియోల్లో ఇది రెండోది. అలాగే కోటి లైక్‌లు సంపాదించిన రెండో వీడియో కూడా ఇదే. ఇప్పటివరకు 1.80 కోట్లకు పైగా లైక్‌లు వచ్చాయి.

యూట్యూబ్ ట్రెండ్‌సెట్టర్!

బిగ్ బ్రదర్ ఈజ్ గంగ్నమ్ స్టైల్

సాంగ్: ఓపన్ గంగ్నమ్ స్టైల్
ఆల్బమ్: పిఎస్‌వై6 • **జానర్:** పాప్
నిడివి: 3.39 నిమిషాలు
అప్‌లోడ్ : జులై 15, 2012



ఒక్క యూట్యూబ్‌లోనే కాదు ఇంటర్నెట్ పుట్టాక 100 కోట్లు, 200 కోట్లు వ్యూస్‌ను సాధించిన తొలి వీడియోగా నిలిచింది గంగ్నమ్‌స్టైల్. ఈ దక్షిణ కొరియా పాప్ వీడియో కల్ట్ ఫేవరేట్‌గా నిలిచింది. ఓపన్ గంగ్నమ్ స్టైల్ అనగానే జనం తమ హృదయ ద్వారాలు తెరిచారు. ప్రస్తుతం 300 కోట్ల వ్యూస్‌కు చేరువలో ఉంది. ఈ మాస్ బీట్‌పై డేవిడ్ కామెరూన్, ఒబామాలంటి దిగ్గజాలు ఫిదా అని కాలు కదిపారు. ఓపన్ గంగ్నమ్ స్టైల్‌కు దాని రూపకర్త పార్క్ జె శాంగ్ చెప్పిన అర్థం 'బిగ్ బ్రదర్ ఈజ్ గంగ్నమ్ స్టైల్'. దక్షిణ కొరియా సియోల్‌లోని గంగ్నమ్ అనే ప్రాంతం ఉంది. క్యాచీబీట్‌కు తోడు నవ్వు తెప్పించే డాన్స్ మూవ్‌మెంట్‌లు ఉండటంతో జనం విరగబడి చూశారు. గంగ్నమ్ స్టైల్ వీడియో 'మోస్ట్ లైక్‌డ్ వీడియో ఆన్ యూట్యూబ్' గా 'గిన్నీస్ వరల్డ్ రికార్డ్' గుర్తింపు దక్కింది. బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్‌తో పాటు ఒబామా, బాన్‌కీమూన్ లాంటి వారు స్టెప్పేశారు. కొరియన్ కల్చర్‌ను యావత్ ప్రపంచం తన సొంతం చేసుకున్న సందర్భం అది.

ఫిఫ్త్ మోస్ట్ వ్యూడ్ యూట్యూబ్ వీడియో ఆల్‌టైమ్!

'అప్‌టౌన్ ఫంక్'
అప్‌లోడ్: 10 నవంబర్, 2014
వ్యూస్: 2.60 కోట్లు
ఆల్బం: అప్‌టైన్ స్పెషల్
జోనర్: పాప్ ఫంక్
నిడివి: 4.30



ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనే సూక్తి సంగీతానికి వర్తిస్తుందని నిరూపించాడు బ్రూనో మార్స్. 60ల్లో అమెరికన్ యూత్‌ను ఓ ఊపు ఊపిన ఫంక్‌సాంగ్స్‌ను మళ్లీ పట్టుకొచ్చి సూపర్‌హిట్ కొట్టాడు ఈ పాప్ రారాజు. మ్యూజిక్ నోబెల్‌లా భావించే గ్రామీ పురస్కారాలను రెండింటిని సొంతం చేసుకుంది. 20 శాతం ప్రపంచ జనాభా లైక్ చేసిన సాంగ్‌గా దీన్ని విమర్శకులు పేర్కొంటారు.

మోస్ట్ లైక్‌డ్ వీడియో

'సారీ'
వ్యూస్: 2.80 కోట్లు.
జస్టిన్ బైబర్ మ్యూజిక్ వీడియో
ఆల్బం: పర్పస్
అప్‌లోడ్ : అక్టోబర్-23, 2015
జోనర్: పాప్



పాప్ సామ్రాజ్యంలోకి 2008లో ప్రవేశించిన కొత్తగాలి జస్టిన్ బైబర్. 'గర్ల్‌ఫ్రెండ్ ముందు తలదించుకొని ఉంటే ప్రయోజనం ఏముంది.. తలెత్తి ప్రార్థించినా స్వర్గం ప్రాప్తిస్తుంది' అని భావించే తెలివైన అబ్బాయి.. అమ్మాయితో 'ఒకటి రెండు సార్లు (నీ లెక్కలో ఓ రెండు మూడొందల సార్లు)నేను తప్పు చేసి ఉండొచ్చు.. సారీ.. కానీ ప్లీజ్ ఇంకొక్క ఛాన్స్ ఇవ్వు' అని ప్రియురాలిని వేడుకోవటమే పనిగా పెట్టుకుంటాడు. కాన్సెప్ట్ యూనివర్సల్ కదా ప్రేక్షకులు 'సారీ'ని ఓన్ చేసుకున్నారు. ఇప్పటి వరకు 2.80 కోట్ల వ్యూస్‌తో యూట్యూబ్‌లో 'ఫోర్త్ మోస్ట్ వ్యూడ్ వీడియో'గా నిలిచింది.

వెరైటీ

సారీ... నెమలికి నో ఎంట్రీ!



ఇదే చెప్పి పంపించేశారు న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్ అధికారులు. అందమైన నెమలికి విమానంలోకి ఎంట్రీ లేదా! ఏం పాపం చేసింది అది! అనుకుంటున్నారా? అయితే దాని సైజ్ చూస్తే ఇలా మాట్లాడరు! అసలు విషయం ఇదీ!

అమెరికాలోని ఓ మహిళకు పెంపుడు నెమలి ఉంది. అక్కడి నిబంధనలు ప్రకారం నెమలిని కూడా పెంచుకోవచ్చు. కానీ ఆ నెమలిని తనతో పాటు విమానంలో ఆమె తీసుకెళ్లామనుకుంది. అక్కడే చిక్కు వచ్చి పడింది. న్యూజెర్సీ రాష్ట్రంలోని న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు తన పెంపుడు నెమలితో పాటు వెళ్లింది. కానీ, ఈ నెమలి పరిమాణం చూసి ఎయిర్‌పోర్ట్ అధికారులు షాక్ తిన్నారు. అక్కడి ఫెడరల్ మార్గదర్శకాల ప్రకారం, 'ఎమోషనల్ సపోర్ట్ యానిమల్' పేరుతో ప్రయాణికులు తమతో పాటు పెంపుడు పక్షులు, జంతువులు తీసుకెళ్లవచ్చు. కానీ మానసిక సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులకు మాత్రమే ఇందుకు అనుమతి ఉంది. తోటి ప్రయాణికులకు ఏ మాత్రం హాని కలగదనీ, ప్రయాణానికి ఏ మాత్రం అంతరాయం కలగదని వారు రాతపూర్వక హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అంతకుముందు వన్యప్రాణుల ఎగుమతి, దిగుమతుల మీద నిబంధనలు కఠినతరంగా ఉండేవి. కానీ ఈ మధ్య కాలంలోనే వీటిని సడలించారు. కానీ ఈ నెమలిని మాత్రం విమానంలోకి ప్రయాణికురాలితో పాటు అనుమతించబోమన్నారు.

అంత పెద్ద నెమలి విమానంలో ప్రయాణించడం తమ నిబంధనలకు విరుద్ధమని వారు స్పష్టం చేశారు. అయితే ఇదే తొలి సారి కాదు. ఆమె పెంపుడు నెమలితో విమానంలో ప్రయాణిద్దామని గతంలో కూడా చాలా సార్లు ప్రయత్నించిందట. కానీ, కుదరలేదు. ఈ సారి న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ తతంగాన్ని ఎవరో షూట్ చేస్తే ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అసలు, ఇంత పెద్ద నెమలిని తనతో పాటు ఎలా తీసుకెళ్తారు? అది తోటి ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుంది కదా?' అని నెటిజన్లు కూడా ఎయిర్‌పోర్ట్ అధికారులకే మద్దతు పలికారు.

డైలీ సుడోకు - 93

7				5		9	6	3
					6		2	
9	1			3				
6							9	
		2				4		
	3							2
				1			3	8
	6		2					
8	7	4		9				6

ఎలా పూరించాలి?


ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 92 సమాధానం

[illegible]



కల్యాణ్‌దేవ్, చిరంజీవి, సెంథిల్‌కుమార్, కీరవాణి, రాజమౌళి

అల్లుడి చిత్రానికి మామ క్లాప్

చిరంజీవి రెండో కుమార్తె శ్రీజ భర్త కల్యాణ్‌దేవ్ వెండితెరకు కథానాయకుడిగా పరిచయమవుతోన్న చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్ ఇవ్వగా, ఎం.ఎం. కీరవాణి కెమెరా స్విఛాన్ చేశారు. రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. రాకేశ్ శశి దర్శకత్వంలో వారాహి చలనచిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ కథానాయిక. ఈ సందర్భంగా వారాహి చలనచిత్రం అధినేత సాయి కొర్రపాటి మాట్లాడుతూ "చిరంజీవిగారి అల్లుడు కల్యాణ్‌దేవ్ పరిచయ చిత్రాన్ని నిర్మించడం హ్యాపీగా ఉంది. రాకేశ్ శశి తయారుచేసిన అద్భుతమైన కథను భారీ నిర్మాణ విలువలతో నిర్మిస్తాం. 'బాహుబలి' ఛాయాగ్రాహకుడు సెంథిల్‌కుమార్, 'రంగస్థలం' కళా దర్శకుడు రామకృష్ణ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు. తనికెళ్ల భరణి, మురళీ శర్మ, నాజర్, 'సత్యం' రాజేశ్, ప్రగతి, పోసాని తదితరులు నటించనున్న ఈ చిత్రానికి సాహిత్యం: రెహమాన్, సంగీతం: యోగేశ్.

'కిర్రాక్ పార్టీ' నాకు స్పెషల్ చిత్రం

- నిఖిల్



సిమ్రన్, నిఖిల్, సంయుక్త

"తేజగారు చేసిన 'నువ్వు నేను', 'చిత్రం' సినిమాలకు కాలేజ్ బంక్ కొట్టి వెళ్లేవాడిని. నేను నటించిన 'హ్యాపీడేస్' కాలేజీ చిత్రం. ఆ తర్వాత ఇన్నాళ్లకు 'కిర్రాక్ పార్టీ' చేయడం ఆనందంగా ఉంది. ఇందులో నేను హీరో కాదు. నాతో పాటు చాలా మంది హీరోలున్నారు. ఈ చిత్రం నోస్టాల్జిక్ ట్రిప్ అవుతుంది. షూటింగ్ ఆఖరి రోజు అందరి కళ్లలో నీళ్లు తిరిగాయి" అని నిఖిల్ అన్నారు. ఆయన హీరోగా నటించిన 'కిర్రాక్ పార్టీ' చిత్రం టీజింగ్ ట్రైలర్‌ను దర్శకుడు తేజ హైదరాబాద్‌లో బుధవారం విడుదల చేశారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన చిత్రమిది. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. సిమ్రన్ పరీన్జా, సంయుక్త హెగ్డే నాయికలు. తేజ మాట్లాడుతూ "టీజింగ్ ట్రైలర్ చాలా బావుంది. హీరో లుక్స్ కూడా బావున్నాయి. హీరో ఫ్రెండ్స్‌గా చేసిన వారందరూ నేచురల్‌గా ఉన్నారు" అని చెప్పారు. అనిల్ సుంకర మాట్లాడుతూ "ఇది మా సంస్థలో ఉత్తమ చిత్రమవుతుంది. నటీనటులు చాలా మంది కొత్తవారే అయినా బాగా నటించారు. సినిమా మొత్తం భావోద్వేగాలతోనూ, ఫన్‌తోనూ సాగుతుంది. ఇటీవలి కాలంలో వచ్చిన కాలేజీ చిత్రాల్లో ఉత్తమ చిత్రంగా నిలుస్తుంది. అతి త్వరలో విడుదల చేస్తాం" అని చెప్పారు. కన్నడలో పెద్ద విజయం సాధించిన చిత్రాన్ని తెలుగు నేటివిటీకి తగ్గట్టు మౌల్డ్ చేసినట్టు దర్శకుడు తెలిపారు.

అమీర్‌పేట్ నుంచి అమెరికా వరకూ...

అనుష్క ఈజ్ ది బెస్ట్!

- దర్శకుడు అశోక్



అనుష్క

"కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలు మీరు ఎక్కువ చేస్తున్నారని ప్రతి ఒక్కరూ అంటున్నారు. ఒక నిర్మాణ సంస్థ, మంచి కథ, మంచి దర్శకుడు, సాంకేతిక నిపుణులు లేకుండా ఇటువంటి చిత్రాలు సాధ్యం కాదు. 'భాగమతి'తో మరోసారి అది రుజువైంది. విడుదల నుంచి ఈ రోజు వరకూ మంచి ప్రేక్షకాదరణతో చిత్రం నడుస్తోంది. ఇంత మంచి చిత్రం చేయడానికి కారణమైన మా చిత్రబృందానికి, ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు అనుష్క. ఆమె ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం సక్సెస్‌మీట్ మంగళవారం జరిగింది. 'దిల్' రాజు మాట్లాడుతూ "అరుంధతి', 'బాహుబలి'లో దేవసేన, 'రుద్రమదేవి', ఇప్పుడీ 'భాగమతి'... ఏం చేసినా ఆమె ఎంతో ఎఫర్ట్స్ పెడుతున్నారు. సాధారణంగా హీరోలు సినిమా కోసం ఎక్కువ కష్టపడతారు. విజయవంతమైన హీరోయిన్‌గా కొనసాగుతూ ఇలాంటి చిత్రం చేయడం గొప్ప విషయం. కొన్ని చిత్రాలకు సాంకేతిక నిపుణులు చాలా ముఖ్యం. అటువంటి చిత్రమే భాగమతి. సోమవారం ఈ చిత్రానికి రూ. 1. 80 కోట్లు షేర్ వచ్చిందంటే... ఎంత పెద్ద విజయమో అర్థం చేసుకోండి" అన్నారు. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ "ఐదేళ్ల క్రితం రాసిన కథే ఈ చిత్రం. 2012లో మేం తీసుకున్న నిర్ణయం సరైనదేనని ప్రేక్షకులు నిరూపించారు. ఒక మంచి కథ ప్రేక్షకుల వరకూ రావాలంటే... 'ఇది నేను చేయగలను. చేసి నిరూపించగలను' అనే ఆర్టిస్ట్ కావాలి. అనుష్క రూపంలో మాకు అలాంటి నటి లభించింది. నటనలో కోపాన్ని, ఆవేశాన్ని, బాధను ఆమె చూపారు. అమీర్‌పేట్ నుంచి అమెరికా వరకూ 'అనుష్క ఈజ్ ద బెస్ట్' అంటున్నారు" అన్నారు. చిత్రనిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్కి, సంగీత దర్శకుడు తమన్, కళా దర్శకుడు రవీందర్, నటులు నాగినీడు, 'ప్రభాస్' శీను, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెగాస్టార్‌కన్నా బాగా చేశాడని అంటారు

- సి.కల్యాణ్



"సాయిధరమ్‌తేజ్ మా 'ఇంటిలిజెంట్'లో చమక్కు చమక్కు.. పాటకు వేసిన స్టెప్పులు చూసి అందరూ మెచ్చుకుంటారు. అప్పట్లో మెగాస్టార్ చిరంజీవికన్నా, ఇప్పుడు తేజ్ బాగా చేశాడని తప్పకుండా అంటారు. ఒమన్‌లోని అందమైన ప్రదేశాల్లో వినాయక్ ఆ పాటను చాలా చక్కగా తెరకెక్కించారు" అని సి.కల్యాణ్ అన్నారు. ఆయన నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్' ఈ నెల 9న విడుదల కానుంది. సాయిధరమ్‌తేజ్, లావణ్యత్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమది. సి.కల్యాణ్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. "ఫిబ్రవరి 4న రాజమండ్రిలో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తాం. చమక్కు చమక్కు వీడియో పాటను ఇళయరాజాగారు, సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు ఆవిష్కరిస్తారు. వాళ్లతో పాటు మరో పెద్ద సెలబ్రిటీ కూడా పాల్గొంటారు. అది ఎప్పుడు, ఎక్కడ అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. 'ఖైదీ నంబర్ 150' తర్వాత వినాయక్‌కి చాలా మంచి ఆఫర్లు ఉన్నప్పటికీ మా బ్యానర్‌లో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. మా ఇద్దరిదీ ఎప్పటి నుంచో అన్నదమ్ముల అనుబంధం. అది ఈ చిత్రంతో మరోసారి నిరూపితమైంది" అని అన్నారు. తదుపరి చిత్రాల గురించి మాట్లాడుతూ "రానా హీరోగా నటిస్తున్న 1945 ఇంకో షెడ్యూల్ ఉంది. సుభాష్ చంద్రబోస్ నేపథ్యంలో రూపొందుతోంది. అప్పట్లో ప్రేమలు ఎలా ఉండేవో చాలా క్లారిటీగా ఇందులో చూపిస్తాం. వినాయక్ దర్శకత్వంలోనే మరో సినిమా ఉంటుంది. 'చందమామ' వంటి ఓ క్యూట్ చిత్రాన్ని కూడా ఇదే ఏడాది తెరకెక్కిస్తాం" అని తెలిపారు. "మార్చి 1 నుంచి ఇండస్ట్రీ షట్‌డౌన్ ఉంటుంది. ప్రస్తుతం దానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. మా డిమాండ్లకు ఒప్పుకోమని, నిర్మాతలను నక్సలైట్లుగా తయారు చేయొద్దని చెబుతున్నాం" అని అన్నారు.

ఒక రోజు వెనక్కి వెళ్తున్నాం

- దిల్‌రాజు



భోగవల్లి ప్రసాద్, దిల్‌రాజు

"విడుదలయ్యే సినిమాలన్నీ మంచి లాభాలను ఆర్జించాలి. నాకు బాక్సాఫీస్ పోటీ ఇష్టం ఉండదు. అందుకే 'తొలిప్రేమ'ను ఫిబ్రవరి 10న విడుదల చేస్తున్నాం. ఫిబ్రవరి 9న కల్యాణ్‌గారు 'ఇంటిలిజెంట్'ను విడుదల చేయాలని అనుకున్నట్టు మాకు ముందస్తు సమాచారం లేదు" అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. వరుణ్‌తేజ్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్ఎన్ ప్రసాద్ నిర్మించిన చిత్రం 'తొలిప్రేమ'. ఈ చిత్రాన్ని దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో దిల్‌రాజు మాట్లాడుతూ "తొలిప్రేమ, ఇంటిలిజెంట్ సినిమాలు ఒకేరోజు విడుదలవుతాయా? లేదా? అనే సందిగ్ధత చాలా మందిలో ఉంది. మెగా అభిమానులకు ఇలాంటి అయోమయం లేకుండా మేం 'తొలిప్రేమ'ను 10న విడుదల చేస్తాం. ఓవర్సీస్‌లో మాత్రం 'హ్యాపీడేస్', 'శతమానం భవతి' తరహాలో 9న విడుదల చేయాలనుకుంటున్నాను. దాని గురించి అక్కడివారితో మాట్లాడి నిర్ణయానికి వస్తాం. 80ల్లో మన హీరోలు ఏడాదికి రెండు, మూడు సినిమాలు చేసేవారు. ప్రతివారం సినిమాల విడుదలలో పోటీ ఉండేది. గత 20 ఏళ్లుగా ఆ సంప్రదాయం లేదు. మళ్లీ ఇప్పుడు అలాంటిది మొదలైంది. గతేడాది డిస్ట్రిబ్యూటర్‌గా నాకు ఎక్కువ నష్టం జరిగింది. ఈ ఏడాది 'భాగమతి'తో లాభాలు మొదలయ్యాయి. 'తొలిప్రేమ' కొనసాగిస్తుందని ఆశిస్తున్నాను" అని దిల్‌రాజు అన్నారు. నిర్మాత బీవీయస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ "ఈగోలకు పోకుండా మేం ఒకరోజు వెనక్కి జరిగి 10న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. మా సినిమా చాలా బాగా వచ్చింది" అని అన్నారు.

'ఛలో'తో రెండు, మూడు మెట్లెక్కుతా

- నాగశౌర్య



"నా సినిమాలు బాగా ఆడితే నాకే మంచి పేరు వస్తుంది. ఒకవేళ ఫ్లాప్ అయినా నా మార్కెట్టే పడిపోతుంది. అందుకే స్క్రిప్ట్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటున్నాను. ఆచితూచి సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాను. 'ఛలో' అలా చేసిన చిత్రమే. ఈ చిత్రం నన్ను హీరోగా రెండు, మూడు మెట్లెక్కిస్తుంది" అని నాగశౌర్య తెలిపారు. ఆయన హీరోగా నటించిన 'ఛలో' ఈ నెల 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం నాగశౌర్య విలేకరులతో మాట్లాడారు. "ఐరా అనేది మా సొంత సంస్థ. నాకు ఏనుగులంటే చాలా ఇష్టం. అందుకే ఐరావతంలోని ఐరా అనే అక్షరాలతో మా సంస్థకు పేరుపెట్టాం. మా నాన్నకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. ఐరాను ఆయన కన్నకూతురిలాగా చూసుకుంటున్నారు. 'ఛలో' విషయానికి వస్తే... నా ఫ్రెండ్ వెంకీ కొన్ని కథలు చెప్పాడు. నచ్చలేదన్నాను. నేను బయట ఎలా ఉంటానో అలాగే తెరమీద చూపించేలా ఈ కథను సిద్ధం చేశాడు. ఒక ఊరు రెండుగా చీలిపోతుంది. అది ఎందుకు? ఏంటి? అనేదే ఈ సినిమా కథ. చాలా బావుంటుంది. మంచి పాటలు కుదిరాయి. సినిమా క్వాలిటీ విషయలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. బిజినెస్ పరంగానూ చాలా హ్యాపీగా ఉన్నాం. హిందీ రైట్స్ కూడా అమ్మేశాం. నైజామ్ మాత్రం మేమే ఉంచుకున్నాం. బడ్జెట్ వ్యవహారాలన్నీ మా అమ్మ దగ్గరుండి చూసుకున్నారు" అని తెలిపారు. 'కణం', 'అమ్మమ్మగారిల్లు' షూటింగ్స్ పూర్తయ్యాయి. ఫిబ్రవరి నుంచి నేను నటించే ప్రతి సినిమానూ మరింత జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటాను. త్వరలో సాయిశ్రీరామ్ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీ మొదలవుతుంది. ఆ తర్వాత శ్రీనివాస్ దర్శకత్వంలో 'నర్తనశాల' అనే సినిమా చేస్తాను" అని తెలిపారు. నీహారికతో మీ పెళ్లి జరగనుందని వార్తలు వస్తున్నాయి.. అని ప్రశ్నించగా.. 'అలాంటిదేమీ లేదండీ. అందులో అసలు నిజం లేదు. కాకపోతే మా అమ్మావాళ్లు మరింత ఫోర్స్ చేస్తే ఇంకో మూడు, నాలుగేళ్లలో ఎవరో ఒకరిని పెళ్లి చేసుకుంటాను" అని అన్నారు.

తెలుగమ్మాయితో నటించడం నచ్చింది!

- రాహుల్ రవీంద్రన్



నారా రోహిత్, పత్తిపాటి పుల్లారావు, చాందిని, రాహుల్,

"ఒక గౌరవం, హుందాతనంతో కూడిన పాత్రను ఈ చిత్రంతో చేశా. రేవన్ యాదు చిత్రాన్ని అద్భుతంగా తీశారు. చాందిని, మనాలి బాగా నటించారు. ఇద్దరికీ తెలుగు వచ్చు. ముఖ్యంగా చాందిని తెలుగమ్మాయి. చిత్రీకరణలో డైలాగులు ప్రాంప్టింగ్ ఇవ్వవలసిన అవసరం లేదు. దాంతో ఎదుటి నటులకు డిస్టబెన్స్ ఉండదు. వాళ్లూ బాగా నటించే అవకాశం లభిస్తుంది. తెలుగమ్మాయితో నటించడం నచ్చింది. మానవ సంబంధాల నేపథ్యంలో నడిచే మంచి చిత్రమిది" అన్నారు రాహుల్ రవీంద్రన్. ఆయన హీరోగా రేవన్ యాదు దర్శకత్వంలో ఈఎమ్‌వీఈ స్టూడియోస్ సంస్థ నిర్మించిన సినిమా 'హౌరా బ్రిడ్జ్'. చాందినీ చౌదరి, మనాలీ రాథోడ్ హీరోయిన్లు. శనివారం ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. అందులో ఏపీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సినిమా ఆడియో సీడీలను విడుదల చేశారు. నారా రోహిత్ మాట్లాడుతూ "శేఖర్ చంద్ర మంచి పాటలు ఇచ్చారు. ఆయన సంగీతమంటే నాకు ఇష్టం. కానీ, ఆయనతో పని చేసే ఛాన్స్ రాలేదు. ప్రచార చిత్రాలు, పాటలు బాగున్నాయి. చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోలు నిఖిల్, నవీన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దెయ్యం హ్యాక్ చేస్తే...



మేఘన, సల్మాన్, సంతోషి

మేఘన, సంతోషి, సల్మాన్ ముఖ్యతారలుగా కృష్ణకార్తీక్ దర్శకత్వంలో వై. ఉదయభాస్కర్ నిర్మించిన హారర్ థ్రిల్లర్ 'హ్యాక్‌డ్ బై డెవిల్' (హెచ్‌బిడి). ఈ సినిమా ప్రచార చిత్రాలను సర్వే సత్యనారాయణ, నవీన్ యాదవ్, పాటల్ని ఆర్పీ పట్నాయక్, రాజ్ కందుకూరి, రామ సత్యనారాయణ, సాయి వెంకట్ విడుదల చేశారు. "సాధారణంగా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో హ్యాకింగ్ ఉంటుంది. ఒకవేళ దెయ్యం ఆ విధంగా హ్యాక్ చేయాలనుకుంటే ఏం చేసింది? అనే ఆలోచనలోంచి చిత్రకథ పుట్టింది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అన్నారు. హిమజ, మానస, సురేష్, అజయ్ నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. మహి మదన్.

రూ.4కే మొబైల్ నంబర్ పోర్టబిలిటీ

న్యూఢిల్లీ: టెలికాం కంపెనీలకు ట్రాయ్ మరోసారి షాకిచ్చింది. మొబైల్ నంబరు పోర్టబిలిటీ (ఎంఎన్‌పి) కోసం ప్రస్తుతం కంపెనీలు వసూలు చేస్తున్న ఛార్జీలను ఒకేసారి 79 శాతం తగ్గించింది. ఇక నుంచి ఎవరైనా అదే నంబర్‌తో ఒక ఆపరేటర్ నుంచి మరో ఆపరేటర్‌కు మారాలంటే కంపెనీలకు గరిష్ఠంగా రూ.4 చెల్లిస్తే సరిపోతుంది. ప్రస్తుతం కంపెనీలు ఇందుకోసం రూ.19 వసూలు చేస్తున్నాయి. ఏదైనా మొబైల్ ఆపరేటర్ సేవలు బాగోకపోతే ఖాతాదారులు అదే నంబరుతో వేరే నెట్‌వర్క్‌కు మారేందుకు ఎంఎన్‌పి ప్రవేశపెట్టారు. ఇటీవల ఎంఎన్‌పిలు గణనీయంగా పెరగడంతో ఈ చార్జీలు కూడా తగ్గిస్తున్నట్టు ట్రాయ్ పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పోటీ దృష్ట్యా కంపెనీలు ఉచితంగానే ఎంఎన్‌పికి సిద్ధమైనా ఆశ్చర్యం లేదని భావిస్తున్నారు.

నేటి నుంచే ఇ-వే బిల్లులు



జిఎస్‌టిలో కీలక మరో కీలకఘట్టం ఇ-వే బిల్లుల వ్యవస్థను గురువారం నుంచి తెలుగు రాష్ట్రాలు సహా 13 రాష్ట్రాల్లో అమల్లోకి తెస్తున్నారు. ఇ-వే బిల్లు విధానం ద్వారా ఒకే వే బిల్లుతో దేశవ్యాప్తంగా సరుకులు రవాణా చేయవచ్చు. దీనివల్ల పన్ను ఎగవేతకు అడ్డుకట్టపడుతుంది. వ్యాపారులు సరుకుల రవాణాలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టనష్టాలను అధిగమించి సులభతరంగా సరుకులను రవాణా చేయవచ్చు. ఈ నేపథ్యంలో ఇ వే బిల్లు విశేషాలు, రిజిస్ట్రేషన్ పద్ధతులపై జిఎస్‌టి నిపుణులు, వాణిజ్య పన్నుల శాఖ మాజీ అధికారి డాక్టర్ కె రవీంద్ర ప్రత్యేక వ్యాసం.

- జిఎస్‌టిలో నమోదు అయిన ప్రతి వ్యక్తి (రిజిస్టర్డ్ పర్సన్) సరుకుల రవాణాకు ముందు పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసి ఇ-వే బిల్లును జనరేట్ చేసుకోవచ్చు. 50,000 రూపాయల పైబడిన వస్తువులు రవాణాకు ఇ-వే బిల్లు తప్పనిసరి.
- పోర్టల్ ద్వారా ఇ-వే బిల్లు జనరేట్ చేసిన వెంటనే ఒక ప్రత్యేక ఇ-వే బిల్లు నెంబరు (ఇబిఎన్) సప్లయర్ (అమ్మకందారు)కు, రిసిపియంట్ (కొనుగోలుదారు), రవాణాదారు (ట్రాన్స్‌పోర్టర్)కు అందుబాటులోకి వస్తుంది.
- సరుకు రవాణా చేసే వ్యక్తి ఇ-వే బిల్లు ఒరిజినల్ గానీ ఇ-వే బిల్లు నెంబరు గానీ సరుకు రవాణాతోపాటు తీసుకువెళ్లాలి. ఇ-వేబిల్లు నెంబరుతోపాటు అమ్మకం బిల్లు, డెలివరీ చలాను గానీ ఉండాలి.



- ఇ-వే బిల్లు వివరాలు కొనుగోలుదారునికి (రిసిపియంట్) అందుబాటులోకి వస్తాయి. రిజిస్టర్డ్ కొనుగోలుదారు సరుకు కొనుగోలుకు సంబంధించి తన సమ్మతిని గాని, అసమ్మతినిగాని ఈ వివరాలు పరిశీలించి తెలియజేయవచ్చు.
- ఇ-వే బిల్లులో పొందుపరిచిన వివరాలు (1.కొనుగోలుదారుని జిఎస్‌టిఐఎన్ 2. సరుకు డెలివరీ ప్రదేశం 3. ఇన్వాయిస్ నెంబరు 4. ఇన్వాయిస్ తేదీ 5. సరుకుల విలువ 6. హెచ్‌ఎస్‌ఎన్ కోడ్) రిజిస్టర్డ్ సప్లయర్‌కు, కొనుగోలుదారునికి అందుబాటులోకి అందుబాటులో ఉండి జిఎస్‌టిఆర్-1లో పొందుపరచబడి ఉంటాయి.
- ప్రభుత్వ అధీకృత అధికారి ఈ రవాణాను మధ్యలో తనిఖీ చేయవచ్చు. ఇ-వే బిల్లు పత్రమును, నెంబరును, వివరాలను వాహనములోని సరుకుతో సరిపోల్చి తనిఖీ చేయవచ్చు.
- ఏదైనా రవాణా వాహనాన్ని 30 నిమిషాలకన్నా ఎక్కువ సేపు తనిఖీ అధికారి ఆపితే సరుకు రవాణాదారు ఆ విషయాన్ని కామన్ పోర్టల్‌లో పొందుపరచవచ్చు.

ఇ-వే బిల్లు విధానంలో స్టేక్ హోల్డర్స్

ఇ-వే బిల్లు విధానములో నలుగురు ముఖ్య వాటాదారులున్నారు.

సప్లయర్స్: ఇ-వే బిల్లును పోర్టల్ ద్వారా పొంది అందులో సప్లయర్, రిసిపియంట్, రవాణాదారు వివరాలను పొందుపరుస్తాడు.

కొనుగోలుదారు: తనపై పంపిన ఇ-వే బిల్లును పరిశీలించి తప్పులు ఉంటే లేక తనకు సంబంధం లేకపోతే తిరస్కరిస్తాడు.

రవాణాదారు: వే బిల్లును పోర్టల్ ద్వారా పొందవచ్చు. ఇ-వే బిల్లులన్నింటినీ ఏకీకృతం చేయవచ్చు.

అధీకృత అధికారి: ఇ-వే బిల్లులను, వాహనంలోని సరుకులను తనిఖీ చేసే అధికారంకలిగి ఉంటారు.

రిజిస్ట్రేషన్, ఎన్‌రోల్‌మెంట్

అమ్మకందారు, కొనుగోలుదారు, రవాణాదారు సరుకులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి ఎటువంటి అవాంతరాలు లేకుండా చేరవేయాలని భావిస్తారు. అధికారులు రవాణా అయ్యే సరుకులు సరిగ్గా లెక్కల పుస్తకంలో నమోదయి ఉండేలా చూస్తారు. రిజిస్టర్డ్ వ్యక్తి ఇ-వే బిల్లు విధానంలో నమోదు చేసుకునేందుకు eway-bill.nic.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలను తెలియజేయాలి. జిఎస్‌టి నమోదు కలిగిన వ్యక్తి అమ్మకందారు, కొనుగోలుదారు, రవాణాదారు కావచ్చు. రవాణాదారు చిన్న ఆపరేటర్‌గా ఉండి జిఎస్‌టి రిజిస్ట్రేషన్ లేకపోతే అలాంటి రవాణాదారు ఎన్‌రోల్‌మెంట్ విధానం ద్వారా తమ వివరాలను పొందుపరచి ఇ-వే బిల్లు పొందవచ్చు.

ఇ-వే బిల్లు రిజిస్ట్రేషన్ విధానం

ఇ-వే బిల్లు విధానంలో వే బిల్లులను వే బిల్లులను పలు విధాలుగా పొందవచ్చు. www.ewaybill.nic.in వెబ్ సైట్ నుంచి పొందవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా, ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా, సువిధ ప్రొవైడర్స్ ద్వారా ఇ-వే బిల్లును పొందవచ్చు.

ఇ-వే బిల్లు ఉండటం వల్ల ప్రతి రాష్ట్రంలో ఇతర ట్రాన్సిట్ పాస్ అవసరం లేదు. కొత్తగా 13 రాష్ట్రాలు ఇ-వే బిల్లును ప్రారంభిస్తున్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఉన్నాయి. మిగిలిన రాష్ట్రాలు జూన్ ఒకటో తేదీలోగా ఇంట్రా స్టేట్ రవాణా కోసం ఇ-వే బిల్లు విధానాన్ని అమల్లోకి తేనున్నాయి.

నాడు 97 శాతం పన్ను కట్టారు..

తగ్గుతూ వచ్చిన ఐటి రేట్లు.. సంస్కరణలతో సహేతుకమైన పన్నుల వ్యవస్థ.. ఈసారి మరిన్ని మార్పులపై అంచనాలు



ఈసారి బడ్జెట్‌లో ఆదాయం పన్ను రేట్లు, శ్లాబుల్లో మార్పు ఉంటుందనే అంచనాలు మధ్య తరగతి, వేతన జీవులను కితకితలు పెడుతున్నాయి. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జైట్లీ పన్ను చెల్లింపు దారులను బుజ్జగించే ప్రయత్నం చేయవచ్చని వినిపిస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న పన్ను రేట్లు, శ్లాబులు నిజానికి గత 40 ఏళ్ల కాలంలో అనేక మార్పులకు లోనయ్యాయి. 1990లో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత ఈ మార్పు మరింత బలంగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో గరిష్ఠ పన్ను 97శాతం వరకు ఉండేది. 1974-75లో వైబి చవాన్ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో పన్ను రేట్లను తగ్గించారు. ఆ తర్వాత ఈ ఒరవడి కొనసాగుతూ, పన్నుల వ్యవస్థను హేతుబద్ధం చేసే ప్రయత్నాలు కొనసాగుతూ వచ్చాయి. ఈసారి బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్నులకు సంబంధించే వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలు అనేక ఆశలతో ఉన్నారు. గత కొన్ని దశాబ్దాల్లో పన్నుల వ్యవస్థలో వచ్చిన మార్పులపై కథనం...

97.75 శాతం నుంచి 75 శాతానికి...

వైబి చవాన్ ఆర్థిక మంత్రిగా ఉన్న 1974-75 బడ్జెట్‌లో గరిష్ఠ పన్ను రేటును 97.75 శాతం నుంచి 75 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. తొలిసారిగా 6,000 రూపాయల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపునిచ్చారు. అప్పట్లో వెల్త్ టాక్స్ కూడా ఉండేది. దానిని పెంచడంతోపాటు గరిష్ఠ స్థాయి బ్రాకెట్లు అంటే వార్షికాదాయం 70 వేల రూపాయల పైబడితే పన్నును 70 శాతంగా నిర్ణయించారు. హైఎండ్ బ్రాకెట్లో ఉన్నవారు సెస్‌లతో కలిపి దాదాపు 77 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది.

ఊరటనిచ్చిన విపి సింగ్

విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఆర్థిక మంత్రిగా సమర్పించిన 1985-86 బడ్జెట్ పన్నుల వ్యవస్థలో పెనుమార్పులను చవిచూసింది. అప్పటి వరకున్న ఎనిమిది శ్లాబులను నాలుగుకు తగ్గించారు. గరిష్ఠ పన్ను రేటు 61 శాతం నుంచి 50 శాతానికి తగ్గింది. 18,000 రూపాయలకు లోబడి వార్షికాదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపునిచ్చారు. 18,000 నుంచి 25 వేల రూపాయల వరకు ఆదాయం ఉన్నవారిని 25 శాతం పన్ను శ్లాబులో పెట్టారు. 25,000 నుంచి 50 వేల రూపాయల ఆదాయం ఉన్న వారిని 30 శాతం పన్ను బ్రాకెట్లో 50 నుంచి లక్షల రూపాయల మధ్య ఆదాయంపై 40 శాతం, లక్ష రూపాయలపై బడిన వార్షికాదాయంపై 50 శాతం పన్ను రేటును ప్రతిపాదించారు.

సంస్కరణలతో కొత్త పుంతలు..

90ల్లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలతో ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ 1992-93 బడ్జెట్‌లో శ్లాబుల సంఖ్యను మూడింటికి కుదించారు. 30 వేల రూపాయల వరకు రాబడికి పన్ను మినహాయింపునిచ్చి 30 వేల నుంచి 50 వేల రూపాయల మధ్య రాబడిపై 20 శాతం పన్ను, 50 వేల నుంచి లక్షల రూపాయల మధ్య ఆదాయంపై 30 శాతం పన్ను, లక్ష రూపాయల పైబడిన రాబడులపై 40 శాతం పన్నురేటును ప్రతిపాదించారు. ప్రత్యక్ష పన్నులకు సంబంధించి అతిపెద్ద సంస్కరణకు ఆయన శ్రీకారం చుట్టారు. 194-95 బడ్జెట్‌లో రేట్లను కొనసాగిస్తూ శ్లాబులను మాత్రం మార్చారు. 35 వేల రూపాయల వరకు పన్ను నుంచి మినహాయించడంతో పాటు గరిష్ఠ పన్ను రేటు వర్తించే మొత్తాన్ని 1.2 లక్షల రూపాయలు ఆపై మొత్తానికి పెంచారు.

మార్కెట్లను కదం తొక్కించిన డ్రీమ్ బడ్జెట్

విపి సింగ్, మన్మోహన్‌సింగ్ బాటలో ఆర్థిక సంస్కరణలను మరింత ముందుకు తీసుకుపోయిన చిదంబరం 1997-98లో ప్రవేశపెట్టిన బడ్జెట్ డ్రీమ్ బడ్జెట్‌గా నీరాజనాలు అందుకొంది. ఈ బడ్జెట్‌లో పన్ను రేట్లను 10, 20, 30 శాతంగా మార్చారు. 40-60 వేల రూపాయల మధ్య ఆదాయంపై 10 శాతం, 60-1.5 లక్షల రూపాయల రాబడిపై 20 శాతం, 1.5 లక్షల రూపాయలపై బడిన వార్షికాదాయంపై 30 శాతం పన్నును ప్రతిపాదించారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను 20 వేల రూపాయలకు పెంచారు. వార్షికాదాయం 75 వేల రూపాయలుండి, పిఎఫ్‌కు 10 శాతం కంట్రిబ్యూట్ చేస్తున్న ఉద్యోగులకు పన్ను బెడదలేకుండా చేశారు. దాదాపు పదేళ్లపాటు చిదంబరం ప్రవేశపెట్టిన పద్ధతిలోనే పన్ను రేట్లు, శ్లాబులు కొనసాగాయి. 2005-06లో యుపిఎ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఆర్థిక మంత్రి హోదాలో చిదంబరం లక్ష రూపాయల వార్షిక రాబడి వరకు పన్ను మినహాయింపు ప్రకటించారు. శ్లాబులను కూడా మార్చి 2.5 లక్షల రూపాయల పైబడిన ఆదాయం ఉన్నవారిని 30 శాతం పన్ను పరిధిలోకి తెచ్చారు. శ్లాబులను కూడా సవరించి ఆ తర్వాత మరో ఐదేళ్లకు 2010-11లో ప్రణబ్ ముఖర్జీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని 1.6 లక్షల రూపాయలకు పెంచారు. గరిష్ఠ పన్ను రేటును 8 లక్షల రూపాయల పైబడిన ఆదాయం ఉన్నవారికి వర్తింపజేశారు. ఆ తర్వాత సంవత్సరంలోనూ ప్రణబ్ పన్నుల శ్లాబులను సవరించారు. 2 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు పరిమితిని ప్రతిపాదించారు. 2-5 లక్షల రూపాయల మధ్య 10 శాతం, 5 నుంచి 10 లక్షల రూపాయల రాబడులకు 20 శాతం, 10 లక్షల రూపాయల పైబడిన వార్షికాదాయంపై 30 శాతం పన్ను విధించారు. ఆ తర్వాత ఇటీవల వరకు ఇదే ఒరవడి కొనసాగింది. పన్ను మినహాయింపు పరిమితిని మాత్రం పెంచుతూ వచ్చారు.

జైట్లీ టచ్..

2014-15లో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెల్త్‌టాక్స్‌ను ఎత్తివేశారు. దాని స్థానే కోటి రూపాయల పైబడిన ఆదాయం ఉన్న సంపన్నులపై 2 శాతం సర్‌చార్జ్‌ను ప్రతిపాదించారు. గతేడాది బడ్జెట్‌లో 2.5 నుంచి 5 లక్షల రూపాయల మధ్య రాబడిపై పన్నును 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు.

వీటి మాటేమిటి?

జిఎస్‌టితో బడ్జెట్‌కు..పరోక్ష పన్నులకు సంబంధం తెగిపోయింది. ఏ వస్తు, సేవలనైనా జిఎస్‌టిలో చేర్చాలన్నా, తొలగించాలన్నా లేదా పన్ను రేట్లు సవరించాలన్నా జిఎస్‌టి కౌన్సిల్‌దే తుది నిర్ణయం. మరోవైపు జిఎస్‌టి అమల్లోకి వచ్చి ఆరు నెలలవుతోంది. అయినా ఇప్పటికీ కార్పొరేట్ రంగానికి జిఎస్‌టిపై ఇంకా అనేక సందేహాలు. కనీసం ఇవాల్టి బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ కింది సందేహాలను నివృత్తి చేయాలని పన్నుల నిపుణులు కోరుతున్నారు.

పెట్రోల్‌పై జిఎస్‌టి

ప్రస్తుతం పెట్రోల్, డిజిల్ జిఎస్‌టి పరిధిలో లేవు. ఇప్పటికీ వీటిపై వ్యాట్, సిఎస్‌టి అమలవుతోంది. వీటిని ముడి పదార్థాలుగా ఉపయోగించే రంగాలు మాత్రం భారీగా జిఎస్‌టి చెల్లిస్తున్నాయి. దీంతో వీటిని ముడి పదార్థాలుగా ఉపయోగించే కంపెనీలు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పొందలేకపోతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం ఈ బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి పెట్రో ఉత్పత్తులు, నేచురల్ గ్యాస్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవడంపై స్పష్టత ఇవ్వాలి.

రియల్టీ

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆస్తులు మాత్రమే జిఎస్‌టి పరిధిలో ఉన్నాయి. పూర్తయ్యాక అమ్మే ప్రాజెక్టులకు జిఎస్‌టి వర్తించదు. దీంతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌పై అనేక సందేహాలు. వీటిని తెరదించేలా రియల్టీని జిఎస్‌టి పరిధిలోకి తెచ్చేలా ఆర్థిక మంత్రి స్పష్టత ఇవ్వాలి.

ఎస్ఎంఇల కోర్కెల చిట్టా

- రవాణా రంగానికి చెందిన ఎస్ఎంఇల్లో 87.5 శాతం రహదార్ల నిర్మాణానికి దోహదం చేసే 'భారత్‌మాల'వంటి మరిన్ని ప్రాజెక్టులు చేపట్టాలని కోరాయి. రవాణా, లాజిస్టిక్ రంగాలకు చెందిన ఎస్ఎంఇల్లో 88 శాతం కంపెనీలు లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాయి.
- రిటైల్, ఇ-కామర్స్ రంగానికి చెందిన ఎస్ఎంఇల్లో 54 శాతం జాతీయ రిటైల్ విధానం ప్రకటించాలని స్పష్టం చేశాయి. రిటైల్, ఎఫ్ఎంసిజి రంగాలకు ఏకీకృత జాతీయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కూడా 52 శాతం కంపెనీలు కోరాయి.
- పెట్టుబడులు అధికంగా ఉండే కంపెనీలకూ లాభాలతో ముడివడిన ప్రోత్సాహకాలను విస్తరించాలని లోహాలు, మైనింగ్ రంగాలకు చెందిన 43 శాతం ఎస్ఎంఇలు కోరాయి.
- ఆటోమొబైల్ విడిభాగాలపై జిఎస్‌టి భారం మరింత తగ్గించేందుకు ఆర్థిక మంత్రి జైట్లీ కనీసం ఈ బడ్జెట్‌లో అయినా విధాన చర్యలు ప్రకటించాలని ఆ రంగానికి చెందిన 56 శాతం కంపెనీలు కోరుతున్నాయి. అలాగే భారత్ స్టేజ్-6కు మారేందుకు అవసరమైన ప్రోత్సాహకాలు ప్రకటించాలని 88 శాతం ఎస్ఎంఇలు విజ్ఞప్తి చేశాయి.
- పర్యావరణ పరిరక్షణ, ఆధునీకరణకు దోహదం చేసే యంత్రాల దిగుమతిపై సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలని పారిశ్రామిక యంత్రాల విడిభాగాలు తయారు చేసే ప్రతి మూడు కంపెనీల్లో ఒక కంపెనీ కోరుతోంది.



డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహించేందుకు కస్టమర్లతోపాటు సర్వీస్ ప్రొవైడర్లకు బడ్జెట్ ద్వారా మరిన్ని రాయితీలు కల్పించే అవకాశం ఉంది. అయితే, బ్యాంకింగ్ సేవలపై ప్రస్తుతం వసూలు చేస్తున్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించాల్సిన అవసరం ఉంది. మైక్రో ఎటిఎం లావాదేవీలపై చార్జీలను 0.5 శాతం నుంచి మళ్లీ 1 శాతానికి పెంచాలి. ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు సైబర్ సెక్యూరిటీని మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు చేపట్టాలి. మైక్రో ఎటిఎంల ద్వారా జరిపే లావాదేవీలపై జిఎస్‌టిని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలి. తద్వారా పేమెంట్ బ్యాంక్‌లు, ఇతర సంస్థలు తమ సేవలను మరింత విస్తరించేందుకు వీలవుతుంది.
- రిషి గుప్తా, ఫినో పేమెంట్ బ్యాంక్ ఎండి, సిఇఒ



బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పన, విద్య, వ్యవసాయం పైన ప్రధానంగా దృష్టిసారించే అవకాశం ఉంది. ఈసారి ప్రజాకర్షక, వృద్ధికారక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకే అవకాశాలెక్కువ.
- శ్రీనివాస్ ద్రోణంరాజు, విసాఫ్ట్ టెక్నాలజీస్ సిఇఒ



ఈసారి బడ్జెట్‌లో స్టార్టప్ ఇన్వెస్టర్లకు పన్ను రాయితీలతోపాటు ఇతర ప్రోత్సాహకాలు ప్రకటించే అవకాశం ఉంది. దేశంలోని 5వేలకు పైగా స్టార్టప్‌ల్లోకి ఏటా 1500-2000 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు చొప్పించగలిగే వెంచర్ క్యాపిటల్ వ్యవస్థ అవసరం. ఎందుకంటే, చాలా స్టార్టప్‌లు ఫండింగ్ లభించక సతమతమవుతున్నాయి.
- మహేష్ లింగారెడ్డి, స్మాట్రాన్ చైర్మన్



అన్ని రకాల సరుకు రవాణా కార్యకలాపాలకు ఒకే జిఎస్‌టి రేటును వర్తింపజేయాలి. అంతేకాదు, జిఎస్‌టి రిటర్నుల దాఖలు ప్రక్రియను మరింత సరళీకరించాలి. వ్యవసాయంతోపాటు దానికి సంబంధించిన పరిశ్రమలకు ప్రోత్సాహకాలు పెంచడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. పైగా ఎగుమతులకు ఊతం లభిస్తుంది. ఆదాయం పన్ను శ్లాబ్ రేట్లను తగ్గించగలిగితే దేశంలో వినిమయ డిమాండ్‌తోపాటు విదేశీ వాణిజ్యం మరింత పుంజుకునే అవకాశం ఉంటుంది. **- అనిల్ యెండ్లూరి, కృష్ణపట్నం పోర్ట్ సిఇఒ, డైరెక్టర్**

2020కల్లా రూ.3,500 కోట్ల ఆదాయం

- **వ్యాపార విస్తరణకు రెండేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి**
- **రాంకీ ఎన్విరో ఎండి, సిఇఒ గౌతమ్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శాస్త్రీయ పద్ధతిలో వర్థ్యాలను నిర్వహించే సంస్థ రాంకీ ఎన్విరో ఇంజినీర్స్ విదేశీ మార్కెట్లలో శరవేగంగా విస్తరిస్తోంది. గడిచిన ఆరు నెలల్లో విదేశీ మార్కెట్లలో 10-12 కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. రెండేళ్ల తర్వాత ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా రూ.350 కోట్ల మేర ఆదాయం సమకూరవచ్చని సంస్థ అంచనా వేస్తోంది. అమెరికాకు చెందిన మెరైన్ పొల్యూషన్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఎన్ఇఎంఎస్-మార్‌పోల్‌లో 50 శాతం వాటా కొనుగోలు చేసినట్లు రాంకీ ఎన్విరో ఎండి, సిఇఒ గౌతమ్ రెడ్డి వెల్లడించారు. మున్ముందు ఇండోనేషియా, థాయ్‌లాండ్, వియత్నాం, మలేషియా మార్కెట్లపైనాదృష్టిసారించనున్నట్లు బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెప్పారు. దేశీయ, విదేశీ మార్కెట్లలో వ్యాపార విస్తరణ కోసం రూ.900-1,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు గౌతమ్ రెడ్డి తెలిపారు. రుణ సేకరణతోపాటు అంతర్గత వనరుల ద్వారా ఈ నిధులను సమకూర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు.



ఐదేళ్లలో సగం ఆదాయం విదేశాల నుంచే..

గడిచిన ఆర్థిక సంవత్సరం (2016-17)లో సంస్థ రూ.1,500 కోట్ల ఆదాయం ఆర్జించిందని, అందులో మూడో వంతు ఆదాయం విదేశీ మార్కెట్ల నుంచి సమకూరిందని గౌతమ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో ఆదాయం 20 శాతం మేర వృద్ధి చెంది రూ.1,800 కోట్లకు చేరుకోవచ్చని, అందులో విదేశీ మార్కెట్ల వాటా రూ.650 కోట్ల వరకు ఉండవచ్చన్నారు. వచ్చే రెండేళ్లలో (2019-2020)కల్లా సంస్థ ఆదాయం రెండింతలై రూ.3,500 కోట్ల స్థాయికి పుంజుకోవచ్చని గౌతమ్ రెడ్డి అంచనా వేస్తున్నారు. అందులో విదేశీ మార్కెట్ల నుంచి 1000-1,100 కోట్ల రూపాయల వరకు సమకూరవచ్చన్నారు.

హైదరాబాద్‌లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది రాంకీ ఎన్విరో. 20 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ యూనిట్ కోసం రూ.340 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు, మార్చి 2019 కల్లా ఇది పూర్తి కానున్నట్లు గౌతమ్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ తరహా విద్యుత్ ప్లాంట్‌లు మరిన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన చెప్పారు. ఢిల్లీలో ఇప్పటికే 24 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సంస్థ.. మరో 24 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నది.



ఫోర్డ్ యుటిలిటీ వాహనం 'ఫ్రీ స్టైల్'

ఏప్రిల్‌లో మార్కెట్‌లోకి...

న్యూఢిల్లీ: ఫోర్డ్ ఇండియా కాంపాక్ట్ యుటిలిటీ వాహనం ఫ్రీస్టైల్‌ను బుధవారం ఇక్కడ ఆవిష్కరించింది. ఇది ఏప్రిల్ నుంచి మార్కెట్‌లో అందుబాటులోకి వస్తుందని కంపెనీ ప్రకటించింది. దీన్ని భారత్ నుంచే అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేస్తున్నామని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్ అనురాగ్ మెహరోత్రా తెలిపారు. గుజరాత్‌లోని సనంద్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేసి దేశీయ మార్కెట్‌తోపాటు యూరప్, పశ్చిమాసియా మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్టు చెప్పారు. 1.2 లీటర్ల మూడు సిలిండర్ల పెట్రోల్ ఇంజన్, 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్ దీని ప్రత్యేకతలని, ఇది మాన్యువల్, ఆటో ట్రాన్స్‌మిషన్లు రెండింటిలోనూ తయారు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కార్పొరేట్లలో డేటా రక్షణ గుబులు

తేల్చి చెప్పిన ఇవై నివేదిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత కార్పొరేట్ రంగం ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో డేటా రక్షణ, డేటా గోప్యత విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నదని ఎర్నెస్ట్ యంగ్ (ఇవై) సర్వేలో తేలింది. ఈ ఏడాది కార్పొరేట్ రంగం కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీల్లో భారీ పెట్టుబడులు పెడుతుందని ఇవై తాజా నివేదికలో తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో ఆ నివేదికను ఎర్నెస్ట్ యంగ్ గ్లోబల్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ విభాగం హెడ్ ఆండ్రూ గార్డన్, ఇండియా, ఎమర్జింగ్ మార్కెట్స్ హెడ్ అర్పిందర్ సింగ్ విడుదల చేశారు. డేటాకు సంపూర్ణమైన రక్షణ కల్పించాలంటే యూరోపియన్ యూనియన్ రూపొందిస్తున్న సార్వత్రిక డేటా రక్షణ నిబంధనల (జిడిపిఆర్) అమలు ఒక్కటే మార్గమని సింగ్ చెప్పారు. భారత్ ఐటి రంగంలో తిరుగులేని ఆధిపత్యంలో ఉన్నప్పటికీ తమ సర్వేలో పాల్గొన్న వారిలో 60 శాతం మంది జిడిపిఆర్ గురించి తెలియదని చెప్పడం విచారించదగ్గ అంశమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కొత్త నియంత్రణలు వస్తున్న నేపథ్యంలో వ్యాపార సంస్థలు తమ రిస్క్ సామర్థ్యాలను పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. భారత కార్పొరేట్ రంగం గత రెండేళ్లుగా డిజిటల్ కార్యకలాపాల బాటలో పయనిస్తూ ఉండడంతో డేటా నిర్వహణలో కొత్త రిస్క్‌లు ఎదురవుతున్నాయని గార్డన్ చెప్పారు. డేటాకు ఎదురవుతున్న ముప్పును పరిష్కరించడంలో ఫోరెన్సిక్ డేటా అనలిటిక్స్ (ఎఫ్‌డిఎ), కొత్త టెక్నాలజీలు కీలకంగా నిలుస్తాయని ఆయన అన్నారు. తాజా సర్వే ప్రకారం 71 శాతం సంస్థలు డేటా రక్షణ కోసం ఎఫ్‌డిఎను సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నట్టు తేలిందని చెప్పారు. అయితే కంపెనీల గణాంకాల ప్రకటనల్లో అవకతవకలు భారత్‌లో 87 శాతం ఉన్నట్టు సింగ్ తెలిపారు.

శ్రీకాళహస్తి పైప్స్ లాభంలో తగ్గుదల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో శ్రీకాళహస్తి పైప్స్ నికర లాభం రూ.39.47 కోట్లకు తగ్గింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.40.09 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.301.1 కోట్ల నుంచి రూ.398.4 కోట్లకు పెరిగింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో కంపెనీ నికర లాభం 109 కోట్ల రూపాయల నుంచి రూ.113 కోట్లకు వృద్ధి చెందింది. గత డిసెంబరు నెలలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యుఐపి) ద్వారా 250 కోట్ల రూపాయలు సమీకరించినట్టు కంపెనీ హోల్‌టైమ్ డైరెక్టర్ జిఎస్ రాఠి తెలిపారు. కోక్ ఓవెన్ ప్లాంట్, క్యాప్టివ్ పవర్ ప్లాంట్ పూర్తయ్యే దశకు చేరుకున్నాయని, 2018-19 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ప్రారంభంకానున్నట్టు ఆయన చెప్పారు.

హైదరాబాద్‌లో టౌన్ ప్లానర్స్ జాతీయ సదస్సు

- **'అమరావతి'పై ఐటిపిఐని సంప్రదించలేదు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదికవుతోంది. ఫిబ్రవరి 2-4 తేదీల మధ్య 66వ జాతీయ టౌన్ అండ్ కంట్రీ ప్లానర్స్ కాంగ్రెస్ హైదరాబాద్‌లో జరగనుంది. సిఎం కెసిఆర్ ఈ సదస్సు ప్రారంభిస్తారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా (ఐటిపిఐ) ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ జనరల్ ప్రదీప్ కపూర్ విలేకరులతో చెప్పారు. ఎపి, తెలంగాణతోపాటు దేశంలోని 22 రాష్ట్రాల నుంచి ఈ సదస్సుకు 400 మంది ప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకుల అంచనా. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే 65 మంది హాజరయ్యే అవకాశం ఉందని ఐటిపిఐ తెలంగాణ చాప్టర్ చైర్మన్ ఎస్ దేవేందర్ రెడ్డి చెప్పారు. పట్టణ పర్యావరణ ప్రణాళిక, పరిణామాలు, సవాళ్లు, పట్టణ ప్రాంతాల్లో ఎదురవుతున్న వరదల ముప్పు' అనే విషయాలపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నట్టు ఐటిపిఐ గౌరవ అధ్యక్షుడు డిఎస్ మెశ్రామ్ చెప్పారు. హైదరాబాద్ నగరానికి పొంచి ఉన్న వరదల ముప్పుపైనా ఈ సదస్సులో ప్రధానంగా చర్చించబోతున్నారు.

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర అభివృద్ధి ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వం తమను సంప్రదించలేదని మెశ్రామ్ 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చెప్పారు. ఈ ప్రణాళిక అంతా సింగపూర్ ప్రభుత్వ సంస్థే రూపొందించిందన్నారు. చెన్నై, శ్రీనగర్ నగరాలను ముంచెత్తిన వరదల నేపథ్యంలో పట్టణ ప్రణాళికల్లో వరదల ముప్పు ప్రాధాన్యత సంతరించుకుందని మెశ్రామ్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

సెన్సెక్స్ 35965.02 ↓ 68.71 | నిఫ్టీ 11027.95 ↓ 21.95 | బంగారం 30390 ↓ 65 (ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)) | వెండి 39170 | రూపాయి డాలర్ 63.58 ↓ 20 | ముడి చమురు ↑ 68.68

12 | నిజామాబాద్ • గురువారం 1 ఫిబ్రవరి 2018 | andhrajyothibusiness@gmail.com



మందగించిన ఇన్‌ఫ్రా

» డిసెంబరు వృద్ధి నాలుగు శాతమే

న్యూఢిల్లీ: దేశంలో మౌలిక వసతుల విభాగంలోని ఎనిమిది కీలక రంగాల వృద్ధి రేటు డిసెంబరు నెలలో మందగించింది. క్రూడాయిల్, బొగ్గు విభాగాలు ప్రతికూల వృద్ధిని కనబరచడం ఇందుకు కారణమని బుధవారం విడుదలైన అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. గత ఏడాది జూలై తర్వాత కీలక రంగాల్లో నమోదైన తక్కువ వృద్ధి రేటు ఇదే. గత ఏడాది డిసెంబరులో ఈ రంగాలు 5.6 శాతం వృద్ధిని సాధించాయి. ఇన్‌ఫ్రాలోని ఎనిమిది కీలక విభాగాల్లో బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఉన్నాయి. డిసెంబరులో బొగ్గు ఉత్పత్తి 0.1 శాతం క్షీణించగా క్రూడాయిల్ ఉత్పత్తి 2.1 శాతం పడిపోయింది. ఉక్కు రంగంలో 2.6 శాతానికి, విద్యుత్ రంగంలో 3.3 శాతానికి వృద్ధిరేటు మందగించింది. గత డిసెంబరులో ఈ రంగాలు సాధించిన వృద్ధి 15.9 శాతం, 6.4 శాతంగా ఉంది. అయితే రిఫైనరీ ఉత్పత్తులు, సహజవాయువు, ఎరువులు, సిమెంట్ విభాగాల్లో ఆరోగ్యకరమైన వృద్ధి నమోదయింది. దేశంలో మొత్తం ఫ్యాక్టరీ ఉత్పత్తిలో ఈ కీలక రంగాల వాటా 41 శాతం ఉన్నందు వల్ల వాటి వృద్ధిలో ఏర్పడే హెచ్చుతగ్గుల ప్రభావం పారిశ్రామికోత్పత్తి సూచీపై పడుతుంది.

సిమెంట్ రంగంలో వృద్ధి అంతంతే...

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ రంగంలో వృద్ధి మందగించిందని, ఏడాది మొత్తం మీద ఈ రంగం రెండు శాతం వృద్ధికే పరిమితం కావచ్చునని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. జీఎస్‌టీతో పాటు ఇసుక కొరత, రియల్టీలో కార్యకలాపాలు మందంగా ఉండడం సిమెంట్ డిమాండు తగ్గడానికి కారణమని తేల్చి చెప్పింది. నెలవారీ వినియోగం పరిశీలిస్తే గత నవంబరు నెలలో సిమెంట్ వినియోగం 0.5 శాతం మాత్రమే పెరిగిందని పేర్కొంది. ఏప్రిల్-నవంబరులో సిమెంట్ ఉత్పత్తి నామమాత్రంగా 0.6 శాతం పెరిగినట్టు తెలిపింది. రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం వల్ల నిర్మాణ రంగ కార్యకలాపాలు మందగించాయి.

కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం రూ.172 కోట్లు

చెన్నై: మురుగప్ప గ్రూపునకు చెందిన ఎరువుల కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ అనుబంధ సంస్థలతో కలుపుకుని (కన్సాలిడేటెడ్) రూ.2,707 కోట్ల ఆదాయంపై రూ.172 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.2,283 కోట్ల ఆదాయంపై రూ.112 కోట్ల నికర లాభం ఆర్జించింది. అనుబంధ కంపెనీలను మినహాయిస్తే డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.2,706 కోట్ల ఆదాయంపై రూ.172 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే మూడో త్రైమాసికంలో ఆదాయం రూ.424 కోట్లు, నికర లాభం రూ.59 కోట్లు పెరిగాయి. 'ప్రభుత్వం వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, సాధారణ వర్షపాతం నమోదవడం మూడో త్రైమాసికంలో కంపెనీకి బాగా కలిసొచ్చాయి. నాలుగో త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆశిస్తున్నాం' అని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎండి సమీర్ గోయల్ చెప్పారు. చైర్మన్ పదవి నుంచి తప్పుకున్న ఎ వెల్లయన్ విజ్ఞప్తిని బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఆమోదించింది. ఆయన స్థానంలో ఎంఎం మురుగప్పన్‌ను డైరెక్టర్ల బోర్డు చైర్మన్‌గా ఎన్నుకుంది.

వాల్‌మార్ట్ చేతికి ఫ్లిప్‌కార్ట్ వాటా?

న్యూఢిల్లీ: దేశీయ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో 15-20 శాతం వాటా కొనుగోలుకు వాల్‌మార్ట్ సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. ఈ మధ్య భారత్‌కు వచ్చిన వాల్‌మార్ట్ గ్లోబల్ సిఇఒ డౌ మెక్‌మిలన్, బెంగుళూరులోని ఫ్లిప్‌కార్ట్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారని ఈ వ్యవహారం గురించి తెలిసిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ 100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.6,400 కోట్లు) వరకు పెట్టుబడి పెట్టే అవకాశం ఉందని వారు చెప్పారు. వాల్‌మార్ట్ డీల్ ద్వారా ఫ్లిప్‌కార్ట్ ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు సరఫరా వ్యవస్థను, వస్తు సేకరణ, ఉత్పత్తుల వర్గీకరణ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసేందుకు వీలవుతుంది. అలాగే, వాల్‌మార్ట్‌కు దేశీయ ఇ-కామర్స్ రంగంలోకి ఎంట్రీ లభిస్తుంది. శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న భారత ఇ-కామర్స్ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా 3,300 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా. మార్కెట్ ఊహాగానాలపై స్పందించేందుకు నిరాకరించిన వాల్‌మార్ట్ ఇండియా ప్రతినిధి.. భారత్‌లో వ్యాపార విస్తరణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు.

ఇరు వర్గాలకు ప్రయోజనం

అమెజాన్‌తో అమీతుమీ

అమెరికన్ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల మధ్య తీవ్రపోటీ నెలకొంది. అగ్రపీఠం కోసం పోటీలో ఇరు సంస్థలు వేల కోట్ల పెట్టుబడులు గుమ్మరిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫ్లిప్‌కార్ట్ 400 కోట్ల డాలర్ల నిధులు సేకరించింది. జపాన్ టెక్నాలజీ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ 250 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేయగా.. టాన్సెంట్, మైక్రోసాఫ్ట్, ఇ-బే మరో 140 కోట్ల డాలర్లు సమకూర్చాయి. ఇక అమెజాన్ ఇండియాకు మాతృ సంస్థ నుంచి రూ.8 వేల కోట్ల నిధులు లభించాయి.



నష్టాల్లోనే మార్కెట్

» బడ్జెట్ నేపథ్యంలో వేచిచూసే ధోరణి

» 36000 దిగువకు సెన్సెక్స్

ముంబై: బడ్జెట్ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. స్టాక్ మార్కెట్లపై ఆర్థిక సర్వే చేసిన వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లు యాక్టివ్ ట్రేడింగ్‌కు దూరం ఉన్నారు. మంగళవారం 249 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసిన సెన్సెక్స్ బుధవారం నాడూ బలహీనంగానే ఉంది. ట్రేడింగ్ ప్రారంభంలో లిప్తకాలంపాటు లాభాల్లోకి వచ్చినా ఆ తర్వాత అంతా నెగెటివ్ జోన్‌లోనే ఉంది. మధ్యాహ్నం సెషన్‌లో భారీ నష్టాలతో కలవరం సృష్టించినప్పటికీ ఆఖరులో కోలుకొని 68 పాయింట్ల నికర నష్టంతో 35965 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 36000 కీలక స్థాయి ఎగువన నిలదొక్కుకోలేకపోయింది. నిఫ్టీ నికరంగా 21 పాయింట్లు నష్టపోయినప్పటికీ 11000 ఎగువన నిలబడింది. నిఫ్టీ 11027 వద్ద ముగిసింది. మార్కెట్ భవిష్యత్ గమనాన్ని గురువారం నాటి బడ్జెట్ ప్రతిపాదనలు నిర్ణయిస్తాయని విశ్లేషకులు అంటున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి బడ్జెట్ విషయంలో మార్కెట్‌వర్గాల్లో భారీ అంచనాలు, ఆశలు ఏమీ కనిపించడం లేదు. ద్రవ్యలోటు కట్టుదప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఆర్థిక సంస్కరణలను మరింత ముందుకు తీసుకుపోయే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. గ్రామీణ ఆర్థిక రంగం, మౌలికవసతులు, కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయం పన్నుల రేట్లు.. వీటిపై బడ్జెట్ ఫోకస్ ఉంటుందన్న అభిప్రాయం ఆయన వ్యక్తం చేశారు.

- సెన్సెక్స్ ఇంట్రాడేలో 35818 పాయింట్ల కనిష్ఠ స్థాయిని 36050 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది.
- జనవరిలో సెన్సెక్స్ 1908 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 497 పాయింట్లు దూసుకుపోయింది.
- సెన్సెక్స్‌లో డాక్టర్ రెడ్డీస్ అత్యధిక నష్టాలను చవిచూసింది. షేరు ధర దాదాపు 4 శాతం పతనమైంది. టాటా స్టీల్, హెచ్‌యుఎల్, సన్ ఫార్మా, కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, ఐటిసి, టిసిఎస్ నష్టాలతో ముగిసాయి.
- ఫార్మా, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసిజి, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు జోరుగా సాగాయి.

ఐసిఐసిఐ బ్యాంక్ లాభంలో 32 శాతం తగ్గుదల

ముంబై: క్యూ3లో ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు అంచనాలను నిరాశ పరిచాయి. ఈ కాలానికి బ్యాంక్ రూ.1,650 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం 32 శాతం పడిపోయింది. ఈ కాలానికి బ్యాంక్ రూ.1,954 కోట్ల నికర లాభం ఆర్జించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. గత ఏడు త్రైమాసికాల్లో ఐసిఐసిఐ బ్యాంక్ నికర లాభం ఎన్నడూ ఇంత తక్కువ స్థాయికి పడిపోలేదు. అనుకున్న స్థాయిలో రుణాల వృద్ధి లేకపోవడం, ప్రభుత్వ రుణ పత్రాల్లో పెట్టుబడి ద్వారా వచ్చే ట్రెజరీ ఆదాయం పడిపోవడం, ఎన్‌పిఎల కేటాయింపుల భారం పెరగడం ఇందుకు కారణమని బ్యాంక్ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17) మూడో త్రైమాసికంలో 7.87 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పిఎల భారం డిసెంబరునాటికి 7.82 శాతానికి తగ్గాయి. అయినా బ్యాంక్ నికర లాభం భారీగా తగ్గడం విశేషం. దివాలా చట్టం కింద కేటాయింపుల భారం పెరగడం ఇందుకు ప్రధాన కారణమని బ్యాంక్ సిఇఒ చందా కొచ్చార్ చెప్పారు.

వేదాంత లాభం రూ.2,173 కోట్లు

ముంబై: అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.2,173 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 1.8 శాతం మాత్రమే ఎక్కువ. అయితే ఇదే కాలంలో అనుబంధ కంపెనీలతో కలిపి కంపెనీ రూ.24,934 కోట్ల ఆదాయం ఆర్జించింది. ప్రస్తుతం కమొడిటీస్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మరింత బాగుంటాయని ఆశిస్తున్నట్టు కంపెనీ సిఇఒ కులదీప్ కౌరా చెప్పారు.

కీలక మద్దతు స్థాయిలో...

టెక్ వ్యూ

నిఫ్టీ మరింత బలహీనత ప్రదర్శించినా రికవరీ సాధించి చివరికి 20 పాయింట్ల స్వల్ప నష్టంతో క్లోజయింది. స్వల్పకాలిక మద్దతు స్థాయికన్నా పైన క్లోజ్ కావడం వల్ల అప్‌ట్రెండ్ ఆశలు సురక్షితంగా ఉన్నాయి. 20 డిఎంఎ కన్నా చాలా పైనే ఉన్న ఇండెక్స్ 10 డిఎంఎ వద్ద మద్దతు తీసుకుంటోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 11100 **మద్దతు :** 11000

- మరింత రికవరీని ప్రదర్శిస్తే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించడానికి ప్రధాన నిరోధం 11100 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. అప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.
- రియాక్షన్‌లో పడినా 11000 వద్ద కోలుకుని తీరాలి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.
- బ్యాంక్ నిఫ్టీకి 27500 వద్ద నిరోధం ఎదురవుతోంది. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

బడ్జెట్ కీలకం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ పాడ్యమి **నక్షత్రం :** ఆశ్లేష

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 11027.70 (-21.95)

ట్రెండ్ మార్పు వేళలు : 9.40; 3.05

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 12.20 వరకు అదే ధోరణి ప్రదర్శిస్తూ తదుపరి 2.15 వరకు నిస్తేజంగా ఉండి చివరిలో మెరుగ్గా మారే ఆస్కారం ఉంది. మార్కెట్ కదలికలకు బడ్జెట్ కీలకం.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 గంటల తర్వాత తిరిగి ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 11070, 11105

మద్దతు స్థాయిలు : 10985, 10930

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in


బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 8.8(9.25)1798
AGRO TECH FO 649.1(652.45)1421
AISHWARYA TE 8.6(8.98)6445
ALPHAGEO (I) 910(907.5)2863
ALU FLUORIDE 122.8(129.25)7667
AMAR RAJA BA 807.75(812.1)31380
ANDHRA BANK 52.6(53.15)450838
ANDHRA CEMEN 13.03(12.46)58293
ANDHRA PETRO 70.45(69.25)300385
ANJANI PORTL 225.1(228.15)3790
ASTRA MICRO 114.3(113.75)103833
AUROB.PHARMA 629.5(631.15)117903
AVANTEL LTD 538.9(553.2)12009
AVANTI FEEDS 2223.95(2271.65)15786
B.N.RATHI SE 42.6(43.05)5241
BALAJI AMINE 656.4(682.15)20917
BAMBINO AGRO 272.65(285.2)5118
BARTRONICSIN 14.04(14.1)16656
BHAGIRA.CHEM 299.15(305.05)4144
BHAGYA INL 41.55(42.25)11440
BHARATFIN 1050.75(1023.9)377050
BNR UDYOG 31.5(30)388
CAMBRIDGE 84.8(86.25)9678
CCHHL 16.25(16)15111
CCL PRODUCTS 294.8(285.25)8165
CELESTIAL 18.05(18.05)7745
CIL SECURITS 33.9(34.8)2165
COROM INTER 552.5(528.35)25527
CUBEX TUBING 26.45(25.4)2020
CYBERMATE 3.67(3.63)27521
CYIENT 642.45(627.35)41095
DANLAW TECH. 89.3(93.8)10169
DECAN CEMENT 574.2(579.45)122
DHAN ROTO SP 40.5(41.7)6709
DIAMONPOWER 18.35(18.55)33465
DIVI'S LAB. 1036.45(1084.85)65870
DIVYA.GRANIT 112.05(110)1490
DQ ENT 17.15(17.1)8126
DR.REDDY'S 2225.25(2312)132603
EMPEE SUGARS 4.57(4.38)2860
EVEREST ORG. 144(146.9)516
FACOR ALLOYS 3.8(3.86)55797
FIRSTOBJ 16.45(14.45)16068
GATI LTD. 130.55(129.95)266158
GAYATRI BIO 10.5(10.04)1020
GAYATRI PROJ 207.65(210.2)6262
GENNEX LAB 4.68(4.79)238642
GMR INFRASTR 21.75(22.1)3941814
GODAVARI DRU 36.25(36.95)2754
GOLDST INFRA 224.6(224.25)41710
GOLDSTONE EN 15.1(14.5)5810
GRANULES (I) 132.2(132.5)141592
GVK POWERINF 20.55(20.75)588530
HBL P SYS 61.1(61.9)123563
HERITGFOOD 758.55(768.5)1607
HIND.FLUROCA 14.2(14.92)5132
HINDUSTN BIO .7(.69)200
I.C.S.A. IND 4.29(4.09)155588
IKF TECHNO 1.04(.95)1929992
INCAP LTD. 103.2(103.5)2459
IPAPPM 348.8(346.15)23943
IVRCL LTD 5.31(5.35)96023
KAKATIYA CEM 366.45(365.45)9353
KAKATIYA TEX 2.63(2.63)14
KALLAM SPG. 22.15(21.6)13648
KARAN WOO-SN 1.81(1.73)400
KAVERI SEED 515.45(488.1)92188
KCP LTD 145.7(145.4)25346
KERNEX MICRO 54.4(55.15)61409
KNR CONST 307.45(312.95)13918
KREBS BIOCHM 143.95(140.9)761
LANCO INFRA 1.6(1.53)8754740
LOKESH MACH 69.25(69.55)8164
LOTUS CHOC 52.1(54.35)13491
MADHUCON PRJ 32(32.2)21304
MOLD-TEK TEC 67.65(70.35)5290
MOSCHIP SEMI 36.9(38.5)115803
MSR INDIA 36.65(37.4)8583
N C L IND. 274.85(267.5)7733
NACLIND 55.45(54.25)30975
NATCO PHARM 944.3(965.6)47669
NCC 122.6(125.25)419943
NEHA INTER. 7.73(7.9)15189
NETTLINX LTD 91.65(89.95)30299
NEULAND LAB. 836.65(840.9)1125
NIHAR INFO 14.5(14.49)480
NILE LTD. 907.2(928.4)3380
NTL 4.55(4.64)4395
OIL COUNTRY 50.7(51.75)7040
PADMALAYA TE 5.54(5.76)11334
PALRED 98.95(103.2)3322
PANYAM CEMEN 57.15(57.25)17653
PENNAR STEEL 61.15(61.25)79280
PFL INFOTECH 11(11)4990
PHYTOCHEM I. 71.1(74.9)16070
PITTI LAMIN. 86.25(84.6)9062
POKARNA LTD 219.35(218.2)4853
PRAJAY ENGS. 15.45(14.72)55179
PREMIER EXPL 424.15(426.95)886
PRISM CEMENT 138.45(137.85)151503
RAIN 380.9(395.65)496029
RAJ PACKAGIN 39.45(39)1327
RAJVIR IND 44(45)124
REG.CERAMIC 6.6(6.6)3191
RESTILE CER. 7.34(7.79)7150
SAGAR CEM. 992.3(999.8)1303
SAMKRG PIST. 313(324.15)14410
SAMPRE NUTRI 69.05(69.8)4234
SANGHI IND. 124.35(121.7)88458
SATVAH.ISPAT 27.75(27.4)5960
SAVEN TECHNO 22.15(22.7)705
SIBAR AUTO 20.54(19.57)18754
SMPL 1.57(1.6)6090
SMS PHARMACE 97.7(99.35)18899
SREE RAYALA 186.75(193.15)3600
STEEL EXCH 32.6(33.15)38142
SUJANA INDUS 1.12(1.07)135796
SURANATP 5.94(5.75)7832
SURYACHAKRA 1.67(1.63)28397
SURYAMBA SP 71.3(75)2013
SURYAVA SPIN 7.46(7.34)4561
SURYLAK.COTT 90.25(90.25)7798
SUVEN LIFE S 214.3(224.4)300279
TAJ GVK HOTL 176.35(177)29873
TANLA 33.95(33.75)183980
TCI INDUS. 951(1000)3
TRANSCORP IN 42.1(43.65)6220
TRANSGENE BI 2.3(2.36)6180
TRANSPORT CO 278.4(276.9)8518
USHER AGRO 7.95(7.87)5526
VICEROY HOTE 17.5(17.7)116038
VIJAY TEXTIL 59.2(59.85)20085
VIMTA LABS 209.55(212.55)41717
VIRAT CRANE 47.55(48.15)4613
VIRINCHI 127.4(127.7)31866
VISAKA IND. 743.6(740.05)56866
VISTA PHARMA 41.7(42.3)106142
VIVIMED LABS 86.15(84.75)328680
VST INDUS. 3250.05(3313.55)352
WATERBASE 273.65(288.05)335301
XLENERGY 3.81(3.93)10664
YBRANTDIGI 6.11(6.22)280127
ZEN TECH 120.7(122.75)23416
ZENOTECH 46(46.15)6195

ఎన్‌ఎస్‌ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 624.95(642.2)8557
AARTIIND 1056.75(1028.65)40022
ABAN 211(213.5)1363558
ABB 1653.2(1605.8)125376
ABFRL 163.05(160)636498
ABGSHIP 12.05(12.45)28940
ACC 1715.25(1728.1)335683
ADANIENT 213.2(211.3)7732419
ADANIPORTS 428.85(428.25)2734628
ADANIPOWER 36.65(37.45)10959615
ADANITRANS 208.9(209.15)889978
AEGISCHEM 249(252.6)341415
AHLUCONT 350.5(351.35)93180
AIAENG 1535.85(1564.15)27039
AJANTPHARM 1451.55(1447.95)182964
AKZOINDIA 1841.3(1860.75)12160
ALBK 66.8(68.15)2829122
ALLCARGO 193(195.9)251948
ALOKTEXT 3.55(3.6)3987166
AMARAJABAT 810.1(811.25)297406
AMBUJACEM 261.8(261.5)2708846
AMTEKAUTO 25.2(25.35)330155
ANANTRAJ 66.7(66.25)1324342
ANDHRABANK 52.55(53.25)3495843
APARINDS 736.45(760.75)90962
APLLTD 567.1(555.25)488735
APOLLOHOSP 1162.8(1140.05)495268
APOLLOTYRE 254.85(258.45)3531429
ARVIND 413.35(424.9)3019180
ASHIANA 199.5(189.55)531187
ASHOKA 227(223.45)244219
ASHOKLEY 126.1(125.75)10040333
ASIANPAINT 1128.3(1126.7)961596
ASTRAL 798.75(774.25)19686
ASTRAZEN 1136.45(1121.4)2398
ATUL 2712.45(2802.8)13807
AUROPHARMA 629.55(631.7)1877445
AVANTIFEED 2217.15(2274.8)93603
AXISBANK 593.6(593.75)7108060
BAJAJ-AUTO 3337.15(3358.3)275934
BAJAJCORP 492.1(505)24013
BAJAJELEC 488.1(495.2)211283
BAJAJFINSV 4812.35(4875.65)220161
BAJAJHIND 14.15(14)4833991
BAJAJHLDNG 2808.45(2800.65)33221
BALKRISIND 1141.85(1155.65)805923
BALLARPUR 15.7(14.85)3117392
BALMLAWRIE 239.85(246.7)139979
BALRAMCHIN 122.15(119)4209664
BANKBARODA 156.8(160.2)13420760
BANKINDIA 157.2(161.7)4510152
BASF 2128.35(2136.3)10798
BATAINDIA 705.95(712.55)291368
BBTC 1399.95(1423.05)121189
BEML 1454.6(1478.25)239302
BERGEPAINT 250.35(252.1)478844
BFUTILITIE 483.85(481.55)376759
BGRENERGY 132.8(133.25)61445
BHARATFIN 1051.65(1024.65)1458271
BHARATFORG 717.1(721.1)1869666
BHARTIARTL 439.85(440.6)6371320
BHEL 100.2(101.6)12559349
BHUSANSTL 51.15(49.9)6514554
BIOCON 614.9(629.95)2622093
BIRLACORPN 1127.8(1141.95)84086
BLISSGVS 205.7(207.6)534132
BLUEDART 4681.85(4631.9)15058
BLUESTARCO 751.2(744.3)21351
BOMDYEING 228.15(231.25)1979490
BOSCHLTD 19400.25(19495.55)34590
BPCL 492.3(485.6)6111327
BRFL 71.1(74.8)266378
BRIGADE 285.4(280.05)67628
BRITANNIA 4684.15(4705.6)71887
CADILAHC 425.8(425.3)1240632
CANBK 341.35(349.4)2526706
CAPF 738.1(743.85)678722
CARERATING 1361.15(1370.05)79059
CASTEXTECH 5.35(5.35)387546
CASTROLIND 185.4(184.15)2949770
CCL 294.85(290.4)118233
CEATLTD 1820.85(1840)351894
CENTRALBK 73.05(73.35)197162
CENTURYPLY 321.15(324.45)191530
CENTURYTEX 1388.25(1397.6)428050
CERA 3472.85(3533.85)24709
CESC 1054.75(1067.25)260836
CHAMBLFERT 160.35(155.95)739353
CHENNPETRO 413.7(417.2)310170
CHOLAFIN 1286.05(1287.7)403468
CIPLA 592.15(605.95)1264055
CLNINDIA 636.75(639.6)54453
COALINDIA 299.55(305.9)5198298
COLPAL 1121.35(1138.6)86920
CONCOR 1390.3(1380)312099
COROMANDEL 554.6(529.4)291288
CORPBANK 38.65(38.9)210433
COX&KINGS 249.75(254.85)168758
CRISIL 1938.55(1953.25)7538
CUB 158.7(163.35)805319
CUMMINSIND 903.9(909.2)212326
CYIENT 641.85(622.45)965938
DABUR 355.6(358.6)4361853
DALMIABHA 2935.25(2941.2)173458
DBCORP 326.05(335.45)56261
DBREALTY 61.1(62.95)933027
DCBBANK 173.45(178.5)1062687
DCMSHRIRAM 572.8(581.4)133953
DEEPAKFERT 398.55(401.7)203904
DELTACORP 345.8(354)2592157
DEN 110.5(111.15)445694
DENABANK 25.1(25.1)1688090
DHANUKA 756.95(769.8)49191
DHFL 582.2(588.45)2034304
DISHTV 75.2(75.15)3397963
DIVISLAB 1039.4(1079.9)960918
DLF 250.1(253.9)6309912
DREDGECORP 764.75(694.2)2474569
DRREDDY 2225.35(2306.15)1143907
DYNAMATECH 1859.4(1860)3003
ECLERX 1509.3(1531.25)161615
EDELWEISS 280.7(289.75)3671514
EICHERMOT 26923.6(26689.4)137766
EIDPARRY 328.45(325.2)228555
EIHOTEL 191.3(198.9)269869
ELECTCAST 33.95(34.55)306260
ELGIEQUIP 309.9(314.7)79741
EMAMILTD 1124.75(1142.6)557660
ENGINERSIN 177.5(172.95)4122602
EROSMEDIA 202.2(203.7)490068
ESCORTS 811.75(832.9)2953781
ESSDEE 69.8(73.4)26132
ESSELPACK 284.75(292)186229
EVEREADY 413.45(417.4)83797
EXIDEIND 223.35(225.45)2045295
FCONSUMER 63.2(65.4)3965934
FDC 230.7(237.4)58126
FEDERALBNK 100.45(100.65)10362003
FINCABLES 735.05(730.55)63825
FINPIPE 646.6(640.4)28777
FLFL 370(380.75)178984
FORTIS 139.05(146.9)18945343
FSL 41(41.65)2399550
GAIL 478.6(476.1)2470120
GATI 130.3(130.2)1321671
GDL 229.15(230)278148
GEPIL 939.7(934.9)14125
GESHIP 401.25(403.8)35892
GET&D 431.6(413.75)119617
GILLETTE 6554.75(6704.5)10575
GLAXO 2460.6(2456.3)10599
GLENMARK 606.2(615.8)667577
GLOBOFFS 34.5(34.1)19568
GMDCLTD 146.9(147.7)157892
GMRINFRA 21.75(22.05)40644926
GODFRYPHLP 922.7(959.4)99428
GODREJCP 1053.4(1057.7)2353345
GODREJIND 607.5(606.2)592098
GODREJPROP 799.6(804.35)163075
GPPL 144.1(147.1)235724
GRANULES 132.25(132.7)1569827
GREAVESCOT 138.5(139.8)423351
GREENPLY 344.3(357.55)50791
GRINDWELL 516.65(531.15)28694
GRUH 584.85(578.7)641058
GSFC 144.7(145.05)1467465
GSKCONS 6642.65(6540.55)19756
GSPL 202.85(203.4)328545
GUJFLUORO 833.2(841.7)53317
GUJGASLTD 835.75(853)30170
GULFOILLUB 900.6(907.85)13025
GVKPIL 20.7(20.65)1614693
HATHWAY 40.25(40.05)826208
HAVELLS 522.35(552.85)7290911
HCC 39.3(39)9150088
HCL-INSYS 53.7(53.9)1914382
HCLTECH 986.55(1000.4)1610572
HDFC 1956.3(1937.5)3665385
HDFCBANK 2005.7(1995.5)1735837
HDIL 57.85(58.35)10431969
HEIDELBERG 155.9(156.35)113921
HEROMOTOCO 3691.45(3687.85)558327
HEXAWARE 381.4(382.75)1189566
HFCL 29.2(29.55)5983811
HIMATSEIDE 350.9(351.65)248871
HINDALCO 256.15(253.55)17514495
HINDCOPPER 85(84.95)3085286
HINDPETRO 397.7(393)6975667
HINDUNILVR 1369.35(1400.25)1491912
HINDZINC 310.25(310.9)3717227
HMT 37.05(37.3)13029
HMVL 252.35(255.35)9512
HONAUT 16903.55(16988.6)525
HOTELEELA 21.75(22.25)566648
HSIL 433.75(446.1)62457
HTMEDIA 98.55(101.55)369741
IBREALEST 215.7(216.45)7682490
IBULHSGFIN 1390.95(1415)1337755
ICICIBANK 352.95(353.25)22638319
ICRA 3965(3953.25)1586
IDBI 60.45(60.85)5451521
IDEA 93.1(94)15241120
IDFC 56.35(56.8)6053179
IFBIND 1269.25(1296.65)20540
IFCI 28.5(28.7)12430346
IGARASHI 833.4(840.25)5573
IIFL 729.45(714.3)342915
IL&FSTRANS 77.5(79.3)385691
INDHOTEL 138.2(143.55)910191
INDIACEM 168.15(169.35)3856780
INDIANB 362.6(368.55)802290
INDOCO 274.55(276.25)107809
INDUSINDBK 1753.1(1736.05)1237098
INEOSSTYRO 978.75(995.95)5881
INFRATEL 351.55(344.45)3997015
INFY 1150.25(1170.65)4606849
INGERRAND 776(787.8)14312
INOXLEISUR 276.95(272.6)338127
INOXWIND 129.8(131.55)81823
INTELLECT 177.9(161.7)1781205
IOB 22.65(22.65)534555
IOC 417.6(416.25)13503235
IPAPPM 350(346.3)83031
IPCALAB 574.5(562.7)172027
IRB 241.2(243.45)2097510
ITC 271.4(275.2)18945945
J&KBANK 74.2(74.1)456669
JAGRAN 173.4(173)78107
JAICORPLTD 182(172.05)4547395
JBCHEPHARM 307.3(311.75)32860
JBFIND 181.1(190.8)97383
JCHAC 2522.3(2478.9)7990
JETAIRWAYS 753.65(762.4)2047730
JINDALPOLY 348.45(349.15)83948
JINDALSTEL 266.45(268.35)11086304
JISLJALEQS 139.95(144.7)17730695
JKCEMENT 1114.9(1121.85)24664
JKIL 332.1(315.1)211587
JKLAKSHMI 411.75(413.15)557088
JKTYRE 175.15(176.1)695661
JMFINANCIL 163.15(162.05)2537488
JPASSOCIAT 20.3(20.35)42105203
JPINFRATEC 15(14.95)1697712
JPPOWER 7(7.05)1698388
JSWENERGY 87.6(87.3)5988050
JSWHL 1707.15(1699)27500
JUBILANT 913.35(928)1190586
JUBLFOOD 2043.2(2138.25)1180069
JUSTDIAL 516.1(518.7)5898670
JYOTHYLAB 365.1(364.6)62553
KALPATPOWR 443.9(465.6)229469
KANSAINER 510.1(484.95)387850
KEC 351.55(351.25)254189
KESORAMIND 138.8(136.75)391804
KIRLOSENG 381(390.15)21583
KITEX 289.3(294.65)39344
KOLTEPATIL 365.45(359.35)206865
KOTAKBANK 1108.95(1088.05)3143011
KPIT 211.6(219.35)4002772
KRBL 614.9(611.45)139547
KSCL 515.5(487.05)1146592
KSK 15.25(15.95)1035961
KTKBANK 147.5(148.4)2413820
KWALITY 100(97.95)596866
L&TFH 172.6(176.05)5245741
LAKSHVILAS 127.9(131.75)3311323
LAOPALA 616.2(613)21628
LAXMIMACH 6023.05(6104.85)2502
LICHSGFIN 534.95(537.6)2992832
LITL 1.7(1.65)21105265
LT 1416.5(1429.9)2614515
LUPIN 883.75(902.75)1590192
M&M 763.05(764.9)2242045
M&MFIN 463.5(472.85)2968098
MAGMA 158.5(161.95)68460
MAHINDCIE 221.3(225)216325
MAHLIFE 501.45(490.8)58538
MANAPPURAM 110.95(113.5)4801845
MANPASAND 377.5(381.2)252264
MARICO 309.4(315.45)721880
MARKSANS 40.3(40.85)4327083
MARUTI 9509.7(9571.55)462650
MAYURUNIQ 493.05(506.2)42314
MCDOWELL-N 3285.6(3281.15)434481
MCLEODRUSS 170.4(174.85)246034
MERCK 1451.45(1496.35)17183
MHRIL 330.6(346.6)144484
MINDACORP 199.6(201.05)184533
MINDTREE 770(764.45)1590667
MMTC 61.35(60.6)2075608
MOIL 242.45(244.2)396500
MONSANTO 2568.55(2573)9953
MOTHERSUMI 365.8(362.3)1984871
MOTILALOFS 1285.7(1232.45)133383
MPHASIS 894.85(883.35)526609
MRF 68113.35(68261.55)8102
MRPL 128.95(129.05)2040743
MTNL 25.2(25.8)1393281
MUTHOOTFIN 415.25(422.25)471658
NATCOPHARM 946.9(965.65)281124
NATIONALUM 75.3(75.5)14390601
NAUKRI 1351.55(1370)260048
NAVKARCORP 178.85(184.2)428044
NCC 122.5(125.15)4443696
NETWORK18 55.85(53.75)2618297
NHPC 29.45(29.9)5433820
NIITTECH 856.15(858.75)1069232
NITINFIRE 6.25(6.4)308078
NLCINDIA 103.8(103.6)354659
NMDC 140.3(143.7)5265833
NTPC 170.25(170.3)6517115
OBEROIRLTY 528.8(526.05)834203
OFSS 4182.65(4121.35)35226
OIL 358.95(359.45)399404
OMAXE 228.95(228)178426
ONGC 203.45(204.8)11990243
ORIENTBANK 115.65(117.15)4623839
ORIENTCEM 151.6(153.05)126786
ORISSAMINE 1839.6(1854.55)5548
PAGEIND 21459.75(21663.35)10914
PARSVNATH 23.95(24.05)84346
PCJEWELLER 485.35(521.1)9928536
PEL 2743(2766.95)233914
PERSISTENT 787.85(780.55)646927
PETRONET 254.75(257.9)7215527
PFC 116.8(117.35)5522906
PFIZER 2320.85(2290)60446
PFS 34.9(35.15)919094
PGHH 9271.7(9310.6)3676
PHOENIXLTD 653.6(635.85)71083
PIDILITIND 896.3(885.95)709011
PIIND 890.85(914.8)52854
PNB 171.35(172.65)15313331
POLARIS 410.25(410.75)962450
POWERGRID 193.8(194.95)8084501
PRAJIND 106.65(105.9)894605
PRESTIGE 322.8(315.9)1551929
PRISMCEM 138.35(138.15)1099340
PTC 105.35(106.15)1031411
PUNJLLOYD 22.9(22.9)1490350
PURVA 150.6(152.55)645253
PVR 1460.6(1422.9)679906
RADICO 361.5(364)2410426
RAIN 380.55(395.9)3073275
RAJESHEXPO 821.45(819.3)502494
RALLIS 250.25(246.95)397841
RAMCOCEM 758.25(767.55)138456
RAMCOSYS 498.4(503)20035
RATNAMANI 1028.7(1049.95)6261
RAYMOND 1049.7(1078.95)577998
RCF 97.75(93.95)4938945
RCOM 29.45(30.05)117149717
RECLTD 155.5(156.8)3294640
REDINGTON 178.5(184)158369
RELAXO 622.15(635.6)14868
RELCAPITAL 491.1(502.3)4701616
RELIANCE 961.3(950.4)5738209
RELINFRA 496.35(508.3)2647818
RENUKA 15.5(15.4)2011121
REPCOHOME 624.2(643.2)277137
RIIL 540.9(527.55)1064259
RKFORGE 778.9(795.45)55829
RNAVAL 46(49.2)8193464
ROLTA 67.9(68.85)1144352
RPOWER 45.75(47.2)12683291
RTNPOWER 7.2(7.2)6148372
RUCHISOYA 17.1(17.05)687175
SADBHAV 407.5(411.7)358722
SADBHIN 144.9(143.25)198133
SAIL 88.9(91.1)13643595
SANOFI 4971.45(4960.05)9800
SBIN 313.25(313.55)16409938
SCHAEFFLER 5488.7(5508.05)6670
SCHNEIDER 119.1(120.55)65737
SCI 81.05(80.3)896699
SHARDACROP 436.8(430.15)26938
SHILPAMED 568.6(582.2)24715
SHK 300.3(300.95)656082
SHOPERSTOP 517.7(520.05)52979
SHREECEM 17206.3(17326.55)17037
SHRIRAMCIT 2018(2030.85)58749
SIEMENS 1301.85(1289.25)518457
SIMPLEXINF 584.9(604.35)31479
SINTEX 23.2(23.3)1780421
SITINET 23(23.75)211228
SJVN 34.35(34.4)1033578
SKFINDIA 1759.7(1780.9)3406
SMLISUZU 844.8(847.55)12050
SNOWMAN 56.2(55.2)1352965
SOBHA 570.1(562.7)579807
SOMANYCERA 735.35(775.5)111530
SONATSOFTW 301.45(304.9)154797
SOUTHBANK 30.15(30.45)10059105
SPARC 453.3(466.4)170013
SREINFRA 95.8(96.45)1329617
SRF 1783.45(1794.9)188183
SRTRANSFIN 1379.75(1374.85)755720
STAR 763(784.4)473863
STCINDIA 159(160.45)29668
SUNDARMFIN 1882.2(1881)66928
SUNDRMFAST 525.1(532.95)193622
SUNPHARMA 579.9(591.95)4781423
SUNTV 1024.4(1027.55)491600
SUPREMEIND 1303.25(1258.4)211629
SUVEN 215(224.45)1546034
SUZLON 14.6(14.55)21012681
SWANENERGY 208.55(216.55)450987
SYMPHONY 1819.2(1839.4)45754
SYNDIBANK 72.55(73.1)4192635
SYNGENE 599.7(619.65)114182
TAKE 169(168.5)253366
TATACHEM 719(714.65)926013
TATACOFFEE 142.95(145.5)715588
TATACOMM 615.35(609.95)602219
TATAELXSI 1059.8(1082.8)320365
TATAGLOBAL 290.65(304)5397599
TATAMOTORS 399.5(395.85)5111454
TATAMTRDVR 224.55(225.1)2359630
TATAPOWER 89(90.6)5862598
TATASPONGE 1076.8(1103.7)192524
TATASTEEL 705.05(775.85)12958902
TBZ 125.15(126.75)236285
TCS 3112.35(3152.85)1521607
TECHM 612.65(602.95)7244068
TECHNO 376.25(380)138610
TEXRAIL 103.45(104.45)968938
THERMAX 1238.5(1220.1)28218
THOMASCOOK 234.2(239.7)310300
TIDEWATER 6832(6865.6)1279
TIMKEN 893.8(898.55)43114
TITAN 869.55(884.15)1431670
TNPL 417.4(429.4)58064
TORNTPHARM 1362.4(1356.6)115158
TORNTPOWER 285.45(279.5)1416923
TREEHOUSE 13.65(13.6)12897
TRIDENT 78.7(78.4)622339
TRITURBINE 128.3(130)149545
TTKPRESTIG 7304.15(7383.15)11061
TTML 6.9(7)696627
TV18BRDCST 61.85(58.9)18376216
TVSMOTOR 696.8(713.95)2395174
TVSSRICHAK 3564.2(3417.75)10040
TVTODAY 451.25(455)114792
UBL 1146.55(1137.9)181780
UCOBANK 31.5(31.1)547023
UFLEX 421.55(430.2)163879
ULTRACEMCO 4382(4363.2)189153
UNICHEMLAB 358.25(360.85)156997
UNIONBANK 136.25(136.1)2987896
UNITECH 8.45(8.7)25005392
UPL 752.05(770.75)1831502
VAIBHAVGBL 720.05(742.45)33397
VAKRANGEE 364.75(455.9)23453688
VEDL 340.35(341.3)8287707
VIDEOIND 18.5(17.95)3051711
VIJAYABANK 63.85(64.5)1382595
VINATIORGA 952.05(948.6)13284
VIPIND 340.15(337.4)355453
VOLTAS 605(609)1409431
VRLLOG 438.5(445.85)66039
VSTIND 3249.75(3299.45)5510
VTL 1297.4(1318.3)110320
WABAG 610.2(607.6)80981
WABCOINDIA 7423(7501.45)8299
WELCORP 159.95(168.4)609682
WELSPUNIND 69.05(69.85)1156075
WHIRLPOOL 1476.85(1476.55)57811
WIPRO 304.7(307.3)2823913
WOCKPHARMA 804.85(825.2)3334845
WONDERLA 375.95(386.85)39361
ZEEL 593.7(603)1844853
ZEELEARN 44.3(44)317930
ZENSARTECH 953.45(948.5)31655
ZYDUSWELL 998(1008.45)5248



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,340	---	31,240	30,800	30,450
క్రితం ముగింపు	31,230	31,000	31,300	30,750	30,370
22 క్యారెట్లు	29,020	---	28,740	28,550	29,000
క్రితం ముగింపు	29,910	28,800	28,780	28,520	28,920
వెండి (కిలో)	40,200	---	40,300	40,400	42,400
క్రితం ముగింపు	41,100	40,500	40,400	40,200	42,100

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	74.00	విజయవాడ	80.00
కరీంనగర్	75.00	గుంటూరు	80.00
వరంగల్	74.00	ఒంగోలు	82.00
మహబూబ్‌నగర్	74.00	చిత్తూరు	70.00
కర్నూలు	74.00	నెల్లూరు	80.00
విశాఖపట్నం	75.00	అనంతపురం	73.00
గోదావరి	80.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.20 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	360.00	చిత్తూరు	383.00
వరంగల్	362.00	చెన్నై	390.00
విజయవాడ	372.00	నమక్కల్	375.00
గోదావరి	372.00	బెంగళూరు	380.00
విశాఖపట్నం	382.00	ముంబై	415.00



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు)

(రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.93	67.17
పౌండ్	82.08	95.19
యూరో	71.99	83.49
ఆస్ట్రేలియా డాలర్	46.78	54.13
బహ్రెయిన్ దినార్	156.88	179.79
కువైట్ దినార్	175.76	218.80
ఒమని రియాల్	153.63	175.77
సౌదీ రియాల్	15.40	18.26
సింగపూర్ డాలర్	44.20	52.36
యుఎఇ దిరమ్	15.77	18.43



మేనరికాల్లో టాప్!

అగ్రస్థానంలో తమిళనాడు.. 3, 4 స్థానాల్లో తెలంగాణ, ఏపీ

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకోవడం.. మేనత్త కొడుకుతో వివాహబంధం.. అక్క కూతుర్ని చేసుకునే మేనమామలు.. ఇవన్నీ మనకు సర్వసాధారణం. మనతో పోలిస్తే ఉత్తరాదిన ఇలా మేనరికాలు చేసుకునేవారి సంఖ్య తక్కువట. 'కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ' నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-4)లో వెల్లడైన అంశమిది. దేశంలో ఎక్కువ శాతం రక్తసంబంధ వివాహాలు దక్షిణాదిలోనే జరుగుతున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఆ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. లక్షద్వీప్ రెండో స్థానంలో ఉంది. 33% మేనరికాలతో తెలంగాణ.. 32% రక్తసంబంధ వివాహాలతో ఆంధ్రప్రదేశ్ మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ విషయంలో జాతీయ సగటు కేవలం 12% కావడం గమనార్హం. ఈ సర్వే కోసం తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో 2596 ఇళ్లను, గ్రామీణ ప్రాంతాల్లోని 5,346 ఇళ్లను, మురికివాడల్లో 572 ఇళ్లను ఎంచుకున్నారు. ఆయా కుటుంబాల్లో 15-49 ఏళ్ల వయసున్న మహిళలను ప్రశ్నించారు.

(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

- గ్రామీణ ప్రాంతాల కన్నా పట్టణ ప్రాంతాల్లో ఇలా మేనరికాలు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువని సర్వేలో తేలింది.
- తెలంగాణలో 18-29 ఏళ్ల వారిలో 30శాతం మంది 18 ఏళ్లకు ముందే వివాహం చేసుకోగా ఏపీలో ఈ సంఖ్య 36 శాతం కావడం గమనార్హం.
- ఏపీలో పట్టణ అమ్మాయిల్లో 30.4 శాతం మందికి 19 ఏళ్లకే పెళ్లిళ్లు జరుగుతుండగా పల్లెల్లో అది 38.9 శాతంగా ఉంది. అబ్బాయిల్లో ఆ శాతం చాలా తక్కువగా ఉంది.
- తెలంగాణలో పట్టణ ప్రాంతా ల్లో 21.2% మందికి గ్రామీణ ప్రాంతంలో 40.1% మంది అమ్మాయిలు 19 ఏళ్లకే పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. అబ్బాయిల్లో ఈ సగటు.. పట్టణాల్లో 7.9%, గ్రామీణ ప్రాంతాల్లో 18.8శాతంగా ఉంది.
- దేశవ్యాప్తంగా ఇటీవలికాలంలో.. భర్తలను కొట్టే భార్యల సంఖ్య ఎక్కువైనట్టు సర్వేలో తేలింది. రాష్ట్రాల వారీ వివరాలు మాత్రం లభ్యం కాలేదు.
- ఏపీలో తండ్రి తరఫు బంధువులతో వివాహాలు 11.6 శాతం, తల్లి తరఫువారితో 12.1 శాతం వివాహాలు జరుగుతుండగా.. తెలంగాణలో ఆ రేటు వరుసగా 12.7%, 8.2 శాతంగా ఉన్నాయి.

పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు



మనదేశంలో పెళ్లి కాని ప్రసాదుల సంఖ్య భారీగానే ఉన్నట్టు జాతీయ కుటుంబ సర్వే వెల్లడించింది. స్త్రీలతో పోల్చితే మగవారిలోనే ఎక్కువగా పెళ్లికానివారు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. దేశంలో దాదాపు 38% పెళ్లి కాని మగవారు ఉన్నారు. అదే ఆడవారి విషయానికొస్తే ఆ సంఖ్య 23 శాతమే ఉంది.


- స్త్రీ, పురుషుల్లో 45-49 వయసు మధ్య వారిలో ఒక్క శాతం మాత్రమే పెళ్లి వద్దనుకుంటున్నారు.
- 45-49 ఏళ్ల మహిళల్లో ప్రతి 9 మందికి ఒకరు వితంతువు.
- 15-49 ఏళ్ల వయసు మహిళల్లో మూడు శాతం మంది భర్త నుంచి విడాకులు తీసుకున్నారు.



ఇష్టం లేకుండా పుట్టిన 2.1 కోట్ల ఆడపిల్లలు

అయినా..భారతీయులు మారలేదు!

భారతీయ సమాజంలో అబ్బాయే వంశోద్ధారకుడనే బూజు పట్టిన ఆలోచనల నుంచి చాలా మంది బయటపడలేకపోతున్నారు. ఫలితంగా కొడుకు పుడతాడని ఎదురుచూస్తూ దంపతులు తమకు ఇష్టం లేకపోయినా 2కోట్ల 10 లక్షలమంది ఆడపిల్లలను కన్నారని ఆర్థికశాఖ నివేదిక అంచనా వేసింది. చాలామంది జంటలు కొడుకు పుట్టేంతవరకూ కంటూ పోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని వెల్లడించింది. లింగ నిర్ధారణ పరీక్షలు, పుట్టబోయేది ఆడపిల్ల అయితే అబార్షన్లు, కుటుంబంలో అబ్బాయిలకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భారతీయ జనాభాలో 6 కోట్ల 30 లక్షలమంది మహిళలు మాయమయ్యారని ఆర్థిక సర్వే పేర్కొంది. అంతేకాదు..మగ పిల్లాడు పుట్టాలంటే కొన్ని ప్రత్యేకమైన రోజుల్లో దంపతులు కలవాలనీ, పశ్చిమం వైపు తలపెట్టుకుని నిద్రపోవాలన్న మూఢనమ్మకాలను చాలామంది గుడ్డిగా నమ్ముతున్నారని వెల్లడించింది.





అంగస్తంభన వైఫల్యానికి

ఆసనాలతో చెక్

కర్ణాటకలోని శ్రీధర్మస్థల మంజునాథేశ్వర ఆయుర్వేద కళాశాల పరిశోధకుల వెల్లడి

మరీ ముఖ్యంగా 5 ఆసనాలతో చెక్

యోగా వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన దూరమవుతుంది. ఫిట్‌నెస్ పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటాం.. ఇలా చెప్పుకొంటూ పోతే యోగా ఉపాయాల జాబితా చాంతాడంత! ఈ జాబితాలో ఇంకో లాభం చేరింది. అదీ పురుషులకు మాత్రమే ప్రత్యేకం!!

పురుషుల్లో వచ్చే అంగస్తంభన సమస్యను రోజూ యోగా చేయడం ద్వారా నివారించుకోవచ్చట! కర్ణాటకలోని శ్రీ ధర్మస్థల మంజునాథేశ్వర కాలేజ్ ఆఫ్ ఆయుర్వేద అండ్ హాస్పిటల్ పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వివరాలతో వారు రాసిన వ్యాసం 'జర్నల్ ఆఫ్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్సెస్'లో ప్రచురితమైంది. అంగస్తంభన వైఫల్యానికి చాలావరకూ.. ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలే కారణమవుతాయని వివరించారు. యోగా వల్ల స్ట్రెస్, డిప్రెషన్ వంటివి తగ్గి శృంగారపరంగా చురుగ్గా ఉంటారని పేర్కొన్నారు. వారు చేసిన సిఫారసుల ఆధారంగా.. పెన్సిల్వేనియాకు చెందిన డేనియల్ బుబ్నిస్ అనే యోగా శిక్షకుడు అంగస్తంభన వైఫల్యానికి 5 ఆసనాలు చెక్ పెడతాయని వివరించారు. ఆయన చెబుతున్న ఆ ప్రత్యేక ఆసనాలు ఏంటంటే...

సిద్ధాసనం

అంతర్జాతీయంగా యోగా శిక్షకులు దీన్ని 'పర్‌ఫెక్ట్ పోజ్'గా వ్యవహరిస్తుంటారు. ఈ ఆసనం వల్ల పొత్తికడుపు భాగం ఉత్తేజితమవుతుంది.



శవాసనం

నేరుగా అంగస్తంభన సమస్యకు ఈ ఆసనంతో సంబంధం లేదుగానీ.. ఒత్తిడిని తొలగించే ఆసనమిది.



పవనముక్తాసనం

ఈ ఆసనం గ్యాస్, మలబద్ధకం సమస్యను పోగొట్టడమే కాక.. పొత్తికడుపు భాగంలోని కండరాలను, పునరుత్పత్తి అవయవాలను ఉత్తేజితం చేస్తుంది.



గరుడాసనం

ఈ ఆసనం కూడా పొత్తికడుపు భాగానికి రక్తసరఫరాను పెంచుతుంది.



అర్ధ మత్స్యేంద్రాసనం

ఈ ఆసనం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. కాలేయం, ప్లీహం, క్లోమం, పొత్తికడుపు భాగం సహా పలు ప్రధాన అవయవాలకు రక్త సరఫరా మెరుగవుతుంది.

తస్మాత్ జాగ్రత్త

యోగాసనాలతో అంగస్తంభన వైఫల్యం తగ్గుతుందో లేదోగానీ.. భవిష్యత్తులో రాబోయే హృద్రోగాలకు అది ముందస్తు సూచన కూడా కావొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం, రక్తం గడ్డకట్టడం వంటివాటివల్ల కూడా అంగస్తంభన సమస్య ఏర్పడవచ్చని, కాబట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

రామసేతు @ 18,400 ఏళ్లు!



చెన్నై శాస్త్రవేత్తల నిర్ధారణ.. రెండేళ్లుగా పరిశోధన

సముద్ర శిలాజాలు అమెరికాకు.. 'ఆంధ్రజ్యోతి'తో శాస్త్రవేత్త శ్రీనివాసులు

రామసేతు.. అసలేమిటీ వారధి కథ? భారత్‌లోని రామేశ్వరాన్ని లంకలోని మన్నార్‌ను కలిపే ఈ వారధి సహజసిద్ధంగా ఏర్పడిందా? లేక శ్రీరాముడు నిర్మించినదేనా? అసలు దీని వయసెంత? రామసేతుపై ఇలాంటి అంతుచిక్కని ప్రశ్నలెన్నో! అయితే లంకలో ఉన్న సీతాదేవిని రక్షించడానికి శ్రీరాముడు వానర సేనలతో కలిసి సముద్రంలో ఈ వారధిని నిర్మించాడని అత్యధికులు విశ్వసిస్తారు. అందుకే దీన్ని రామసేతు అంటారని చెబుతారు. ఇంతకీ ఈ వారధి ఎప్పటిది? అనే విషయంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. రామసేతు లోపల సముద్ర గర్భంలో ఉన్న శిలాజాల వయస్సు ఆధారంగా ఇది 18,400 ఏళ్ల కిందటిదని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు(ఇన్‌కాయిస్)కు చెందిన శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఈ పరిశోధనలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ శ్రీనివాసులు అనేక ఆసక్తికరమైన అంశాలను 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. ఈ సేతు దగ్గర ఉండే సముద్ర శిలాజాలను పరీక్షించటం ద్వారా ఇది ఏ కాలం నాటిదనే విషయాన్ని కనుగొనటానికి 2015లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇన్‌కాయిస్‌లు పరిశోధనా ప్రాజెక్టును ప్రారంభించాయి. ఈ ప్రాజెక్టులో చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేటిక్స్, అన్నా యూనివర్సిటీల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సముద్ర గర్భం నుంచి కొన్ని నమూనాలను సేకరించారు. "ఈ బ్రిడ్జి తమిళనాడులోని పంబన్ ద్వీపం, శ్రీలంకలో మన్నార్ ద్వీపాల మధ్య సముద్ర గర్భంలో 35 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఇది మన్నార్ వైపు కొద్దిగా ఎత్తుగా ఉంటుంది. రామేశ్వరం వైపు ఏటవాలుగా ఉంటుంది. ఈ సేతు చాలా పొడవుగా ఉంది కాబట్టి మూడు చోట్ల నమూనాలను సేకరించాం" అని శ్రీనివాసులు వివరించారు. సాధారణంగా సముద్రగర్భంలో అనేక జీవులు నివసిస్తూ ఉంటాయి. వీటిలో సిబిసైడ్స్ అనేవి కొన్ని లక్షల ఏళ్ల నుంచి సముద్ర గర్భంలో నివసిస్తున్నాయని శాస్త్రవేత్తల అంచనా. అందువల్ల సముద్రగర్భం నుంచి వెలికితీసే శిలాజాల వయస్సును కనుగొనటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. "సముద్ర (దాదాపు 600 మీటర్ల నుంచి కిలోమీటరు లోతులో) గర్భంలో 75 సెంటీమీటర్ల లోతుకు తవ్వకాలు జరిపాం. అక్కడ మాకు సిబిసైడ్స్ లభించలేదు. మరో ప్రాంతంలో 130 సెంటీమీటర్ల లోతు తవ్వినప్పుడు దొరికాయి. వాటిని వెలికితీసి అవి ఏ కాలం నాటివనే విషయాన్ని తెలుసుకున్నాం" అని శ్రీనివాసులు తెలియజేశారు. వీటి వయసును కొనుగొనటానికి అవసరమైన పరికరాలు మన దగ్గర లేకపోవటంతో అమెరికాలోని బీటా ఎనలిటిక్స్ అనే సంస్థకు పంపారు. "సముద్ర శిలాజాల వయసు కనుగొనటంలో ఈ సంస్థకు విశేషమైన సామర్థ్యం ఉంది. అందుకే అక్కడికి పంపాం. వారు మా నమూనాలను కార్బన్-14 డేటింగ్ ప్రక్రియ ద్వారా పరీక్షించి సముద్రగర్భంలో 132 సెంటీమీటర్ల లోతులో దొరికిన శిలాజాలు 18,400 ఏళ్ల క్రితం నాటివని తేల్చారు. 94 సెంటీమీటర్ల లోతులో దొరికిన శిలాజాలు 800 ఏళ్ల క్రితం నాటివని తేల్చారు" అని శ్రీనివాసులు వివరించారు. 'ఈ తరహా పరిశోధన చేయటం ఇదే మొదటిసారని ఆయన చెప్పారు.

–స్పెషల్ డెస్క్

బాబోయ్ ఫేస్‌బుక్ వద్దు!



ఫేస్‌బుక్ 'మెసెంజర్ కిడ్స్' యాప్‌పై నిరసన.. జుకర్‌బర్గ్‌కి పిల్లల వైద్యుల బహిరంగ లేఖ

పెద్దలే ఫేస్‌బుక్ వదల్లేక పోతున్నారు. గంటలకు గంటలు ఫేస్‌బుక్ చూస్తూ విలువైన వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతున్నారు. ఇక అండర్-13 పిల్లలు కూడా ఫేస్‌బుక్‌కి అలవాటుపడితే ఇంకేమైనా ఉందా? చాలు.. చాలు.. అంటున్నారు తల్లిదండ్రులు! పదమూడేళ్లలోపు పిల్లల కోసం ఫేస్‌బుక్ తీసుకువచ్చిన 'మెసెంజర్ కిడ్స్' యాప్‌ను వెనక్కి తీసుకోవాలని వందమందికిపై పిల్లల వైద్య నిపుణులు ఆందోళన మొదలుపెట్టారు. చిన్నచిన్న పిల్లలకు యాప్ తీసుకురావడం బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్‌కి వారు బహిరంగ లేఖ రాశారు. 'ఎలిమెంటరీ పిల్లలకు కూడా ఫేస్‌బుక్ యాప్ అందుబాటులోకి తేవడం మంచిది కాదు. మెదడు పరిపక్వత చెందే వయసులో డిజిటల్ పరికరాలు, సోషల్ మీడియా పిల్లలకు క్షేమం కాదు. చిన్నారులు ఇందుకు సిద్ధంగా లేరు' అని లేఖలో డాక్టర్లు పేర్కొన్నారు. అయితే ఆన్‌లైన్ సేఫ్టీ నిపుణుల సలహాలతోనే యాప్‌ను రూపొందించామనీ, మెసెంజర్ యాప్ ఓపెన్ కావాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి అని ఫేస్‌బుక్ చెబుతోంది. 'తండ్రి నైట్ షిఫ్ట్‌లో ఉండి పగలు నిద్రపోతూ ఉంటాడు. తల్లి ఆఫీస్‌లో ఉంటుంది. ఇంట్లోని తన పిల్లలతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండటానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది' అని ఫేస్‌బుక్ వాదిస్తోంది. ఈ వాదనను బాలల హక్కుల కార్యకర్తలు తోసిపుచ్చుతున్నారు.

ఖైదీలకూ దాంపత్య హక్కు!

లా-లోచనం
Law lochanam



పొరపాటునో, గ్రహపాటునో జైలుపాలైన వారిని సంస్కరించి సరైన బాటలో పెట్టి సమాజంలో తిరిగి భాగస్వాములను చేయటం జైలుశిక్ష విధింపులో ఆంతర్యం. వాస్తవానికి ఈ ఉద్దేశం మరుగునపడి జైళ్లు నేరస్థుల కర్మాగారాలుగా అపకీర్తి మూటగట్టుకుంటున్నాయి. కారాగారాలను శిక్షాలయాలుగాకాక 'క్రమశిక్షణాలయాలు'గా తీర్చిదిద్దాలని నేరతత్వ శాస్త్రవేత్తల అభిప్రాయం. నిజానికి బ్రిటిష్ ఏలుబడిలో రూపొందిన జైళ్ల చట్టం (1894) ఆశయం కూడా ఇదే. జైళ్లలో సరైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, వ్యక్తుల మానసిక ఎదుగుదలకు సహకరించే సిబ్బంది, విద్య, వైద్య, వినోద సౌకర్యాలు కల్పించాలని ఈ చట్టం, దాని విధివిధానాలూ సూచిస్తున్నాయి. ఖైదీలకు షరతులపై 'సెలవు', బంధువులను కలుసుకొనే ఏర్పాటూ, కొంతకాలం కుటుంబంతో కలిసి గడిపే వెసులుబాటు కూడా ఉన్నాయి. అయితే ఈ అవకాశాలు పలుకుబడి, 'పెట్టుబడి' గల కొందరు వ్యక్తులకే సులువుగా దక్కుతాయనే వాదన ఉంది. జైలుశిక్ష పడినంత మాత్రాన వారికి పౌరహక్కులు లేకుండా పోవు. ఖైదీల సంస్కరణ, సంరక్షణ ప్రక్రియలను పటిష్ఠం చేసే దిశలో జైళ్ల చట్టం సవరణ బిల్లు (2016) రూపొందినా అది చట్టసభలో ఇంకా చర్చకు ఎదురుచూపులు చూస్తోంది. దేశంలోని 1401 చెరసాలలు అరకొర వసతులూ, చాలీచాలని సిబ్బంది, సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. ఖైదీకి దినసరి ఖర్చు కోసం ప్రభుత్వం రూ.86 వెచ్చిస్తుండగా, అందులో తిండి ఖర్చే రూ. 52. దీంతో పౌష్టికాహార లభ్యత సందేహమే. కటకటాల్లోనే సగం జీవితం గడిపేస్తూ కాలగర్భంలో కలిసిపోతున్న నిర్భాగ్యులు ఏమాత్రం సంస్కరించబడతారనేది ప్రశ్నార్థకమే. ఖైదీలందరికీ పౌరహక్కులు లభిస్తాయని చల్లా రామకృష్ణారెడ్డి కేసు (2000)లో సుప్రీం ప్రకటించగా, మానవహక్కుల కొనసాగింపునకు జైలుగోడలు అడ్డంకి కారాదనీ, రాజ్యాంగం ప్రసాదించిన సమానతా హక్కు, వాక్ స్వాతంత్ర్యం, జీవించే హక్కు ఖైదీలకు సైతం నిరాటంకంగా వర్తిస్తాయని జస్టిస్ చిన్నపరెడ్డి 1983లో (వతీస్వరన్ కేసు)లో స్పష్టం చేశారు. జైళ్లు రక్షణ గృహాలనీ, శిక్షా గృహాలు కావనీ, వారికి ఉచిత, న్యాయసహాయం అందచేయటం సర్కారు బాధ్యత అనీ, ఖైదీల పట్ల గౌరవ మర్యాదలతో సిబ్బంది ప్రవర్తించాలనీ జైళ్లల్లో సంస్కరణ పర్వానికి మానవతా విలువలు జోడించాలనీ (రతీరామ్ కేసు 2012) సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో చెప్పింది. బంధుమిత్రులతో సమావేశం కావటం, కొన్నాళ్లు కుటుంబంతో గడపటంతో ఖైదీలకు కుటుంబ బాధ్యతలు గుర్తుకొచ్చి, త్వరగా మార్పు చెందగలరని సునీత బత్రా కేసులో సుప్రీం విశ్వసించింది. జస్టిస్ విమల నేతృత్వంలో మద్రాసు హైకోర్టు ధర్మాసనం మేహరాజ్ కేసులో తాజాగా వెలువరించిన తీర్పు, జైలు జీవితాన్ని గడుపుతూనే కుటుంబ సౌఖ్యం అనుభవించటానికీ, మార్పు వైపునకు పయనించడానికీ ఖైదీలకు మార్గం సుగమం చేసింది.

–వేదాంతం సీతారామావధాని, భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, సెల్: 70421 40099

ఖరగ్‌పూర్ ఐఐటీలో గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్

ఖరగ్‌పూర్ ఐఐటి ఏటా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జిఇఎస్)ను ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ఏంజెల్ ఇన్వెస్టర్లు, నవ తరం ఎంట్రప్రెన్యూర్లు, పరిశ్రమల నిపుణులు హాజరవుతారు. దేశ, విదేశీ విద్యార్థులు పాల్గొంటారు. క్రిప్టోకరెన్సీ, డిజిటల్ బ్యాంకింగ్‌పై వర్క్‌షాప్స్; సరికొత్త సాంకేతికతో కూడిన ప్రొడక్ట్ ఎగ్జిబిషన్లు; స్టార్టప్ క్యాంప్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ప్రత్యేక సదస్సులు తదితరాలు ఇందులో ఉంటాయి. చర్చల్లో కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఎంట్రప్రెన్యూర్లు, ప్రొఫెషనల్స్ పాల్గొంటారు. శ్యామ్ పిట్రోడా, ఇండియా టీవీ ఛైర్మన్ రజత్ శర్మ, గూగుల్ సిఇఓ సుందర్ పిచాయ్ వంటి ప్రముఖులు గతంలో హాజరయ్యారు. మీడియా పార్ట్‌నర్‌గా 'ఆంధ్రజ్యోతి' ఈ సదస్సులో పాల్గొంటోంది.

ఉన్నత విద్యకు ఉపకారం



యూజీసీ స్కాలర్‌షిప్స్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. దేశంలో ఉన్నత విద్యా రంగానికి దిశా నిర్దేశం చేసే అత్యున్నత సంస్థ. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీలు పాటించాల్సిన ప్రమాణాలను రూపొందించడం, సంబంధిత విషయాలపై సలహాలు, సూచనలు ఇవ్వడం, నిధులను మంజూరు చేయడం వంటి విధులను యూజీసీ నిర్వర్తిస్తుంది. అంతేకాకుండా ఉన్నత విద్యారంగం వైపు ప్రతిభావంతులను ఆకర్షించి దేశాన్ని ఒక నాలెడ్జ్ హబ్‌గా నిలిపేందుకు ఎన్నో స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ముఖ్యంగా పీజీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న కొన్ని స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌ల వివరాలను చూద్దాం...

గేట్, జీప్యాట్ ఉత్తీర్ణులకు...

ఉన్నత విద్యా రంగంవైపు ప్రతిభావంతులైన విద్యార్థులను ఆకర్షించే లక్ష్యంతో యూజీసీ 'పీజీ స్కార్‌షిప్ ఫర్ గేట్ / జీప్యాట్ క్వాలిఫైడ్ స్టూడెంట్స్ ఫర్ పర్సుయింగ్ ఎంఈ / ఎంటెక్ / ఎంఫార్మ్' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తుంది.

అర్హతలు..

- గేట్‌లో అర్హత సాధించి ఉండాలి. రెండో సంవత్సరం (మూడో సెమిస్టర్)లో గేట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయరు.
- ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ / కాలేజీ / డీమ్డ్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొంది ఉండాలి.
- ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ (డ్యూయల్ డిగ్రీతో కలిపి)
- స్కాలర్‌షిప్ మొత్తం రూ. 12,400
- కంటింజెన్సీ గ్రాంట్: ఏటా రూ. 5,000.

మెరిట్ ఆధారంగా..

ఏదైనా సెమిస్టర్‌లో 60 శాతం కంటే తక్కువ మార్కులు సాధించిన పక్షంలో నెలకు రూ. 1,550 మాత్రమే స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తారు. అయితే అదే సెమిస్టర్ పరీక్షలను మళ్లీ రాసి 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే రెగ్యులర్ స్కాలర్‌షిప్‌నకు అర్హత లభిస్తుంది. సెమిస్టర్ల వారీగా విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తారు. ఒక వేళ ఏవైనా కారణాలతో మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించకపోతే ప్రాజెక్ట్ వర్క్, ప్రవర్తనకు సంబంధించి యూనివర్సిటీ సమర్పించే నివేదిక ఆధారంగా స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు.

- వెబ్‌సైట్: https://scholarships.gov.in www.ugc.ac.in

ఎస్సీ / ఎస్టీ విద్యార్థుల కోసం...

సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులను ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో చేరే విధంగా ప్రోత్సహించే ఉద్దేశంతో 'పీజీ స్కాలర్‌షిప్స్ ఫర్ ఎస్సీ / ఎస్టీ స్టూడెంట్స్ ఫర్ ప్రొఫెషనల్ కోర్సెస్' అనే కార్యక్రమాన్ని యూజీసీ ప్రారంభించింది.

సెమిస్టర్‌లో ప్రతిభ చూపిస్తేనే...

యూజీసీ నిర్దేశించిన విధంగా మార్కులు సాధిస్తేనే స్కాలర్‌షిప్‌ను కొనసాగిస్తారు. ఈ క్రమంలో రెండో సెమిస్టర్‌కు అర్హత పొందాలటే మొదటి సెమిస్టర్‌లో ప్రథమ శ్రేణి మార్కులు / తత్సమాన గ్రేడ్ సాధించాలి. ఇదేవిధంగా మూడో సెమిస్టర్ కోసం రెండో సెమిస్టర్‌లో, నాలుగో సెమిస్టర్ కోసం మూడో సెమిస్టర్‌లో ప్రతిభను చూపాల్సి ఉంటుంది. ప్రతి సెమిస్టర్‌లో సాధించే మార్కుల ఆధారంగానే స్కాలర్‌షిప్‌లను కొనసాగిస్తారు. కోర్సును మధ్యలో మానేయకుండా డిక్లరేషన్ సమర్పించాలి. ఏదైనా సెమిస్టర్‌లో ఉత్తీర్ణులు కాకపోతే స్కాలర్‌షిప్‌ను రద్దు చేస్తారు.

- స్కాలర్‌షిప్ మొత్తాన్ని కూడా మెరిట్ ప్రాతిపదికగానే అందజేస్తారు. మొదటి, రెండో, మూడో సెమిస్టర్‌లో ప్రథమ శ్రేణి మార్కులు (60 శాతం మార్కులు) / తత్సమాన గ్రేడ్ సాధించిన విద్యార్థులకు నెలకు రూ. 5 వేలు స్కాలర్‌షిప్ చెల్లిస్తారు. 60 శాతం కంటే తక్కువ మార్కులు సాధిస్తే నెలకు రూ. 1000 మాత్రమే స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తారు.
- సంబంధిత ప్రొఫెషనల్ డిగ్రీ రెండో సంవత్సరం (మూడో సెమిస్టర్)లో గేట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయరు.
- వయసు: 45 ఏళ్లు, మహిళలకు 50 ఏళ్లు (దరఖాస్తు చేసుకునే ఏడాది జూలై 1 నాటికి) మించకూడదు.
- స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 1000
- స్కాలర్‌షిప్ వ్యవధి: రెండు / మూడేళ్లు (కోర్సు వ్యవధిని బట్టి)
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15, 2018.
- వెబ్‌సైట్: https://scholarships.gov.in/

అమ్మాయిలకు ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్

దేశంలో కొన్ని రాష్ట్రాల్లో బాలురతో పోల్చితే బాలికల సంఖ్య తక్కువగా (లింగ నిష్పత్తి) నమోదవుతోంది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పరిస్థితులను అధిగమించి లింగ సమానత్వాన్ని సాధించాలంటే మహిళలు విద్యావంతులుగా ఎదగడం ఎంతో అవసరం. మహిళా సాధికారత సాధించే దిశలో వారిని విద్యావంతు లుగా తీర్చిదిద్దడం, ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రారంభించిన కార్యక్రమం 'పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇందిరాగాంధీ స్కాలర్‌షిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్ ఫర్ పీజీ ప్రోగ్రామ్స్'. పోస్ట్‌గ్రాడ్యు యేషన్ స్థాయిలో నాన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో మహిళలను ప్రోత్సహించడమే ఈ స్కాలర్‌షిప్ ముఖ్య ఉద్దేశం.

ఏయే సంస్థలకు...

- యూజీసీ చట్టం ప్రకారం ఏర్పాటైన యూనివర్సిటీలు/ ఇన్‌స్టిట్యూట్‌లు/ కాలేజీలు
- యూజీసీ గుర్తింపు ఉన్న డీమ్డ్ యూనివర్సిటీలు
- కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నడిచే యూనివర్సిటీలు / కాలేజీలు / ఇన్‌స్టిట్యూట్‌లు
- జాతీయ ప్రాధాన్యం ఉన్న విద్యాసంస్థలు (ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్)

అర్హతలు..

- దరఖాస్తు చేసుకునే మహిళ / బాలిక వారి తల్లిదండ్రులకు ఏకైక సంతానం అయి ఉండాలి (తోబుట్టువులు ఉండకూడదు). కవల పిల్లలయితే పెద్ద అమ్మాయి దరఖాస్తు చేసుకోవచ్చు.
- రెగ్యులర్ విధానంలో పీజీ మొదటి సంవత్సరం కోర్సులో చేరి ఉండాలి (దూర విద్యలో చేరిన వారికి అవకాశం లేదు). వయసు 30 ఏళ్లకు మించకూడదు.
- స్కాలర్‌షిప్ మొత్తం - వ్యవధి: నెలకు రూ. 3,100 మొత్తాన్ని స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తారు. పీజీ కోర్సు వ్యవధి మేరకు వర్తించేలా ఏటా 10 నెలలపాటు రెండేళ్లు ఈ స్కాలర్‌షిప్‌ను చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15, 2018.
- వెబ్‌సైట్: https://scholarships.gov.in/

యూనివర్సిటీ ర్యాంకర్లకు...

డిగ్రీలో యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి 'పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెరిట్ స్కాలర్‌షిప్ ఫర్ యూనివర్సిటీ ర్యాంక్ హోల్డర్స్ ఫర్ పీజీ ప్రోగ్రామ్స్' పేరుతో యూజీసీ స్కాలర్‌షిప్స్ అందిస్తోంది. విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌తోనే చదువు ఆపేయకుండా, వారిని ఉన్నత విద్యవైపు మరల్చడం దీని లక్ష్యం. ముఖ్యంగా గ్రాడ్యుయేషన్‌లో యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా చదువులు మానేయడాన్ని అరికట్టడానికి వీటిని ఉద్దేశించారు. ఈ కార్యక్రమ లక్ష్యాలు..

- ప్రతిభను ప్రోత్సహించడం, డిగ్రీ స్థాయిలోని మెరిట్ విద్యార్థులను పీజీ వైపు ఆకర్షించడం
- అండర్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో ప్రొఫెషనల్ కోర్సులు కాకుండా బేసిక్ (సంప్రదాయ) కోర్సులను ఎంచుకునేలా చేయడం.

అర్హతలు..

- అండర్‌గ్రాడ్యుయేషన్‌లో యూనివర్సిటీ స్థాయిలో మొదటి / రెండో ర్యాంక్ సాధించి ఉండాలి.
- ర్యాంక్, పీజీ కోర్సులో అడ్మిషన్ పొందిన విషయాన్ని రుజువు చేసే ధ్రువపత్రాలను సమర్పించాలి.
- అండర్‌గ్రాడ్యుయేట్ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన యూనివర్సిటీ / కాలేజీలో రెగ్యులర్ విధానంలో పీజీలో మొదటి సంవత్సరం కోర్సులో చేరి ఉండాలి (దూర విద్యలో చేరిన వారికి అవకాశం లేదు). వయసు అడ్మిషన్ నాటికి 30 ఏళ్లకు మించకూడదు.
- ఆఫర్ చేసే సబ్జెక్టులు: మ్యాథమెటిక్స్, కామర్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్, లాంగ్వేజెస్, సోషల్ సైన్సెస్.
- స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 3000
- స్కాలర్‌షిప్ వ్యవధి: రెండేళ్లు
- స్కాలర్‌షిప్ మొత్తం: రూ. 3,100 (నెలకు). ఏటా 10 నెలలపాటు రెండేళ్లు ఈ ఫెలోషిప్‌ను చెల్లిస్తారు.

ప్రతిభ ఆధారంగా కొనసాగింపు

ఈ స్కాలర్‌షిప్ కోసం ఎంపికైన విద్యార్థుల ప్రగతిని యూజీసీ నిరంతరం సమీక్షిస్తుంది. మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్ కొనసాగింపు ఉంటుంది. ఈ మేరకు విద్యార్థులు డిపార్ట్‌మెంట్ హెడ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ సంతకాలతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను యూజీసీకి పంపాలి. కోర్సును మధ్యలో ఆపేసినా, 60 శాతం కంటే తక్కువ మార్కులు సాధించినా, ప్రవర్తన, ఇతర విషయాల్లో యూనివర్సిటీ నుంచి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా స్కాలర్‌షిప్‌ను మధ్యలోనే రద్దు చేస్తారు.

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15, 2018.
- వెబ్‌సైట్: https://scholarships.gov.in/

ఈస్ట్ సెంట్రల్ రైల్వే

మొత్తం ఖాళీలు 1896

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలోని ఈస్ట్ సెంట్రల్ రైల్వే అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డివిజన్ల వారీ ఖాళీలు: ధన్‌పూర్ డివిజన్‌లో ఫిట్టర్ 190, వెల్డర్ 6, డీజిల్ మెకానిక్ 32, రిఫ్రిజిరేషన్ & ఎసి మెషిన్ 68, ఫోర్జర్ & హీట్ ట్రీటర్ 20, కార్పెంటర్ 10, ఎలక్ట్రానిక్ మెకానిక్ 130, పెయింటర్ 14, ఎలక్ట్రీషియన్ 134, వైర్‌మన్ 22; ధన్‌బాద్ డివిజన్‌లో ఫిట్టర్ 38, టర్నర్ 21, మెషినిస్ట్ 6, కార్పెంటర్ 6, వెల్డర్ 41, మెకానిక్ డీజిల్ 12, వైర్‌మన్ 18; మొగల్‌సరాయ్ డివిజన్‌లో ఫిట్టర్ 480, మెషినిస్ట్ 4, వెల్డర్ 24, ఎలక్ట్రీషియన్ 36, ఎంఎంటిఎం 2, టర్నర్ 6, వైర్‌మన్ 58, రిఫ్రిజిరేషన్ & ఎసి మెకానిక్ 16, ఎలక్ట్రానిక్ మెకానిక్ 140, డీజిల్ మెకానిక్ 78; సమస్తిపూర్ డివిజన్‌లో ఫిట్టర్ 14, టర్నర్ 4, వెల్డర్ 4, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 10, పెయింటర్ 2, కార్పెంటర్ 2, డీజిల్ మెకానిక్ 20, లేబరేటరీ అసిస్టెంట్ 4; ప్లాంట్ డిపో-మొగల్‌సరాయ్‌లో ఫిట్టర్ 54, మెషినిస్ట్ 10, వెల్డర్ 10, ఎలక్ట్రీషియన్ 4, మెషినిస్ట్/ గ్రిండర్ 12, టర్నర్ 10, ఎంవి మెకానిక్ 8, డీజిల్ మెకానిక్ 8; మెకానికల్ వర్క్‌షాప్ - సమస్తిపూర్‌లో ఫిట్టర్ 50, మెషినిస్ట్ 10, వెల్డర్ 32, ఎలక్ట్రీషియన్ 8 ఖాళీలు ఉన్నాయి.
- అర్హత: 50 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: జనవరి 30 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
- దరఖాస్తు ఫీజు: రూ.100 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్: www.rrcecr.gov.in

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

మొత్తం ఖాళీలు 310

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ప్రకటనను విడుదల చేసింది. వివరాలు..

- విభాగాల వారీగా ఖాళీలు..
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ - 1 (ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్) - 4
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ - 2 (ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్) - 87
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ - 2 (బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్) - 219
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 6, 2018.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6, 2018.
- వెబ్‌సైట్: tspsc.gov.in

ఇస్రోలో సైంటిస్ట్‌లు

మొత్తం ఖాళీలు 106

ఇస్రో ఆధ్వర్యంలోని సెంట్రలైజ్‌డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఐసిఆర్‌బి) - సైంటిస్ట్ / ఇంజనీర్ (SC) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రానిక్స్ 32, మెకానికల్ 45, కంప్యూటర్ సైన్స్ 29
- అర్హత: కనీసం 65 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ఆఖరు ఏడాది సెమిస్టర్లు చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆగస్టు 31 నాటికి కోర్సు పూర్తిచేయగలగాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 35 ఏళ్లు మించకూడదు
- ఉద్యోగ ప్రదేశం: బెంగళూరు
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- రాత పరీక్ష జరుగు తేదీ: ఏప్రిల్ 22
- దరఖాస్తు ఫీజు: రూ.100
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: www.isro.gov.in

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్

మొత్తం ఖాళీలు 88

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థుల కోసం స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది.

- పోస్టులవారీ ఖాళీలు: అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్ 2, లీగల్ 1, కార్పొరేట్ & కమ్యూనికేషన్ 1, సేఫ్టీ 1), స్టేషన్ కంట్రోలర్/ ట్రైన్ ఆపరేటర్ 50, మెయింటైనర్ - ఎలక్ట్రానిక్ మెకానిక్ 29, స్టెనోగ్రాఫర్ 2, అకౌంట్ అసిస్టెంట్ 1, ఆఫీస్ అసిస్టెంట్ 1
- అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో సీఏ / ఐసిడబ్ల్యుఏ / బిఎస్సీ (ఆనర్స్/ ఎంపిసి)/ 60 శాతం మార్కులతో మాస్టర్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ & జర్నలిజం / ఎంటెక్ (సేఫ్టీ)/ ఐటిఐ (ఎన్‌సివిటి/ ఎస్‌సివిటి) / బిఏ/ బికాం ఉత్తీర్ణులై ఉండాలి.

జాబ్ కార్నర్

- వయసు: జనవరి 1 నాటికి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 26
- వెబ్‌సైట్: www.delhimetrorail.com

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

మొత్తం ఖాళీలు 44

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- పోస్టులు: సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్స్ 4, సాఫ్ట్‌వేర్ టెస్టర్ 3, ఒరాకిల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ 1, ఎంఎస్‌క్యుఎల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ 1, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్స్ 4, డేటా అనలిస్ట్ 10, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ 5, హెచ్‌ఆర్ మేనేజర్ 5, చీఫ్ మేనేజర్ (క్రెడిట్ 10, బ్యాలెన్స్ షీట్ 1)
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 3 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

ఒఎన్‌జిసి మంగళూరు పెట్రో కెమికల్స్

మొత్తం ఖాళీలు 17

ఒఎన్‌జిసి మంగళూరు పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఒఎంపిఎల్)- గ్రాడ్యుయేట్/ టెక్నీషియన్ అప్రెంటీస్ ట్రైనీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌లు 12, టెక్నీషియన్ అప్రెంటీస్‌లు 5
- విభాగాలవారీ ఖాళీలు: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌లు (కెమికల్ 4, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 4, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ 1, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 2), టెక్నీషియన్ అప్రెంటీస్‌లు (కెమికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 2, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ 1)
- అర్హత: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌లకు సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్, టెక్నీషియన్ అప్రెంటీస్‌లకు డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- స్టయిపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌లకు నెలకు రూ.4984, టెక్నీషియన్ అప్రెంటీస్‌లకు రూ.3542 చెల్లిస్తారు.
- ఎంపిక: రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను 1:25 నిష్పత్తిలో రాత పరీక్షకు అనుమతిస్తారు.
- రాత పరీక్ష వివరాలు: గంటన్నర పరీక్ష సమయంలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలే ఇస్తారు. నెగెటివ్ మార్కింగ్ లేదు. ప్రశ్న పత్రాన్ని ఇంగ్లీషు మాధ్యమంలో మాత్రమే ఇస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 1
- వెబ్‌సైట్: www.ompl.co.in



ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం & ఎనర్జీ

మొత్తం ఖాళీలు 9

విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం & ఎనర్జీ (ఐఐపిఇ) - కింది విభాగాల్లో బోధనా సిబ్బంది ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: పెట్రోలియం ఇంజనీరింగ్ 2, కెమిస్ట్రీ 1, మేథమెటిక్స్ 2, కంప్యూటర్ సైన్స్ 1, ఇఇఇ 1, బయాలజీ 1, మెకానికల్ 1
- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సీనియర్ ప్రొఫెసర్స్/ విజిటింగ్ ఫ్యాకల్టీ
- అర్హత: సంబంధిత విభాగంలో పిహెచ్‌డి చేసి ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు రెండేళ్లు, సీనియర్ ప్రొఫెసర్స్‌కు పదిహేనేళ్ల బోధన/ రీసెర్చ్ అనుభవం ఉండాలి.
- వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు 35 ఏళ్లు, సీనియర్ ప్రొఫెసర్స్‌కు 69 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: www.iipe.ac.in

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మొత్తం ఖాళీలు 407

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కాంట్రాక్ట్ ప్రాతిపదికన వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీ ఖాళీలు: రిలేషన్‌షిప్ మేనేజర్ (వెల్త్ మేనేజ్‌మెంట్ 168, ఇ వెల్త్ 20, ఎన్‌ఆర్‌ఐ 10, కార్పొరేట్ 4, అక్విజిషన్ 80, టీమ్ లీడ్ 22), ఇన్వెస్ట్‌మెంట్ కౌన్సిలర్ 33, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ 55, సెంట్రల్ రీసెర్చ్ టీమ్ 1, జోనల్ హెడ్ సేల్స్ (రిటైల్) 2, హెడ్ (ఆపరేషన్స్) 1, కంప్లయెన్స్ ఆఫీసర్ 1, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (బిజినెస్ 1, టెక్నాలజీ 1), బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ 1, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్ 2, సెంట్రల్ ఆపరేషన్స్ టీమ్ సపోర్ట్ 2, సెంట్రల్ రీసెర్చ్ టీమ్ సపోర్ట్ 1, జోనల్ హెడ్ (ఇ వెల్త్ 1, టీమ్ లీడ్ ఎన్‌ఆర్‌ఐ 1)
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పోస్టును అనుసరించి ఎంబిఏ/ ఎంఎంఎస్/ పీజీడీఎం/ ఎంఇ/ ఎంటెక్/ బిఇ/ బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. వెల్త్ మేనేజ్‌మెంట్ సంబంధిత విభాగాల్లో కనీసం మూడు నుంచి పదిహేనేళ్ల (ప్రకటనలో నిర్దేశించిన విధంగా) అనుభవం ఉండాలి.
- వయసు: పోస్టును అనుసరించి 2017 డిసెంబరు 1 నాటికి 23 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- ఎంపిక: అభ్యర్థులను అర్హత, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో బ్యాంక్ నిర్ణయించిన కటాఫ్ మార్కుల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్ తయారుచేస్తారు.
- కాంట్రాక్టు వ్యవధి: అయిదేళ్లు
- దరఖాస్తు ఫీజు: రూ.600 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: www.sbi.co.in/careers

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

నిజామాబాద్ • గురువారం 1 ఫిబ్రవరి 2018

పాకిస్థాన్ x అఫ్ఘానిస్థాన్
అండర్-19 వరల్డ్‌కప్
(మూడోస్థానం మ్యాచ్)
తెల్లవారుజామున 3గం. నుంచి
STAR SPORTS 2

శ్రీలంక x బంగ్లాదేశ్
తొలి టెస్ట్
రెండో రోజు
ఉ. 9 గం. నుంచి
STAR SPORTS SELECT 2



ఖేలో ఇండియా ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీతో గోపీచంద్, సింధు, శ్రీకాంత్.

ఖేలో ఇండియా షురూ

ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహిస్తోన్న ఖేలో ఇండియా స్కూల్‌గేమ్స్ (కేఐఎస్‌జీ) బుధవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ క్రీడలను ప్రారంభించారు. దేశ క్రీడాప్రతిభ, సత్తాను ప్రపంచానికి తెలియజేయడానికి ఈ క్రీడలు దోహదం చేస్తాయని మోదీ అన్నారు. 'వ్యక్తిత్వ వికాసంలో క్రీడలు ప్రధానపాత్ర పోషిస్తాయి. ఖేలో ఇండియా అనేది ఒక కార్యక్రమం కాదు.. మిషన్' అని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. దేశం గర్వపడేలా చేసిన క్రీడాకారుల చిన్ననాటి కోచ్‌లను తగిన విధంగా సత్కరిస్తామని మోదీ అన్నారు. ప్రతి ఏడాదీ ఖేలో ఇండియా క్రీడలను నిర్వహిస్తామని కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ చెప్పాడు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పోరుకు శ్యామ్, కోమ్



మేరీకోమ్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాక్సర్ శ్యామ్ కుమార్(49కిలోలు), సతీష్ కుమార్(91కి.) మహిళల ప్రపంచ మాజీ చాంపియన్ మేరీకోమ్(48కి), సరితాదేవి (60 కిలోలు) స్వర్ణపోరుకు చేరుకున్నారు. ఫైనల్లో మేరీ ఫిలిప్పీన్స్ చెందిన జోసీ గబుకోతో తలపడుతుంది. 60 కిలోల విభాగంలో ఫేవరెట్, టాప్‌సీడ్ శివథాపా సెమీస్‌లోనే వెనుదిరిగాడు. స్వదేశానికే చెందిన మనీష్ కౌశిక్ చేతిలో ఓడి కాంస్యపతకానికే పరిమితమయ్యాడు. లైట్ ఫ్లైవెయిట్ విభాగంలో అమిత్ పంగల్ ఫైనల్‌కు చేరాడు. శశి చోప్రా (57 కి), సర్జుబాలాదేవి (51కి), సిమ్రన్‌జిత్ కౌర్ (64కి) సెమీస్‌లో ఓడి కాంస్యాలతో సరిపెట్టుకున్నారు.

రాయుడిపై సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ: క్రమశిక్షణను ఉల్లంఘించిన హైదరాబాద్ కెప్టెన్ అంబటి రాయుడిపై బీసీసీఐ రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధించింది. సయ్యద్ ముస్తాక్ అలీలో భాగంగా గతనెల వైజాగ్‌లో కర్ణాటక-హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌లో స్కోరుపై వివాదం రేగింది. కర్ణాటక ఇన్నింగ్స్ ముగిశాక 203/5 స్కోరుకు అదనంగా 2 పరుగులు జతచేశారు. ఈ మ్యాచ్‌లో 2 రన్స్ తేడాతోనే హైదరాబాద్ ఓడింది. మ్యాచ్ టై అయిందని.. సూపర్‌ఓవర్ నిర్వహించాలని అంపైర్లతో రాయుడు వాగ్వాదానికి దిగాడు. దీనిపై వివరణ తీసుకున్న బోర్డు.. అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది.

భారత్-దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ రసవత్తరంగా సాగింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడినా.. ఆఖరాటలో నెగ్గిన కోహ్లీసేన ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. వాండరర్స్‌లో భారత్ పోరాటం చూసి ఆ సిరీస్‌లో మరో మ్యాచ్ ఉంటే బాగుండేదని అభిమానులు ఆశించారు. వారి ఆకాంక్షలు నెరవేర్చడానికి ఇప్పుడు వన్డే వార్ వచ్చేసింది. ఇరు దేశాల మధ్య ఆరు వన్డేల సిరీస్ మొదలయ్యేది నేడే..!

పరిమిత ఓవర్లలోనూ హోరాహోరీ తలపడేందుకు టాప్-2 ర్యాంకర్లు సౌతాఫ్రికా, భారత్ సిద్ధంగా ఉన్నాయి. టెస్టు సిరీస్ జోరును కొనసాగిస్తూ వచ్చే ఏడాది జరిగే వన్డే వరల్డ్‌కప్‌నకు ఈ సిరీస్‌తో సన్నాహకం మొదలుపెట్టాలన్నది సఫారీల కోరిక..!!

భారత్ లక్ష్యాలు మాత్రం చాలానే ఉన్నాయి. సఫారీ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించడంతో పాటు ఆ జట్టు నుంచి నెంబర్ వన్ ర్యాంక్‌ను లాక్కోవాలని టీమిండియా భావిస్తోంది. అలాగే, మొన్నటి టెస్టు సిరీస్ ఓటమితో పాటు.. 2015లో వన్డే సిరీస్‌లో సొంతగడ్డపై తమను ఓడించిన సౌతాఫ్రికాపై ప్రతీకారం తీర్చుకోవాలని కోహ్లీసేన కసిగా ఉన్నది. మరి, డివిల్లీర్స్ లేక డీలా పడ్డ సఫారీలపై భారత్ పైచేయి సాధిస్తుందా..!!!



సా. 4.30 నుంచి
SONY TEN 1, 3
DD SPORTS

102
వన్డేల్లో పదివేల మైలురాయి దాటిన భారత నాలుగో ఆటగాడిగా నిలిచేందుకు ధోనీకి అవసరమైన పరుగులు.

5
సౌతాఫ్రికా గడ్డపై ఆ జట్టుతో ఆడిన 28 వన్డేల్లో భారత్ నెగ్గిన మ్యాచ్‌లు. దర్బన్‌లో ఒక్కసారి కూడా గెలువలేదు.

టాప్ లేపాలి!

ఆత్మవిశ్వాసంలో భారత్ ▸ దక్షిణాఫ్రికాతో తొలి వన్డే నేడు

దర్బన్: సిరీస్ కోల్పోయినా.. మూడో టెస్టులో అద్భుత విజయం దక్కించుకొని ఊరట చెందిన టీమిండియా.. ఆ గెలుపు ఇచ్చిన ఆత్మవిశ్వాసాన్ని వన్డే సిరీస్‌లో కొనసాగించాలని చూస్తోంది. టెస్టు సిరీస్ నెగ్గడం సాధ్యం కాలేదు గనుక.. సౌతాఫ్రికా గడ్డపై తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ గెలుచుకోవాలని కోహ్లీసేన కృతనిశ్చయంతో ఉంది. గురువారం ఇక్కడ జరిగే తొలి మ్యాచ్‌లో నెగ్గి అందుకు మంచి పునాది వేసుకోవాలని ఆశిస్తోంది. 2019 వన్డే వరల్డ్‌కప్ సమీపిస్తున్నందున.. ఆ మెగా టోర్నీకి ఈ సిరీస్‌తో సన్నాహకాలు కూడా మొదలు పెట్టొచ్చు. ఆగస్టులో ఇంగ్లండ్‌తో తర్వాతి టెస్టు సిరీస్‌కు ముందు భారత్ సుదీర్ఘ పరిమిత ఓవర్ల షెడ్యూల్‌లో పోటీ పడనుంది. ఈ పర్యటనలో 6వన్డేలు, 3 టీ-20ల్లో తలపడనున్న కోహ్లీసేన తర్వాత.. శ్రీలంకలో ముక్కోణపు టీ-20 సిరీస్, ఆ వెంటనే ఇంగ్లండ్, ఐర్లాండ్‌ల్లో మూడు వన్డేలు, మూడు టీ-20 మ్యాచ్‌లు ఆడనుంది. ఏప్రిల్‌లో ఐపీఎల్ ఉండనే ఉంది. విదేశాల్లో ఇలా పెద్ద సంఖ్యలో పరిమిత ఓవర్ల క్రికెట్ నేపథ్యంలో.. వచ్చే వరల్డ్‌కప్‌లో పాల్గొనే కోర్ టీమ్‌ను సిద్ధం చేసుకునేందుకు టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఇది చక్కని అవకాశం.

ఆ రికార్డు తుడిచేయాలి..: సఫారీగడ్డపై టెస్టులతో పాటు వన్డేల్లోనూ భారత్‌కు చెత్త రికార్డు ఉంది. 1992 నుంచి ఇక్కడ నాలుగు సార్లు పర్యటించిన భారత్ ఒక్క సిరీస్ కూడా నెగ్గలేకపోయింది. అలాగే, రెండు ముక్కోణపు సిరీస్‌ల్లో కూడా ట్రోఫీ గెలుచుకోలేదు. పైగా, సఫారీగడ్డపై ఆ జట్టుతో 28 వన్డేల్లో 21 మ్యాచ్‌ల్లో ఓడి ఐదింటిలోనే నెగ్గింది. రెండింటిలో ఫలితం రాలేదు. అలాగే, దర్బన్‌లోనూ సౌతాఫ్రికాతో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరింటిలో ఓడిపోయింది. అయితే, ఇప్పుడు అన్ని విభాగాల్లోనూ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తున్న కోహ్లీసేన ఈ చెత్త రికార్డుల నుంచి బయటపడాలని చూస్తోంది.



4-2తో గెలిస్తే నెంబర్ వన్: వన్డేల్లో తిరిగి నెంబర్ వన్ ర్యాంక్‌ను చేజిక్కించుకునే అవకాశం భారత్ ముంగిట నిలిచింది. కోహ్లీసేన ప్రస్తుతం రెండోర్యాంక్‌లో ఉంది. ఒకేఒక్క ర్యాంకింగ్ పాయింట్ తేడాతో సఫారీలు (120 పాయింట్లు) అగ్రస్థానంలో ఉన్నారు. ఈ సిరీస్‌ను 4-2 తేడాతో నెగ్గితే భారత్ టాప్‌కు చేరుకుంటుంది. పైగా, రెండేళ్లుగా వన్డేల్లో భారత్‌కు ఘనమైన రికార్డు ఉంది. 2016 జనవరిలో ఆస్ట్రేలియా చేతిలో 1-4తో ఓడిన కోహ్లీసేన ఆ తర్వాత ఇంటాబయట ఒక్క వన్డే సిరీస్ కూడా కోల్పోలేదు. ఈ సమయంలో జింబాబ్వే, న్యూజిలాండ్ (రెండుసార్లు), ఇంగ్లండ్, వెస్టిండీస్, శ్రీలంక (రెండుసార్లు), ఆస్ట్రేలియాపై నెగ్గింది. 32 ద్వైపాక్షిక వన్డేల్లో 24 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఈ రెండేళ్లలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో మాత్రమే.

రహానె 4లో.. రోహిత్‌పై దృష్టి..: పరిమిత ఓవర్లలో భారత్ రెండేళ్ల అప్రతిహత విజయయాత్రలో జట్టు సమష్టి కృషి ఉన్నది. బ్యాటింగ్‌లో విరాట్‌తో పాటు రోహిత్ జట్టుకు వెన్నుముకగా నిలుస్తున్నారు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు చేసిన తొలి ఆటగాడైన రోహిత్ ఈ సిరీస్‌లోనూ కీలకం కానున్నాడు. లంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరంగా ఉన్న విరాట్ మళ్లీ బ్లూ జెర్సీలో అలరించేందుకు సిద్ధమయ్యాడు. స్వల్ప విరామం తర్వాత మాజీ సారథి ధోనీ కూడా సిరీస్‌కు సంసిద్ధుడై ఉన్నాడు. మహీ అనుభవం కోహ్లీకి మరింతబలం చేకూర్చనుంది. జట్టు కూర్పు విషయానికొస్తే.. రోహిత్‌తో ధవన్ ఓపెనింగ్ చేయడం ఖాయమే. మనీష్ పాండేతో పోటీ ఉన్నా రహానెవైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపొచ్చు. గతేడాది ఓపెనర్‌గా ప్రయోగాలు చేసిన రహానెను తిరిగి నాలుగో నెంబర్‌లో పంపనున్నారు. సఫారీ గడ్డపై ఇన్నింగ్స్ ఆసాంతం మంచి పేస్ లభిస్తుంది గనుక.. నాలుగో నెంబర్‌లో రహానె కీలకం. ఇక, 5, 6, 7 నెంబర్లలో కేదార్, హార్దిక్, ధోనీ బాధ్యతలు తీసుకునే చాన్సుంది. ఇక, జట్టు ఎంతమంది స్పిన్నర్లతో ఆడుతుందనేది ఆసక్తికరం. ఒకే స్పిన్నర్‌ను ఆడిస్తే.. మిడిలార్డర్‌లో ప్రత్యర్థి లెఫ్టాండ్ హిట్టర్లు మిల్లర్, డుమినిలకు కౌంటర్ ఇచ్చేందుకు చైనామన్ బౌలర్ కుల్దీప్‌కే అవకాశాలెక్కువ. టెస్టుసిరీస్ లో రాణించిన భువీ, బుమ్రా అదే జోరును కొనసాగించాలని చూస్తున్నారు. మరో పేసర్‌గా శార్దూల్ కంటే సీనియర్ షమిని తీసుకోవచ్చు.

సఫారీల విజన్ 2019..: భారత్ కంటే ఎక్కువగా సౌతాఫ్రికానే వచ్చే వరల్డ్‌కప్ సన్నాహకాలపై దృష్టి పెట్టింది. ఈ సిరీస్‌తో 'విజన్ 2019' ఆరంభించాలని చూస్తోంది. అదే సమయంలో నెంబర్ వన్ ర్యాంక్‌ను మరింత పదిలం చేసుకోవాలని డుప్లెసిస్ సేన కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, గాయంతో తొలి మూడు వన్డేలకు ఏబీ డివిల్లీర్స్ దూరమవడం ఆ జట్టుకు ఇబ్బందే. ఇలాంటి సమయాల్లో బెహర్డీన్‌ను ఆతిథ్యజట్టు బరిలోకి దింపుతుంది. కానీ, ఈ సారి మాత్రం ఏబీకి బ్యాకప్‌గా అతనికి పిలుపు రాలేదు. ఈ నేపథ్యంలో ప్రొటీస్ టీమ్ వివిధ కాంబినేషన్లను పరీక్షించుకోవాలని చూస్తోంది. ఏబీ స్థానంలో మార్‌క్రమ్‌ను ఆడిస్తామని కెప్టెన్ చెప్పాడు. మార్‌క్రమ్, మిల్లర్‌తో పాటు దేశవాళీ వన్డేకప్‌లో భారీస్కోర్లు సాధించిన డుమిని మిడిలార్డర్‌లో కీలకం కానున్నారు. ఆల్‌రౌండర్ మోరిస్‌తో లోయర్ ఆర్డర్ కూడా బలంగా మారింది. ఇక, పెహ్లుక్వాయో, రబాడతో మూడో పేసర్‌గా మోర్నీ మోర్కెల్‌ను ఎంచుకుంటే వన్డే అరంగేట్రం కోసం లుంగి ఎంగిడి వేచి చూడాల్సి ఉంటుంది. కాగా, ఆతిథ్య జట్టు ఏకైక స్పిన్నర్‌గా ఇమ్రాన్ తాహిర్‌తో బరిలోకి దిగనుంది.

జట్లు (అంచనా)	పిచ్/వాతావరణం
భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రహానె/మనీష్, ధోనీ (కీపర్), కేదార్, హార్దిక్, భువనేశ్వర్, బుమ్రా, కుల్దీప్/చాహల్/అక్షర్, షమి/శార్దూల్ ఠాకూర్. **సౌతాఫ్రికా:** ఆమ్లా, డికాక్ (కీపర్), డుప్లెసిస్ (కెప్టెన్), మార్‌క్రమ్, డుమిని, మిల్లర్, క్రిస్ మోరిస్, పెహ్లుక్వాయో, రబాడ, మోర్కెల్, తాహిర్.	దక్షిణాఫ్రికాలో మిగతా పిచ్‌లతో పోల్చితే డర్బన్ వికెట్ స్లోగా ఉంటుంది. టెస్టు సిరీస్ మాదిరిగా ఇక్కడ అంత ఎక్కువగా పేస్ లభించదు. ఇక, గురువారం మధ్యాహ్నం కొద్దిపాటి వర్షం వచ్చే అవకాశం ఉన్నా.. తర్వాత ఆగిపోతుందని అంచనా. ఆకాశం మాత్రం మేఘావృతం అయి ఉంటుందట.

వన్డేల్లో హోరాహోరీ తప్పదు..!

(కృష్ణమాచారి శ్రీకాంత్)

టెస్ట్ సిరీస్‌ను విజయంతో ముగించిన టీమిండియా.. పరిమిత ఓవర్ల యుద్ధానికి రెడీ అవుతోంది. ఫార్మాట్ మారడంతో దక్షిణాఫ్రికాను ఎలా దెబ్బకొట్టాలనే వ్యూహంలో భారత మేనేజ్‌మెంట్ మునిగిపోయి ఉంటుంది. అయితే వన్డే సిరీస్ మాత్రం హోరాహోరీగా సాగే అవకాశాలున్నాయి. కానీ, డివిల్లీర్స్ దూరం కావడం టీమిండియాకు లాభదాయకమే! మ్యాచ్‌ను అమాంతం మలుపు తిప్పగలిగే సత్తా ఏబీకి ఉంది. తొలి మూడు వన్డేలకు డివిల్లీర్స్ దూరం కావడంతో టీమిండియా బౌలర్లు కొంత ఊపిరి పీల్చుకోవచ్చు. భారత టాపార్డర్, మిడిలార్డర్ కుదురుకున్నట్టే కనిపిస్తోంది. కానీ సిరీస్‌లో శుభారంభం దక్కడం ఎంతో ముఖ్యం. ఓపెనర్లు 8-9 ఓవర్లపాటు నిలబడి అదిరిపోయే ఆరంభాన్నిస్తే మిగతా బ్యాట్స్‌మెన్ తర్వాతి పని చూసుకుంటారు.

-(టీసీఎమ్)

సైనా, సింధు శుభారంభం



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆతిథ్య దేశ షట్లర్లు తొలిరోజు అదరగొట్టారు. హెచ్‌ఎస్ ప్రణయ్ మినహా మిగతా భారత స్టార్లంతా ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, మహిళల్లో టాప్‌సీడ్ పీవీ సింధు, నాలుగోసీడ్ సైనా నెహ్వాల్, యువ సంచలనం రుత్వికా శివాని రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. గతవారం ఇండోనేసియా ఓపెన్‌లో ఫైనలిస్టుగా నిలిచి ఫామ్‌లోనున్న సైనా 21-15, 21-9తో డెన్మార్క్ షట్లర్ సోఫీ హోల్బ్‌బెపై, డిఫెండింగ్ చాంపియన్ సింధు 21-10, 21-13తో డెన్మార్క్‌కే చెందిన నటాలియా కోచ్ రోడ్‌పై, రుత్విక 21-17, 21-10తో అమెలి హెర్ఫ్ (డెన్మార్క్)పై విజయం సాధించి ప్రీక్వార్టర్స్ చేరారు. క్వాలిఫయర్ ఆకర్షి కశ్యప్, ముగ్ధా ఆగ్రే కూడా తొలిరౌండ్‌ను అధిగమించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో రెండోసీడ్ శ్రీకాంత్ 21-17, 21-18తో లీ చుయెక్ యు (హాంకాంగ్)పై, 8వ సీడ్ సాయి ప్రణీత్ 21-11, 17-21, 21-17తో రాజీవ్ ఊసెఫ్ (ఇంగ్లాండ్)పై, కశ్యప్ 21-14, 21-18తో హన్స్ క్రిస్టియన్ (డెన్మార్క్)పై, కార్తికేయ గుల్షన్ 21-17, 14-21, 21-3తో సహచరుడు శుభాంకర్ డేపై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. ఇక ఫేవరెట్లలో ఒకడైన ఐదోసీడ్ హెచ్‌ఎస్ ప్రణయ్ తొలిరౌండ్లోనే వెనుదిరిగాడు. కాలి పాదం గాయంతోనే బరిలోకి దిగిన ప్రణయ్‌ను భారత్‌కే చెందిన శ్రేయాంశ్ జైస్వాల్ 21-4, 21-6తో వరుససెట్లలో చిత్తుచేశాడు. ఇక డబుల్స్ స్పెషలిస్ట్ సిక్కిరెడ్డి డబుల్స్, మిక్స్‌డ్ రెండు విభాగాల్లోనూ రెండోరౌండ్ చేరింది. సాత్విక్‌సాయిరాజ్-అశ్విని, శివమ్-పూర్వీశా జోడీలు మిక్స్‌డ్‌లో ప్రీ క్వార్టర్స్ చేరారు.

బీసీసీఐ సీఈవోతో టీసీఏ ప్రతినిధుల భేటీ

• సభ్యత్వ ప్రక్రియపై చర్చ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణ క్రికెట్ సంఘానికి (టీసీఏ) సభ్యత్వం ఇచ్చే విషయంలో బీసీసీఐ సానుకూలంగా స్పందిస్తున్నదని టీసీఏ కార్యదర్శి గురువా రెడ్డి తెలిపారు. ఈ విషయంపై చర్చించేందుకు బోర్డు సీఈవో రాహుల్ జోహ్రీతో సమావేశం అయినట్టు చెప్పారు. జోహ్రీ ఆహ్వానం మేరకు ముంబైలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయనతో భేటీ అయినట్టు చెప్పారు. ఈ సమావేశంలో సభ్యత్వ ప్రక్రియను మొదలు పెట్టే విషయంపై చర్చించినట్టు తెలిపారు. 'మా దరఖాస్తు పరిశీలనలో ఉన్నదని జోహ్రీ చెప్పారు. ఈ విషయంపై బోర్డు పాలక మండలి (సీవోఏ)తో చర్చిస్తానని, త్వరలో జరిగే అడ్మినిస్ట్రేటర్ల సమావేశం అజెండాలోనూ ఉండేలా చూస్తానని హామీ ఇచ్చార'ని తెలిపారు. తెలంగాణ క్రికెట్‌లో ముఖ్యంగా హెచ్‌సీఏలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బీసీసీఐ పరిశీలిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో టీసీఏకు అనుబంధ లేదా శాశ్వత సభ్యత్వం ఇచ్చే అంశాన్ని రాబోయే సమావేశాల్లో బీసీసీఐ తేల్చనుందని చెప్పారు. గత మూడేళ్ల నుంచి తెలంగాణ జిల్లాల క్రికెటర్ల కోసం టీసీఏ చేస్తున్న కృషిని బోర్డు గుర్తించిందన్నారు. జిల్లాల క్రికెటర్లకు సమాన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావిస్తున్నదని చెప్పారు. అలాగే, హెచ్‌సీఏలో నెలకొన్న గందరగోళ పరిస్థితులతో క్రికెట్‌కు నష్టం కలిగిందని సీఈవో కూడా అంగీకరించారని గురువారెడ్డి చెప్పారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన బీసీసీఐకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో గురువారెడ్డితో పాటు టీసీఏ సభ్యులు అంబర్ అబ్బాస్, జైపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంబై జట్టులో పృథ్వీ షా

ముంబై: విజయ్ హజారే ట్రోఫీ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో యువ బ్యాటింగ్ సంచలనం పృథ్వీ షాకు చోటు దక్కింది. వికెట్ కీపర్ ఆదిత్య తారె సారథ్యంలో ముంబై జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఫిబ్రవరి 5 నుంచి విజయ్ హజారే ట్రోఫీ జరగనుంది.



ఆ సాయం ఇంకా అందలేదు

• ఏపీ సీఎంకు వివరించిన ఆర్చర్ జ్యోతి సురేఖ

విజయవాడ (ఆంధ్రజ్యోతి): అర్జున అవార్డు అందుకున్న నేపథ్యంలో ప్రకటించిన రూ. కోటి నగదు బహుమతి, గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం తనకు నేటికీ అందలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మహిళా ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ బుధవారం వివరించింది. సచివాలయంలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని జ్యోతిసురేఖ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమె తన సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. సురేఖకు త్వరలోనే ప్రోత్సాహకాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయ స్కేటింగ్‌లో ఫల్గుణికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ అమ్మాయి కైరవి ఫల్గుణి టక్కర్ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకంతో మెరిసింది. రెండ్రోజుల క్రితం చెన్నైలో మొదలైన ఈ టోర్నమెంట్లో ఫల్గుణి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ సోలో డ్యాన్స్ కేటగిరిలో రెండోస్థానంలో నిలిచి రజత పతకాన్ని అందుకుంది.

మాకూ ఓ ద్రావిడ్ కావాలి!



కరాచీ: భారత యువ క్రికెటర్లను సానబెట్టడంలో దిగ్గజం రాహుల్ ద్రావిడ్ కృషిని పాకిస్థాన్ మాజీ రమీజ్ రాజా ప్రశంసించాడు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ద్రావిడ్ లాంటి కోచ్ పాక్‌కు అవసరమన్నాడు. అండర్-19 వరల్డ్‌కప్ సెమీస్‌లో టీమిండియా చేతిలో పాక్ 203 పరుగుల తేడాతో చిత్తు కావడాన్ని తీవ్రంగా విమర్శించాడు. 'కొందరు భారత ప్లేయర్ల తీరు ఎంతో ఆకట్టుకుంది. ఆ క్రెడిట్ అంతా రాహుల్‌దేన'ని రాజా అన్నాడు. పాక్ యూత్ క్రికెట్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పాడు.

మోమినుల్ భారీ శతకం

బంగ్లా 374/4 • లంకతో టెస్టు



మోమినుల్ హక్ (175 బ్యాటింగ్)

చిట్టగాంగ్: మోమినుల్ హక్ (175 బ్యాటింగ్) అజేయ శతకంతో అదరగొట్టడంతో శ్రీలంకతో జరుగుతున్న మొదటి టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. బుధవారం మొదలైన టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా.. మోమినుల్‌తోపాటు ముష్ఫికర్ రహీమ్ (92) చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో 374/4 పరుగుల భారీ స్కోరు చేసింది. తొలిరోజు ఆట ముగిసేసరికి హక్‌తోపాటు కెప్టెన్ మహ్మదుల్లా (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మోమినుల్, ముష్ఫికర్ మూడో వికెట్‌కు 236 పరుగుల డబుల్ సెంచరీ భాగస్వామ్యంతో బంగ్లాను పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఓపెనర్ తమీమ్ (52) అర్ధ శతకం నమోదు చేశాడు. లక్మల్ (2/43) రెండు వికెట్లు పడగొట్టాడు.

12ఏళ్ల తర్వాత దొరికిన నాసా ఉపగ్రహం



వాషింగ్టన్, జనవరి 31: దాదాపు 12 ఏళ్ల క్రితం అదృశ్యమైన నాసా ఉపగ్రహం ఆచూకీ దొరికింది. ఆ ఉపగ్రహం నుంచి జనవరి 20న అమెరికాలోని ది జాన్ హోప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్ టెలిమెట్రీ డేటాను విజయవంతంగా సేకరించింది. ఆ సంకేతాలను డీకోడ్ చేసిన నాసా శాస్త్రవేత్తలు.. మార్చి 25, 2000లో అంతరిక్షంలోకి పంపిన ఇమేజ్ ఉపగ్రహంగా గుర్తించారు. ఆ ఉపగ్రహం పంపుతున్న సంకేతాల ఆధారంగా అందులోని ప్రధాన కంట్రోల్ వ్యవస్థ ఇంకా పనిచేస్తున్నట్లు తెలుస్తుందని చెబుతున్నారు. ఈ ఇమేజ్ ఉపగ్రహం గురించి మరింత సమాచారం, దాని స్థితిని తెలుసుకునేందుకు నాసాకు చెందిన గొడర్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ పనిచేస్తుంది.

నౌకాదళం అమ్ములపొదిలోకి 'కరంజ్'

- స్కార్పీన్ శ్రేణిలో మూడో జలాంతర్గామి
- ఆవిష్కరించిన నేవీ చీఫ్ భార్య రీనా లాంబా

ముంబై, జనవరి 31: స్కార్పీన్ శ్రేణిలో మూడో జలాంతర్గామి 'కరంజ్' భారత నౌకాదళం అమ్ములపొదిలో చేరింది. నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా భార్య రీనా లాంబా బుధవారం దీన్ని ఆవిష్కరించారు. ఏడాది తర్వాత ఇది నౌకాదళంలో సేవలు ప్రారంభిస్తుందని, అప్పటి వరకు పరీక్షలు నిర్వహిస్తామని సునీల్ లాంబా చెప్పారు. ఎండీఎల్ నౌకా నిర్మాణ సంస్థ దీన్ని తయారు చేసింది. దీని నిర్మాణంలో ఫ్రాన్స్‌కు చెందిన ప్రధాన నౌకా తయారీ సంస్థ మేజర్ నావల్ గ్రూప్ సహకారం అందించింది. స్కార్పీన్ శ్రేణిలో మొత్తం 6 జలాంతర్గాములను ఎండీఎల్‌లో నిర్మిస్తున్నారు. ఈ శ్రేణిలోని మొదటి జలాంతర్గామి 'కల్వరి' సేవలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత నెలలో ప్రారంభించారు. రెండో జలాంతర్గామి ఐఎన్ఎస్ ఖండేరీ 2017 జనవరిలో ఆవిష్కరించారు.



సవాళ్ల సవారీ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ఓటు బీజేపీకి దూరం కావడంతో కాపాడుకునేందుకు ఆ దిశగా దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే జనాకర్షక పోయి తాయిలాలను విరజిమ్మితే వృద్ధిపై గట్టి ప్రభావం పడుతుంది, ప్రపంచదేశాలు ముందు మన రేటింగ్ తగ్గుతుంది, దాని ప్రభావం పెట్టుబడులపైనా పడొచ్చు. అంచేత జైట్లీ ఓ పెద్ద సవాల్‌నే ఎదుర్కొంటున్నారు. సామాన్య, మధ్య తరగతి ఆశలను తీర్చేట్లుగా బడ్జెట్‌ను తీర్చిదిద్దాలి. గ్రామీణ, పట్టణ ఓటుబ్యాంకును కాపాడుకుంటూనే ఆసియాలోనే అతి భారీ లోటున్న దేశంగా భారత్‌కున్న మచ్చను చెరిపేయాలి, కార్పొరేట్లనూ మెప్పించాలి. ఇది జైట్లీకి కత్తి మీద సామే.

క్రూడ్ ఆయిల్


ముఖ్యంగా దృష్టి నిలపాల్సింది పెరుగుతున్న చమురు ధరలపై! గత జూన్ నుంచి అంతర్జాతీయంగా చమురు ధర 40%కు పైగా పెరిగింది. దీంతో పెట్రోల్, డీజిల్ రేట్లను అనేకమార్లు పెంచాల్సి వచ్చింది. వీటి పెంపు ద్రవ్యోల్బణం పై ఒత్తిడిపెంచుతోంది. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. సుంకం తగ్గిస్తే ప్రభుత్వ రాబడి పడిపోతుంది. ప్రభుత్వ సబ్సిడీ బిల్లు పెరుగుతుంది. దీంతో అనేక ప్రాజెక్టులకు డబ్బు సమకూరదు. మోదీ తలపెట్టిన సంస్కరణలకు పెట్టుబడి రాదు. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ చెబుతున్న ప్రకారం క్రూడాయిల్ ధర 10డాలర్లు పెరిగితే ఆర్థిక పెరుగుదల 0.2-0.3% దెబ్బతింటుంది. సుంకం తగ్గించకుండా పెట్రోల్, డీజిల్ ధరలపై పరిమితిని విధించి కూడా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయొచ్చు. మరి జైట్లీ ఏ దారి ఎన్నుకుంటారో! పెట్రోలియం, వంటగ్యాస్ ధరలను జీఎస్టీలో చేర్చాలన్న ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

జైట్లీ ముందున్న మరి కొన్ని సవాళ్లు

1. గత నాలుగేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువగా నమోదవుతున్న ఆర్థికవృద్ధికి ఊతమిచ్చే చర్యలుతీసుకోవడం. ఈ మార్చి చివరినాటికి 6.75%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7-7.5%కు పెరగొచ్చు. అయితే దీన్ని పెంచే నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జైట్లీ ద్రవ్య పరమైన ఒత్తిళ్ల ఎంతవరకూ తట్టుకొనే చర్యలు ప్రతిపాదిస్తారనేది చూడాలి.
2. ద్రవ్యలోటును జీడీపీలో 3.2%కు తగ్గిస్తామని జైట్లీ నిరుటి బడ్జెట్‌లో ఇచ్చిన హామీ నెరవేరే సూచనల్లేవు. బాండ్ల మీద వచ్చే రాబడి తగ్గితే అప్పులు పెరిగి ఆర్థికవృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.
3. జీఎస్టీ రాబడిలో తగ్గుదల పరిశీలించాలిందే. రాబడి 2 నెలలు తగ్గి డిసెంబరులోనే రూ.86, 703 కోట్లకుపెరిగింది. జూలైలో రూ.95 వేల కోట్లుంది. జీఎస్టీ రాబడి తగ్గితే ఏం చేయాలన్నది జైట్లీ చూడాలి.
4. పన్నుల్లో కోత: వ్యవసాయానికి పన్నురేటును సరళీకరించే అంశంపై జైట్లీ దృష్టి పెట్టాలి. 2015-16లో కార్పొరేట్ పన్నును 30% నుంచి 25%కు తగ్గించారు. అమెరికా తన కార్పొరేట్‌ను భారీగా తగ్గించడంతో అంతర్జాతీయ పోటీని ఎదుర్కొనేందుకు జైట్లీ కూడా తగ్గించాల్సి వచ్చింది.
5. పెట్టుబడులకు ఊతమిచ్చే చర్యలు ప్రకటిస్తే ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. దీనికి మౌలిక సౌకర్యాలపై వ్యయాన్ని పెంచడమే మార్గం.

బడ్జెట్ ఆశలు

అనేక సంస్థలు, కార్పొరేట్ వర్గాలు, వ్యవసాయ, మధ్యతరగతి వర్గాల అంచనాల ప్రకారం జైట్లీ బడ్జెట్‌లో వ్యవసాయానికి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వొచ్చు. వ్యవసాయ రంగ దుస్థితికి ఆయన నిర్దిష్ట చర్యల్ని ప్రతిపాదిస్తారని ఆశిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగుల సంఖ్య 2 కోట్లు. బడ్జెట్‌లో జాతీయ ఉపాధికల్పన విధానం ప్రకటించి ఓ రోడ్‌మ్యాప్‌ను జైట్లీ ప్రకటిస్తారని అంచనా. పన్ను మినహాయింపు పరిమితిని రూ.50 వేలైనా పెంచుతారని, స్టాండర్డ్ డిడక్షన్ ను మళ్ళీ ప్రవేశపెడతారని మరో అంచనా.



ఉదయం 11 గంటలకే బడ్జెట్

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ఉదయం 11 గంటలకు లోక్‌సభకు సమర్పిస్తారు. తొలిసారిగా బడ్జెట్ సమర్పణను నెలరోజులు ముందుకు జరిపారు. పాత సంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి నెల ఆఖరి పనిదినం నాడు ప్రవేశపెట్టేవారు. అయితే ఆదాయ వ్యయాల లెక్కింపులు, కొత్త ఆర్థిక సంవత్సరపు అవసరాలకు మార్గం సుగమం చెయ్యడం.. మొదలైనవాటికి సమయంచాలక పోవడంతో బడ్జెట్ డేటును ముందుకు జరిపారు. బడ్జెట్ ప్రతిపాదనలను ఏప్రిల్ 1 నుంచి ఇబ్బంది లేకుండా ప్రారంభించేందుకు దీన్ని మార్చినట్లు జైట్లీ చెప్పారు. శతాబ్ద కాలంగా అమలైన రైల్వేలకు విడి బడ్జెట్‌కు కూడా స్వస్తిపలికి, రైల్వే పద్దులను కూడా సాధారణ బడ్జెట్‌లో కలిపేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ఇది కావడంతో స్వల్పకాలానికి ఓటాన్ అకౌంట్‌కు అనుమతి కూడా వచ్చేసారి తీసుకుంటారు. జీఎస్టీ తర్వాత ప్రవేశపెడుతున్న తొలిబడ్జెట్ ఇదే. జూలై 1 నుంచి జీఎస్టీ అమలవుతున్నప్పటికీ 2017-18లో పాత పద్ధతి ప్రకారమే కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, సేవల పన్ను మొదలైనవాటిని ప్రత్యేక పన్నులతో పాటే ప్రతిపాదించారు. ఎక్సైజ్ సుంకం, సేవల పన్ను జీఎస్టీలో భాగం కావడంతో జీఎస్టీ రాబడిని వచ్చే ఆర్థిక సంవత్సరపు ఆదాయంలో భాగంగా బడ్జెట్‌లో చేరుస్తారు.

రాహుల్.. 70వేల జాకెట్!

ఖరీదైన కోటు ధరించి సంగీత కచేరీకి హాజరు

- మోదీపై సూట్ బూట్ విమర్శలకు ప్రతిగా బీజేపీ ఎదురుదాడి
- జాకెట్ కొనలేదు.. బహుమతిగా ఇచ్చారు: రాహుల్



న్యూఢిల్లీ, షిల్లాంగ్, జనవరి 31: ఒకానొక సందర్భంలో ప్రధాని మోదీ తన పేరు నేసివున్న అత్యంత ఖరీదైన సూట్‌ను ధరించి వివాదంలో చిక్కుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీది కూడా అదే పరిస్థితి! మంగళవారం రాత్రి మేఘలయా రాజధాని షిల్లాంగ్‌లో జరిగిన సంగీత కచేరీకి రాహుల్ అత్యంత ఖరీదైనదని చెబుతున్న బ్లాక్ బర్బరీ జాకెట్‌ను ధరించి హాజరయ్యారు. కాగా రాహుల్ రూ. 70వేల ఖరీదు చేసే జాకెట్ ధరించారని మేఘాలయా బీజేపీ విమర్శలు గుప్పించింది. ఈ మేరకు రాహుల్ ధరించిన జాకెట్, ధరతో కూడిన ఫొటోను పోస్ట్‌చేసింది. 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామాతో సమావేశమైన సందర్భంగా మోదీ.. తన పేరు నేసివున్న సూట్‌ను ధరించారు. తర్వాత ఆ సూట్ వేలంలో రూ.4.31 కోట్లకు అమ్ముడైంది. దీనిపై రాహుల్ అప్పట్లో మోదీ ప్రభుత్వాన్ని 'సూట్ బూట్‌కీ సర్కార్' అంటూ విమర్శించారు. కాగా తన జాకెట్ ధారణ వివాదాస్పదం కావడంపై రాహుల్ వెంటనే స్పందించారు. తాను వేసుకున్న జాకెట్ తాను కొన్నది కాదని, ఎవరో గిఫ్ట్‌గా ఇస్తే తీసుకున్నదని వివరణ ఇచ్చారు. మోదీ ప్రభుత్వం ముమ్మాటికీ 'సూట్ బూట్‌కీ సర్కార్' అని రాహుల్ స్పష్టం చేశారు. అటు తమనేతపై బీజేపీ చేసిన విమర్శలను కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి ఖండించారు. రాహుల్‌కు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేకే బీజేపీ అసంబద్ధమైన విమర్శలు చేస్తోందన్నారు. కాగా, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల భావజాలానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పోరాడుతోందని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. బుధవారం షిల్లాంగ్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్‌లో ఎన్ని నాయకత్వ స్థానాలు మహిళల చేతుల్లో ఉన్నాయని ప్రశ్నించారు.



శ్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ పైనుంచి జారిపడిన గడ్డర్

ఉత్తరాదిలో భూ ప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.1గా నమోదు

ఇస్లామాబాద్/కాబూల్/ఢిల్లీ/శ్రీనగర్, జనవరి 31: ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో బుధవారం భూప్రకపంనలు సంభవించాయి. అఫ్ఘానిస్థాన్‌లోని హిందూఖుష్ పర్వత శ్రేణుల్లో ఏర్పడిన భూకంపం ప్రభావం ఢిల్లీ పరిసర ప్రాంతాలో పాటు జమ్ము, కశ్మీర్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాలపై కనిపించిందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. భూకంపం తీవ్రతకు శ్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పైనుంచి గడ్డర్ జారిపడింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. హిందూఖుష్‌లో భూకంప కేంద్రాన్ని గుర్తించామని, రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.1గా నమోదైందని యూఎస్ జియోలాజికల్ సర్వే విభాగం పేర్కొంది. ఉత్తర అఫ్ఘానిస్థాన్, తజకిస్థాన్ సరిహద్దుల్లోని హిందూఖుష్ శ్రేణుల్లో భూమికి 191 కి.మీ. లోతులో ఈ భూకంపం సంభవించిందని వెల్లడించింది. దీని ప్రభావంతో కాబూల్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్, పెషావర్, లాహోర్‌లో భూమి తీవ్రంగా కంపించింది. క్వెట్టాలో ప్రకంపనల తాకిడికి ఇంటి పైకప్పు కూలి ఓ బాలిక మృతిచెందింది. ఇదిలా ఉండగా, భూకంపం నేపథ్యంలో జమ్ము, కశ్మీర్‌లోని పలు జిల్లాల్లో రానున్న 24గంటల్లో హిమపాతం సంభవించే ప్రమాదం ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్నో అండ్ అవలాంచ్ స్టడీ ఎస్టాబ్లిష్‌మెంట్ హెచ్చరికలు జారీ చేసింది.

జమిలికి విపక్షం వ్యతిరేకం?

న్యూఢిల్లీ, జనవరి 31: దేశంలోని పార్టీలన్నీ జమిలీపై చర్చలో మునిగితేలుతున్నాయి. బిహార్ సీఎం నితీశ్ కుమార్ మాత్రం జమిలి కుదిరే పని కాదంటున్నారు. 2020 వరకు పాలించే అవకాశం ఉన్న ఆయన రెండున్నర ఏళ్ల ముందే గద్దె దిగడానికి సుముఖంగా లేరు. జమిలిపై నితీశ్‌ను విలేకరులు ప్రశ్నించగా, గుజరాత్‌లో కూడా ఎన్నికలు పెడతారా? అని అడిగారు. ఇది సాధ్యమయ్యే వ్యవహారం కాదని కొట్టిపారేశారు. జమిలి మోదీ గిమ్మిక్కని, ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం చట్టసభకు నిర్దిష్ట కాల వ్యవధిని నిర్ణయించడం సాధ్యం కాని వ్యవహారమని కాంగ్రెస్ నేత చిదంబరం అన్నారు.

పసిఫిక్‌లో పడవ మునక.. 80 మంది గల్లంతు

వెల్లింగ్టన్, జనవరి 31: పసిఫిక్ మహాసముద్రంలో ఒక పడవ మునిగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 80 మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగినప్పుడు పడవలో 80 మంది దాకా ప్రయాణికులు, మరో ఐదుగురు సిబ్బంది ఉన్నారని కిరిబాటి దేశ అధికారులు చెప్పారు. తాజా సమాచారం ప్రకారం ప్రమాదంలో ఏడుగురు బతికిబయట పడ్డారు. పడవ మునిగిపోయిన చోట దాని జాడ తెలుసుకునేందుకు అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు చెందిన 4 విమానాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

మెదడుకు పేస్‌మేకర్‌తో అల్జీమర్స్ దూరం

వాషింగ్టన్, జనవరి 31: గుండెకే కాదు...మెదడుకు కూడా పేస్‌మేకర్ తీసుకొచ్చారు శాస్త్రవేత్తలు. దీనివల్ల అల్జీమర్స్ ముప్పును ఎదుర్కోవచ్చనేది వారి వాదన. అయితే గుండెలో అమర్చే పేస్‌మేకర్‌లా కాకుండా ఇది కాస్త వేరుగా ఉంటుందని ఒహియో స్టేట్ వర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. పేస్‌మేకర్ అమర్చడం వల్ల అల్జీమర్స్ వచ్చే లక్షణాలు ఉన్న వ్యక్తి చిత్త వైకల్యానికి గురికాకుండా, మునుపటిలా ఆలోచించేలా చేయగలమని ఆ వర్సిటీ పరిశోధకులు డగ్లస్ తెలిపారు.



ట్రంప్ ప్రసంగానికి చప్పట్లు కొడుతున్న ఆయన సతీమణి, అమెరికా ప్రథమ మహిళ మెలానియా

ఉత్తర కొరియాతో అణ్వాస్త్ర ముప్పు

- చైనా,రష్యా సవాల్ విసురుతున్నాయి
- కాలం చెల్లిన వలస విధానాన్ని సంస్కరిద్దాం
- డెమోక్రాట్లు, రిపబ్లికన్లకు ట్రంప్ పిలుపు
- అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి తొలిసారి ప్రసంగం



వాషింగ్టన్, జనవరి 31: అణ్వస్త్రాల విషయంలో ఉత్తర కొరియా నిర్లక్ష్య ధోరణి కారణంగా అమెరికా నగరాలకు త్వరలోనే పెను ముప్పు ఏర్పడనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉత్తర కొరియా దూకుడును నిలువరించడంలో అమెరికాను గతంలో పాలించిన వారు ఉదాసీత ప్రదర్శించారని విమర్శించారు. గత ప్రభుత్వాల మాదిరి దేశాన్ని ప్రమాదకరస్థితిలో నిలిపే తప్పుడు నిర్ణయాలను తీసుకోబోనని స్పష్టం చేశారు. అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి బుధవారం ట్రంప్ తొలిసారి ప్రసంగించారు. వలస విధానంలో సంస్కరణలు, అమెరికా ఫస్ట్ అనే తన అజెండాపై ట్రంప్ ఎక్కువ దృష్టి సారించారు. దేశద్రోహ ఆరోపణలతో ఉత్తర కొరియాలో అరెస్ట్ అయ్యి, ఆ తర్వాత మరణించిన అమెరికన్ ఒట్టో వార్మ్‌బియర్ అంశాన్ని ప్రస్తావించారు. ఉత్తర కొరియా నిరంకుశత్వానికి ఒట్టో బలయ్యాడన్నారు. అమెరికా అణ్వాయుధ సంపత్తిని పునర్నిర్మించుకోవడంతోపాటు ఆధునీకీకరించుకోవాల్సిన అవసరముందన్నారు. ఐఎస్‌ను పూర్తిగా ఓడించే వరకు విశ్రమించబోనని స్పష్టం చేశారు.

వలసవిధానంలో కీలక సంస్కరణలు

వలస విధానంలో కీలక సంస్కరణలు చేపట్టేందుకు పార్టీలకు అతీతంగా డెమోక్రాట్లు, రిపబ్లికన్లు తనకు మద్దతు ఇవ్వాలని ట్రంప్ పిలుపునిచ్చారు. కాలం చెల్లిన అమెరికా వలస విధానాన్ని సంస్కరించాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. 'అమెరికా ఆర్థిక వ్యవస్థను, అమెరికా విలువలను ఉగ్రవాద సంస్థలు.. చైనా, రష్యా వంటి ప్రత్యర్థి దేశాలు సవాల్ చేస్తున్నాయి. ఈ శక్తులను ఎదుర్కోవాలంటే మనం బలంగా ఉండాలి, అందుకే మన నడుమ విభేదాలు పక్కన పెట్టి ఏకతాటిపైకి రావాలి.' అని ట్రంప్ రెండు పార్టీల సభ్యులకు సూచించారు. ప్రతిభ ఆధారిత వలస విధానం బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం తెలపాలని అన్నారు. సురక్షితమైన.. బలమైన.. సగౌరవంగా తలెత్తుకుని నిలబడగలిగే అమెరికా నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రకటించారు. అమెరికా ఆర్థికంగా అణిగిమణిగి ఉండే రోజులకు కాలం చెల్లిందని ప్రకటించారు. కాలిఫోర్నియాకు చెందిన 12ఏళ్ల బాలుడు ప్రెస్టన్ షార్ప్ నుంచి జాతీయ పతాకాన్ని ఎలా గౌరవించాలో నేర్చుకోవాలన్నారు. కాగా, ట్రంప్ తొలి కాంగ్రెస్ ప్రసంగంలో అమెరికా తొలి మహిళ మెలానియా ట్రంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అతిథిగా హాజరైన కూచిభొట్ల సతీమణి

గత ఏడాది అమెరికాలో హత్యకు గురైన భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కూచిభొట్ల శ్రీనివాస్ సతీమణి సునయన.. ట్రంప్ ప్రసంగాన్ని ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని వీక్షించారు. రిపబ్లికన్ కాంగ్రెస్ ప్రతినిధి కెవిన్ యోడర్ ఆహ్వానంపై ఆమె ప్రత్యేక అతిథిగా కాంగ్రెస్‌కు వచ్చారు. స్పీకర్ పాల్ రేయాన్‌తోసహా పలువురు కాంగ్రెస్ ప్రతినిధులను ఆమె కలుసుకున్నారు. తన భర్తను కోల్పోయిన విషాదంలోనూ అమెరికాలో శాంతిస్థాపన కోసం సునయన చేస్తున్న ప్రయత్నాలు తనను ఆకట్టుకున్నాయని అందుకే ఆమెను ట్రంప్ ప్రసంగానికి అతిథిగా ఆహ్వానించానని యోడర్ తెలిపారు.

అవినీతి జడ్జిపై వేటు!

- రాష్ట్రపతి, ప్రధానికి సీజే సిఫారసు
- రాజ్యసభలో అభిశంసన?
- రాజీనామాకూ శుక్లా ససేమిరా

న్యూఢిల్లీ, జనవరి 31: మెడికల్ కాలేజీ అనుమతుల కుంభకోణంలో ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలొచ్చిన అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ నారాయణ్ శుక్లాను పదవి నుంచి డిస్మిస్ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా - రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. దాని ప్రతిని ప్రధాని నరేంద్ర మోదీకి పంపారు. మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీ నేతృత్వంలోని త్రిసభ్య అంతర్గత విచారణ బృందం సమర్పించిన నివేదిక ఆధారంగా దీపక్ మిశ్రా ఈ తీవ్ర చర్య తీసుకున్నారు. జస్టిస్ శుక్లాకు న్యాయపరమైన విధులను కేటాయించవద్దని సీజే - అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ డీబీ భోసలేను ఆదేశించారు. దీంతో- జనవరి 23 నుంచే ఆయనకు ఎలాంటి కేసు విచారణలూ అప్పగించలేదు. ఏ బెంచ్‌లోనూ ఆయనను చేర్చలేదు. జస్టిస్ శుక్లా ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. 'న్యాయవ్యవస్థ గౌరవాన్నే శుక్లా మంటగలిపారు ఒక జడ్జి చేయాల్సిన పని కాదది. చేసిన ప్రమాణాన్ని ఆయన ఉల్లంఘించారు. తన పదవి ఔన్నత్యాన్ని, విశ్వసనీయతను, విలువలను దిగజార్చేలా ఆయన ప్రవర్తించారు' అని త్రిసభ్య కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ కమిటీ నివేదిక ఇచ్చాక జస్టిస్ దీపక్ మిశ్రా నిబంధనలను అనుసరించి జస్టిస్ శుక్లాను రాజీనామా చేయాలని లేదా స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయాలని కోరారు. కానీ శుక్లా ఆ రెంటి కీ విముఖత చూపారు. దాంతో జస్టిస్ మిశ్రా జస్టిస్ భోసలేకు ఆదేశాలు పంపి జుడీషియల్ విధుల నుంచి తప్పించారు. రాష్ట్రపతికి లేఖ రాశారు. రాష్ట్రపతి తన లేఖ కాపీని రాజ్యసభ చైర్మన్‌కు పంపుతారు. ఆయన దానిపై సభలో చర్చ చేపట్టవచ్చా లేదా అన్న విషయం తేల్చడానికి ఓ కమిటీ వేస్తారు. ఆ కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్య ఉంటుంది. ఒకవేళ చర్చ జరపాలని నిర్ణయిస్తే చైర్పర్సన్ ఏదో ఒకరోజును నిర్ణయించి దీనిపై స్వల్పకాలిక చర్చ చేపడతారు. ఆ చర్చలో - జస్టిస్ శుక్లా తరపున కూడా ఎవరైనా వాదన వినిపించవచ్చు. 1990 లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి రామస్వామి ఇలానే లోక్‌సభలో అభిశంసన ఎదుర్కొన్నారు. ఆయన తరఫున కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. 2011లో కలకత్తా హైకోర్టు జడ్జి సౌమిత్ర సేన్‌పైనా ఇలాగే అభిశంసన తీర్మానం వచ్చింది. అదే ఏడాది సిక్కిం హైకోర్టు చీఫ్ జస్టిస్ దినకరన్ పైకూడా వచ్చినా ఆయన తన పదవికి రాజీనామా ఇచ్చేసి అభిశంసన నుంచి తప్పించుకున్నారు. కాగా.. అవినీతికి పాల్పడ్డ జస్టిస్ ఎస్ఎన్ శుక్లాను పదవి నుంచి తొలగించాలని సీజేఐ నిర్ణయించడంపై కాంగ్రెస్ హర్షం ప్రకటించింది.

న్యాయమూర్తులపై కత్తిగడతారా?

- జడ్జి లోయా మృతిపై కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 31: సీబీఐ ప్రత్యేక జడ్జి బీహెచ్ లోయా మృతిపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. కాగా.. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నిందితుడుగా ఉన్న ఒక కేసును విచారిస్తున్న సమయంలో సీబీఐ న్యాయమూర్తి లోయా 2014లో గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. అయితే లోయా మృతి వివాదం కారణంగా సుప్రీంకోర్టు జడ్జిల్లో తీవ్ర విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై సిబల్ మాట్లాడుతూ, 'లోయా మృతి గురించి మేము ఏమీ చెప్పలేము. అయితే ఆయన ఎదుర్కొన్న పరిస్థితులు మరో విషయాన్ని చెబుతున్నాయి' అని వ్యాఖ్యానించారు.

బోఫోర్స్ విచారణ నుంచి సీజేఐ మిశ్రా తప్పుకోవాలి

సుప్రీంలో బీజేపీ నేత వ్యాజ్యం

న్యూఢిల్లీ, జనవరి 31: బోఫోర్స్ కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు సీజే జస్టిస్ దీపక్ మిశ్రా తప్పుకోవాలని కోరుతూ ఓ వ్యాజ్యం దాఖలయ్యింది. బీజేపీ నేత, అడ్వొకేట్ అజయ్ అగర్వాల్ బుధవారం ఈ కేసు దాఖలు చేశారు. బోఫోర్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తాను గతంలో దాఖలు చేసిన అప్పీలుపై జనవరి 16న జరిగిన విచారణను ఆయన ప్రస్తావించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.